ఈనాడు

హైదరాబాద్ 16-10-2024 బుధవారం సిటీ సంపుటి 51. సంచిక 66

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 14 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

సర్కారు విద్య.. కలెక్టర్ల ముద్ర



- ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లపై అమితాసక్తి
- తరచూ తనిఖీలతో విద్యా నాణ్యత పెంచే ప్రయత్నం
- ప్రత్యేక కార్యక్రమాలతో మార్పునకు శ్రీకారం

తమ జిల్లాలో ఎన్ని శాఖలు, విభాగాలున్నా... ఎన్ని కార్యక్రమాలున్నా... ఎంత తీరిక లేకుండా ఉన్నా... కొందరు కలెక్టర్లు ప్రభుత్వ పాఠశాలలకు ప్రత్యేకంగా సమయం కేటాయిస్తున్నారు. బడుల బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నారు. సౌకర్యాలపై దృష్టి సారిస్తున్నారు. విద్యార్థుల గైర్హాజరును తగ్గిస్తున్నారు. ఉపాధ్యాయుల హాజరును పెంచుతున్నారు. పిల్లలకు పోషకాహారం లభించేలా చూస్తున్నారు. నాణ్యమైన చదువులు అందేలా కృషి చేస్తున్నారు. మాలాగే మీరు ఉన్నత స్థానాలకు చేరాలంటూ ప్రోత్సహిస్తున్నారు.

విద్యారంగంలో తమదైన ముద్ర ఉండేలా వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. వీటి అమలు కోసం తమకున్న అధికార బలాన్ని ఉపయోగించడం లేదు. ఎవరిపైనా... ఎక్కడా... అదిలింపులు లేవు... బెదిరింపులు అసలే లేవు. వ్యవస్థలో మార్పు అవసరాన్ని అందరికీ అర్థమయ్యేలా వివరిస్తున్నారు.

అలాంటి కొందరు కలెక్టర్ల ప్రయత్నాలపై సమగ్ర కథనం.. 3లో



కరీంనగర్.. వినూత్న కార్యక్రమాల కలబోత

కరీంనగర్ జిల్లాలో కలెక్టర్ పమేలా సత్పతి వివిధ వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 23 వేలకుపైగా విద్యార్థులకు ఉచితంగా బూట్లు, మూడు జతల సాక్సులను అందజేశారు. ప్రముఖ క్రీడాకారులు, శాస్త్రవేత్తలు, రాజనీతిజ్ఞులపై తీసిన 32 సినిమాల జాబితాను రూపొందించి శని, ఆదివారాల్లో పాఠశాల, కళాశాల విద్యార్థులకు చూపిస్తున్నారు. వాటిపై పిల్లలతోనే సమీక్షలు రాయిస్తున్నారు. తరచూ హాస్టళ్లను సందర్శిస్తూ అధికారుల్లో అప్రమత్తతను పెంచారు. మూతపడిన జిల్లా సైన్స్ మ్యూజియాన్ని తెరిపించారు. అక్కడ విద్యార్థులతో సైన్స్ చర్చలు, సదస్సులు, ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. మత్తు పదార్థాల వినియోగానికి దూరంగా ఉండేలా పోలీసు, ఎక్సైజ్ సిబ్బందితో పాఠశాల, కళాశాల విద్యార్థుల్లో అవగాహన కల్పిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల గోడలపై రకరకాల బొమ్మలు గీయించారు. కొవిడ్ తర్వాత పదో తరగతి తప్పుతూ వస్తున్న విద్యార్థుల వివరాలను సేకరించి, ప్రత్యేక తరగతులు చెప్పించడంతో 400 మంది పాసయ్యారు. వారంతా ఇప్పుడు ఇంటర్ చదువుతున్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థినిని ముద్దు చేస్తున్న కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

దామగుండం కీలకం

దేశరక్షణలో ఇక్కడ నెలకొల్పే నౌకాదళ వీఎల్‌ఎఫ్ స్టేషన్‌ది ముఖ్యభూమిక

- ఈ ప్రాజెక్టుతో స్థానికులకు ఉపాధి
- సీఎం రేవంత్‌రెడ్డి పెద్దమనసుతో సహకరించారు
- రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ వెల్లడి
- రాడార్ కేంద్రానికి శంకుస్థాపన

ఈనాడు - హైదరాబాద్, న్యూస్‌టుడే - వికారాబాద్

సముద్రంపై ఆధిపత్యం ప్రదర్శిస్తున్న దేశాలే శక్తిమంతంగా మారుతున్నాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. బ్రిటిష్ సామ్రాజ్య విస్తరణకు ఈ ఆధిపత్యమే దోహదం చేసిందన్నారు. దామగుండంలో వీఎల్‌ఎఫ్ (వెరీ లో ఫ్రీక్వెన్సీ) రాడార్ స్టేషన్ పనిచేయడం ప్రారంభించాక.. భారత నౌకాదళానికి ఇది అత్యంత కీలకమని రుజువవుతుందని పేర్కొన్నారు. ఈ కేంద్రం మన సముద్ర సంబంధ ప్రయోజనాలను కాపాడే లక్ష్యంతో నిర్మితమవుతోందని, సైనిక సామర్థ్యాలను పెంచుతుందని వివరించారు. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం దామగుండం అటవీప్రాంతంలో ఈ స్టేషన్ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి రాజ్‌నాథ్‌సింగ్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు.

...మిగతా 2లో



రాజ్‌నాథ్‌కు జ్ఞాపిక అందిస్తున్న నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేశ్ కె.త్రిపాఠి. చిత్రంలో రేవంత్‌రెడ్డి, సంజయ్

దేశరక్షణలో రాజకీయాలు చేయనివ్వం

- రాడార్ స్టేషన్ నిర్మాణానికి దగ్గరుండి సహకరిస్తాం
- 2017లోనే ప్రాజెక్టుకు భూ బదలాయింపు 2లో
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

నేను వేరే పార్టీకి చెందిన ముఖ్యమంత్రినైనా.. మీరు ఇంకో పార్టీకి చెందిన రక్షణమంత్రి అయినా మనమంతా కలిసి దేశరక్షణ కోసం పనిచేద్దాం. రాజకీయంగా ఎలాంటి వివాదాలు ఎదురైనా తెలంగాణ ప్రభుత్వం రాడార్ స్టేషన్‌కు అండగా ఉంటుంది. తమిళనాడులో ఇలాంటి వీఎల్‌ఎఫ్‌నే 1990లో ప్రారంభించారు. 34 ఏళ్లయినా ఆ ప్రాంత ప్రజలకు ఎలాంటి నష్టం కలగలేదు. వివాదాలకు తెర లేపుతున్నవాళ్లు దేశ రక్షణ గురించి ఆలోచన చేయాలి. - సీఎం రేవంత్

హైదరాబాద్‌లో ఎస్‌ఈఐ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్

- మూడేళ్లలో 1000కి పైగా ఉద్యోగాల కల్పన 11లో
- మంత్రి శ్రీధర్‌బాబుతో సంస్థ ప్రతినిధుల భేటీ

తొలుత పరేషాన్.. తర్వాత పోస్టింగ్

- డీఎస్సీ కౌన్సెలింగ్ నిలుపుదల చేయాలన్న ఆదేశాలతో ఆందోళన
- సీఎం దృష్టికి సమస్య.. వెంటనే పోస్టింగ్‌ల జారీకి పచ్చజెండా 3లో
- రాత్రి వరకు కొనసాగిన ప్రక్రియ.. కొత్త టీచర్లకు పాఠశాలల కేటాయింపు

వయనాడ్ బరిలో ప్రియాంక 12లో

ఒకే విడతలో మహారాష్ట్ర.. రెండు దశల్లో ఝార్ఖండ్..

రెండు రాష్ట్రాల అసెంబ్లీలకు మోగిన ఎన్నికల నగారా

- మహారాష్ట్ర ఎన్నికలు: నవంబరు 20న
- ఝార్ఖండ్: 13, 20 తేదీల్లో..
- ఓట్ల లెక్కింపు: అదే నెల 23న

దిల్లీ: రెండు రాష్ట్రాల్లో శాసనసభ ఎన్నికలకు నగారా మోగింది. మహారాష్ట్రలోని 288 శాసనసభ స్థానాలకు నవంబరు 20న ఒకే విడతలో ఎన్నికలు జరగనున్నాయి. ఝార్ఖండ్‌లోని 81 అసెంబ్లీ స్థానాలకు నవంబరు 13, 20 తేదీల్లో రెండు విడతల్లో పోలింగ్ జరగనుంది. దీంతోపాటు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ రాజీనామా చేసిన వయనాడ్ (కేరళ) లోక్‌సభ స్థానానికి నవంబరు 13న, సిట్టింగ్ ఎంపీ మృతితో ఖాళీ అయిన మహారాష్ట్రలోని నాందేడ్ లోక్‌సభ సీటుకు 20న ఎన్నికలు జరగనున్నాయి. వేర్వేరు కారణాలతో 15 రాష్ట్రాల్లో ఖాళీ అయిన 48 శాసనసభ స్థానాలకూ 13నే ఉప ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం అన్నిచోట్లా ఓట్ల లెక్కింపును నవంబరు 23న చేపట్టనున్నారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ మంగళవారం షెడ్యూల్ ప్రకటించారు. మహారాష్ట్రలో 9.63 కోట్లమంది

...మిగతా 2లో



ఎన్నికల షెడ్యూల్‌ను వెలువరిస్తున్న సీఈసీ రాజీవ్‌కుమార్

సబ్ రిజిస్ట్రార్లపై కొరడా



కీలక స్థానాల్లో ఉన్న 12 మందికి స్థానచలనం

- గత బదిలీల్లో అవకతవకల నేపథ్యంలో రిజిస్ట్రేషన్ల శాఖ చర్యలు

ఈనాడు, హైదరాబాద్: స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ పలువురు సబ్ రిజిస్ట్రార్లపై కొరడా ఝళిపించింది. గ్రేడ్-1, 2 కేటగిరీలకు చెందిన 12 మంది సబ్ రిజిస్ట్రార్లను బదిలీ చేసింది. జిల్లాల్లో పనిచేస్తున్న ఏడుగురికి అదనపు విధుల కింద హైదరాబాద్ నగరంలోని పలు కీలక స్థానాల్లో పోస్టింగ్‌లు ఇచ్చింది. జులై నెలాఖరులో జరిగిన స్థానచలనాల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయని, పెద్దఎత్తున డబ్బులు చేతులు మారాయని, పలువురు కీలక స్థానాలు దక్కించుకున్నారన్న ఆరోపణలు వచ్చాయి. దీనిపై ప్రభుత్వానికి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదిక ఇచ్చింది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శాఖలో అంతర్గతంగా విచారణ చేయించారు. ఉన్నతాధికారుల నుంచి నివేదిక తెప్పించి చర్యలకు ఉపక్రమించారు.

...మిగతా 2లో



నిపుణుల కమిటీ నిర్ణయాల్లో జోక్యం చేసుకోలేం

- గ్రూప్-1పై పిటిషన్లను కొట్టివేసిన హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: గ్రూప్-1 నోటిఫికేషన్‌కు సంబంధించి దాఖలైన రెండు పిటిషన్‌లను హైకోర్టు కొట్టివేసింది. గ్రూప్-1 పోస్టుల భర్తీ నిమిత్తం 2022లో జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారమే పరీక్షలు నిర్వహించాలని, ప్రాథమిక కీలో తప్పులున్నాయని, వాటిని సవరించాలన్న అభ్యంతరాలను పట్టించుకోకపోవడాన్ని సవాల్ చేస్తూ పలువురు అభ్యర్థులు రెండు వేర్వేరు పిటిషన్‌లు దాఖలు చేశారు.

...మిగతా 2లో

వైద్య విద్యలో జరిగిన ప్రవేశాల్లో జోక్యం చేసుకోబోం: సుప్రీం 3లో

ఇదీ సంగతి!





కేటాయించిన రాష్ట్రాల్లో చేరాల్సిందే

అఖిల భారత సర్వీసు అధికారుల పిటిషన్లపై క్యాట్

- కేంద్రం ఆదేశాల నిలిపివేతకు నిరాకరణ
- తుది ఉత్తర్వులకు లోబడే చేరికలుంటాయని స్పష్టీకరణ
- వరద బాధిత ప్రజలకు సేవలందించాలని ఎందుకు అనుకోరని వ్యాఖ్య
- సమగ్ర కౌంటర్ దాఖలు చేయాలని కేంద్రానికి ఆదేశం
- నవంబరు 5కు విచారణ వాయిదా

ఈనాడు, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం ఆలిండియా సర్వీసు అధికారులు(ఏఐఎస్‌లు) తమకు కేటాయించిన రాష్ట్రాల్లో ఈ నెల 16లోగా చేరాల్సిందేనని హైదరాబాద్‌లోని కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్(క్యాట్) బెంచ్ స్పష్టం చేసింది. కేంద్రం ఇచ్చిన ఆదేశాల అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి నిరాకరించింది. ప్రజాప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని ఈ ఉత్తర్వులు జారీ చేస్తున్నామని పేర్కొంది. రాష్ట్రాలకు జరిపిన కేటాయింపులపై అధికారుల వ్యక్తిగత అభ్యర్థనలను పరిశీలించి..

...మిగతా 2లో



'అబ్బే..' అనేవారిని ఎక్కువగా పట్టించుకోకండి

విమర్శకుల గురించి, ఏ పని మొదలుపెట్టినా 'అబ్బే..!' అంటూ వెనక్కిలాగేవారి గురించి ఎక్కువగా పట్టించుకోకండి. వారి మాటలను మరీ సీరియస్‌గా తీసుకుంటే మీరు ఆత్మవిశ్వాసం కోల్పోతారు. వినూత్నంగా ఆలోచించగల మీ సామర్థ్యాలను బయటకు తీయకుండా సగటు వ్యక్తులుగానే మిగిలిపోతారు. - రాబిన్ శర్మ, రచయిత



సభలో మాట్లాడుతున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్. వేదికపై కొండా సురేఖ, డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్, బండి సంజయ్, సీఎం రేవంత్‌రెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, నేవీ అధికారులు

సబ్ రిజిస్ట్రార్లపై కొరడా

(మొదటి పేజీ తరువాయి)

చార్మినార్ జోన్ పరిధిలోకి వచ్చే కీలకమైన సబ్ రిజిస్ట్రార్ల స్థానాల్లో మూడు నెలల క్రితం జరిగిన బదిలీలపై శాఖ నిశితంగా దృష్టి సారించింది. రాబడి ఎక్కువగా ఉన్న కార్యాలయాలను కొందరు కొన్నేళ్లుగా వదిలివెళ్లడం లేదని, అక్కడ పనిచేసి మరోచోటికి బదిలీ అయి వెళ్లినా.. ఆ తదుపరి బదిలీల్లో తిరిగి పాత స్థానానికే వస్తున్నారని ఉన్నతాధికారులు గుర్తించారు. సాధారణంగా ఏ-కేటగిరీ కార్యాలయాల్లో పనిచేస్తున్నవారిని బీ, సీ కార్యాలయాలకు; బీ-కేటగిరీ కార్యాలయాల్లో పనిచేస్తున్నవారిని ఏ, సీ కార్యాలయాలకు; సీ-కేటగిరీ వారిని ఏ, బీ కార్యాలయాలకు బదిలీ చేయాల్సి ఉంది. కానీ,

బదిలీ అయినవారు వీరే..

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
వై. వనజకుమారి	దూద్‌బౌలి	కాప్రా
బి. రాజశేఖర్‌రెడ్డి	శేరిలింగంపల్లి	ఎంవీ-ఏ, రంగారెడ్డి
కె. మహేందర్	గండిపేట	వికారాబాద్
జి. జగన్మోహన్‌రాజు	సరూర్‌నగర్	చిట్స్, గోల్కొండ
కె. మధుసూదన్‌రెడ్డి	పరిగి	జాయింట్ సబ్ రిజిస్ట్రార్-2, రంగారెడ్డి
ఆర్. సతీష్‌కుమార్	కాప్రా	దూద్‌బౌలి
ఆర్. సతీష్	ఉప్పల్	ఎంవీ-ఏ, మేడ్చల్ మల్కాజిగిరి
జె. సురేందర్	కుత్బుల్లాపూర్	జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1, పటాన్‌చెరు
బి. సురేష్	కూకట్‌పల్లి	ఎంవీ-ఏ, హైదరాబాద్
ఎం. రవికాంత్	జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1, పటాన్‌చెరు	కొడంగల్
బి. శ్రీనివాస్	జాయింట్ సబ్ రిజిస్ట్రార్-2, పటాన్‌చెరు	పరిగి
ఎం. డి. అమ్జాద్ అలీ	స్టేషన్ ఘన్‌పూర్	జనగామ

కొందరు ఎప్పుడూ చివరి కేటగిరీకే పరిమితమవుతున్నారని, రాబడి అధికంగా ఉన్న స్థానాలను ప్రతిసారీ కొందరికే కేటాయిస్తున్నారని ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో శాఖలో సమూల ప్రక్షాళనపై గత జులైలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టి సారించారు. అటెండర్ నుంచి ఉన్నతాధికారి వరకు బదిలీలు చేపట్టాలని, ప్రజాప్రతినిధుల సిఫారసులతోపాటు తన ప్రమేయం కూడా ఉండబోదని స్పష్టంగా చెప్పారు. అయినప్పటికీ పలు స్థానాల్లో అవకతవకలు చోటుచేసుకున్నట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. వాటిపై విచారణ నివేదిక అందడంతో కఠిన చర్యలకు మంత్రి ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ తాజా చర్యలు చేపట్టింది. మరోవైపు, ఇప్పటికే గత నెల 28న జిల్లా రిజిస్ట్రార్ల స్థాయిలో నలుగురిని బదిలీ చేశారు.

● హైదరాబాద్ నగరం పరిధిలోని కీలక స్థానాలను జిల్లాల్లో పనిచేస్తున్న సబ్ రిజిస్ట్రార్లకు కేటాయించారు. అదనపు విధుల(ఓడీ) పేరుతో తొలిసారి ఈ నిర్ణయం తీసుకున్నారు. కరీంనగర్ జిల్లా రామగుండం సబ్ రిజిస్ట్రార్ ఎం. బాలకృష్ణను గండిపేట సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో ఉన్న ఎం. డి. అసీఫుద్దీన్‌కు శేరిలింగంపల్లి; మెదక్‌లో ఉన్న ఎం. శ్రీలతకు సరూర్‌నగర్; ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో ఉన్న మోసెస్ భాస్కర్‌కు ఉప్పల్; వరంగల్ జిల్లా నర్సంపేటలో ఉన్న ఎ. గిరిధర్‌కు కూకట్‌పల్లి; యాదాద్రి జిల్లా మోత్కూరులో ఉన్న ఎ. అశోక్‌కు కుత్బుల్లాపూర్; నాగర్‌కర్నూల్‌లో ఉన్న ఎం. డి. అఫ్జలుద్దీన్‌కు పటాన్‌చెరు (జాయింట్ సబ్ రిజిస్ట్రార్-2) బాధ్యతలు అప్పగించారు.

దామగుండం కీలకం

(మొదటి పేజీ తరువాయి)

భారత రక్షణ రంగంలో తనదైన ముద్రవేసిన మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి రోజు ఈ ప్రాజెక్టుకు భూమిపూజ జరగడం సంతోషంగా ఉందని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెద్దమనసుతో సహకరించి సంపూర్ణ మద్దతు ఇచ్చారని, దేశహితంలో రాజకీయాలు అవసరం లేదని చెప్పారని వెల్లడించారు.

సమష్టికృషితోనే సముద్ర భద్రత

"ఇండో-పసిఫిక్ రీజియన్‌లో సవాళ్లు పెరిగాయి. సముద్ర ఖనిజ సంపదపై అన్ని దేశాలూ దృష్టి పెట్టాయి. ఈ క్రమంలో సముద్ర భద్రత అనేది సమష్టికృషి అని భారత్‌తో సాగరంలో సరిహద్దులు పంచుకుంటున్న దేశాలు గుర్తించాలి. బయటి శక్తులను మన సరిహద్దుల్లోకి ఆహ్వానించడం మన ఐక్యతను దెబ్బతీస్తుంది. బంగాళాఖాతం, హిందూ మహాసముద్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు భారత్‌కు స్నేహపూర్వక దేశాల సహకారం చాలా అవసరం. ఏ ఒక్క దేశం వెనక్కి తగ్గినా భద్రత ప్రమాదంలో పడుతుంది. అందుకే అన్ని దేశాలను ఒక్కతాటిపైకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాం.

క్లిష్టమైన ఆపరేషన్లలో ఇదే కీలకం

దేశ రక్షణలో కీలకమైన నౌకాదళ కమ్యూనికేషన్ వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడంపై దృష్టిసారించాం. దేశంలో రెండో రాడార్ స్టేషన్ ఏర్పాటుతో నేవీలో ప్రతిస్పందన సమయం చాలావరకు తగ్గిపోతుంది. యుద్ధ విధానాలు మారుతున్న దృష్ట్యా యంత్రాలు, మనుషుల మధ్య సమర్థ సమన్వయం చాలా అవసరం. క్లిష్టమైన ఆపరేషన్లలో సాయుధ దళాల కమాండ్ సెంటర్లు, నౌకలు, జలాంతర్గాముల మధ్య సురక్షితమైన రియల్‌టైం కమ్యూనికేషన్‌కు ఇది దోహదపడుతుంది.

దేశాభివృద్ధిలో తెలంగాణ కీలక పాత్ర

తెలంగాణ పేరుకు కొత్త రాష్ట్రమే అయినా ఎంతో పురాతన చరిత్ర ఉంది. మౌర్యులు, శాతవాహనులు, కాకతీయుల ఏలుబడిలోనే ఈ ప్రాంతం వ్యవసాయంలో ముందంజలో ఉంది. ఆధునిక కాలంలోనూ దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది. ప్రాచీనకాలం నుంచి ఇప్పటివరకు ఇక్కడి ప్రజల అవసరం దేశానికి ఎంతో ఉంది. మొదటినుంచి రక్షణరంగ పరికరాల తయారీలో హైదరాబాద్ కీలకంగా ఉంది. ప్రస్తుత వీఎల్ఎఫ్ ప్రాజెక్టుతో స్థానికులకు ఉపాధి, ఉద్యోగావకాశాలు మెరుగవుతాయి తప్ప ఎలాంటి నష్టం ఉండదు. నిర్మాణ సమయంలో అవసరమైతే బాధితులకు పునరావాసం ఏర్పాటు హామీని పరిశీలిస్తాం" అని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేశ్ కె.త్రిపాఠి ప్రసంగించారు.

రూ.3100 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణం

ఈ రాడార్ స్టేషన్‌ను 2,900 ఎకరాల్లో రూ. 3,100 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్నారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్, శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, చేవెళ్ల, మహబూబ్‌నగర్ ఎంపీలు విశ్వేశ్వర్‌రెడ్డి, డీకే అరుణ, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, యాదయ్య, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బేగంపేటలో రాజ్‌నాథ్‌సింగ్‌కు ఘన స్వాగతం

బేగంపేట, న్యూస్‌టుడే: రాడార్ స్టేషన్ శంకుస్థాపన కోసం రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ భారత వాయుసేన ప్రత్యేక విమానంలో మంగళవారం ఉదయం 11.35 గంటలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు ఘన స్వాగతం పలికారు. హెలికాప్టర్‌లో దామగుండం వెళ్లేందుకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ విప్ పట్నం మహేందర్‌రెడ్డి తదితరులు ఎయిర్‌పోర్ట్ లాంజ్‌లో రాజ్‌నాథ్‌సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. హెలికాప్టర్‌లో దామగుండం వెళ్లాల్సి ఉన్నప్పటికీ వాతావరణం అనుకూలించకపోవడంతో రాజ్‌నాథ్‌సింగ్, బండి సంజయ్ తదితరులు విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గంలో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో రాజ్‌నాథ్‌సింగ్ సాయంత్రం 4 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో బేగంపేట విమానాశ్రయం చేరుకుని ప్రత్యేక విమానంలో దిల్లీ బయలుదేరి వెళ్లారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు మరో హెలికాప్టర్‌లో దామగుండం వెళ్లి.. తిరిగి సాయంత్రం 4.22 గంటలకు బేగంపేట చేరుకున్నారు.



బేగంపేట విమానాశ్రయంలో రాజ్‌నాథ్‌సింగ్‌కు స్వాగతం పలుకుతున్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్

దేశరక్షణలో రాజకీయాలు చేయనివ్వం

● ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్- న్యూస్‌టుడే, వికారాబాద్: దేశరక్షణలో రాజకీయాలు చేయం.. చేయనివ్వబోమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. దామగుండంలో వీఎల్ఎఫ్ ప్రాజెక్టు నిర్మాణానికి తమ ప్రభుత్వం దగ్గరుండి సహకరిస్తుందన్నారు. ఈ విషయంలో కొంతమంది కావాలని రాజకీయాలు చేయాలని చూస్తున్నారని విమర్శించారు. 'దేశానికి మూడు వైపులా సముద్రం ఉంది. నౌకలను పర్యవేక్షించడానికి వికారాబాద్‌లో రాడార్ స్టేషన్ ఏర్పాటు చేసుకుంటున్నాం. దేశానికి తెలంగాణ వ్యూహాత్మక ప్రాంతం. దేశ రక్షణలో రాష్ట్రం మరో కీలక అడుగు వేయబోతోంది" అని పేర్కొన్నారు. ప్రాజెక్టు శంకుస్థాపన సభలో రేవంత్ మాట్లాడారు.

దేశముంటేనే మనముంటాం

"వీఎల్ఎఫ్ కేంద్రం ఏర్పాటుతో వికారాబాద్ జిల్లా ప్రజలకు అన్యాయం జరుగుతోందని అపోహలు కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్, ముఖ్యమంత్రిగా నేను ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ ప్రాంతానికి దేశంలో రెండో వీఎల్ఎఫ్ రావడం.. రాజ్‌నాథ్‌సింగ్ స్వయంగా రావడాన్ని బట్టి ప్రాజెక్టు ప్రాధాన్యాన్ని తెలంగాణ ప్రజలు గుర్తించాలి. హైదరాబాద్ మొదటినుంచీ దేశ రక్షణ శాఖకు సంబంధించిన వ్యూహాత్మక ప్రాంతంగా గుర్తింపు పొందింది. నగరంలో రక్షణ, ఆయుధ, అణు ఇంధన (న్యూక్లియర్ ఫ్యూయెల్) తదితర వ్యవస్థలున్నాయి. 2017లో వాళ్లున్నప్పుడే రాడార్ కేంద్రానికి భూబదలాయింపు, అటవీ ప్రాంత అభివృద్ధికి నిధులివ్వడం పూర్తిస్థాయిలో జరిగాయి. నేను ముఖ్యమంత్రి అయ్యాక ప్రాజెక్టును ప్రారంభించాలని రాజ్‌నాథ్‌సింగ్ అడిగిన వెంటనే అధికారులను పిలిచి సమీక్షించా. రాజకీయాల కోసం ఈవిషయంలో సమస్యలు సృష్టించాలని చూసేవారికి ఇక్కడే ఉన్న 400 ఏళ్లనాటి రామలింగేశ్వరస్వామి జ్ఞానం ప్రసాదించాలని ప్రార్థిస్తున్నా.

జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు అంతా సిద్ధం

పర్యావరణ ప్రేమికులకు నేనొక మాట చెప్పదలుచుకున్నా. దేశం, దేశంలో ప్రజలుంటేనే పర్యావరణం గురించి మనం చర్చించుకుంటాం. ఇక్కడ జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు అంతా సిద్ధంగా ఉంది. ఇక్కడ లక్షల చెట్లను తొలగించాల్సి ఉంటుందని అబద్ధాలు చెబుతున్నారు. అది నిజం కాదు. వాళ్లు పదేళ్లపాటు అబద్ధాలు చెప్పి తెలంగాణను లూటీ చేసిన సంగతి ప్రజలందరికీ తెలుసు. మేం ఇక్కడ నిలబడి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తాం.

విద్యాసంస్థల్లో స్థానికులకు కోటా

ఇక్కడి ప్రజలకు ఆరాధ్య దైవమైన రామలింగేశ్వరస్వామికి ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా, వారి నమ్మకాన్ని కాపాడాలని నౌకాదళ అధికారులను కోరుతున్నా. ప్రజలు గుడికి వెళ్లేందుకు దారి ఏర్పాటు చేయాలి. ప్రాజెక్టు స్థలంలో ఏర్పాటు చేసే విద్యాసంస్థల్లో స్థానిక విద్యార్థులకు కోటా కల్పించాలి. కనీసం మూడోవంతు సీట్లు కేటాయిస్తే ఇక్కడి విద్యార్థుల పురోభివృద్ధికి అవకాశం కలుగుతుంది'' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

కేటాయించిన రాష్ట్రాల్లో చేరాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయం తీసుకోవాలంటూ కేంద్రానికి హైకోర్టు జనవరిలో ఆదేశాలు ఇచ్చింది. అయితే అధికారుల అభ్యర్థనలను తిరస్కరిస్తూ.. గత కేటాయింపులనే ఖరారు చేస్తూ కేంద్రం ఈ నెల 9న ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై ఏఐఎస్ అధికారులు వాకాటి కరుణ, కె.ఆమ్రపాలి, ఎ. వాణీప్రసాద్, డి.రొనాల్డ్‌రాస్, జి.సృజన, హరికిరణ్, శివశంకర్‌లు మరోసారి క్యాట్‌లో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై లతా బస్వరాజ్ పట్నే, శాలినీ మిశ్రలతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం దాకా సుదీర్ఘ వాదనలు కొనసాగాయి. రాష్ట్ర పునర్విభజన నేపథ్యంలో ఆలిండియా సర్వీసు అధికారుల విభజనకు కేంద్రం రూపొందించిన మార్గదర్శకాలు కొంతమందికి ఇబ్బంది కలిగించి ఉండవచ్చని, అయితే సర్దుబాటు తప్పదని క్యాట్ పేర్కొంది. అధికారులు ప్రస్తుతం విధుల్లో చేరినప్పటికీ.. ఈ చేరికలు తుది ఉత్తర్వులకు లోబడి ఉంటాయని స్పష్టం చేసింది. వన్‌మ్యాన్(ఏకసభ్య) కమిటీని ఏర్పాటు చేసే అధికారం కేంద్రానికి ఉందని వ్యాఖ్యానించింది. అయితే అధికారుల అభ్యర్థనలను పరిశీలించి వన్‌మ్యాన్ కమిటీ కేంద్రానికి సమర్పించిన నివేదికను కేంద్రం తరఫు న్యాయవాదులు క్యాట్‌కు కూడా అందించలేకపోయారని పేర్కొంది. నవంబరు 5లోగా ఈ కమిటీ నివేదికను సమర్పించాలని కేంద్రాన్ని ఆదేశించింది. నివాసం, పరస్పర బదిలీలు, రూల్ ఆఫ్ రిజర్వేషన్.. ఇలా అంశాల వారీగా వివరాలతో సమగ్ర కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను నవంబరు 5కు వాయిదా వేసింది.

కోర్టు ధిక్కరణ పిటిషన్ ఎందుకు వేయలేదు?

అంతకుముందు పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు కె.లక్ష్మీనరసింహ, జి.విద్యాసాగర్, కె.ఆర్.కె.వి. ప్రసాద్, వి.మల్లిక్, వాసిరెడ్డి ప్రభునాథ్ తదితరులు వాదనలు వినిపిస్తూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కేంద్రం అమలు చేయలేదని, పిటిషనర్ల వ్యక్తిగత అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. హైకోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా వన్‌మ్యాన్ కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. ఆ కమిటీ నివేదికను తమకు అందజేయకుండా, దానిపై తమ అభ్యంతరాలను తీసుకోకుండా ఏకపక్షంగా ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. ఈ దశలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయలేదన్నపుడు కోర్టు ధిక్కరణ పిటిషన్ ఎందుకు దాఖలు చేయలేదని ప్రశ్నించింది. వన్‌మ్యాన్ కమిటీ ఏర్పాటును, అది సమర్పించిన నివేదికను ఎందుకు సవాల్ చేయలేదని ప్రశ్నించింది.

అవసరమైతే దేశ సరిహద్దుల్లోనూ పనిచేయాలి..

ఏఐఎస్ అధికారులు అవసరమైతే దేశ సరిహద్దుల్లో పనిచేయడానికైనా సిద్ధంగాఉండాలని, విజయవాడలో వరదలతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు సేవలందించాలని ఎందుకు అనుకోరని వ్యాఖ్యానించింది. కేటాయింపుల్లో పారదర్శకత లేదని తెలుస్తోందని, కొందరి పట్ల సానుకూలంగా వ్యవహరించడంతోనే పదేళ్లుగా వివాదం కొనసాగుతూనే ఉందంది. న్యాయవాదులు తమ వాదనలు కొనసాగిస్తూ వాణీప్రసాద్, వాకాటి కరుణ హైదరాబాద్‌లోనే విద్యాభ్యాసం పూర్తిచేసి, ఇక్కడే ఉంటున్నా ఏపీకి చెందిన వారిగా చూపించారన్నారు. పరస్పర బదిలీ పరిధిని ప్రత్యూష్ సిన్హా కమిటీ కుదించిందన్నారు. హరికిరణ్ విషయంలో రిజర్వేషన్ విధానాన్ని తప్పుగా అన్వయించారన్నారు. సీనియారిటీకి సంబంధించి కటాఫ్ తేదీని ప్రత్యూష్ సిన్హా కమిటీ తప్పుగా అన్వయించడంతో నష్టపోయినట్లు రొనాల్డ్‌రాస్ పేర్కొన్నారు. అందరి అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకున్నాకే కేంద్రం ఉత్తర్వులు జారీ చేసిందని, పిటిషన్లను కొట్టివేయాలని కేంద్రం తరఫు న్యాయవాదులు రాధాకృష్ణ, రజిత, మల్లికార్జున్ కోరారు.

హైకోర్టును ఆశ్రయించనున్న అధికారులు..

క్యాట్ తీర్పు నేపథ్యంలో తెలంగాణలో పనిచేస్తున్న వాకాటి కరుణ, వాణీప్రసాద్, రొనాల్డ్‌రాస్, ఆమ్రపాలి బుధవారం ఉదయం హైకోర్టును ఆశ్రయించనున్నట్లు తెలిసింది. వీరు ఏపీలో చేరాల్సి ఉంది. అలాగే ఏపీ నుంచి హరికిషన్, శివశంకర్, జి.సృజన తెలంగాణకు రావాల్సి ఉంది. కేటాయించిన రాష్ట్రాల్లో చేరికకు బుధవారమే గడువు ముగుస్తుండటంతో వీరు హైకోర్టులో లంచ్ మోషన్‌లో పిటిషన్ దాఖలు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

నిపుణుల కమిటీ నిర్ణయాల్లో జోక్యం చేసుకోలేం

(మొదటి పేజీ తరువాయి)

వీటిపై జస్టిస్ పుల్లా కార్తీక్ విచారణ చేపట్టి మంగళవారం తీర్పు వెలువరించారు. ప్రాథమిక పరీక్షలో ప్రశ్నలకు సంబంధించి ఒక్క పిటిషనర్ మాత్రమే గడువులోగా అభ్యంతరాలను సమర్పించారని, వాటిని మాత్రమే పరిగణనలోకి తీసుకుంటున్నామన్నారు. పిటిషన్‌లో 14 ప్రశ్నలపై అభ్యంతరాలు వ్యక్తం చేసిన పిటిషనర్లు.. 8 ప్రశ్నలపైనే వాదనలు వినిపించారన్నారు. ఉన్నతాధికారుల పోస్టుల నియామకాలకు జరిగే పరీక్షల్లో సూటిగా ఉండే ప్రశ్నలనే అభ్యర్థులు ఆశించకూడదని స్పష్టం చేశారు. మెలిక ప్రశ్నలు ఇవ్వడాన్ని సమర్థించారు. 1,721 మంది వ్యక్తం చేసిన 6,417 అభ్యంతరాలను ఆయా సబ్జెక్టులకు చెందిన నిపుణుల కమిటీ పరిశీలించి కీని విడుదల చేసిన తర్వాతే టీజీపీఎస్సీ ఫలితాలు విడుదల చేసిందని, ఇందులో జోక్యం చేసుకోలేమంటూ తేల్చిచెప్పారు. విద్యాసంబంధమైన విషయాల్లో నిపుణుల కమిటీ నిర్ణయం అంతిమమని, కోర్టులు జోక్యం చేసుకోరాదని సుప్రీంకోర్టు పలు తీర్పుల్లో స్పష్టంగా పేర్కొందన్నారు. సాంకేతిక, శాస్త్రీయ అంశాల్లో నిపుణుల అభిప్రాయాల్లో కోర్టులు అధికరణ 226 కింద విచక్షణాధికారంతో జోక్యం చేసుకోవడానికి వీల్లేదన్నారు. పిటిషనర్ల సందేహాలకు కమిషన్ ఇచ్చిన సమాధానాలు సంతృప్తికరంగానే ఉన్నాయంటూ పిటిషన్‌ను కొట్టివేశారు. మొదటి నోటిఫికేషన్ రద్దుచేసిన 6నెలల తర్వాత పిటిషనర్లు కోర్టును ఆశ్రయించడాన్నీ న్యాయమూర్తి తప్పుబట్టారు. 2022లో జారీ చేసిన నోటిఫికేషన్ రద్దు వల్ల పిటిషనర్లకు నష్టం వాటిల్లినట్లయితే ఈ ఏడాది ఫిబ్రవరిలో వెబ్‌నోట్ పెట్టిన తర్వాత కోర్టును ఆశ్రయించి ఉండవచ్చన్నారు. ఆరు నెలల తర్వాత కోర్టుకు వచ్చినవారు జాప్యానికి ఒక్క కారణమూ చూపలేదని, అందుకే పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఒకే విడతలో మహారాష్ట్ర.. రెండు దశల్లో ఝార్ఖండ్..

(మొదటి పేజీ తరువాయి)

ఓటర్ల కోసం 1,00,186 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఝార్ఖండ్‌లో 2.69 కోట్ల మంది ఓటర్ల కోసం 29,562 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎగ్జిట్ పోల్స్‌కు ఎలాంటి శాస్త్రీయత లేనప్పటికీ భారీ అంచనాలను సృష్టిస్తున్నాయని రాజీవ్ కుమార్ వ్యాఖ్యానించారు. వీటివల్ల ప్రజల్లో గందరగోళం ఏర్పడుతోందన్నారు. ''ఎగ్జిట్‌పోల్స్‌తో మాకు సంబంధం ఉండదు. నమూనా పరిమాణం ఎంత, సర్వేలు ఎక్కడ జరిగాయి, అంచనాలకు అనుగుణంగా ఫలితాలు రాకుంటే మన బాధ్యత ఎంతవరకు? అనే విషయంలో భాగస్వామ్య పక్షాలు ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఈ విషయంలో మీడియాకు స్వీయ నియంత్రణ అవసరం'' అని పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు లెక్కింపు మొదలైతే 5-10 నిమిషాల్లోనే మీడియాలో ఫలితాలు వచ్చేస్తుండడం అర్థరహితమని అన్నారు. ఈవీఎం బ్యాటరీలు కాలిక్యులేటర్ మాదిరిగానే ఉంటాయని, వీటిపై వచ్చిన 20 ఫిర్యాదులకు వాస్తవాలతో వివరణ ఇస్తామని తెలిపారు. ఓటర్లను గుర్తింపులో నిబంధనల ప్రకారమే వెళ్తామని, వారి సంప్రదాయాలకు తగిన గౌరవం ఇస్తామని చెప్పారు.

ఇదీ షెడ్యూలు..

మహారాష్ట్ర		ఝార్ఖండ్	తొలి దశ	రెండో దశ
నోటిఫికేషన్ విడుదల	: అక్టోబరు 22	నోటిఫికేషన్ విడుదల	: అక్టోబరు 18	అక్టోబరు 22
నామినేషన్ల దాఖలుకు తుది గడువు	: 29	నామినేషన్ల దాఖలుకు తుది గడువు	: 25	29
నామినేషన్ల పరిశీలన	: 30	నామినేషన్ల పరిశీలన	: 28	30
నామినేషన్ల ఉపసంహరణ గడువు	: నవంబరు 4	నామినేషన్ల ఉపసంహరణ గడువు	: 30	నవంబరు 1
పోలింగ్ తేదీ	: 20	పోలింగ్ తేదీ	: నవంబరు 13	20
ఓట్ల లెక్కింపు	: 23	ఓట్ల లెక్కింపు	: 23	23

నగర ఓటర్లపై ప్రత్యేక దృష్టి

వారాంతంలో ఎన్నికలు నిర్వహిస్తే వరస సెలవులతో నగర ఓటర్లు వేరేపనుల్లో పడి పోలింగ్ కేంద్రాలకు ముఖం చాటేస్తుండడంతో మహారాష్ట్ర, ఝార్ఖండ్‌లలో బుధవారాల్లో పోలింగ్ నిర్వహిస్తున్నట్లు సీఈసీ చెప్పారు. గతసారి హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ సహా గురుగ్రాం, ఫరీదాబాద్, దక్షిణ బెంగళూరు, పుణె, ఠాణె వంటి నియోజకవర్గాల్లో పోలింగ్ ఆయా రాష్ట్రాల సగటు కంటే చాలా తక్కువగా నమోదైన విషయం గుర్తుచేశారు. నగర ఓటర్ల నిర్లిప్తతపై ఆందోళన వ్యక్తంచేశారు. ఈసారి ఈ అంశంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని చెప్పారు. రాజకీయ నేతలపై హింసాత్మక ఘటనల్ని తీవ్రంగా పరిగణిస్తామని, వీటికి ఏమాత్రం తావు ఇవ్వొద్దని పోలీసులకు స్పష్టం చేస్తామని తెలిపారు. కొన్ని పిటిషన్లు పెండింగులో ఉన్నందువల్ల పశ్చిమబెంగాల్‌లోని బశీర్హాట్, ఉత్తర్‌ప్రదేశ్‌లోని మిల్కిపుర్ లోక్‌సభ స్థానాలకు ఉప ఎన్నికల తేదీలను ఈసీ ప్రకటించలేదు.

కాంగ్రెస్ పరిశీలకుల నియామకం

దిల్లీ: మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలకు ప్రాంతాల వారీగా పార్టీ పరిశీలకులుగా వ్యవహరించేందుకు సీనియర్ నేతల్ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నియమించారు. వీరిలో అశోక్ గహ్లోత్, భూపేశ్ బఘెల్, చరణ్‌జీత్ సింగ్‌చన్నీ, సచిన్‌పైలట్ వంటి వారు ఉన్నారు. తారిక్ అన్వర్, అధీర్ రంజన్ చౌధరి తదితర నేతల్ని ఝార్ఖండ్‌కు పరిశీలకులుగా పంపించనుంది. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ సమీక్ష నిర్వహించారు. ఐక్యంగా వ్యవహరించి భాజపాను నిలువరించాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎవరి పేరునూ ప్రచారంలోకి తీసుకురావద్దని చెప్పారు. కాంగ్రెస్ గ్యారంటీలను ప్రకటించడానికి రెండు రాష్ట్రాల్లోనూ త్వరలో ఆయన పర్యటించనున్నారు.

మహారాష్ట్రను గాడిలో పెట్టేవరకు నాకు విశ్రాంతి లేదు: పవార్

ముంబయి: తన వయసు 84 అయినా, 90 అయినా మహారాష్ట్రను గాడిలో పెట్టేవరకు విశ్రమించబోనని ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్‌పవార్ చెప్పారు. పార్టీలోకి కొందరు నేతలు చేరిన సందర్భంగా మంగళవారం సతారా జిల్లాలో ఏర్పాటైన సభలో ఆయన ప్రసంగించారు. ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలోని సర్కారు అవినీతిలో కూరుకుపోయిందని విమర్శించారు. మరోవైపు.. కేవలం 35 రోజుల వ్యవధిలో ఎన్నికల ప్రక్రియను ముగించడం వల్ల ప్రచారానికి తగినంత సమయం లభించదని మహారాష్ట్ర విపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి.

గ్రహం అనుగ్రహం
16-10-2024 బుధవారం

శ్రీ క్రోధి నామ సంవత్సరం; దక్షిణాయణం; శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం
చతుర్దశి: రా. 7-45 తదుపరి పూర్ణిమ
ఉత్తరాభాద్ర: రా. 7-18 తదుపరి రేవతి
వర్జ్యం: ఉ. 7-23 వరకు
అమృత ఘడియలు: మ. 2-50 నుంచి 4-20 వరకు
దుర్ముహూర్తం: ఉ. 11-22 నుంచి 12-09 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ. 5.56; **సూర్యాస్తమయం:** సా. 5.36

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
నిజామాబాద్	35.2	24.5
రామగుండం	34.0	25.0
ఆదిలాబాద్	34.0	23.7
ఖమ్మం	32.6	24.6
హనుమకొండ	32.0	23.5
కరీంనగర్	32.0	23.0
మెదక్	31.2	20.0
సూర్యాపేట	31.0	25.5
హైదరాబాద్	29.9	23.4
నల్గొండ	28.5	24.0
మహబూబ్‌నగర్	27.4	24.5

సర్కారు విద్య.. కలెక్టర్ల ముద్ర



ప్రధానోపాధ్యాయులతో సమావేశమైన హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్: కాఫీ విత్ కలెక్టర్

హైదరాబాద్ జిల్లాలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి 'కాఫీ విత్ కలెక్టర్' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ప్రతి వారం కొందరు ప్రధానోపాధ్యాయులను పాఠశాలల సమయం ముగిశాక తన కార్యాలయానికి ఆహ్వానిస్తున్నారు. వారితో కాఫీ తాగుతూ విద్యా నాణ్యత పెంచేందుకు సూచనలు తీసుకుంటున్నారు. జిల్లాలో ఉన్న 384 ప్రభుత్వ పాఠశాలలను రాజ్‌భవన్ పాఠశాల తరహాలో మార్చాలని పట్టుదలగా ఉన్నారు. అందుకనుగుణంగా నిధులను విడుదల చేస్తున్నారు. రోజు మార్చి రోజు నగరంలోని ఏదో ఒక ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నారు. అక్కడి బోధన, బోధనేతర సౌకర్యాలను పరిశీలిస్తున్నారు. సమస్యలుంటే వెన్వెంటనే పరిష్కరిస్తున్నారు.



బడిబాటలో భాగంగా ఓ మహిళతో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్: గ్రౌండ్ బేస్డ్ లెర్నింగ్

విద్యార్థుల్లో గణితం, సామాన్య శాస్త్రాలపై మరింత ఆసక్తి పెంచేందుకు, వారు కనీస సామర్థ్యాలను సాధించేందుకు 'గ్రౌండ్ బేస్డ్ లెర్నింగ్'కు మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా నిపుణులతో కార్యశాల నిర్వహించి మెటీరియల్ రూపొందించారు. అవి త్వరలో విద్యార్థులకు అందుబాటులోకి రానున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో అధికంగా విద్యార్థులు చేరేందుకు బడిబాట తొలిరోజు పల్లెనిద్ర నిర్వహించారు. ఆ సందర్భంగా ప్రభుత్వ బడుల్లో సౌకర్యాలను, వాటిలో చదివితే చేకూరే ప్రయోజనాలను ప్రజలందరికీ తెలియజేసేలా చర్యలు తీసుకున్నారు. బడిబాటపై స్వయంగా పాట రాసి, వీడియో రూపొందించి విస్తృత ప్రచారం కల్పించారు.



అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో తనిఖీ చేస్తున్న కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం: పర్యావరణ పాఠాల ఒరవడి

భద్రాద్రి-కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించారు. వీలున్నప్పుడల్లా బడులను సందర్శిస్తున్నారు. సౌకర్యాలపై ఆరా తీస్తున్నారు. ఇటీవల అనాథలు, వీధి పిల్లలు, బాల కార్మికులు, వివిధ కారణాలతో మధ్యలో చదువు మానేసిన పిల్లల కోసం నిర్వహిస్తున్న అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలను తనిఖీ చేశారు. అక్కడి విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల పెంపునకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం డాక్టర్ ప్రభు దయాల్‌ను ప్రత్యేక పర్యవేక్షకుడిగా నియమించారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఉపయోగపడే మొక్కలను నాటిస్తున్నారు. వాననీటి సంరక్షణకు ఇంకుడు గుంతలు తవ్విస్తున్నారు.



పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి: హాజరవుదాం... ప్రార్థన చేద్దాం

పెద్దపల్లి జిల్లాలో ఉపాధ్యాయుల హాజరుపై అక్కడి కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ఉపాధ్యాయులంతా ప్రతిరోజూ ప్రార్థన సమయంలో ఫొటో దిగి వాట్సప్ గ్రూపులో పంపాలనే నిబంధన తెచ్చారు. హాజరు నివేదిక ఉదయం 9 గంటలకు తనకు చేరేలా ఏర్పాట్లు చేసుకున్నారు. వీడియో కాల్ చేసి ఉపాధ్యాయులతో మాట్లాడుతుంటారు. వారిని ఉత్సాహపరుస్తున్నారు. ఫలితంగా టీచర్లు కూడా ఆలస్యంగా రాకుండా జాగ్రత్త పడుతున్నారు. ఆయన స్వయంగా పాఠశాలలకు వెళుతూ విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలిస్తున్నారు.

నిర్మల్: భావి పౌరుల బాలశక్తి



కలెక్టర్ అభిలాష అభినవ్

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సమాజంలోని అన్ని రంగాలపై అవగాహన కల్పించడానికి నిర్మల్ జిల్లాలో కలెక్టర్ అభిలాష అభినవ్ 'బాలశక్తి' అనే కార్యక్రమాన్ని రూపొందించారు. ఆసుపత్రులు, బ్యాంకులు, ఇతర అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు వారిని తీసుకెళుతున్నారు. బ్యాంకులు, పోస్టాఫీసుల పనితీరును పరిశీలింపజేస్తూ వారిలో 'ఆర్థిక అక్షరాస్యత'పై అవగాహన కలిగిస్తున్నారు. ఆసుపత్రులకు తీసుకెళుతూ వైద్యులు, నర్సుల పనివిధానం వివరిస్తున్నారు. ముమ్మందు తాము కూడా మేనేజర్లు, డాక్టర్లు, నర్సులు, పోస్టుమాస్టర్లు, ఎస్ఐలుగా స్థిరపడేలా పిల్లల్లో స్ఫూర్తి నింపేందుకు ప్రయత్నిస్తున్నారు.



హాస్టల్‌లో ఆహారాన్ని పరిశీలిస్తున్న నిజామాబాద్ కలెక్టర్ హనుమంతు

నిజామాబాద్: రాత్రి బసతో భవితపై భరోసా

వసతి గృహాలు, గురుకుల, ప్రభుత్వ పాఠశాలలపై నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. వాటిని తరచూ తనిఖీ చేస్తున్నారు. పిల్లలతో మమేకమవుతూ సమస్యలను ఆరా తీస్తున్నారు. ఇటీవల ముప్కాల్ మండలం పోచంపాడ్‌లోని ప్రభుత్వ గురుకుల బాలుర పాఠశాలలో రాత్రి బస చేశారు. రాత్రి 7.30 గంటల ప్రాంతంలో ఆకస్మికంగా సందర్శించి విద్యార్థుల స్టడీ అవర్స్‌ను గమనించారు. పూర్తి వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి అక్కడే నిద్రించారు. ఎప్పుడు ఎక్కడికి వస్తారో తెలియకపోవడంతో ఆయా హాస్టళ్ల బాధ్యులు సౌకర్యాలను మెరుగుపరిచే పనిలో పడ్డారు.

- ఈనాడు, హైదరాబాద్



గాంధీభవన్‌లో సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి సీతక్క

దామగుండం ప్రాజెక్టుకు జీవో ఇచ్చింది భారాస సర్కారే: మంత్రి సీతక్క

- గాంధీభవన్‌లో ప్రజల నుంచి అర్జీల స్వీకరణ

హైదరాబాద్, న్యూస్‌టుడే: వికారాబాద్ జిల్లా దామగుండం అటవీ ప్రాంతంలో నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు జీవో ఇచ్చింది గత భారాస ప్రభుత్వమేనని మంత్రి సీతక్క అన్నారు. భారాస నేతలు అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా మాట్లాడటం సరికాదని హితవు పలికారు. మంగళవారం గాంధీభవన్‌లో జరిగిన 'మంత్రులతో ముఖాముఖి' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రజలు, కార్యకర్తల నుంచి వివిధ సమస్యలపై వినతులు స్వీకరించారు. మొత్తం 160 అర్జీలు వచ్చాయి. కొన్నింటిపై మంత్రి వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ..రాడార్ స్టేషన్ నిర్మాణంతో మూసీ నదికి, పర్యావరణానికి ప్రమాదమని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. మరి మీ హయాంలో జీవో ఎందుకిచ్చారని ప్రశ్నించారు.

త్వరలో 500 కారుణ్య నియామకాలు

ఈనాడు, హైదరాబాద్: పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖలో త్వరలో 500కు పైగా కారుణ్య నియామకాలు చేపట్టేందుకు సీఎం సూత్రప్రాయంగా అంగీకరించారని మంత్రి సీతక్క తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా గ్రామీణ నీటి సరఫరా శాఖలో నియమితులైన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు(ఏఈఈలకు) శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని మంగళవారం హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ కార్యాలయంలో ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కష్టపడి ఉద్యోగాలు సాధించిన వారు అంతే చిత్తశుద్ధితో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు సేవలందించాలని సూచించారు.

పెండింగ్ బిల్లుల కోసం ఉద్యమ కార్యాచరణ

- 30లోపు స్పష్టతనివ్వకుంటే కార్యాలయాల ముట్టడి
- రాష్ట్ర సర్పంచుల సంఘం వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: గ్రామ పంచాయతీల్లో పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలన్న డిమాండ్‌తో ఆందోళన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు రాష్ట్ర సర్పంచుల సంఘాల ఐకాస అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ ప్రకటించారు. 30లోగా స్పష్టమైన ప్రకటన చేయకుంటే రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, కార్యాలయాల ముట్టడి నిర్వహిస్తామని చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. '2019 నుంచి 2024 వరకు గ్రామాల్లో అత్యధిక అభివృద్ధి పనులు చేసి తెలంగాణ దేశంలోనే రికార్డు సృష్టించింది. సర్పంచులు ఇప్పుడు దయనీయ స్థితిలో ఉన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికే 10 నెలలవుతోంది. పలుమార్లు సీఎం, మంత్రులకు వినతిపత్రాలు ఇచ్చాం. అయినా బిల్లులు విడుదల చేయలేదు. త్వరలోనే అఖిలపక్ష రాజకీయ నాయకులను కలిసి మా ఉద్యమానికి సహకరించమని అడుగుతాం' అని పేర్కొన్నారు.

కొండా సురేఖ, రఘునందన్‌రావుల ఫొటో వైరల్ వ్యవహారంలో ఇద్దరి అరెస్టు

ఈనాడు- హైదరాబాద్: మంత్రి కొండా సురేఖ, భాజపా ఎంపీ రఘునందన్‌రావుల ఫొటోను అభ్యంతరకరంగా వైరల్ చేసిన వ్యవహారంలో ఇద్దరిని అరెస్టు చేసినట్లు సైబరాబాద్ సైబర్‌క్రైమ్ ఏసీపీ రవీందర్‌రెడ్డి తెలిపారు. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచి దేవన్న, జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణానికి చెందిన వ్యాపారి మహేశ్‌ను మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వారిని బుధవారం న్యాయస్థానంలో హాజరుపర్చనున్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలోని సురేఖ, రఘునందన్‌రావుల ఫొటోను కొందరు సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. ఈ వ్యవహారంపై ఎంపీ ఈ నెల 3న మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సహా కొందరిపై సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైన విషయం తెలిసిందే.

ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ ఉషాలక్ష్మి కన్నుమూత



ఈనాడు, హైదరాబాద్: వైద్య వృత్తి, సేవా రంగంలో సుదీర్ఘకాలంగా సేవలందించిన ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ కె. ఉషాలక్ష్మి(91) మంగళవారం రాత్రి గుండెపోటుతో కన్నుమూశారు. నిలోఫర్ ఆస్పత్రిలో చాలా కాలంపాటు ఆమె ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఉద్యోగ విరమణ అనంతరం 69 ఏళ్ల వయసులో రొమ్ము క్యాన్సర్ బారిన పడ్డారు. మహమ్మారిని జయించిన ఆమె, రొమ్ము క్యాన్సర్‌పై మహిళా లోకాన్ని జాగృతం చేసేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టారు. ఉషాలక్ష్మి బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్‌ను స్థాపించి రోగ నిర్ధారణ కేంద్రాలు నిర్వహించారు. ఉషాలక్ష్మి స్ఫూర్తితో ఆమె కుమారుడు, ప్రముఖ క్యాన్సర్ చికిత్స నిపుణులు డాక్టర్ రఘురామ్ కిమ్స్ ఆస్పత్రిలో తల్లి పేరున చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 17 ఏళ్లుగా ఆ కేంద్రం ద్వారా అనేక మందికి సేవలు అందిస్తూ వస్తున్నారు. తన తల్లి వైద్య వృత్తిని ఎంతో ఆరాధించేవారని, మహిళలు క్యాన్సర్ బారిన పడకుండా చూడాలనే ఆమె ఆశయాలను నెరవేరుస్తానని ఈ సందర్భంగా డా. రఘురామ్ తెలిపారు.

'కరకగూడెం'పై స్వతంత్ర దర్యాప్తు చేయండి

- మానవ హక్కుల వేదిక డిమాండ్

ఈనాడు, హైదరాబాద్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం బోడగుట్ట అటవీ ప్రాంతంలో సెప్టెంబరు 5న మావోయిస్టులను కాల్చి చంపిన పోలీస్ అధికారులపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని మానవ హక్కుల వేదిక(హెచ్ఆర్ఎఫ్) మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. తెలంగాణ రాష్ట్ర పోలీసులతో సంబంధం లేని స్వతంత్ర దర్యాప్తు సంస్థ లేదంటే సీబీఐతో దర్యాప్తు చేయించాలని హెచ్ఆర్ఎఫ్ తెలంగాణ ప్రధానకార్యదర్శి డా. ఎస్. తిరుపతయ్య, తెలంగాణ, ఆంధ్ర సమన్వయ కమిటీ సభ్యుడు వి.ఎస్.కృష్ణ కోరారు. 'ముగ్గురు సభ్యులతో కూడిన హెచ్ఆర్ఎఫ్ నిజనిర్ధారణ బృందం ఈ నెల 13న కరకగూడెం, పినపాక మండలాల్లోని గ్రామాలను సందర్శించి, స్థానికులతో మాట్లాడింది. పోలీసులు చెబుతున్నట్లు రెండువైపులా కాల్పులు జరగలేదని తేలింది. ఆదివాసీ మావోయిస్టులపై ఏకపక్షంగా కాల్పులు జరిగినట్లు స్పష్టమైంది. పోలీసులపై హత్యాయత్నం నేరం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అది చట్టప్రకారం సరిపోదు. హత్య, ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధకచట్టం కింద కూడా కేసులు పెట్టాలి. ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపినట్లు నిర్ధారించాల్సింది న్యాయస్థానమే తప్ప పోలీసులు కాదు. మావోయిస్టు ఉద్యమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతిభద్రతల సమస్యగానే చూడొద్దు. మావోయిస్టులను రాజకీయంగా ఎదుర్కోవాలి. కానీ, వన్యమృగాలను వేటాడినట్లు కాల్చి చంపేందుకు లైసెన్సు జారీ చేయడం చట్టవిరుద్ధమే కాకుండా అనాగరికం'' అని స్పష్టంచేశారు.



సమస్యలను స్వయంగా పరిష్కరిస్తేనే ఆత్మసంతృప్తి

కాలం గడిచేకొద్దీ చాలామంది ధనవంతుల మనసుల్లో అంతర్లీనంగా ఒకరకమైన అసంతృప్తి పేరుకుపోతుంటుంది. అదేంటంటే- సమస్యలను స్వయంగా పరిష్కరించక పోవడం. ఏ చిన్న సమస్య ఎదురైనా.. డబ్బుతో దాన్ని తప్పించుకునేందుకే వారు మొగ్గుచూపుతుంటారు. దానివల్ల- సమస్యలను స్వయంగా పరిష్కరించడంతో దక్కే ఆత్మసంతృప్తిని కోల్పోతుంటారు.

– డాన్ కో, రచయిత

తొలుత పరేషాన్.. తర్వాత పోస్టింగ్

ఈనాడు, హైదరాబాద్: డీఎస్సీ-2024 ద్వారా ఎంపికైన కొత్త టీచర్లు మంగళవారం ఉదయం 3 గంటలపాటు ఆందోళన పడినా ఆ తర్వాత కౌన్సెలింగ్ ప్రక్రియ సాఫీగా సాగడంతో ఊపిరి పీల్చుకున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అర్ధరాత్రి వరకు కౌన్సెలింగ్ నిర్వహించి ఏ పాఠశాలలో పనిచేయాలో సూచిస్తూ పోస్టింగ్‌లు కేటాయించారు. మొత్తం 10,006 మంది పోస్టింగ్‌లు పొందారు. వారు బుధవారం వారికి కేటాయించిన పాఠశాలల్లో చేరనున్నారు. దాదాపు 80 % మంది ఎస్జీటీలకు వారి సొంత మండలాల్లోనే పోస్టింగ్‌లు దక్కాయని సమాచారం. గతంలో బదిలీ అయి రిలీవ్ కాని వారు మంగళవారం మధ్యాహ్నమే పాత స్థానం నుంచి రిలీవ్ అయ్యారు. వారూ బుధవారం కొత్త బడుల్లో చేరనున్నారు.

మూడు గంటల పాటు ఉత్కంఠ...

ఈ నెల 9న నియామకపత్రాలు అందుకున్న ఉపాధ్యాయులకు 15న కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు కేటాయించాలని 14న ఆదేశాలు జారీ అయ్యాయి. దాంతో ఎంపికైన వారందరూ మంగళవారం ఉదయం 8.30 గంటలకే కలెక్టరేట్లకు చేరుకున్నారు. సాయంత్రం వరకు కౌన్సెలింగ్‌ను నిలిపివేయాలని ఉదయం 9 గంటలకు పాఠశాల విద్యాశాఖ నుంచి డీఈఓలకు ఆదేశాలు అందాయి. దాంతో ఒక్కసారిగా అభ్యర్థుల్లో కలవరం మొదలైంది. అసలెందుకు నిలుపుదల చేయమన్నారో తెలియక ఆందోళన చెందారు. మధ్యాహ్నం 12కు మళ్లీ కౌన్సెలింగ్‌ను యథాతథంగా కొనసాగించాలని ఉత్తర్వులివ్వడంతో ఊపిరిపీల్చుకున్నారు.

అసలెందుకు గందరగోళం?

కొత్త టీచర్ల కంటే ముందుగా తమకు పోస్టింగ్‌లు ఇవ్వాలని 317 జీఓ బాధిత ఉపాధ్యాయులు కోరుతున్నారు. లేకుంటే తాము మారుమూల గ్రామాలకు వెళ్లాల్సి వస్తుందన్నది వారి ఆందోళన. ఈ విషయంపై కొందరు.. మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులపై ఒత్తిడి చేసినట్లు ప్రచారం జరుగుతోంది. దాంతో విద్యాశాఖ ఉన్నతాధికారుల నుంచి కౌన్సెలింగ్‌ను నిలుపుదల చేయాలని ఆదేశాలు వచ్చాయి. 'ఇప్పుడు కొత్త వారికి పోస్టింగ్‌లు ఇవ్వకుంటే 10 వేల మందికి పనిలేకుండానే జీతాలు ఇవ్వాల్సి వస్తుంది. ఏడు వేల మంది సీనియర్ ఉపాధ్యాయులు రిలీవ్ చేయాలని మూడు నెలలుగా ఎదురుచూస్తున్నారు. సుమారు 500 మంది 317 జీఓ బాధితుల కోసం వేల మందిని ఆపితే ప్రభుత్వం బద్నామ్ అవుతుంది. దానికితోడు ఎవరైనా తమకు అన్యాయం జరిగిందని డీఎస్సీ-2024లో ఎంపికకాని వారు కోర్టుకు వెళ్తే ప్రక్రియ మొత్తం ఆగిపోతుంది. మరో వైపు 317 జీఓ బాధితుల బదిలీల ప్రక్రియ ఒకటి రెండు రోజుల్లో పూర్తవుతుందా? అంటే చెప్పలేని పరిస్థితి' ఇలా పలు కోణాల్లో ఆలోచించిన విద్యాశాఖ అధికారులు కొందరు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ వ్యవహారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి వెళ్లడంతో సమస్య తీవ్రతను అర్థం చేసుకున్న ఆయన వెంటనే కొత్త టీచర్లకు పోస్టింగ్‌లు ఇచ్చేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

ఓసీలు 5.5 శాతం

మొత్తం ఎంపికైన ఉపాధ్యాయుల్లో ఓసీలు 5.5 శాతం ఉన్నారు. అత్యధికంగా బీసీలు 54.70 శాతం మంది ఎంపికయ్యారని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. ఎస్సీలు-18.5 శాతం, ఎస్టీలు 10.3 శాతం మందికి టీచర్ల కొలువులు దక్కాయి. క్రీడా కోటా కింద 393 మంది దరఖాస్తులను శాప్‌నకు పంపామని, అనుమతి మేరకు 33 మందికే పోస్టింగ్‌లు ఇస్తున్నామని అధికారి ఒకరు తెలిపారు. మిగిలిన వాటిపై అక్కడి నుంచి క్లియరెన్స్ రాగానే ఎంపికైన వారికి పోస్టింగ్‌లు ఇస్తామని పేర్కొన్నారు.

ఆదిలాబాద్‌లో అభ్యర్థుల ఆందోళన

ఆదిలాబాద్ పాలనా ప్రాంగణం, న్యూస్‌టుడే: డీఎస్సీ-2024 కౌన్సెలింగ్ ప్రక్రియ ఆదిలాబాద్‌లో ఉద్రిక్తతకు దారితీసింది. మధ్యాహ్నం కౌన్సెలింగ్ నిర్వహించేందుకు సమాయత్తమైన సమయంలో ఎంపిక జాబితాలో చోటుదక్కని అభ్యర్థులు, ఉపాధ్యాయ, కులసంఘాల నాయకులు ఆందోళనకు దిగడం ఉద్రిక్తతకు దారితీసింది. ఈ క్రమంలో డీఈవో ప్రణీతను చుట్టుముట్టి బాధిత అభ్యర్థులు నినాదాలు చేశారు. అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఇతర అధికారులు ఆందోళనకారులతో చర్చలు జరిపినా ఫలితం లేకుండా పోయింది. చివరకు పోలీసులు ఆందోళన చేస్తున్న వారిని చెదరగొట్టారు. రాత్రి వరకు కౌన్సెలింగ్ జరిగింది.



ఆదిలాబాద్ డీఈవో ప్రణీతను చుట్టుముట్టిన అభ్యర్థులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు


ఇప్పటివరకు జరిగిన ప్రవేశాల్లో జోక్యం చేసుకోబోం

- వైద్య విద్య ప్రవేశాల్లో స్థానికత అంశంపై సుప్రీం కోర్టు
- తదుపరి విచారణ నవంబరు 11 తర్వాత చేపడతామని వెల్లడి

ఈనాడు, దిల్లీ: తెలంగాణలో 9, 10, 11, 12 తరగతులు చదవడంతోపాటు, స్థానికంగా నీట్ పరీక్ష రాసిన వారికే వైద్య విద్య ప్రవేశాల్లో 85% స్థానిక కోటా ఉపయోగించడానికి వీలు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 33ను సవాల్ చేస్తూ విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఇదివరకు సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను అనుసరించి కోర్టును ఆశ్రయించిన 133 మంది విద్యార్థుల్లో, ఇప్పటివరకు 115 మంది ప్రవేశం పొందినందున వారి ప్రవేశాలలో జోక్యం చేసుకోబోమని స్పష్టంచేసింది.

మంగళవారం దీనిపై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోలోని అంశాలపై దీపావళి సెలవుల తర్వాత పూర్తిస్థాయి విచారణ చేపడతామని పేర్కొంది.

తమ ఉత్తర్వులను సవాల్ చేస్తూ కోర్టును ఆశ్రయించిన విద్యార్థులకు నీట్‌లో వచ్చిన ర్యాంకు ఆధారంగా సీట్లు కేటాయించడానికి తమకేమీ అభ్యంతరం లేదని రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన మీదట.. సుప్రీంకోర్టును ఆశ్రయించిన 133 మంది విద్యార్థులకు కౌన్సెలింగ్‌లో పాల్గొనడానికి అవకాశం ఇస్తూ సెప్టెంబరు 20న సర్వోన్నత న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది. ఆ ఉత్తర్వుల వల్ల న్యాయస్థానాన్ని ఆశ్రయించిన కొందరికే ప్రయోజనం కలుగుతోందని, వారితోపాటు సమాన అర్హతలున్న తమకూ అదే ఉత్తర్వులను వర్తింపజేయాలంటూ మరి కొంత మంది విద్యార్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.



దీనిపై సెప్టెంబరు 30వ తేదీన విచారణ జరిపిన సీజేఐ ధర్మాసనం జీవో 33ని వచ్చే ఏడాది నుంచి అమలుచేయడానికి వీలుందేమో పరిశీలించాలని తెలంగాణ ప్రభుత్వానికి సూచించింది. లేనిపక్షంలో 'ఆ జీవోను సవాల్ చేస్తూ కోర్టును ఆశ్రయించిన 133 మంది కౌన్సిలింగ్‌లో పాల్గొనడానికి ఇచ్చిన మినహాయింపును తొలగిస్తే తలెత్తే పరిణామాల గురించి అభిప్రాయం చెప్పాలని' నిర్దేశించింది. ఆ రెండు అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం తెలిపే అభిప్రాయం ప్రకారం స్థానికత అంశంపై తమ నిర్ణయాన్ని వెలువరిస్తామని పేర్కొంటూ తదుపరి విచారణను వాయిదా వేసింది. ఈలోపు సుప్రీంకోర్టుకు దసరా సెలవులు రాగా, ప్రస్తుతం రాష్ట్రంలో మెడికల్ కౌన్సిలింగ్ ప్రక్రియ దాదాపు పూర్తయ్యే దశకు చేరుకుంది. మంగళవారం ఈ కేసు విచారణకు వచ్చిన సందర్భంగా విద్యార్థుల తరఫున హాజరైన న్యాయవాదులు ఇది వరకు సుప్రీంకోర్టు జారీచేసిన ఆదేశాలను అనుసరించి పిటిషనర్లలో 107 మంది ఎంబీబీఎస్, 8 మంది బీడీఎస్‌లో సీట్లు పొందారని, బుధవారం నుంచి తరగతులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో వారి ప్రవేశాలను రద్దు చేస్తే ఇబ్బందులు పడతారని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. దాంతో ఆ ప్రవేశాల జోలికి తాము పోవడంలేదని సీజేఐ పేర్కొన్నారు. తదుపరి విచారణను నవంబరు 11వతేదీ తర్వాత చేపడతామని పేర్కొంటూ విచారణను వాయిదా వేశారు.

నీట్ ర్యాంకర్ల తొలి ప్రాధాన్యం ఎయిమ్స్‌కే

- రాష్ట్రంలో గాంధీ, ఉస్మానియా వైపు మొగ్గు

ఈనాడు, హైదరాబాద్: ఎంబీబీఎస్ కలను నెరవేర్చుకునేందుకు విద్యార్థుల తొలి ప్రాధాన్యం ఎయిమ్స్‌కే ఉంటోంది. ఈసారి కూడా ర్యాంకర్లు ఎక్కువ మంది ఎయిమ్స్‌ను ఎంచుకున్నారు. అత్యున్నత వైద్య ప్రమాణాలకు నెలవైన దిల్లీ ఎయిమ్స్ సహా ఇతర ఎయిమ్స్‌లతోపాటు జిప్‌మెర్‌లో ఎంబీబీఎస్ చేసేందుకు విద్యార్థులు సుముఖత చూపారు. రాష్ట్రంలో నీట్‌లో 500 లోపు ర్యాంకు సాధించినవారు ఎయిమ్స్ వైపు మొగ్గుచూపారు. రాష్ట్రంలోని నీట్ ర్యాంకర్ల మొదటి ప్రాధాన్యం గాంధీ మెడికల్ కాలేజీ కాగా తర్వాత ఉస్మానియా వైద్య కళాశాల ఉంది. ఎంబీబీఎస్ అడ్మిషన్లలో జాతీయ స్థాయిలో మూడు రౌండ్ల కౌన్సెలింగ్ పూర్తికాగా రాష్ట్రంలో రెండు విడతల ప్రక్రియ ముగిసింది. మిగిలిన సీట్ల భర్తీ త్వరలో ముగియనుంది. దేశవ్యాప్తంగా నీట్‌లో మొదటి వంద ర్యాంకర్లలో అత్యధికం దిల్లీ ఎయిమ్స్‌లో అడ్మిషన్ తీసుకోగా...మిగిలిన వారిలో ఎక్కువమంది జిప్‌మెర్ (పాండిచ్చేరి)ను ఎంచుకున్నారు. తెలంగాణకు చెందిన విద్యార్థులెవరికీ ఈ సారి నీట్‌లో వందలోపు ర్యాంక్ రాలేదు. 137వ ర్యాంకర్ అనురన్ ఘోష్ ఎయిమ్స్ భువనేశ్వర్‌లో చేరారు. 219 ర్యాంకు సాధించిన జి.వెంకట నృపేశ్ దిల్లీ ఎయిమ్స్‌లో, 357వ ర్యాంకర్ ఎయిమ్స్ భోపాల్‌లో చేరారు. 553వ ర్యాంకు సాధించిన ఎల్. శ్రీరాం నాయక్ కూడా దిల్లీ ఎయిమ్స్‌లో అడ్మిషన్ తీసుకున్నారు. 710వ ర్యాంకర్ ఎయిమ్స్ రిషికేశ్, 733వ ర్యాంకర్ దిల్లీలోని లేడి హర్డింగో మెడికల్ కాలేజీ, తర్వాత ర్యాంకర్లు ఎయిమ్స్ నాగ్‌పూర్, ఎయిమ్స్ భోపాల్‌లో చేరారు. గాంధీ వైద్య కళాశాలలో 549వ ర్యాంకర్ మహమ్మద్ అజాన్ సాద్ అడ్మిషన్ తీసుకున్నారు. 1,157 ర్యాంకర్ ఎ.కమలాకర్ ఉస్మానియా వైద్య కళాశాలలో చేరారు. గత ఏడాది గాంధీ మెడికల్ కాలేజీలో నీట్ 418వ ర్యాంకర్ చేరగా ఈసారి చేరిన ప్రారంభ ర్యాంకర్ 549 కావడం గమనార్హం.

అర్ధరాత్రి యువతిపై ఆటోడ్రైవర్ అత్యాచారం

- గచ్చిబౌలిలో వాహనంలోనే అఘాయిత్యం
- బాధితురాలి ప్రతిఘటనతో కిందికి తోసివేత
- పోలీసుల అదుపులో నిందితుడు!

గచ్చిబౌలి, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఠాణా పరిధిలో సోమవారం అర్ధరాత్రి యువతిపై జరిగిన అత్యాచార ఘటన కలకలం రేపింది. ఆటోను నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లిన డ్రైవర్ ఆమెపై అఘాయిత్యానికి ఒడిగట్టాడు. బాధితురాలి కేకలను విన్న కొందరు వాహనదారులు గమనించి అక్కడికి చేరుకోవడంతో పరారయ్యాడు. గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ హబీబుల్లాఖాన్ తెలిపిన వివరాల ప్రకారం... చెన్నైకి చెందిన యువతి(32) గచ్చిబౌలిలోని నానక్‌రాంగూడలో నివాసం ఉంటున్నారు. ఆమె ఓ ప్రైవేటు సంస్థలో ఆర్కిటెక్ట్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల దసరా సెలవుల నేపథ్యంలో సొంతూరు వెళ్లిన యువతి సోమవారం అర్ధరాత్రి బస్సులో నగరానికి చేరుకున్నారు. నగర శివారు రామచంద్రాపురం దగ్గర రాత్రి 1.30 గంటలకు బస్సు దిగాక నానక్‌రాంగూడ వెళ్లేందుకు ఒక ఆటో ఎక్కారు. ఇంటికి వెళ్లేమార్గంలో సెంట్రల్ యూనివర్సిటీ ప్రధాన రోడ్డులో ఉన్న మసీద్‌బండ కమాన్ వద్దకు రాగానే జనసంచారం లేకపోవడం చూసి డ్రైవర్ వాహనాన్ని పక్కకు నిలిపాడు. యువతి ప్రశ్నించేలోపే వెనుక సీటులోకి వచ్చాడు. ఆమె నోరునొక్కి దాడి చేశాడు. అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలు తీవ్రంగా ప్రతిఘటించగా మరోసారి దాడి చేశాడు. దీంతో తలకు గాయమైంది. ఆమె గట్టిగా కేకలు వేయడంతో దారిన వెళ్తున్న ఫుడ్ డెలివరీ బాయ్స్ గమనించి ఆటో దగ్గరికి వచ్చారు. ఈలోపు అతను యువతిని కిందకు తోసేసి వెంటనే పారిపోయాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు యువతిని భరోసా కేంద్రానికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు.

సీసీ కెమెరాల ద్వారా నిందితుడి గుర్తింపు!

నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. ఘటన తర్వాత అతను పరారవ్వడంతో గచ్చిబౌలి పోలీసులు నాలుగు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలించారు. హెచ్‌సీయూ రోడ్డులో ఉన్న సీసీ కెమెరాల్లోని దృశ్యాల ఆధారంగా అతన్ని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం కొండాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఈనాడు


కెనడా విపరీత పోకడ!

ద్వైపాక్షిక సంబంధాలను నెరపడమంటే- రెండు దేశాలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా కలుపుగోలుతనాన్ని ప్రదర్శించడం... పరస్పర ప్రయోజనాల సాధనకు ఉమ్మడిగా పనిచేయడం! దౌత్య చర్చలు, వాణిజ్య ఒప్పందాలు, సాంస్కృతిక ఆదాన ప్రదానాలు, భద్రతాపరమైన సహాయ సహకారాల ద్వారా దేశాల నడుమ చెలిమి బలోపేతమవుతుంది. తన సార్వభౌమాధికారానికి, సమగ్రతకు ప్రమాదకరమైన ఉగ్రవాదులు, ముష్కర సంస్థలు, సంఘవిద్రోహ కార్యకలాపాలను ఎదుర్కోవడంలో ఒక దేశానికి మరొకటి తోడ్పడటం కచ్చితంగా ఉభయతారకమవుతుంది. ఆ మేరకు పాటించాల్సిన అంతర్జాతీయ దౌత్య విలువలు, ద్వైపాక్షిక సహకార విధానాలను కెనడా ప్రభుత్వం ఖాతరు చేయడం లేదు. సరికదా, ఖలిస్థానీ ముష్కరులను చంకనెక్కించుకుంటూ ఇండియాతో కోరి తగువు పెట్టుకుంటోంది. ఏడాది కిందట హతమైన ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్‌కు కెనడా పార్లమెంటు ఇటీవల నివాళులు అర్పించడమే తీవ్ర వివాదాస్పదమైంది. ఇక తాజాగా నిజ్జర్ హత్య కేసు అనుమానితుల జాబితాలో భారత హైకమిషనర్ పేరు చేర్చేందుకు తెగబడటం- కెనడా కయ్యాలమారి పోకడలకు పరాకాష్ఠ!

హత్యలు మొదలు బాంబుపేలుళ్ల వరకు అనేక అకృత్యాలకు పాల్పడిన హర్దీప్ సింగ్ నిజ్జర్- రవిశర్మ పేరిట తప్పుడు పాస్‌పోర్టుతో కెనడాలో ఆశ్రయం పొందాడు. ఆ కర్కోటకుడికి పౌరసత్వం కట్టబెట్టిన కెనడా ప్రభుత్వం- అతడి హత్యకు సంబంధించి ఇండియాపై నిరాధార ఆరోపణలను గుప్పిస్తోంది. ఆ క్రమంలోనే భారత హైకమిషనర్, దౌత్యాధికారులపై అది బురదజల్లి ఇరుదేశాల నడుమ పెనుసంక్షోభానికి కారణమైంది. కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో రాజకీయంగా గడ్డు పరిస్థితులను చవిచూస్తున్నారు. జీవన వ్యయాలు పెరగడం, నేరాలు అధికం కావడం తదితరాలతో ప్రజల్లో ట్రూడో పరపతి వేగంగా తరిగిపోతోంది. రాబోయే ఎన్నికల్లో ఆయన పార్టీ గెలుపు కష్టతరం కానుందనే విశ్లేషణలూ కొన్నాళ్లుగా వెలువడుతున్నాయి. వాటికి తోడు ట్రూడో నేతృత్వంలోని ప్రభుత్వానికి మద్దతును ఉపసంహరించుకుంటున్నట్లు న్యూ డెమోక్రటిక్ పార్టీ అధ్యక్షుడు జగ్మీత్ సింగ్ ఇటీవల ప్రకటించారు. ఈ పరిణామాలతో ఉక్కిరిబిక్కిరవుతున్న ట్రూడో తన రాజకీయ భవితకు ఇండియాతో మైత్రీబంధాన్ని బలిపెడుతున్నారు. కెనడాలో ఎక్కువ సంఖ్యలో ఉన్న సిక్కుల ఓట్లకోసమే ఆయన ఖలిస్థానీలకు పక్కతాళమేస్తున్నారు!

నాలుగు దశాబ్దాల క్రితం పంజాబ్‌లో ఖలిస్థానీ ఉగ్రవాదులు సృష్టించిన రక్తపాతం అంతాఇంతా కాదు. ఇండియాను కుంగదీయాలన్న కుతంత్రంతో ఆ ముష్కరులకు పాకిస్థాన్ పాలుపోసి పెంచింది. కాలక్రమంలో దేశీయంగా ఖలిస్థానీ ఉగ్ర భావజాలానికి నూకలు చెల్లిపోయాయి కానీ, కెనడాలో అది బలంగా వేళ్లూనుకుంది. ఖలిస్థానీ ఉగ్రవాదులకు అండదండలందించే వేర్పాటువాద సంస్థలు కెనడాలో కనీసం తొమ్మిది ఉన్నట్లు అంచనా. వాటిని ట్రూడో సర్కారు కట్టడి చేయకపోగా, భారతదేశంపై నిత్యం విషం కక్కుతున్న వాళ్లపై అవ్యాజ ప్రేమానురాగాలను కురిపిస్తోంది. ఉగ్రవాదులకు కెనడా స్వర్గధామమైందన్నది ఇండియా విమర్శ మాత్రమే కాదు... 'ఇతర దేశాల భద్రతకు ముప్పు వాటిల్లజేసే అత్యంత కరుడుగట్టిన నేరమూకలకు కెనడా సురక్షిత స్థావరమైంది' అంటూ ఇంటర్నేషనల్ కోయలిషన్ ఎగైనెస్ట్ ఇల్లిసిట్ ఎకానమీస్ సంస్థ నిరుడే నివేదించింది. ఓటుబ్యాంకు రాజకీయాలకోసం భారత వ్యతిరేక శక్తులను, ముష్కర మిన్నాగులను ముద్దుచేస్తున్న ట్రూడో ధోరణి- భవిష్యత్తులో కెనడాకు ఆత్మవినాశకరంగా పరిణమిస్తుందన్నది పచ్చినిజం!

నిరంతరం నేర్చుకోవాలి. తరచూ ప్రశ్నించాలి. జాగ్రత్తగా విశ్లేషించాలి. అప్పుడు ఆ నేర్చుకున్న దాన్ని తెలివిగా ఆచరణలో పెట్టాలి. ప్రశ్నించని వ్యక్తి జీవిత కాలం తెలివితక్కువ వాడిగానే ఉండిపోతాడు.



– కన్‌ఫ్యూషియస్

జీవితం ఇందుకే...

'బతుకు చావటానికి కాదు. బతకడానికి, బతికించడానికి' అని సూటిగా చెప్పారో రచయిత. ఈ మాటలకి ఎంతో అర్థం, అంతరార్థం, పరమార్థం ఉన్నాయి. జీవితాన్ని ఆసాంతం... సహజమైన మరణం వచ్చేవరకు జీవించాలి. అలా జీవించడంలోనే మనిషి వివేకం, ధైర్యం, విజ్ఞతలుంటాయి. బతుకును అర్ధాంతరంగా ముగించకూడదు.

సుఖాలను ఎలా అనుభవించామో, దుఃఖాలనూ అలాగే తట్టుకోవాలి. స్థితప్రజ్ఞత అంటే ఇదే. జీవితం చీకటి వెలుగుల సమ్మిళితం. ఒకదానినొకటి అనుసరిస్తుంటాయి. ఏదీ శాశ్వతం కాదు. ఇది ప్రకృతి ధర్మం. జీవితంలోని ఆనంద, విషాదాలకు ఇదే వర్తిస్తుంది. చాలామంది ఆనందంలో పట్టపగ్గాలు లేకుండా పొంగిపోతూ ఒళ్లు మరచిపోతుంటారు. కానీ విషాదాన్ని మాత్రం తట్టుకోలేక, తల్లడిల్లిపోతుంటారు. మనసు కుదురు కోల్పోతుంది. భరించలేక చావటానికి సిద్ధమవుతారు. బతుకును అర్ధాంతరంగా ముగించాలనుకునేవారు పిరికివాళ్లు. ఈ దుఃఖం, బాధ అనే అంధకారం తొలగి, ఆనందపు ఉదయరేఖలు తమ జీవితంలో ప్రసరిస్తాయనే సంగతే మరచిపోతారు. పుట్టుకతో వచ్చిన సంస్కారం, అనుభవసారం, ఇంగితం, చదువు... ఈ శక్తులన్నీ ఆ క్షణంలో నశిస్తాయి. యుక్తాయుక్త విచక్షణ పోతుంది. మనసు వెలుసు అవుతుంది. ఇది అభిలషణీయం కాదు.



అంతర్యామి

'మనిషి ఓ అద్భుతసృష్టి. ఈ జీవకోటిలో శ్రేష్ఠతముడు, శక్తిపరుడు, యుక్తిపరుడు' అంటాడు షేక్స్పియర్. అంతే కాదు. ఈ సృష్టిలో అద్భుతమైన ఆలోచనాశక్తి కలిగి ఆ మేధను నిరంతరం పదును పెట్టుకునేవాడు మనిషి ఒక్కడే. ఆదిమానవ దశ నుంచి నేటివరకు మానవజీవితంలో ఎంత గొప్పవికాసం! ఎంతటి అనూహ్యమైన మార్పు! నిరంతరం కొత్తపుంతలు తొక్కే తన మేధస్సుతో నాగరికతలో, సాంకేతిక విజ్ఞానంలో ఎంతో పురోగతి సాధించిన మనిషి- బాధలు చుట్టేసినపుడు మానసిక స్థైర్యాన్నీ పరిణతినీ ఎందుకు చూపలేకపోతున్నాడు? ఇంతటి ప్రజ్ఞాశీలి కష్టసమయాలలో ఎందుకు బేలగా మారుతున్నాడు? కష్టాలు కలకాలం ఉండవన్న సంగతి ఆ క్షణాన మరిచిపోతాడా? మనోనిగ్రహాన్ని కోల్పోతున్నాడా? అతని చదువు, సంస్కారం ఏమవుతోంది? నేర్చుకున్న విద్యని జీవితానికి అన్వయించుకోలేకపోతున్నాడా? జీవితాన్ని అంతమొందించుకుంటున్నాడెందుకని? క్షణికావేశం అన్నింటినీ మరిపిస్తోందా?

భర్త పాండురాజు మరణం, సవతి మాద్రి సహగమనం చూసి కుంతి మనోనిబ్బరం కోల్పోలేదు. పిల్లల బాధ్యత ఆమెను బతికించింది. గాంధారి, దుర్యోధనాదుల అసూయనుంచి నిరంతరం తన బిడ్డలను కాపాడుకుంటూనే ఉంది. కష్టాలెన్నో ఓర్చుకుంది. తుదకు పాండవుల ఉచ్చస్థితిని చూసి ఆనందించటానికి జీవించి ఉంది!

ఈ అద్భుత జీవితాన్ని తుదివరకు జీవించాలి. అది మనిషి కర్తవ్యం. ముఖ్యంగా కుటుంబాన్ని, తనవారిని బతికించుకోవాలి. ఆపై జీవితమకరందాన్ని ఆస్వాదించాలి. ఇంతటి నాగరికత, కళా వైదుష్యం, అద్భుత సాహిత్యాలను భావితరాలకు అందించాలి. తనలోని మానవీయశక్తుల్ని పెంచుకోవాలి. అప్పుడు భూమిని మించిన స్వర్గం వేరే ఉంటుందా! మనిషి తన అంతఃసీమల్లో ప్రకాశించే జ్యోతిని చూడగలగాలి. అదే పరం జ్యోతి. దాన్ని చేదుకుని, చేరుకోగలగటమే జీవిత పరమార్థం.

– బొడ్డపాటి చంద్రశేఖర్

రెండు రాష్ట్రాలు... భిన్న సవాళ్లు!

జమ్మూకశ్మీర్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిందిగా నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లాను లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆహ్వానించారు. ముఖ్యమంత్రిగా ఒమర్ ప్రమాణం చేయనున్నారు. అయితే, ఆ బాధ్యతల నిర్వహణ ఆయనకు కత్తిమీద సాము కానుంది. ఇక హరియాణాలో ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చడం భాజపాకు అగ్నిపరీక్షే!

ఇటీవలి జమ్మూకశ్మీర్, హరియాణా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు పరాజితులతోపాటు విజేతలకూ పాఠాలు నేర్పుతున్నాయి. ఓడిపోయినవారు తమ లోపాలను సరిదిద్దుకొని తదుపరి ఎన్నికలకు సన్నద్ధం కావాల్సి ఉంది. గెలిచినవారేమో ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి సమర్థ పాలన అందించాలి. జమ్మూకశ్మీర్‌లో అబ్దుల్లా కుటుంబం మళ్ళీ అధికారంలోకి వచ్చినప్పటికీ, కాంగ్రెస్‌ను కూడా వెంటతెచ్చుకుంది. హిందూ ఓటర్లకు సంఖ్యాధిక్యం ఉన్న జమ్మూలో కాంగ్రెస్ పార్టీ పోటీ చేసిన 29 సీట్లలో కేవలం ఒకే ఒక్క సీటును గెల్చుకోగలిగింది. అబ్దుల్లాల నేతృత్వంలోని నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) మద్దతు ఉండి కూడా కాంగ్రెస్ ఇంత పేలవమైన ఫలితాలు సాధించడం చిత్రమే! జమ్మూకశ్మీర్ అంతటా కాంగ్రెస్ 39 సీట్లకు పోటీచేసి కేవలం ఆరు సీట్లే గెలవగలిగింది. నేషనల్ కాన్ఫరెన్స్‌తో పొత్తు వల్ల ముస్లిం ఓటర్ల మద్దతు లభించి కాంగ్రెస్ ఈ మాత్రం సీట్లయినా గెలుచుకోగలిగింది. ఏతావాతా నేషనల్ కాన్ఫరెన్స్ వల్ల కాంగ్రెస్‌కు లాభం కలిగిందే తప్ప, కాంగ్రెస్ వల్ల అబ్దుల్లాల పార్టీకి ఒరిగిందేమీ లేదని అర్థమవుతోంది.





కేంద్రంతో కలిసి నడుస్తారా?

భారతీయ జనతా పార్టీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వంతో సఖ్యతకు కాంగ్రెస్ వల్ల ఆటంకం కలగకుండా చూసుకోవడం నేషనల్ కాన్ఫరెన్స్‌కు అవసరం. అదీకాకుండా అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన ఇండిపెండెంట్లలో నలుగురు మద్దతు ప్రకటించారు కాబట్టి, కాంగ్రెస్ తోడు లేకుండానే ప్రభుత్వాన్ని నడిపే సత్తా నేషనల్ కాన్ఫరెన్స్‌కు లభించింది. జమ్మూకశ్మీర్‌కు ఉగ్రవాదుల ముప్పు నిరంతరం పొంచి ఉన్నందువల్ల భద్రతాపరంగా కేంద్ర ప్రభుత్వ మద్దతు ఒమర్ అబ్దుల్లా సర్కారుకు ఆవశ్యకం. ప్రస్తుతానికి కేంద్రపాలిత ప్రాంతంగా ఉన్న జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తి సాధించాలన్నా కేంద్రంతో సఖ్యతగా ఉండటం తప్పనిసరి. 2019కి ముందునాళ్లలా జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఇచ్చి జాతీయ స్రవంతిలోకి తిరిగి తీసుకురావాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది. కేంద్రంతో సత్సంబంధాలు ఉంటే జమ్మూకశ్మీర్‌కు వేగంగా రాష్ట్ర హోదా లభిస్తుంది. సంక్షుభిత కశ్మీర్‌ను జాతీయ స్రవంతిలో మమేకం చేయడానికి ఒమర్ అబ్దుల్లా అన్ని విధాలా కృషిచేయాలి. ఎన్నికల ద్వారా అధికారంలోకి వచ్చిన పార్టీలు ప్రజాస్వామ్య పద్ధతిలో పరస్పర సహకారంతో లక్ష్యాన్ని సాధించడం ఉభయతారకంగా ఉంటుంది. ఈ అంశాలన్నీ రాజకీయంగా అనుభవజ్ఞుడైన ఒమర్ అబ్దుల్లాకు తెలియనివి కావు. అబ్దుల్లా కుటుంబం అధికారంలో ఉన్నప్పుడు కేంద్రంతో సఖ్యతగా వ్యవహరిస్తుంది. అదే ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కేంద్రం పట్ల వ్యతిరేక పంథాను అనుసరిస్తుంది. కేంద్ర ప్రభుత్వంతో ఒమర్ అబ్దుల్లా ఒడుపుగా ప్రవర్తించడం ఎంత అవసరమో- కేంద్రం కూడా ఆయన సర్కారు పట్ల ఎలాంటి సందిగ్ధతకు తావివ్వకుండా సూటిగా సంబంధాలు నెరపాలి. జాతీయ భద్రతాపరంగా జమ్మూకశ్మీర్ ప్రాధాన్యాన్ని గుర్తెరిగిన కేంద్రం ఈ వాస్తవాన్ని తప్పకుండా గుర్తుంచుకుంటుంది.

జమ్మూకశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తికి సంబంధించిన 370వ అధికరణను రద్దు చేసిన సంగతి తెలిసిందే. దీనికోసం తెచ్చిన రాజ్యాంగ సవరణ ప్రకారం, అయిదుగురు సభ్యులను అసెంబ్లీకి నామినేట్ చేయాల్సి ఉంది. ఆ పని సజావుగా చేయడం ద్వారా ఒమర్ అబ్దుల్లా కేంద్రంతో సఖ్యతకు ద్వారాలు తెరవాలి. అలా కాకుండా, రద్దయిన 370వ అధికరణను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తే కేంద్రంతో ఘర్షణ వాతావరణం నెలకొంటుంది. దీన్ని ఒమర్ అబ్దుల్లా నివారించాలి. జమ్మూకశ్మీర్ ప్రజల విశాల ప్రయోజనాల కోసం లెఫ్టినెంట్ గవర్నర్‌తో చేతులు కలిపి పని చేయాలి. 370వ రాజ్యాంగ అధికరణ పునరుద్ధరణకు పట్టుపట్టడం ఒమర్ ఎన్నికల ప్రచారానికి ఉపకరించింది. కానీ, ముఖ్యమంత్రి హోదాలో అదే డిమాండ్ చేస్తే కేంద్రంతో కోరి సమస్యలు తెచ్చుకున్నట్లవుతుంది. దీనికి బదులు శాంతిభద్రతల రక్షణ, ఉపాధి అవకాశాలు, విద్యావైద్యాల కోసం డిమాండ్ చేసి సాధించుకోవడం సమర్థ పాలనకు తోడ్పడుతుంది. కేంద్రం రద్దు చేసిన 370వ అధికరణను పునరుద్ధరించడం ప్రస్తుతానికి అసంభవం. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఇవ్వడానికి కేంద్రం సుముఖంగా ఉంది. అయితే జమ్మూకశ్మీర్‌లో శాంతిభద్రతలను సంరక్షించినప్పుడు మాత్రమే రాష్ట్ర హోదా ఇవ్వగలుగుతుంది. అందువల్ల, ఆ సత్తా తనకుందని ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వం నిరూపించుకోవాలి.

హరియాణాలో హామీల భారం...

ఇక హరియాణా విషయానికి వస్తే- ఎన్నికల్లో ఎన్నో సవాళ్లను అధిగమించి భాజపాకు అద్భుత విజయాన్ని సాధించిన ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీని ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చరనే భావిస్తున్నారు. అయితే ఆయన చేసిన వాగ్దానాలను నెరవేర్చడం అంత సులభమేమీ కాదు. హరియాణాలో విత్త లోటు పెరిగిపోతూ పెట్టుబడి వ్యయం తగ్గిపోతోంది. రాష్ట్రంలోని గురుగ్రామ్‌లో 1980 దశకంలో ఏర్పాటైన మారుతి సుజుకి ఫ్యాక్టరీ దేశంలో కార్ల పరిశ్రమకు గొప్ప ఊతమిచ్చింది. కానీ, ఆ పట్టణంతోపాటు హరియాణాలోని ఇతర ప్రాంతాల్లోనూ అధ్వానంగా ఉన్న పౌర సేవలను గాడిన పెట్టాల్సిన అవసరముంది. మహిళలకు నెలనెలా రూ.2,100 భృతి, కళాశాల విద్యార్థినులకు స్కూటీ, పేద కుటుంబాలకు ఉచిత వంట గ్యాస్ సిలిండర్ ఇస్తామనే ఎన్నికల వాగ్దానాలను నిలబెట్టుకోవడం రాష్ట్ర ప్రభుత్వానికి భారం కానుంది. దీన్ని తట్టుకోవాలంటే పారిశ్రామిక, సేవా రంగాల్లో అధిక వృద్ధి రేట్లను సాధించి రాష్ట్ర ఆదాయం పెంచుకోవాలి.



వీరేంద్ర కపూర్
సామాజిక, రాజకీయ విశ్లేషకులు



పోలిక లేదు... పోటీ లేదు!

'ఎత్తయిన ఆ పర్వత శిఖరం మహోన్నతంగా జీవించమని చెప్తున్నట్టుంది కదా' అన్నాడతను.

'ఉన్నతంగా అంటే? ఆర్థికంగానే కదా!'

'పొరపడుతున్నారు! ఈ రోజుల్లో ఆర్థికంగా ఉన్నతస్థాయిలో ఉండటానికి స్వయంకృషిలో చిరంజీవిలా కష్టపడక్కర్లేదు'

'మీరనేది సామాజికంగా ఉన్నతస్థాయిలో ఉండమనా?'

'అయ్యో.. మీకలా అర్థమైందా! జనంలో పేరు రావాలంటే ఒక్క ఇన్‌స్టాగ్రామ్ రీల్ వైరల్ అయితే చాలదా?'

'నిజమే అనుకోండి. ఏదిఏమైనా శిఖరమంత ఎత్తు ఎదగమంటే మాత్రం ఈ వయసులో నావల్ల కాదు' అన్నాను.

'అంత శ్రమ వద్దులెండి. నేననేది వ్యక్తిగతంగా ఉన్నతంగా జీవించమని!'

'అదే కదండీ ఇందాకటి నుంచి నేను చెప్తున్నది.. ఆర్థికంగా, సామాజికంగా ఎదిగితేనే కదా వ్యక్తిగతంగా ఉన్నతంగా బతకగలిగేది?'

'ఓ.. మీకలా అర్థమయ్యిందా! మీతో ఇప్పుడు వ్యక్తిత్వంలో ఓనమాలు దిద్దించడం నావల్ల కాదులెండి' అని నాకో నమస్కారం పెట్టి వెళ్లిపోయాడతను.

నేనేం తప్పు చేశాను అతనలా వెళ్లిపోవడానికి? వ్యక్తిత్వం పట్ల నా అభిప్రాయం చెప్పానంతేగా! మళ్లీ ఆ పర్వతంకేసి చూశాను. అప్పటివరకు ఆకాశమంతా దుప్పటిలా పరుచుకున్న మేఘాలు అటు ఇటు కదిలేసరికి నా ముందున్న మహోన్నత పర్వతానికి గొడుగు పడుతున్నట్టుగా దాని వెనకాలే ఇంకొక పెద్ద పర్వతం కనిపించింది. అతను చెప్పిన దాని ప్రకారం ఈ పర్వతం మహోన్నతం అయితే అంతకన్నా భారీగా ఉన్న పెద్ద పర్వతం మహిమాన్వితమా? మీరేం పేర్లు పెట్టుకుంటే నాకేంటి అన్నట్లు ధీమాగా నిలబడివుంది నా ముందున్న చిన్న పర్వతం. దేని ప్రత్యేకత దానిదే కదా మరి!

అలాగే నా ప్రత్యేకత కూడా నాదే! జీవితం షడ్రుచుల సంగమం. భావావేశాలను అణచుకుని నటిస్తూ జీవించడం వల్ల కాని పని. అంతమాత్రాన 'నాకు కోపం ఎక్కువ, నేను పేలతాను' అంటే ఫలితం అనుభవించడానికీ సిద్ధమవ్వాలి. అదీ కష్టమే! భౌతిక ఆరోగ్యానికి పోషకాలన్నీ సమపాళ్ళలో ఎలా తీసుకోవాలో భావోద్వేగాలను కూడా ఎక్కువ తక్కువ కాకుండా చూసుకోవాలి. నేను సుఖంగా సౌకర్యంగా ఉంటే నా చుట్టూ ఉన్నవారిని సంతోషంగా ఉంచే ప్రయత్నం చేయగలను. అలాగని ఎదుటివారిని సంతోషపరిచే బాధ్యత పూర్తిగా నా నెత్తిమీద వేసుకునేంత అమాయకత్వం లేదు. నా కంఫర్ట్ జోన్ నేనే సృష్టించుకునే ప్రయత్నం చేస్తుంటా. ఇక, ఉన్నతంగా ఉండటం సంగతికొస్తే ప్రతి వ్యక్తికీ నిర్వచనం మారిపోతుంది. 'వెనుక నాకన్నా పెద్ద పర్వతం ఉంది దానిముందు నేనెంత' అనుకుని ముడుచుకుపోలేదు నా ముందున్న చిన్న పర్వతం. నన్ను తక్కువగా చూసేవారి దృష్టితో నాకు సంబంధం లేదన్నట్టు నిలిచింది. అలాగే నేను కూడా! నాకు ఎవరితోనూ పోలిక లేదు. పోటీ లేదు. నేను... నేనే. నా జీవిత మంత్రమిదే!

– డా॥ హారిక చెరుకుపల్లి



అంతర్జాలంలో విహారం

దేశీయంగా స్మార్ట్‌ఫోన్ల వినియోగం పెరుగుతోంది. చౌక ధరకే డాటా లభిస్తోంది. దాంతో అంతర్జాలాన్ని వినియోగించేవారి సంఖ్య అధికమవుతోంది. పల్లెలతో పోలిస్తే పట్టణాల్లో ఇలాంటి వారి సంఖ్య ఎక్కువగా ఉంది. భారతీయులు రోజులో సగటున 1.5 గంటలు ఇంటర్నెట్ కోసం వెచ్చిస్తున్నారు. గత అయిదేళ్లలో దేశీయంగా ఇంటర్నెట్ వినియోగదారుల సంఖ్య ఎలా పెరిగిందంటే.. (కోట్లలో)

2019	57.4
2020	62.2
2021	69.2
2022	75.9
2023	82.1

(ఆధారం: ఇంటర్నెట్ అండ్ మొబైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నివేదిక)

పోషకాహార భద్రత కోసం...

మానవ వికాసంతోపాటు వ్యాధుల బారినపడకుండా ఉండటంలో ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. అందుకే "ఆహారమే మీ ఔషధంగా ఉండాలి" అన్నారు వైద్యశాస్త్ర పితామహుడు హిప్పోక్రాట్స్. పోషకాలతో కూడిన సమతుల ఆహారం ఆరోగ్యకరమైన జీవనానికి ప్రధానం. ఆరోగ్యవంతమైన, బలమైన, ఉత్పాదకశక్తి కలిగిన మానవ వనరులు దేశ ప్రగతికి అత్యంత కీలకం. ఆరోగ్యదాయక జీవనాన్ని గడిపేందుకు అవసరమైన పోషక విలువలు కలిగిన తిండి గింజలను అన్ని కాలాల్లో అందుబాటులో ఉంచడమే ఆహార భద్రత అని ఎఫ్ఏవో నిర్వచించింది. ప్రపంచ జనాభాలో సుమారు 42శాతానికి ఆరోగ్యకరమైన ఆహారాన్ని కొనుగోలు చేసేటంత ఆర్థిక స్థోమత లేదు. భారతదేశంలో సుమారు 74శాతం జనాభా ఆరోగ్యకరమైన ఆహారాన్ని పొందలేకపోతున్నారు. 16శాతం ప్రజలు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. ఈ చేదు నిజాలను ఆహార వ్యవసాయ సంస్థ తాజా నివేదిక వెల్లడించింది.



ఐక్యరాజ్యసమితి 1945, అక్టోబరు 16న ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏవో)ను స్థాపించింది. దాన్ని పురస్కరించుకుని ఏటా ఇదే రోజున ప్రపంచ ఆహార దినోత్సవం నిర్వహిస్తున్నారు. 'మెరుగైన జీవితం, మంచి భవిష్యత్తు కోసం ఆహార హక్కు' ఈ ఏడాది నినాదం. ఆకలి బాధల్లేని ప్రపంచాన్ని సృష్టించడానికి దేశాలన్నీ పునరంకితం కావాల్సిన తరుణమిది.


అటు ఆకలి... ఇటు ఆహార వృథా!

ఐరాస నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో రెండోది- 2030 నాటికి ఆకలి బాధలను అంతమొందించడం. ఇందుకోసం సుస్థిర వ్యవసాయ పద్ధతుల్లో దిగుబడులను గణనీయంగా పెంచాలని సమితి సూచించింది. సురక్షితమైన, పోషకాలతో కూడిన ఉత్పత్తులను సాధించడం, వాటి సరఫరా గొలుసుల పనితీరును మెరుగుపరచడం ద్వారా ఆహార భద్రతను సాధించాలని ఐరాస పిలుపిచ్చింది. అయితే, ఆహార భద్రతను సాధించడంలో చిన్న, సన్నకారు రైతులదే కీలకపాత్ర. ప్రపంచ వ్యాప్తంగా 70.80శాతం ఆహారం చిన్న కమతాల్లోనే ఉత్పత్తి అవుతోంది. కాబట్టి, బడుగు రైతుల ఉత్పాదకతను, వారి ఆదాయాన్ని గణనీయంగా పెంచే ప్రణాళికలను అమలు చేయాలి. 'అన్నమో రామచంద్రా' అని ఆకలితో అలమటిస్తున్న అన్నార్తులు ఎక్కువగా ఉన్న దేశాల్లో భారత్ ఒకటి. 2024 ప్రపంచ ఆకలి సూచీలో 127 దేశాలకుగాను ఇండియా 105వ స్థానాన కూలబడిపోవడం అత్యంత ఆందోళనకరం. దేశ బాలబాలికల్లో 18.7శాతం పౌష్టికాహారలేమితో బాధపడుతుండటమూ కలవరపరిచేదే. అయిదేళ్లలోపు పిల్లల్లో మరణాల రేటు 3.1శాతంగా ఉంది. 15-24 ఏళ్ల యువతులు, మహిళల్లో 58శాతానికి పైగా రక్తహీనతతో సతమతమవుతున్నారు. వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాలు, యుద్ధాలు, అంతర్గత ఘర్షణలు, పేదరికం, చీడపీడలు వంటివి ఆకలి సమస్యను ఎదుర్కోవడంలో ప్రధాన అవరోధాలుగా నిలుస్తున్నాయి. ఆహార ఉత్పత్తుల ధరలు పెరుగుతుండటమూ ఆందోళన కలిగిస్తోంది.

దేశీయంగా ఇళ్లలో ఏటా 7.81కోట్ల టన్నుల మేర ఆహారం వృథా అవుతోంది. వ్యవసాయ ఉత్పత్తులు పొలం నుంచి మార్కెట్‌కు చేరేలోపు భారీగా మట్టిపాలవుతున్నాయి. ఇలాంటి వృథావల్ల ఏటా లక్ష కోట్ల రూపాయల దాకా నష్టం వాటిల్లుతోంది. ప్రపంచ వ్యాప్తంగా ఆహార ధాన్యాలను కోత అనంతరం రిటైల్ మార్కెట్లకు చేర్చేలోపు 13.2శాతం నష్టపోవాల్సి వస్తోందని ఎఫ్ఏవో నివేదిక-2023 విశ్లేషించింది. అయితే, అవి రిటైల్ మార్కెట్ల నుంచి వినియోగదారులకు చేరేలోపు 17శాతం నష్టం జరుగుతోందని ఐరాస పర్యావరణ కార్యక్రమ(యూఎన్ఈపీ) సంస్థ అంచనా వేసింది. అంటే, మొత్తంగా 30శాతం నష్టం వాటిల్లుతుందన్న మాట. ఆహార వృథా అంటే కేవలం ఆహారాన్ని కోల్పోవడమే కాదు- ఆ ఉత్పత్తికి దోహదపడిన నేల, నీరు, వనరులు, ఇంధనం, రవాణా వంటివన్నీ వృథా అయినట్లుగానే భావించాలి. పారబోసిన ఆహారం కుళ్లిపోయి మిథేన్‌ను ఉత్పత్తి చేస్తుంది. దాంతో గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు పెరిగి పర్యావరణానికి నష్టం వాటిల్లుతుంది. 10శాతం గ్రీన్‌హౌస్ వాయువులు కుళ్లిన ఆహారం నుంచే వెలువడుతున్నాయి!

స్వల్ప మార్పులతో...

ఆహారాన్ని వండే, తినే, నిల్వచేసే పద్ధతుల్లో స్వల్ప మార్పులు చేసుకోవడం ద్వారా అత్యంత విలువైన వనరులను, పర్యావరణాన్ని రక్షించుకోవచ్చు. మిగిలిపోయిన ఆహారాన్ని మొక్కలకు శక్తినిచ్చే ఎరువుగా మార్చవచ్చు. ప్రజలకు గౌరవప్రదమైన జీవనాన్ని అందించేందుకని కేంద్రం 2013లో 'జాతీయ ఆహార భద్రతా చట్టం' తీసుకొచ్చింది. దీని కింద రాయితీపై ఆహార ధాన్యాలను అందిస్తున్నారు. అయితే, ఆకలి బాధలను, పోషకాహార లేమిని సమూలంగా నిర్మూలించాల్సిన అవసరముంది. ఇందుకోసం అధిక దిగుబడులనిచ్చే నూతన వంగడాలను సృష్టించడంతో పాటు ఆధునిక సేద్య విధానాలను పాటించాలి. ఆకలి అనేక అనర్థాలకు మూలం. కాబట్టి, ప్రతి ఒక్కరికీ సురక్షితమైన పోషకాహారం అందేలా చూడటం ముఖ్యం.



డాక్టర్ జె.సురేష్
ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆచార్యులు

ఎగురుతూనే ఉంటా!

హాయ్! ఓజ్జీ!!

హాయ్ నేస్తాలూ..! ఎలా ఉన్నారు? నేనైతే చాలా బాగున్నా! నేనెవరో మీకు తెలియదు. సరదాగా పరిచయం చేసుకుందామని ఇలా వచ్చాను. మరి నా విశేషాలేంటో తెలుసుకోండి.




నా పేరు 'మ్యాగ్నిఫిసెంట్ ఫ్రిగేట్‌బర్డ్'. నేను ఒకరకమైన సముద్ర పక్షిని. అమెరికా, మెక్సికో, బ్రెజిల్ వంటి దేశాల్లో ఎక్కువగా కనిపిస్తాను. చూడటానికి కాస్త వింతగా ఉంటాను. మాలో ఆడ,మగ పక్షులను ఇట్టే గుర్తుపట్టేయొచ్చు తెలుసా! మగ పక్షులకు గొంతు దగ్గర ఎరుపు రంగు కాస్త వింతైన ఆకారం ఉంటుంది. ఆడ పక్షులకేమో.. గొంతు దగ్గర తెలుపు రంగు ఉంటుంది. మీకో విషయం తెలుసా.. మాలో ఆడ పక్షులే మగ వాటి కంటే కాస్త పెద్దగా ఉంటాయి.



పేరుకు సముద్ర పక్షినే అయినా.. నా కాళ్లు, పాదాలు చిన్నగా ఉండటంతో నీటి మీద అస్సలు వాలలేను. నేల మీద ఎక్కువగా నడవలేను. అందుకే ఎక్కువ సమయం ఎగురుతూనే ఉంటా. ఆహారం సంపాదించుకోవడానికి నేను చాలా కష్టపడాలి. నాకేమో చేపలంటే చాలా ఇష్టం.. అలాగని నీటిలోకి వెళ్లలేను కదా.. అందుకే అవి పైకి ఎగిరినప్పుడు వెంటనే నోటితో పట్టేసుకుంటాను. ఇతర పక్షులతో పోరాడి.. గుడ్లు, చిన్నచిన్న కీటకాలను కూడా తింటాను. ప్రస్తుతం మా సంఖ్య వేలల్లోనే ఉంది. నేను గంటకు దాదాపు 153 కిలోమీటర్ల వేగంతో ఎగరగలను. నా పొడవు 89 నుంచి 114 సెంటీమీటర్ల వరకు ఉంటుంది. దాదాపు 25 సంవత్సరాల వరకు జీవించగలను. నా విశేషాలు నచ్చాయా ఫ్రెండ్స్! ★

బొమ్మల్లో ఏముందో?

కింద ఇచ్చిన బొమ్మల ఆధారంగా వాటి పేర్లు ఖాళీ గడుల్లో నింపండి. రంగు డబ్బాల్లోని అక్షరాలను ఓచోట చేరిస్తే అర్థవంతమైన పదం వస్తుంది.



జవాబు: 1.ICE 2.NEST 3.MILK 4.BAT (ఆంగ్ల పదం: TIME)

ఈనాడు హైదరాబాద్ HMDA
బుధవారం అక్టోబరు 16, 2024



స్టాన్లీ పాఠశాలలోని కౌన్సెలింగ్ కేంద్రంలో నియామక పత్రం అందజేస్తున్న హైదరాబాద్ డీఈవో రోహిణి. కొత్త ఉపాధ్యాయులు, వారి కుటుంబసభ్యులతో కిక్కిరిసిన కేంద్రం.


చిన్నారికి పాలు పడుతున్న ఉపాధ్యాయురాలు

కొలువు పత్రాలతో కొత్త ఉపాధ్యాయులు

ఈనాడు, హైదరాబాద్, న్యూస్‌టుడే, నారాయణగూడ: ఉపాధ్యాయ పోటీ పరీక్షల్లో వేల మందితో పోటీపడి.. వందలమందిని దాటుకుని బోధనను వృత్తిగా చేపట్టనున్న హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కొత్త ఉపాధ్యాయులు విద్యాశాఖ అధికారుల నుంచి మంగళవారం కొలువు పత్రాలను అందుకున్నారు. ఉదయం 9గంటలకే కౌన్సెలింగ్ ప్రారంభం కావాల్సి ఉండగా.. సాంకేతిక కారణాలతో ఆలస్యమై మధ్యాహ్నం రెండు గంటలకు మొదలైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతులమీదుగా ఈ నెల 9న ఎల్బీస్టేడియంలో నియామకపు పత్రాలు తీసుకున్న అనంతరం తమ జిల్లా పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు హైదరాబాద్‌లోని స్టాన్లీ బాలికల ఉన్నతపాఠశాల, కొంగరకలాన్‌లోని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్, శామీర్‌పేట్‌లోని మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయాలకు కుటుంబసభ్యులు, సన్నిహితులతో కలిసొచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు తమలా మంచి విద్యాబుద్ధులు నేర్పిస్తామని తెలిపారు. యువ ఉపాధ్యాయినులు చంటిపిల్లలతో సహా రాగా... మరికొందరు తల్లిదండ్రులతో కలిసి కౌన్సెలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. హైదరాబాద్ జిల్లాలో 584మందికి నియామకపు పత్రాలు ఇవ్వాల్సి ఉండగా.. రాత్రి 9గంటల వరకూ 400 మందికి ఇచ్చామని, అర్ధరాత్రి వరకూ అందరికీ ఇవ్వనున్నామని అధికారులు తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో 334మందికిగాను రాత్రి 10గంటల ప్రాంతంలో 250 మందికి ఇవ్వగా... మేడ్చల్ జిల్లాలో 82 మందికి నియామక పత్రాలు అందించామని విద్యాశాఖ అధికారులు వివరించారు.

వాహన వలయం.. ఛేదించే వ్యూహం



- ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి క్షేత్రస్థాయిలో సర్వే
- నివేదిక ఆధారంగా సర్కారు చర్యలు

రాజధానిలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 2050 సంవత్సరం నాటికి మహానగరం ఎలా ఉండనుంది.. ట్రాఫిక్ ఇబ్బందులు ఎలా అధిగమించాలి.. ప్రజా రవాణా ఎంతవరకు పెంచాలి.. తదితర వాటికి పరిష్కారం వెతుకుతోంది. దీనిపై క్షేత్రస్థాయిలో సర్వేలు చేసి సమగ్ర నివేదిక ఇచ్చే బాధ్యతను లియో అసోసియేట్‌కు ప్రభుత్వం అప్పగించింది. వచ్చే డిసెంబర్‌లో రవాణాకు సంబంధించి సమగ్ర రవాణా ప్రణాళిక ఇవ్వడానికి సిద్ధమవుతోంది. దీని ఆధారంగా చర్యలు తీసుకోవాలని సర్కారు నిర్ణయించింది.

పెరుగుతున్న ప్రైవేటు వాహనాలు

నగరంలో చిన్నపాటి వర్షం కురిసినా గంటలపాటు ట్రాఫిక్‌లో ఇరుక్కోవాల్సిందే. కొన్నిచోట్ల ఆకాశమార్గాలను నిర్మించినా పెద్దగా ప్రయోజనం ఉండటం లేదు. మరోవైపు ప్రజా రవాణా తగ్గిపోవడంతో నిత్యం 50 లక్షల ప్రైవేటు వాహనాలు నిత్యం రోడ్డెక్కుతున్నాయి. ఈ పరిస్థితిని అలానే వదిలేస్తే వచ్చే మూడు నాలుగేళ్లలో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రంగా మారే అవకాశం ఉంది. వీటికి పరిష్కారం చూపించే బాధ్యతను లియో అసోసియేట్ భుజాన ప్రభుత్వం పెట్టింది. ఈ సంస్థ నగర ప్రజల అభిప్రాయాలను కూడా తీసుకుంటోంది.

ఆ రూట్లలో మెట్రో లాభదాయకమే



లియో సంస్థ నగరంలోని 31 రూట్లలో మెట్రో విస్తరణపై క్షేత్రస్థాయిలో సర్వే చేసింది. నిర్మాణ సంస్థకూ లాభదాయకమేనని తేల్చింది. మెట్రో విస్తరణతో శివార్లలో ప్రయాణికులు పెరిగే అవకాశం ఉందని సర్వేలో తేలింది. ఆర్ఆర్ఆర్ వరకు మెట్రో నిర్మాణం నష్టమేనని తేల్చింది. మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు మెట్రోతో సమీప ప్రాంతాలు అభివృద్ధి చెందే అవకాశం ఉందని తేల్చింది.

ఆర్టీసీ.. ఎంతో కీలకం

నగర ట్రాఫిక్ సమస్య తీరాలంటే ఆర్టీసీ కీలక బాధ్యతను పోషించాల్సి ఉంది. సర్వేలోనూ దాదాపు ఇదే నిర్ణయానికి వచ్చారు. పదేళ్ల కిందట నగరంలో ఆరువేల బస్సులు తిరిగితే ఇప్పుడు ఆ సంఖ్య రెండువేలకు పడిపోయింది. సొంత వాహనాలు రోడ్డెక్కుతున్నాయి. ఈ నేపథ్యంలో బస్సుల సంఖ్యను పెంచాలని సూచించింది.



ఎంఎంటీఎస్.. వందకు పెంచాలి

ప్రస్తుతం 20 ఎంఎంటీఎస్ సర్వీసులు నడుస్తున్నాయి. దీంతో కొన్ని రూట్లలో అరగంటకుకానీ రైళ్లు ఉండటం లేదు. లియో సంస్థ దీనిపై పరిశీలన చేసింది. రాజధానిలో ట్రాఫిక్ కష్టాలు తీరాలంటే ఎంఎంటీఎస్‌ల సంఖ్యను దాదాపు వందకు పెంచాలని సూచించింది.

ఈనాడు-సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి





సత్ప్రవర్తనతో బాలలకు ఉజ్వల భవిష్యత్తు: మంత్రి సీతక్క


ఆర్చరీ అకాడమీలో బాణం ఎక్కుపెట్టిన మంత్రి సీతక్క. చిత్రంలో అధికారులు కాంతి వెస్లీ, కరుణ వాకాటి, శోభారాణి, కార్పొరేటర్ అరుణ తదితరులు

సైదాబాద్, న్యూస్‌టుడే: క్షణికావేశంలో నేరాలు చేసినవారు సత్ప్రవర్తనతో శిక్ష కాలాన్ని ఉజ్వల భవిష్యత్తు కోసం శిక్షణ కాలంగా భావించాలని పంచాయతీ రాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క సూచించారు. సైదాబాద్ జైల్ గార్డెన్‌లోని చిల్డ్రన్ హోమ్ ఫర్ బాయ్స్, అబ్జర్వేషన్ హోమ్ ఫర్ బాయ్స్, జువైనల్ ఆర్చరీ అకాడమీలను మంగళవారం అధికారులు కరుణ వాకాటి, ఎ.కాంతి వెస్లీ, శోభారాణి, డాక్టర్ మిర్జా రాజా అలీ బేగ్, స్థానిక కార్పొరేటర్ అరుణ, సంధ్యారెడ్డిలతో కలిసి మంత్రి సందర్శించారు. బాలలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. జాతీయ, రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల్లో ప్రతిభ కనబరిచిన బాలలతో ముచ్చటించారు. అనంతరం మాట్లాడుతూ.. సాధారణ, సాంకేతిక విద్యతో పాటు విలు విద్యలోనూ బాలలకు మెరుగైన శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికి మెరుగైన అవకాశాలు వస్తాయని, వాటిని సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. త్వరలో సమీక్ష సమావేశం నిర్వహించి, మెరుగైన ఏర్పాట్లు, మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటానన్నారు. అనాథలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. అధికారులు ఎస్‌కేకే చార్వాక్, నవీన్‌కుమార్, మైథిలి, సంగమేశ్వర్, అఫ్జల్ షా అలీ పాల్గొన్నారు.

యాప్‌తో సాఫీగా సరఫరా..!

- నీటి నాణ్యత, క్లోరిన్ శాతం గుర్తించడమూ సులువే
- త్వరలో నగరమంతా స్మార్ట్ వాల్వు టెక్నాలజీ


సోలార్ విద్యుత్తుతో అనుసంధానమైన పరికరాలు

ఇంటింటికీ సరఫరా చేసే నీటిలో క్లోరిన్ శాతం ఎంత ఉంది.? మధ్యలో తగ్గిందా.. పైపుల్లో ఎంత పరిమాణం మేరకు నీటి సరఫరా జరుగుతోంది? తదతర వివరాలు ముందే తెలిస్తే.. కలుషిత జలాల సరఫరాకు అడ్డుకట్ట వేయొచ్చు కదా.. జలమండలి ప్రవేశపెట్టనున్న స్మార్ట్ వాల్వు టెక్నాలజీతో అది సాధ్యమేనని అధికారులు చెబుతున్నారు. నీటి సరఫరాలో భాగంగా వేలాది వాల్వులు నిర్వహించడం జలమండలికి పెద్ద సవాలుగా మారుతోంది. ప్రస్తుతం వీటిని మాన్యువల్‌గా నిర్వహించడంతో లైన్‌మెన్‌లకు భారం అవుతోంది. నీటి సరఫరాను మరింత పకడ్బందీగా చేపట్టేందుకు జలమండలి ఈ ఆటోమేటిక్ వాల్వు ఆపరేషన్ పద్ధతిని నగరమంతా అమలు చేయనుంది.



ఈనాడు, హైదరాబాద్

ఇవీ ప్రయోజనాలు..

- స్మార్ట్ వాల్వు టెక్నాలజీతో లైన్‌మెన్లు క్షేత్రస్థాయిలో తిరగాల్సిన అవసరం లేదు. మొబైల్ యాప్‌తో వాల్వులను నిర్వహించే వెసులుబాటు ఉంటుంది. ఇంటర్‌నెట్ ఆధారిత కమ్యూనికేషన్‌తో వాల్వులను నిర్వహించొచ్చు.
- వాల్వు అనుసంధానంగా పక్కనే వాటి పరికరాలు అమర్చుతారు. ఈ పరికరాలు సోలార్ విద్యుత్తుతో ఛార్జీ అవుతుంటాయి. బ్యాటరీ బ్యాకప్ సైతం ఉండటంతో నిర్వహణలో విద్యుత్తు సమస్యలు తలెత్తే అవకాశం లేదు.
- వాల్వులోనే ప్రత్యేక సాంకేతిక వినియోగించడంతో నీటి సరఫరా సమయంలోనే క్లోరిన్ శాతం, నీటి ఒత్తిడి, నాణ్యత సమీపంలో ఉన్న మీటర్లల్లో తెలుస్తుంది. యాప్‌లోనూ ఈ సమాచారం కనిపిస్తుంది.
- యాప్‌లోనే క్లోరిన్ శాతం తెలుసుకోవడం ద్వారా కలుషిత నీరు సరఫరా కాకుండా అడ్డుకోవచ్చు. నీటి సరఫరాలో అవకతవకలకు స్మార్ట్ వాల్వుతో చెక్‌పెట్టొచ్చు. యాప్‌లో ప్రాంతాల వారీ నీటి సరఫరా సమయాలు సైతం రికార్డు కానున్నాయి. ఈ సమచారం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లనుంది.

కదులుతున్న రైలులో.. ఎక్కుతూ దిగుతూ విన్యాసాలు

ఎక్స్‌లో వీడియో వైరల్




కాచిగూడ: కొందరు బాలురు కదులుతున్న రైలును ఎక్కుతూ.. దిగుతూ చేసిన విన్యాసాలు ఎక్స్ వేదికగా వైరల్ అయ్యింది. కాచిగూడ నుంచి చందానగర్‌కు వెళుతున్న ఎంఎంటీఎస్ రైలు వేగంగా వెళుతున్నప్పుడు వీరు చేసిన ఈ ఫీట్లు ఒళ్లు గగుర్పొడిచేలా ఉన్నాయి. ప్రయాణికులు వారిస్తున్నా వినకుండా వారు చేసిన ఈ ప్రమాదకర విన్యాసాలు చర్చనీయాంశంగా మారాయి.

బాకీ వసూలుకు మధ్యవర్తి కిడ్నాప్

ఆరుగురి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ జావిద్. చిత్రంలో సీఐ ఆదిరెడ్డి

చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే: రూ.30వేల కోసం మధ్యవర్తిని కిడ్నాప్ చేసిన ఘటన ఫలక్‌నుమా పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. మంగళవారం ఫలక్‌నుమా కాంప్లెక్స్‌లో ఏసీపీ ఎం.ఎ.జావిద్, ఇన్‌స్పెక్టర్ కె.ఆదిరెడ్డితో కలిసి తెలిపిన వివరాల ప్రకారం.. బీబీకాచష్మాకు చెందిన మహ్మద్ అలీ రెండు నెలల క్రితం తన స్నేహితుడు జుబైర్‌కు రెయిన్‌బజార్‌కు చెందిన మహ్మద్ హమీద్(24) వద్ద రూ.30వేల విలువైన రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్ ఇప్పించాడు. అయితే డబ్బులు చెల్లించకుండా తప్పించుకు తిరుగుతుండడంతో హమీద్ రెండు రోజుల క్రితం జుబైర్ సోదరుడు సజ్జాద్ వద్ద నుంచి ద్విచక్రవాహనాన్ని లాక్కున్నాడు. జుబైర్ ఎక్కడున్నాడో తెలుసుకునేందుకు హమీద్, వట్టేపల్లికి చెందిన మహ్మద్ సిరాజ్ ఖాన్(42), జహానుమాకు అమ్జద్ ఖాన్(38), సయ్యద్ ఉబైద్(24), మహ్మద్ రహీంపాషా (37), మహ్మద్ షేక్ ఆసిఫ్ (37)లతో కలిసి 13వ తేదీ అర్ధరాత్రి మహ్మద్ అలీని కిడ్నాప్ చేసి వాహనంలో తీసుకెళ్లారు. అలీ భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్పందించిన పోలీసులు వాహనం గుల్బర్గా వైపు వెళ్లినట్లు తెలుసుకుని గుల్బర్గా, సుల్తాన్‌పూర్ పోలీసులకు సమాచారమిచ్చారు. అక్కడి పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని ఫలక్‌నుమాకు తరలించారు. కోర్టు ఆదేశాల మేరకు వారిని మంగళవారం రిమాండ్‌కు తరలించారు.

చెత్తను కొంటామన్నా.. తప్పని ప్రదక్షిణ

ఈనాడు, హైదరాబాద్

- నగరంలో వ్యర్థాల రీసైక్లింగ్ సంస్థలకు ప్రోత్సాహం కరవు
- ఏళ్లుగా పాతుకుపోయిన అధికారుల తీరుతో ఖజానాకు గండి!



చెత్త నిర్వహణపై జీహెచ్ఎంసీలో కనిపించని యుద్ధమే జరుగుతోంది. వ్యర్థాల యాజమాన్యంలో కొత్త సంస్థలు ప్రవేశించకుండా పాత వారు అడ్డుకుంటుంటే.. అధునాతన సాంకేతికతతో వ్యర్థాలకు కొత్త అర్థం చెబుతామంటున్న నూతన ప్రతిపాదనలు అటకెక్కుతున్నాయి. రోజువారీ చెత్తలోని కాగితం, ఇతర లోహ పదార్థాల సేకరణ విషయంలో మరికొన్ని సంస్థలు పోటీ పడుతున్నాయి. అయితే.. ఈ పోటీలో అధికారులు, జీహెచ్ఎంసీ సమన్యాయం పాటించట్లేదనే విమర్శలొస్తున్నాయి. దీర్ఘకాలంగా వ్యర్థాల యాజమాన్యంలో పాతుకుపోయిన అధికారుల తీరుతో.. జీహెచ్ఎంసీ ఖజానాకు గండిపడుతోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. వ్యర్థాల రీసైక్లింగ్ రంగంలోని ఏ ఒక్క అంకుర సంస్థకు కూడా బల్దియా ప్రోత్సాహం ఇవ్వకపోవడమే అందుకు నిదర్శనం.

అంతా డంపింగ్ యార్డుకేనా..

ఘన వ్యర్థాల నిర్వహణ విభాగంలో పదేళ్లకుపైగా పాతుకుపోయిన సీనియర్ ఇంజినీర్లు డంపింగ్‌యార్డును నిర్వహిస్తోన్న రాంకీ సంస్థకు ప్రయోజనం చేకూరుస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. ఆ రంగంలో కొత్త సంస్థలకు అవకాశం ఇవ్వకుండా, కొత్త తరం రీసైక్లింగ్ విధానాలతో అంకుర సంస్థలను స్థాపిస్తోన్న యువతకు సీనియర్ ఇంజినీర్లు ఏ మాత్రం ప్రోత్సాహం ఇవ్వట్లేదని ఇంజినీరింగ్ విభాగం ఉన్నతాధికారులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- కోటి మంది నివసిస్తోన్న హైదరాబాద్‌కు జవహర్‌నగర్ డంపింగ్‌యార్డు ఒక్కటే ఉంది. దానిపై ఒత్తిడి తగ్గించేందుకు, చెత్తను విద్యుత్తుగా మార్చాలన్న లక్ష్యంతో పదేళ్ల కిందట బీబీనగర్‌లో విద్యుదుత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయగా.. అధికారుల నిర్లక్ష్యంతో మూతబడింది. ఓ ప్రైవేటు సంస్థ ఇబ్రహీంపట్నంలోని యాచారంలో విద్యుదుత్పత్తి కేంద్రాన్ని నిర్మించింది. కాలుష్యం లేని విద్యుత్తును ఉత్పత్తి చేస్తామని జీహెచ్ఎంసీ చుట్టూ ప్రదక్షిణ చేస్తూనే ఉంది. అయినా అధికారులు అనుమతించడం లేదు.
- చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించేందుకు ఓ లెక్క, నిల్వ చేస్తున్నందుకు మరో లెక్కన రాంకీ సంస్థ బిల్లులు తీసుకుంటుంది. అంతా ఒప్పందం ప్రకారమే జరుగుతున్నా.. జీహెచ్ఎంసీపై భారం పడకుండా 'చెత్త'కు పరిష్కారం చూపుతామన్న సంస్థలను ప్రోత్సహించకపోవడం అనేక ప్రశ్నలకు తావిస్తోంది. మీ నుంచి చెత్తను కొనుగోలు చేసి, ప్రైవేటు స్థలంలో నిల్వ చేసి, దాన్నుంచి విద్యుదుత్పత్తి చేస్తామని ప్రైవేటు సంస్థ కోరుతున్నా బల్దియా అనుమతివ్వకపోవడమే అందుకు నిదర్శనం.

కేబీఆర్ పార్కులో 20న జీహెచ్ఎంసీ ప్రజా సంబరాలు

ఖైరతాబాద్: సెలవు రోజు వచ్చిందంటే ఇంటిల్లిపాదీ సరదాగా గడిపేలా ప్రత్యేక కార్యక్రమాలను అందుబాటులోకి తెచ్చేందుకు జీహెచ్ఎంసీ ప్రయత్నం చేస్తోంది. దీనిలో భాగంగా బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కును పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి అక్కడ ప్రజా సంబరాల పేరుతో కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారు. అందుకు ఈనెల 20న పార్కులోకి ఉచిత ప్రవేశం కల్పిస్తూ పార్కు వాక్‌వేలో ఉన్న ప్రతి గేటు వద్ద ప్రజలను ఆకట్టుకునే దుకాణాలు ఏర్పాటుచేయనున్నారు. హ్యాండీ క్రాఫ్ట్, హ్యాండ్లూమ్, ఫుడ్ కోర్టులు తదితర దుకాణాలతో పాటు విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తున్నారు. అక్కడ పిల్లలు, పెద్దలకు అవసరమైన క్రీడలు, ఎమ్యూజ్‌మెంట్లు, అడ్వెంచర్ తదితరాలు ఉంటాయని సర్కిల్-18 ఉప కమిషనర్ ప్రశాంతి తెలిపారు. పాఠశాలలు, కళాశాలలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లకు సమాచారం ఇస్తున్నట్లు తెలిపారు. డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం విజయవంతమైతే రెండు వారాలకోసారి నిర్వహిస్తామని, తెలిపారు.



ఎండా.. వానల దోబూచులాట



ఓవైపు వరుణుడు.. మరోవైపు భానుడు నగరవాసులతో దోబూచులాడారు. మంగళవారం మధ్యాహ్నం తర్వాత పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురవడంతో రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. ఆ వెంటనే ఎండ వేడితో ఉక్కపోత మొదలైంది. కొన్నిచోట్ల ఎండ ఉండగానే చినుకులు పడ్డాయి.


జనార్దనహిల్స్‌లో ఎండా వాన

విజయ డయాగ్నస్టిక్ సెంటర్‌కు జరిమానా

ఈనాడు, హైదరాబాద్: వైద్య నిర్ధారణ పరీక్షల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన విజయ డయాగ్నస్టిక్ సెంటర్‌కు హైదరాబాద్ జిల్లా వినియోగదారుల కమిషన్-2 జరిమానా విధించింది. మెహిదీపట్నానికి చెందిన ఆసిఫాఖాన్ ఫిర్యాదును విచారించిన కమిషన్.. ఆతనికి రూ.50వేలు పరిహారం, రూ.5వేలు కేసు ఖర్చులు 45 రోజుల్లో చెల్లించాలని ఆదేశించింది. గడువు తీరినా డబ్బు చెల్లించకపోతే 12శాతం వడ్డీతో కలిపి చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించింది. గుండె వ్యాధితో బాధపడుతున్న ఫిర్యాది 2023 సెప్టెంబరులో టోలిచౌకిలోని విజయ డయాగ్నస్టిక్ సెంటర్‌లో రక్తపరీక్ష చేయించుకున్నారు. అయితే నిర్ధారణ ఫలితాల్లో హిమోగ్లోబిన్ శాతం 10.8 ఉండగా 16.3 ఉన్నట్టు చూపించినట్లు రెండో నిర్ధారణ పరీక్షలో రుజువు కావడంతో ఫిర్యాది కమిషన్‌ను ఆశ్రయించారు. తప్పుడు ఫలితాలతో తీవ్ర మానసిక వేదనకు గురయ్యానని ఫిర్యాదులో పేర్కొన్నారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన కమిషన్ తీర్పు వెలువరించింది.

ఖైరతాబాద్

• ఖైరతాబాద్ • జూబ్లీహిల్స్

లిఫ్టు దారిలా.. ప్రయాణికులు వెళ్లేదెలా?

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: యూసుఫ్‌గూడలోని మెట్రో స్టేషన్ పిల్లర్ నెంబరు 1530 వద్ద లిఫ్ట్‌లోకి వెళ్లే దారి అధ్వానంగా మారింది. ఇక్కడ మ్యాన్‌హోల్ భాగం దెబ్బతినడంతో లిఫ్ట్ ఎక్కడానికి వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు దృష్టిసారించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.


యూసుఫ్‌గూడ మెట్రోస్టేషన్ లిఫ్ట్‌కు వెళ్లే దారి

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ.10 నుంచి మ.1 గంట వరకు

ఖైరతాబాద్	80085 73345
జూబ్లీహిల్స్	80085 73352
బంజారాహిల్స్	80085 73348

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: ? బంజారాహిల్స్ రోడ్డు నం.4 నుంచి రోడ్డు నం.5కు వెళ్లే దారిలోని హైదర్ మంజిల్ ప్రదేశంలో వీధిదీపాలు వెలగడం లేదు. దీంతో చీకటిపడిన తరువాత రాకపోకలకు ఇబ్బందిగా ఉంది.
- నారాయణరావు దేశ్‌ముఖ్, సీనియర్ సిటిజన్, బంజారాహిల్స్

✓ సమస్య మా దృష్టికి రాలేదు. సిబ్బందిని పంపి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - సుష్మ, మున్సిపల్ ఏఈ (వీధిదీపాల విభాగం), సర్కిల్-18

సంక్షిప్త సమాచారం

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించండి

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: నగరంలోని ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని ఆటో యూనియన్ల నాయకులు జేటీసీ రమేష్‌ను కోరారు. మంగళవారం ఖైరతాబాద్‌లోని కార్యాలయంలో యూనియన్ల నాయకులు కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. డ్రైవర్లకు ఎలక్ట్రికల్ ఆటోలు ఇవ్వాలని, ఆటో డ్రైవర్లకు మీటర్ చార్జీలు పెంచాలని, నగరంలో అక్రమంగా నడుస్తున్న వాహనాలను నిషేధించాలని విన్నవించారు.

బకాయిలు విడుదల చేయండి: ఏబీవీపీ

నారాయణగూడ, న్యూస్‌టుడే: దాదాపు రూ. 8 వేల కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ సికింద్రాబాద్ జిల్లా కన్వీనర్ చెక్క బాలు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి సంవత్సరం కావస్తోందని, ఇప్పటివరకు పెండింగ్ బకాయిలను చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తూ పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. వెంటనే ఉపకారవేతనాలు, ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

గ్యార్వీ సందర్భంగా అన్నదానం

బోరబండ, న్యూస్‌టుడే: గ్యార్వీ సందర్భంగా మంగళవారం బోరబండ సైట్-1 కాలనీ చిల్లావద్ద మతపెద్దతో కలిసి కార్పొరేటర్ ఎం.డి.బాబాఫసియుద్దీన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వందలాది మందికి అన్నదానం చేశారు.

డివిజన్‌లో విద్యుత్తు సమస్యలపై వినతి

బంజారాహిల్స్: వెంకటేశ్వరకాలనీ డివిజన్‌లో నెలకొన్న విద్యుత్తు సమస్యలను పరిష్కరించాలని టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీని కార్పొరేటర్ కవితారెడ్డి కోరారు. మంగళవారం మింట్ కాంపౌండ్‌లోని ఆయన కార్యాలయంలో ముషారఫ్ ఫారూఖీని కలిసిన కార్పొరేటర్ వినతి పత్రం అందించారు. వెంకటేశ్వరకాలనీ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. నూతన విద్యుత్తు స్తంభాలు ఏర్పాటుచేయాలని, బంచ్ కేబుల్‌కు అవసరమైన నిధులను విడుదల చేయాలని కోరారు.

'అమ్మవారి ఆలయం ధ్వంసమైనా సర్కారు మొద్దు నిద్ర'

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ కుమ్మరిగూడలోని అమ్మవారి ఆలయం ధ్వంసం వెనుక కుట్రకోణం దాగిఉందని భాజపా నాయకురాలు కొంపెల్ల మాధవీలత ఆరోపించారు. అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తి దేశంలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తమకు సమాచారం ఉందన్నారు. ఈ విషయాలపై సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు. మంగళవారం బంజారాహిల్స్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నిందితుడిని తీవ్రంగా శిక్షించాలన్నారు. ఇటువంటి దుశ్చర్యలను హిందూ సమాజం హర్షించదన్నారు. అమ్మవారి ఆలయం ధ్వంసమైతే సర్కారు మొద్దునిద్ర వీడకపోవడం దారుణమన్నారు. దేవాలయాలను దేవాదాయశాఖ పరిధి నుంచి తప్పించి స్వతంత్ర వ్యవస్థగా ఉంచాలన్నారు.

దశాబ్దాల ఉద్యానం.. అంతటా అధ్వానం

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: ఆహ్లాదం పంచాల్సిన ఉద్యానం.. అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా, మందుబాబులకు అడ్డాగా మారింది. ప్రాముఖ్యత కలిగిన ప్రదేశంలో ఉన్నా.. దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోకుండా నిరుపయోగమైంది. అసాంఘిక శక్తుల అడ్డాగా, విషపురుగులకు నిలయంగా మారి ప్రజలను బెంబేలెత్తిస్తోంది. బంజారాహిల్స్ రోడ్డు నం.11లోని 'పంచవటి కాలనీ పార్కు' పేరిట ఉన్న ఉద్యానం అభివృద్ధికి నోచుకోవడం లేదు. ప్రజా ప్రతినిధులు, అధికారులు మారుతున్నా.. హామీలు మాత్రం నెరవేరడం లేదు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

పంచవటి కాలనీ, ఉదయనగర్, గౌరీశంకర్ నగర్‌ల నడుమ దాదాపు మూడు వేల గజాల స్థలంలో ఈ ఉద్యానం ఉంది. ఆయా కాలనీల ప్రజలకు అందుబాటులో ఉంటుంది. ఈ ప్రాంతంలో ఉద్యానానికి ఇంత పెద్ద స్థలం ఉండటం అరుదు. రెండు దశాబ్దాలకు పైగా అయినా.. నామమాత్రపు అభివృద్ధితో ఈ స్థలంలో పిచ్చిమొక్కలు పెరిగాయి. చెత్త పేరుకుపోయింది. పగలు, రాత్రి తేడా లేకుండా అక్రమాలకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. అర్ధరాత్రి వరకు మందుబాబుల ఆగడాలు, గంజాయి సేవనం నిత్యకృత్యమైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో ఈ పార్కు మీదుగా రాకపోకలు సాగించేందుకు ప్రజలు, మహిళలు జంకుతున్నారు. చిన్నారుల ఉల్లాసం కోసం ఏర్పాటుచేసిన క్రీడా పరికరాలు చోరీ గురయ్యాయి. ఉద్యానశాఖ అధికారులు నాటిన మొక్కలతో పాటు పిచ్చి మొక్కలు గుబురుగా పెరగడంతో విషపురుగులకు నిలయమైంది. ఔషధ మొక్కలు పెంచి, ఉద్యానాన్ని అభివృద్ధి పరిస్తే పరిసరాల్లోని ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుందని స్థానికులు సూచిస్తున్నారు.


పార్కులో చెత్త, పిచ్చిమొక్కలు


దెబ్బతిన్న చిన్నారుల ఆట పరికరాలు

అందరి సహకారంతో అభివృద్ధి చేస్తాం



ఉద్యానం అభివృద్ధి విషయంలో కొంత గందరగోళం వాస్తవమే. రూ 60 లక్షలతో పార్కును అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు ఉన్నాయి. పార్కు అభివద్ధికి అవసరమైన డిజైన్ రూపొందిస్తాం. ఓపెన్ జిమ్, చిన్నారుల మానసిక ఉల్లాసం, వయోవృద్ధుల విశ్రాంతి కోసం ఏర్పాట్లు, పాదబాటలు, ఫౌంటెయిన్, చక్కటి మొక్కలు, సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి ఉద్యానాన్ని సుందరంగా తీర్చిదిద్దుతాం. ఎమ్మెల్యే దానం నాగేందర్ దృష్టికి తీసుకెళ్లి అందరి సహకారంతో పార్కు అభివృద్ధికి కృషి చేస్తాం.
– మన్నె కవితారెడ్డి, కార్పొరేటర్, వెంకటేశ్వరకాలనీ డివిజన్

ఉపాధి కోర్సుల్లో మహిళలకు శిక్షణ

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: మహిళలకు పలు ఉపాధి కోర్సుల్లో అభయ ఫౌండేషన్, పీజేఆర్ ఫౌండేషన్ సంయుక్తంగా ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఆయా ఫౌండేషన్ల ఛైర్మన్లు బాలచంద్ర, విజయారెడ్డి తెలిపారు. మంగళవారం ఖైరతాబాద్‌లోని రెండు పడక గదుల నివాస సముదాయంలో ఫౌండేషన్ల ఆధ్వర్యంలో శిక్షణపై స్థానిక మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టైలరింగ్, బ్యూటీషియన్, పేపర్ ప్లేట్స్ తయారీ, డ్రైవింగ్ శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. శిక్షణ పొందిన వారు సొంతంగా వ్యాపారాలు చేసేందుకు అవసరమైన యంత్రాల కొనుగోలుకు ఈ ఫౌండేషన్లు సహకరిస్తాయని వివరించారు. యంత్రాల కొనుగోలుకు 70 శాతం ఫౌండేషన్ భరిస్తే 30 శాతం శిక్షణ పొందిన వారు భరించాల్సి ఉంటుందని వివరించారు. ఆసక్తి ఉన్న మహిళలు, పురుషులు తమ పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు.


మహిళలను ఉద్దేశించి మాట్లాడుతున్న బాలచంద్ర, చిత్రంలో విజయారెడ్డి

పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ

ఫిలింనగర్, న్యూస్‌టుడే: ఫిల్మ్‌నగర్‌లో పారిశుద్ధ్య మహిళా కార్మికులకు ఫిల్మ్‌నగర్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ కార్యదర్శి కాజ సూర్యనారాయణ మంగళవారం చీరల్ని పంపిణీ చేశారు. కొన్నేళ్లుగా పారిశుద్ధ్య కార్మికులకు ఏటా చీరలు పంపిణీ చేస్తున్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాల ద్వారా పేదలకు చేయూత అందిస్తామని చెప్పారు.



వర్షమొస్తే వరద.. లేదంటే బురద

పంజాగుట్ట, న్యూస్‌టుడే: జీహెచ్ఎంసీ అధికారుల అసంపూర్తి పనులు కాలనీవాసులను ఇబ్బందుల పాల్జేస్తున్నాయి. పంజాగుట్ట ద్వారకాపురి కాలనీ నుంచి సంధ్యా అపార్ట్‌మెంట్స్ వైపు వెళ్లే రోడ్డులో ఎప్పుడూ వరద నీరు లేదా బురద నిల్వ చేరుతోంది. ఈ మార్గంలో ప్రయాణించేవారు గత్యంతరం లేక వరద నీటి నుంచి వెళ్లాల్సి వస్తుంది. వరద తగ్గితే బురద పేరుకుపోతుంది. ద్వారకాపురి కాలనీలో ఇటీవల రోడ్డు పనులు పూర్తిచేసిన జీహెచ్ఎంసీ అధికారులు సంధ్యా అపార్ట్‌మెంట్ వైపు పనులను చాలా కాలంగా మొదలుపెట్టలేదు. దీంతో రోడ్డు ఎగుడు దిగుడుగా మారి చిన్నపాటి వర్షం పడినా రోజుల తరబడి వరద, బురద నిల్వ చేరుతుంది. తమ సమస్యను పరిష్కరించాలని స్థానికులు అధికారులను నేరుగా కలిసి ఫిర్యాదు చేయడంతో పాటు ఆన్‌లైన్‌లో కూడా ఫిర్యాదులు సమర్పించినా స్పందన లేదు.


ద్వారకాపురికాలనీ నుంచి సంధ్య అపార్ట్‌మెంట్స్‌కు వెళ్లే రోడ్డులో నిల్వ చేరిన వరద నీరు

ఒకరికొకరు తోడుగా.. గమ్యం వైపుగా..



ఇద్దరూ దివ్యాంగులే. ఒకరిది ఇంధనంతో నడిచే నాలుగు చక్రాలు వాహనం, మరొకరిది శ్రమ శక్తితో వెళ్లే మూడు చక్రాల సైకిలు. ఇద్దరు వెళ్లాల్సిన గమ్యస్థానం ఒకటే అవడంతో ఇలా ప్రయాణిస్తూ హిమాయత్‌నగర్, ఓల్డ్ ఎంఎల్‌ఏ క్వార్టర్స్ కూడలి కనిపించారు.

జిల్లా జూనియర్స్ ఖోఖో జట్ల ఎంపిక నేడు

నారాయణగూడ, న్యూస్‌టుడే: హైదరాబాద్ జిల్లా జూనియర్స్ ఖోఖో (అమ్మాయిలు, అబ్బాయిలు) జట్ల ఎంపిక ఈ నెల 16న బుధవారం జరుగుతుందని హైదరాబాద్ జిల్లా ఖోఖో సంఘం ప్రధాన కార్యదర్శి పోచప్ప ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 1:30 గంటలకు జింఖానా మైదానంలో ఈ ఎంపిక జరుగుతుందన్నారు. ఎంపిక ట్రయల్స్‌లో పాల్గొనడానికి ఆసక్తి గలవారు ఆధార్ కార్డు, పుట్టిన తేదీ ధ్రువపత్రం, విద్యార్హత పత్రాలతో హాజరు కావాలని సూచించారు. ట్రయల్స్ పోటీలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు అక్టోబరు చివరి వారంలో మహబూబ్‌నగర్‌లో జరిగే 43వ తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్స్ ఖోఖో పోటీలకు ఎంపిక చేయబడతారన్నారు. మరిన్ని వివరాల కోసం 94406 99225 నంబరులో సంప్రదించాలన్నారు.

లేబుల్ లవ్ 6 వస్త్రోత్పత్తుల ప్రదర్శన ప్రారంభం

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: ఆకృతి ఎలైట్ ఆధ్వర్యంలో లేబుల్ లవ్ 6 పేరుతో బంజారాహిల్స్‌లోని తాజ్‌డెక్కన్‌లో మంగళవారం వస్త్రోత్పత్తుల ప్రదర్శన ప్రారంభమైంది. రెండు రోజులపాటు జరిగే ఈ ప్రదర్శనలో దీపావళి పండగ నేపథ్యంలో డిజైనర్ దుస్తులు, సంప్రదాయ దుస్తులను ప్రత్యేకంగా ఏర్పాటుచేశారు. దాదాపు 50కిపైగా స్టాళ్లలో వీటిని ఏర్పాటుచేశారు. దుస్తులతోపాటు గృహాలంకరణ ఉత్పత్తులు, బంగారు ఆభరణాలు, సెమీ ప్రీషియస్ ఆభరణాలను ఇక్కడ అందుబాటులో ఉంచారు. నిర్వాహకురాలు శశినెహతా మాట్లాడుతూ పండగ నేపథ్యంలో మగువలకు అవసరమైన అన్ని రకాల ఉత్పత్తులను ఇక్కడ ఏర్పాటు చేశామన్నారు. విభిన్న ప్రాంతాలకు చెందిన వారికి అనుగుణంగా ఉండే దుస్తులను, ఉత్పత్తులను ప్రత్యేకంగా ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు.


ప్రదర్శనలో ఆభరణాలు చూపుతున్న శశినెహతా

అధునాతన ఆర్‌డీఎన్ వైద్యచికిత్సతో సాంత్వన


కేర్ ఆస్పత్రి వైద్యుడు డా. పీఎల్ఎన్ కపర్ది, రోగి, రోగి సహాయకురాలు, వైద్యసిబ్బంది

బంజారాహిల్స్ న్యూస్‌టుడే: బహుళ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న హైదరాబాద్ చిక్కడపల్లి ప్రాంతానికి చెందిన వృద్ధుడికి బంజారాహిల్స్‌లోని కేర్ ఆస్పత్రి వైద్యులు అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్స చేసి రోగి ప్రాణాలను నిలబెట్టారు. అధిక రక్తపోటు (హైపర్ టెన్షన్), మధుమేహం, తీవ్రమైన హృద్రోగ సమస్యలతో బాధపడుతున్న 74 ఏళ్ల వృద్ధుడికి అధునాతన ఆర్‌డీఎన్ (రెనల్ డినర్వేషన్ ట్రీట్‌మెంట్) వైద్యవిధానం ద్వారా చికిత్స అందించి సాంత్వన చేకూర్చారు. బంజారాహిల్స్‌లోని కేర్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా. అజిత్ సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. అధిక రక్తపోటు, మధుమేహం, కరోనరీ ఆర్టరీ డిసీజ్ తదితర తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వృద్ధ రోగి గతంలోనే కరోనరీ యాంజియోప్లాస్టీ చేయించుకున్నారు. అయినా ప్రమాదకర రక్తపోటు, ఇతర ఆరోగ్య సమస్యలతో ప్రాణాపాయస్థితిలో ఇటీవల బంజారాహిల్స్‌లోని కేర్ ఆస్పత్రిలో చేరారు. ఈ క్రమంలో రోగి నాన్-ఇస్కీమిక్ హైపర్‌టెన్సివ్ లెఫ్ట్ వెంట్రిక్యులర్ వైఫల్యం ప్రమాదం ఉందని గుర్తించారు. ఈ నేపథ్యంలో కేర్ ఆస్పత్రి క్యాథ్‌ల్యాబ్ క్లినికల్ డైరెక్టర్, సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డా. పీఎల్ఎన్ కపర్ది నేతృత్వంలో రోగికి మూత్రపిండ ధమనులపై.. అధునాతన ఆర్‌డీఎన్ వైద్య విధానం ద్వారా 11 సైకిల్ ఆబ్లేషన్ చికిత్సను అందించారు. అనంతరం వారం రోజుల్లో రోగి రక్తపోటు మెరుగుపడింది. డా. పీఎల్ఎన్ కపర్ది, డా. అజిత్‌సింగ్ మాట్లాడుతూ తీవ్ర హైపర్‌టెన్సివ్ అనారోగ్యంతో బాధపడుతున్న రోగుల జీవన నాణ్యతను మెరుగుపర్చడంలో ఈ విధానం ఉపయోగపడుతుందని చెప్పారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు


కింగ్‌కోఠిలో స్థానికులు, అధికారులతో మాట్లాడుతున్న మహాలక్ష్మీగౌడ్

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: ప్రజల సమస్యలను పరిష్కరించే విషయంలో నిర్లక్ష్యం తగదని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ గడ్డం మహాలక్ష్మీగౌడ్ వివిధ శాఖల అధికారులకు స్పష్టం చేశారు. మంగళవారం డివిజన్ పరిధిలోని కింగ్‌కోఠి, పర్దాగేట్, షేర్ గేట్ ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ, జలమండలి, శానిటైజేషన్, ఉద్యాన, వీధి దీపాలకు సంబంధించిన అధికారులతో విస్తృతంగా పర్యటించారు. తమ బస్తీలో సీసీ రోడ్డు వేయాలని, డ్రైనేజీ, సీవరేజ్ లైన్లు, కిందికి వచ్చిన చెట్ల కొమ్మలను నరికించాలని, వంగిపోయిన విద్యుత్తు స్తంభాలను సరి చేయాలని లేదా కొత్తవి ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మహేష్‌కుమార్, సోహెల్ జాబ్రి, మన్సూర్ బిన్, ముజఫర్ బేగం, సోహెల్ అన్సారి, సౌద్, నదీమ్, జేఆర్ సందీప్, కొండయ్య, హితేష్, జగదీష్, ఆదర్శ్, స్థానికులు అజ్మత్ అలీ ఖాన్ మెహదీఅలీ, కైసర్ అబూ, అబ్దుల్ రహీం, ఫారూఖ్, ఆరీఫ్ తదితరులు ఉన్నారు.

ఆలయాల వద్ద చరవాణుల చోరీలు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: జూబ్లీహిల్స్ పెద్దమ్మగుడిలో దైవదర్శనానికి వచ్చిన ఓ భక్తురాలి చరవాణి మాయమైన సంఘటన జూబ్లీహిల్స్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. బోడుప్పల్ ప్రాంతానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దాసరి చాందిని ఈ నెల 13న దసరా ఉత్సవాల నేపథ్యంలో దర్శనానికి వచ్చారు. దర్శనం అనంతరం తిరిగి వెళ్లే క్రమంలో తన చేతిసంచిలో చరవాణి పరిశీలించగా కనిపించలేదు. దీంతో ఆమె జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో వివిధ ఆలయాల వద్ద దాదాపు 17 చరవాణులు చోరీకి గురయ్యాయి. ఈ మేరకు బాధితులు జూబ్లీహిల్స్ ఠాణాలో వేర్వేరుగా ఫిర్యాదులు చేశారు. యూసుఫ్‌గూడలోని నల్లపోచమ్మ ఆలయం వద్ద కారుకు వాహనపూజ చేయించడానికి వచ్చిన ఏఎస్సై డిల్లేశ్వరరావు కుటుంబ సభ్యులకు చెందిన రెండు చరవాణులు మాయమయ్యాయి. దీంతో జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చేతిసంచిలోని డబ్బు, నగలు మాయం

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: మెట్రో స్టేషన్‌లో తమ చేతి సంచులు స్కానింగ్‌కు ఇస్తే అందులోని నగదు, నగలు మాయమయ్యాయని ఓ మహిళ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్‌లోని నక్కలగుట్ట ప్రాంతానికి చెందిన శోభలత తన సోదరి హేమలత పింగళితో కలిసి ఈ నెల 10న బంజారాహిల్స్‌లోని ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రికి కంటి పరీక్షల నిమిత్తం వచ్చారు. అదే రోజు సాయంత్రం జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 5లో మెట్రో రైలు ఎక్కి ఎన్‌జీఆర్ఐ వద్ద దిగి అక్కడి నుంచి రాత్రి వరంగల్‌కు తిరిగి వెళ్లారు. అక్కడికి వెళ్లిన శోభలత చేతిసంచిని పరిశీలించగా అందులో ఉండాల్సిన రూ. 12 వేలు కనిపించలేదు. ఆమె సోదరి తన చేతిసంచి పరిశీలించగా అందులో ఉండాల్సిన దాదాపు రూ.40 వేల విలువైన బంగారు ఆభరణాలు కనిపించలేదు. మెట్రో స్టేషన్‌లో తాము తమ చేతిసంచులను సెక్యూరిటీ స్కానింగ్‌కు ఇచ్చామని, తమకు సెక్యూరిటీ సిబ్బందిపై అనుమానం ఉందటూ సోమవారం జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అక్కా అంటూ.. అసభ్య సందేశాలు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: అక్కా అంటూనే అసభ్య సందేశాలు పంపుతున్న ఓ యువకుడిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. యూసుఫ్‌గూడ నవోదయ కాలనీలో నివసించే ఓ యువతి (23)ని ఇంటికి సమీపంలో నివసించే ఓ దర్జీ కుమారుడు రిషి అక్కా అంటూ పిలిచేవాడు. ఇటీవలి కాలంలో ఆమె చరవాణికి అసభ్య సందేశాలు పంపడం ప్రారంభించాడు. దీంతో ఆమె శుక్రవారం జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించడంతో పోలీసులు పిలిచి తొలుత కౌన్సెలింగ్ చేసి పెట్టీ కేసు నమోదు చేశారు. దీంతో కక్ష పెంచుకున్న రిషి మంగళవారం ఉదయం యువతి ఇంటి వద్దకు కత్తి తీసుకొని వెళ్లి బెదిరించాడు. దీంతో యువతి పోలీసులను ఆశ్రయించడంతో పోలీసులు రిషిపై కేసు నమోదు చేశారు. అతడు మత్తు పదార్థాలు వాడుతున్నట్లు ఆరోపణలు రావడంతో పరీక్షలు చేయిస్తామని పోలీసులు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు చోట్ల నగదు, ఆభరణాల అపహరణ

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: ఇంటి తాళాలు పగులగొట్టి అల్మారాలో నుంచి నగదుతో పాటు బంగారు, వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. రహ్మత్‌నగర్‌లోని ఎస్పీఆర్ హిల్స్‌లో నివాసం ఉండే శ్రీనివాస్ కారు డ్రైవర్. దేవీశరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఇంటి సమీపంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించాడు. ఈ నెల 13న రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారి విగ్రహం నిమజ్జనానికి వెళ్లాడు. ఈనెల 14న ఉదయం ఇంటితాళం పగులగొట్టి ఉండటంతో సమీపంలోని వారు శ్రీనివాస్‌కు ఫోన్‌చేసి విషయం చెప్పారు. వెంటనే ఇంటికి చేరుకుని చూడగా ఇంటి తాళాలు, అల్మారా పగులగొట్టి ఉన్నాయి. రూ.32 వేల నగదుతో పాటు బంగారు, వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

● అల్మారాలోని లాకర్‌లో భద్రపర్చిన 90 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. మధురానగర్ ప్రాంతంలో ఉప్పలయ్య, భవానీ వృద్ధ దంపతులు నివాసం ఉంటున్నారు. అనారోగ్యం కారణంగా భవానీ గతనెల 15న కుమార్తె ఇంటికి వెళ్లి ఈ నెల 14న తిరిగి వచ్చింది. అల్మారాలోని లాకర్‌లో చూడగా అందులో భద్రపర్చిన 70 గ్రాముల బంగారు గాజులు, 15 గ్రాముల నల్లపూసల గొలుసు, అయిదు గ్రాముల చెవికమ్మలు మాయమయ్యాయి. ఇంట్లో పనిమనిషిపై అనుమానం వ్యక్తంచేస్తూ.. ఉప్పలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రధాన రహదారిపై తాగునీటి లీకేజీ

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: తాగునీటి సరఫరా జరిగినప్పుడల్లా లీకేజీ సమస్య తలెత్తడంతో నీరంతా రోడ్డుపై వృథాగా పోతోందని స్థానికులు వాపోయారు. బంజారాహిల్స్ రోడ్డు నం.10 ప్రధాన రహదారిలోని స్టార్ ఆస్పత్రి ఎగువ ప్రాంతంలో (ఇలాహే స్టోర్ ఎదురుగా) తాగునీటి లీకేజీ సమస్య తలెత్తింది. గత రెండు నెలలుగా ఈ ప్రదేశంలో నీటి సరఫరా జరిగిన ప్రతీసారి లీకేజీ కారణంగా నీరంతా రోడ్డుపై వృథాగా పోతోందని స్థానికులు చెబుతున్నారు. లీకేజీ కారణంగా పీడనం తగ్గిపోయి సరిపడా నీరు అందడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై జలమండలి విభాగం స్థానిక అధికారులతో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ప్రదేశంలో వైట్‌టాప్ సీసీ రోడ్డు ఉందని, సమస్య పరిష్కరించాలంటే దాన్ని తవ్వాల్సి ఉందని జలమండలి అధికారి ఒకరు చెప్పారు. రోడ్డు కటింగ్‌కు అనుమతి లభిస్తే సమస్య పరిష్కారానికి పనులు ప్రారంభమవుతాయని తెలిపారు.


బంజారాహిల్స్ రోడ్డు నం.10లో వృథాగా పోతున్న నీరు

వెలగని దీపాలు.. అంధకారంలో వీధులు

షేక్‌పేట, న్యూస్‌టుడే: కొన్ని నెలలుగా షేక్‌పేట ప్రాంతంలో వీధిదీపాలు వెలగటం లేదు. వాటిని పునరుద్ధరించాల్సిన జీహెచ్ఎంసీ విద్యుత్తు విభాగం అధికారులు విడిభాగాలు, పరికరాల కొరత పేరుతో మరమ్మతులకు చర్యలు తీసుకోవడంలేదు. దీంతో వీధులు, ప్రధాన రహదారులు అంధకారంలో మగ్గుతున్నాయి.

స్తంభాలతోనే సరి.. షేక్‌పేట ద్వారకానగర్ కాలనీలో రాయదుర్గం- షేక్‌పేట ప్రధాన రహదారిలో రెండు నెలల క్రితం సెంట్రల్ లైటింగ్ స్తంభాలు ఏర్పాటు చేసి దీపాలు బిగించకుండా వదిలేశారు. అదే వరుసలో సన్రైజ్ స్కూలు కూడలిలో ఓ మినీ మాస్ట్ స్తంభానిదీ అదే పరిస్థితి. రూ. లక్షలు వెచ్చించి స్తంభాలు ఏర్పాటు చేసిన అధికారులు దీపాలు బిగించి పనులను పూర్తి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఆ ప్రధాన రహదారిలో రాత్రయితే అంధకారం అలముకుంటోంది. అటుగా షేక్‌పేట, ఓయూ కాలనీ, మణికొండ ప్రాంతాలకు స్థానికులు, ఐటీ ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారు. చీకటిగా ఉండటంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.


షేక్‌పేట ద్వారకానగర్ కాలనీలో వీధి దీపాలు లేని స్తంభాలు

ఓయూ కాలనీలో సమస్య జఠిలం..

షేక్‌పేట ఓయూ కాలనీలో ప్రధాన రహదారితో పాటు వీధుల్లోనూ స్ట్రీట్‌లైట్లు వెలగకుండా పోయాయి. రెండుమూడు నెలలుగా సమస్య ఇబ్బంది పెడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. షేక్‌పేట మారుతీనగర్, వివేకానందనగర్, వినోబానగర్, వినాయకనగర్ కాలనీల్లోనూ ఇదే పరిస్థితి. ప్రజలు మరమ్మతుల విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తే.. విడిభాగాలు, ఎల్ఈడీ లైట్ల కొరత ఉందని ఒకసారి.. ల్యాడర్ (నిచ్చెన) అందుబాటులో లేదని మరోసారి చెబుతూ మరమ్మతులకు తాత్సారం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి మరమ్మతులు చేసి వెలుగులు తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

రెండు రోజుల్లో పునరుద్ధరిస్తాం – సుష్మ, జీహెచ్ఎంసీ ఏఈ

విడిభాగాలు కొరత తీరింది. నిచ్చెన అందుబాటులోకి వచ్చింది. రెండు రోజుల్లోనే మరమ్మతులు చేసి వీధిదీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం.

ఫీజు బకాయిలు చెల్లించకుంటే ఆందోళనలు ఉద్ధృతం

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: 'మూడేళ్ల నుంచి ఫీజులు చెల్లించకపోవడంతో భవన అద్దె, అధ్యాపకుల జీతాలు చెల్లించలేని దుస్థితి.. అప్పులపాలై.. మానసిక వేదనతో ఇప్పటికే ముగ్గురు చనిపోయారు. గత్యంతరం లేక కళాశాలల మూసివేత నిర్ణయం తీసుకున్నాం. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు బకాయిలు చెల్లించాకే కళాశాలలను తెరుస్తామని' తెలంగాణ ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల సంఘం స్పష్టం చేసింది. తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ అధ్యక్షతన మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్య సంఘాలు, బీసీ సంఘాలు, విద్యార్థి, యువజన సంఘాలతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ.. కళాశాలల యాజమాన్యాలకు 48 గంటల్లోపు ఫీజు బకాయిలు చెల్లించకుంటే ఆందోళన కార్యక్రమాలను తీవ్రతరం చేయనున్నట్లు వెల్లడించారు. తెలంగాణ ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల సంఘం(టీపీడీపీఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బొజ్జ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ..అన్ని విద్యార్థి, ప్రజా, కుల సంఘాలు, పార్టీలు తమ ఆందోళనలకు మద్దతు ఇవ్వడంపై కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ మాట్లాడుతూ ఈ నెల 22న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్‌ల ముట్టడి చేపడుతున్నట్లు వెల్లడించారు. టీపీడీపీఎంఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాద రామకృష్ణ, పరమేశ్వర్ గౌడ్, బీసీ సంఘాల నేతలు నీల వెంకటేశ్, గొరిగె మల్లేశ్‌యాదవ్, జిల్లపల్లి అంజి, ఎ.రాంకోటి ముదిరాజ్, టి.నందగోపాల్, అనంతయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

జంట జలాశయాల గేట్ల ఎత్తివేత

బండ్లగూడజాగీర్, నార్సింగి, న్యూస్‌టుడే: జంటజలాశయాల పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండటంతో ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లోకి వరద కొనసాగుతోంది. ఉస్మాన్‌సాగర్‌లోకి 350 క్యూసెక్కుల వరద వస్తుండగా రెండు గేట్లు అడుగుమేర ఎత్తి 242 క్యూసెక్కులను మూసీలోకి విడిచి పెడుతున్నారు. హిమాయత్‌సాగర్‌లోకి 350 క్యూసెక్కుల వరకు వస్తుండగా...ఒక గేటు అడుగు మేర ఎత్తి 348 క్యూసెక్కులను వదులుతున్నట్లు జలమండలి తెలిపింది.

పోలీసులకు సమన్వయ పాఠాలు

సమస్యాత్మక ప్రాంతాలపై నగర సీపీ ప్రత్యేక దృష్టి

ఈనాడు, హైదరాబాద్: మొన్న సంతోష్‌నగర్.. నిన్న.. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్.. తాజాగా సికింద్రాబాద్ కుమ్మరిగూడ ప్రార్థనా మందిరాలపై వరుస దాడుల నేపథ్యంలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్న విషప్రచారాలు, విద్వేషపూరిత పోస్టులపై ఐటీ సెల్ ప్రత్యేక దృష్టిసారించినట్లు తెలుస్తోంది.

మర్యాదగా మెలగండి.. నగర పోలీసు కమిషనరేట్ పరిధిలో ఏడు జోన్లు. వీటిలో సౌత్, సౌత్‌ఈస్ట్, సౌత్‌వెస్ట్‌లో అధికశాతం సున్నితమైన, సమస్యాత్మక ప్రాంతాలున్నాయి. 1600 మంది రౌడీషీటర్లలో అధికశాతం మూడు జోన్ల పరిధిలో ఉన్నారు. రెండేళ్లలోనే సౌత్‌ఈస్ట్, సౌత్‌వెస్ట్ డీసీపీలు నలుగురు మారారు. ఆ ప్రాంతంపై పట్టు చిక్కేలోపుగానే బదిలీలు జరగడంతో అక్కడ శాంతిభద్రతల సమస్య సవాల్‌గా మారుతోంది. అర్ధరాత్రి వరకూ విధుల్లో ఉన్నా మరుసటిరోజు ఉదయాన్నే రోల్‌కాల్‌కు హాజరుకావాలనే నిబంధనతో పోలీసులు మరింత ఒత్తిడికి గురయ్యారు. దీని ప్రభావం కేసుల దర్యాప్తుపై పడినట్టు ఒక ఇన్‌స్పెక్టర్ ఆవేదన వెలిబుచ్చారు. మరోసారి నగర సీపీగా బాధ్యతలు చేపట్టిన సీవీ ఆనంద్ దిద్దుబాటు చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. కిందిస్థాయి పోలీసు అధికారులు, సిబ్బంది పట్ల అనుచితంగా ప్రవర్తించవద్దని, మర్యాదపూర్వకంగా మాట్లాడమంటూ ఇద్దరు డీసీపీలు, ముగ్గురు అదనపు డీసీపీలను సున్నితంగా మందలించినట్లు సమాచారం.

సత్వర నిర్ణయంతో సమస్య పరిష్కారం.. నగరం భిన్న మతాలు.. సంస్కృతుల సమ్మేళనం. ప్రధాన పండగల సమయంలో పోలీసులు నెల రోజుల ముందుగానే ప్రణాళిక రూపొందిస్తారు. అసాంఘిక శక్తులను గుర్తించి బైండోవర్ చేస్తారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన పోలీసు అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయం చేసుకోవటంలో విఫలమవుతున్నారు. సున్నితమైన ప్రాంతాల్లో అవాంఛనీయ ఘటనలు తలెత్తినపుడు పోలీసులు స్పందిస్తున్నా సత్వర నిర్ణయం తీసుకునేందుకు వెనుకడుగు వేస్తున్నారు. నగర పరిస్థితులపై పూర్తిస్థాయి అవగాహన లేకపోవటమే దీనికి కారణంగా ఉన్నతాధికారులు గుర్తించారు. క్షేత్రస్థాయిలో కానిస్టేబుల్ నుంచి డీసీపీల వరకూ లోటుపాట్లను గమనించి లోపాలను సరిదిద్దేందుకు అవగాహన కార్యక్రమం నిర్వహించేందుకు నగర సీపీ సీవీ ఆనంద్ సిద్ధమైనట్లు తెలుస్తోంది. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సత్వర నిర్ణయం తీసుకొనేలా.. సున్నితమైన ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న డీసీపీలకు దిశా నిర్దేశం చేస్తున్నారు.

దాడుల నిరోధానికి చర్యలు చేపట్టాలి

గోల్నాక, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఆలయాలపై దాడుల నిరోధానికి చర్యలు చేపట్టాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం నింబోలిఅడ్డలో సమావేశంలో నేతలు పులిజాల కృష్ణ, మెట్టు ముత్యాల్‌రావు, సీహెచ్ ప్రదీప్‌గౌడ్, భూషణ్ కుమార్, డా.ప్రశాంత్ నిమ్మర్ తదితరులతో కలిసి మాట్లాడారు. ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి నిందితులపై కఠిన చర్యలు చేపట్టాలని కోరారు.



మాట్లాడుతున్న రాజేందర్‌పటేల్‌గౌడ్

షవర్మ తిని నలుగురికి అస్వస్థత


మరోసారి గ్రిల్‌హౌస్‌ను సీజ్ చేసిన అధికారులు

అల్వాల్, న్యూస్‌టుడే: అల్వాల్‌లోని లోతుకుంట-గ్రిల్‌హౌస్ ఆహారశాలలో షవర్మ తిని నలుగురు అస్వస్థతకు గురయ్యారు. గతంలోనూ ఇక్కడ తిన్న పలువురు ఆసుపత్రి పాలయ్యారు. దీంతో అధికారులు శాశ్వతంగా మూసివేసేందుకు తాఖీదులిచ్చారు. అధికారుల వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి అల్వాల్‌కు చెందిన లోకేశ్(19), మచ్చబొల్లారంవాసులు గోవర్ధన్ రాజు(25) ఆయన భార్య వర్ధిని(23), బొల్లారం ఆసుపత్రి ఉద్యోగి శరత్(29) గ్రిల్ హౌస్‌లో షవర్మ తిని వాంతులు, విరేచనాలకు గురయ్యారు. వీరంతా కంటోన్మెంట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న జీహెచ్ఎంసీ సర్కిల్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్ మంగళవారం గ్రిల్‌హౌస్‌లో నమూనాలు సేకరించి సీజ్‌చేశారు. దుకాణం యజమాని తాఫిక్ షరీఫ్‌పై కేసులు నమోదు చేశారు. జనవరిలో ఇందులోనే షవర్మ తిని 20 మంది ఆసుపత్రి పాలయ్యారని.. అప్పట్లో సీజ్‌చేసి వ్యాపార అనుమతిని రద్దు చేసినా దుకాణం యజమాని తిరిగిప్రారంభించారని తెలిపారు. ఈసారి శాశ్వతంగా మూసివేత నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఆసుపత్రిలో బాధితులు కోలుకుంటున్నారని చెప్పారు.

నకిలీ పాల తయారీ కేంద్రంపై దాడి

భారీగా ముడి సరకు స్వాధీనం

మేడిపల్లి (బోడుప్పల్), న్యూస్‌టుడే: నకిలీ పాల ఉత్పత్తుల తయారీ కేంద్రంపై మల్కాజిగిరి ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి భారీగా ముడి పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. పీర్జాదిగూడ అడ్డాగా సికింద్రాబాద్ బోయిగూడకు చెందిన గజేందర్‌సింగ్ రాజ్ పురోహిత్(51) కోహినూర్ పాల ఉత్పత్తుల కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. పక్కా సమాచారంతో మల్కాజిగిరి ఎస్‌ఓటీ పోలీసులు ఆ కేంద్రంపై మంగళవారం దాడి చేసి 4500 లీటర్ల రిఫైన్డ్ పామాయిల్, 300 కిలోల పన్నీర్, 750 లీటర్ల ఎసిటిక్ యాసిడ్, 750 లీటర్ల వనస్పతి డాల్డా, 16,250 కిలోల స్కిమ్డ్ మిల్క్ పౌడర్, 15 లీటర్ల గ్లూకోజ్ ద్రవం, 1500 కిలోల కలాకాన్ ముడి పదార్థం, 1500 కిలోల చిరోటి రవ్వలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని తదుపరి విచారణ నిమిత్తం మేడిపల్లి పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గజేందర్‌సింగ్ రాజ్‌పురోహిత్

బెట్టింగ్‌ల్లో అప్పులపాలై చోరీలు

ఇద్దరు నిందితుల అరెస్టు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నం సర్కిల్ పరిధిలోని గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆకులమైలారం గ్రామంలో బంగారం దొంగతనం చేసిన నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం కేసు వివరాలు ఇబ్రహీంపట్నంలో ఏసీపీ రాజు.. ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ సీఐ కృష్ణంరాజు, ఎస్ఐ తేజంరెడ్డి, క్రైం పోలీసులతో కలిసి వెల్లడించారు. ఈనెల 10న కందుకూరు మండలం ఆకులమైలారం గ్రామానికి చెందిన వృద్ధురాలు దేవరశెట్టి సుమతమ్మ ఒంటరిగా ఇంట్లో ఉన్న సమయంలో సూర్యాపేట జిల్లా రామన్నగూడేనికి చెందిన వూటుకూరి ప్రభాష్(20), నల్గొండ జిల్లా శాలిగౌరారానికి చెందిన గుండ్లపల్లి శివ(19) లోపలకు ప్రవేశించారు. వృద్ధురాలి మెడలో ఉన్న 6 తులాల బంగారు గొలుసు, చేతి గాజులు కత్తిరించి దోపిడీ చేశారు. సీఐ కృష్ణంరాజు, ఎస్ఐ తేజంరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. నిందితులను పట్టుకున్నారు. నిందితుల నుంచి 6 తులాల బంగారు నగలు, కారు, ఐ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ప్రభాష్ బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. శివ మెడికల్ దుకాణంలో పని చేస్తున్నాడు. ఇద్దరూ ఆన్‌లైన్ బెట్టింగ్‌ల్లో అప్పులపాలయ్యారు. హయత్‌నగర్ కోహెడ గ్రామంలో కారు అద్దెకు తీసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలింది. నిందితులను పట్టుకున్న ఎస్ఐ తేజంరెడ్డి, క్రైం పోలీసులను. . ఏసీపీ అభినందించి నగదు బహుమతి అందజేశారు.



స్వాధీనం చేసుకున్న కారు, బంగారు నగల వద్ద ఏసీపీ రాజు, సీఐ కృష్ణంరాజు, ఎస్ఐ తేజంరెడ్డి, క్రైం సిబ్బంది

చికెన్ ధరలు			
ఫాంరేటు	126-00	డ్రెస్డ్	215-00
రిటైల్	148-00	స్కిన్‌లెస్	244-00

తూకాల్లో మోసాలపై 574 కేసుల నమోదు

ఈనాడు, హైదరాబాద్: షాపింగ్‌మాల్స్, వివిధ దుకాణాలు, డీలర్లు, పెట్రోల్ బంకుల్లో తూకాల మోసాలపై ఐదునెలల్లో 574 కేసులు నమోదుచేసినట్టు హైదరాబాద్ లీగల్ మెట్రాలజీ విభాగం అధికారులు వెల్లడించారు. ఏప్రిల్ 24 నుంచి సెప్టెంబరు 24 వరకు 10 మంది ఇన్‌స్పెక్టర్లు నిరంతర తనిఖీలతో పెనాల్టీల రూపంలో రూ.43.18లక్షలు, వెరిఫికేషన్ ఫీజు రూపేణ రూ.75.89లక్షలు వసూలు చేసినట్టు తెలిపారు.



కదలవు.. కనులు తిప్పుకోనివ్వవు!

టోలిచౌకి నుంచి షేక్‌పేట మార్గంలో వంతెన కింద పాస్‌పోర్టు కార్యాలయం సమీపంలో సుందరీకరణలో భాగంగా ఏర్పాటవుతున్న గుర్రాల బొమ్మలు ఆకట్టుకుంటున్నాయి.

సైబర్ మోసానికి అడ్డుకట్ట

రూ.39 లక్షలు కాపాడిన పోలీసులు

నారాయణగూడ, న్యూస్‌టుడే: బాధితుడి సొమ్ము రూ.39లక్షలను సైబర్ నేరస్థుల బారినపడకుండా హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కాపాడారు. నగరానికి చెందిన నిరుద్యోగి ట్రేడింగ్ పేరుతో మోసపోయాడు. పెట్టుబడులు పెట్టించి డబ్బు దండుకున్నారని పోలీసులకు ఫిర్యాదుచేశాడు. వెంటనే ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రావు, కానిస్టేబుళ్లు వెంకటేష్, సంపత్‌లు స్పందించి బాధితుడి సొమ్ము ఏ ఖాతాలో జమైందో తెలుసుకొని.. ఆ బ్యాంకు అధికారులకు నోటీసులు జారీ చేశారు. ఖాతాలో సొమ్మును స్తంభింపజేశారు. డబ్బు పొందడానికి కోర్టులో పిటిషన్ దాఖలుచేయాలని బాధితుడికి సూచించారు. సైబర్ పోలీసుల కృషిని సీపీ సీవీఆనంద్, డీసీపీ(సైబర్ క్రైమ్) ధార కవిత అభినందించారు.

శ్రీకృష్ణ జువెలరీ కేసు సీసీఎస్‌కు బదిలీ

ఈనాడు, హైదరాబాద్: శ్రీకృష్ణ జువెలరీ దుకాణంలో రూ.6కోట్ల నగలు మాయమైన కేసును మంగళవారం సీసీఎస్‌కు బదిలీ చేశారు. బంజారాహిల్స్ రోడ్‌నం.10లోని శ్రీకృష్ణ జువెలర్స్‌లో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు, కొనుగోలుదారులకు అందించాల్సిన బంగారు, వజ్రాభరణాలను మాయం చేసినట్టు అంతర్గత ఆడిటింగ్‌లో గుర్తించారు. హెచ్ఆర్ మేనేజర్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాజాగా ఈకేసును సీసీఎస్‌కు బదిలీ చేయటంతో సుకేతు అనిల్‌షా, ఉదయ్‌కుమార్ శెట్టి, బబ్బూరి శ్రీకాంత్, సత్యనారాయణ, హనుమాన్, అజయ్, చింటు, టింకు, చంద్రపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అంబేడ్కర్ వర్సిటీ డిగ్రీ, పీజీ ప్రవేశ గడువు పెంపు

జూబ్లీహిల్స్: వర్సిటీలో డిగ్రీ, పీజీల్లో చేరడానికి చివరి తేదీని అక్టోబరు 30 వరకు పొడిగించినట్లు ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సుధారాణి మంగళవారం ప్రకటనలో తెలిపారు. 2022-23, 2023-24 విద్యా సంవత్సరంలో డిగ్రీలో చేరిన ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు ట్యూషన్ రుసుం చెల్లించాలని, అంతకుముందు చేరిన విద్యార్థులు సైతం అక్టోబరు 30 లోపు ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. వివరాలకు అధ్యయన కేంద్రం లేదా 7382929570/580, 04023680222/333/444/555 లేదా టోల్‌ఫ్రీ 18005990101 లేదా వెబ్‌సైట్ www.braouonline.in, www.braou.ac.in లో పరిశీలించాలన్నారు.

బెంగాల్‌లో జూనియర్ వైద్యుల డిమాండ్లు నెరవేర్చాలి


నిరాహార దీక్ష చేస్తున్న ఐఎంఏ, టీ జూడా ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: కోల్‌కతాలో హత్యాచారానికి గురైన వైద్యురాలి కుటుంబానికి న్యాయం చేయాలని, వైద్యులకు రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలంటూ అక్కడి జూడాల డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ డిమాండ్ చేసింది. తొమ్మిది డిమాండ్లతో బెంగాల్ జూనియర్ వైద్యులు కొనసాగిస్తున్న ఆమరణ నిరాహార దీక్షకు సంఘీభావంగా ఐఎంఏ ప్రతినిధులు, జూనియర్ వైద్యులు మంగళవారం కోఠిలోని ఐఎంఏ భవన్‌లో 12 గంటల నిరాహార దీక్ష చేపట్టారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డా.కాళీప్రసాద్‌రావు, డా. విజయ్‌రావు, టీ జూడా ప్రతినిధులు జి.శ్రీనివాస్, రాహులు, ఇసాక్ న్యూటన్ మాట్లాడుతూ.. న్యాయమైన డిమాండ్లతో 10 రోజులుగా బెంగాల్‌లో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న జూడాల ఆరోగ్యం క్షీణిస్తున్నా.. అక్కడి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఐఎంఏ ప్రతినిధులు డా. దయాళ్‌సింగ్, డా.దిలిప్ భానుషాలి, డా.ధనశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వెన్నెముక సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు


కార్యక్రమంలో డా. గురువారెడ్డి, వైద్య నిపుణులు

బేగంపేట: వెన్నెముక సంబంధిత సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దని కిమ్స్, సన్‌షైన్ ఆసుపత్రి ఎండీ, సన్‌షైన్ బోన్ అండ్ జాయింట్ ఇన్‌స్టిట్యూట్ ఛైర్మన్ డా.ఎ.వి.గురువారెడ్డి హెచ్చరించారు. ప్రపంచ సైన్స్ డే సందర్భంగా బేగంపేటలోని కిమ్స్, సన్‌షైన్ ఆసుపత్రిలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డా.గురువారెడ్డి మాట్లాడుతూ.. దేశ జనాభాలో 60 శాతం మంది ఏదో ఒక సమయంలో వెన్నెముక సంబంధిత సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని పరిశోధనలు వెల్లడిస్తున్నాయన్నారు. రోజురోజుకు పెరుగుతున్న వెన్నెముక సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి వైద్యులను సంప్రదించాలని సూచించారు. డా. ఎ.దిశకర్, డా.పి.వి.సత్యనారాయణమూర్తి, డా.హేమాన్షు ప్రసాద్, డా.డి. ఆంజనేయులురెడ్డి, డా.మురారి, డా.ఎల్.జయప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాభవన్‌కు భారీగా తరలివచ్చిన వీఆర్‌ఏలు


మాట్లాడుతున్న ప్రజావాణి అధికారి దివ్య

సోమాజిగూడ, న్యూస్‌టుడే: ప్రజాభవన్‌లో మంగళవారం ప్రజావాణి కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి భారీ ఎత్తున వీఆర్‌ఏలు తరలివచ్చారు. 61 ఏళ్ల పైబడిన 3,797 మంది వీఆర్‌ఏ వారసులకు కారుణ్య నియామకాల ఉత్తర్వులు జారీ చేసిన జీవో 81, 85 వెంటనే అమలు చేయాలని ప్రజాభవన్ ఇన్‌ఛార్జి, రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జి.చిన్నారెడ్డి, ప్రజావాణి ప్రత్యేకాధికారి దివ్యను కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని వారు హామీ ఇచ్చారు. [illegible] మంగళవారం మొత్తం దరఖాస్తులు 406 అందాయి.

పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు విడుదల చేయండి

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: ఆరేళ్లుగా రూ.8 వేల కోట్లకుపైగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రైవేటు టీచర్స్ లెక్చరర్స్ ఫెడరేషన్ (టీపీటీఎల్ఎఫ్) రాష్ట్ర కన్వీనర్ ఎ.విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇప్పటికే ప్రవేశ పరీక్షలు రాసి, ఉన్నత చదువులకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పేద విద్యార్థులు అప్పులు చేసి మరీ కళాశాలలోని తమ సర్టిఫికెట్లు తీసుకుంటున్నారని అన్నారు. జీతాలు కూడా చెల్లించలేమంటూ ఇప్పటికే కళాశాలల బంద్‌కు పిలుపునిచ్చారని అన్నారు.

కాలుష్య తనిఖీలకు ఆమడ దూరం

- పీయూసీకి వాహనదారుల అనాసక్తి
- ఉచిత డ్రైవ్‌లో పాల్గొన్నది 390 వాహనదారులు

ఈనాడు, హైదరాబాద్

కాలుష్య తనిఖీలకు గ్రేటర్‌లోని వాహనదారులు ఆమడ దూరం ఉంటున్నారు. ఉచిత డ్రైవ్ నిర్వహించినా స్పందించడం లేదు. ఇటీవల కాలుష్య నియంత్రణ మండలి గ్రేటర్‌లోని ఆరు ప్రాంతాల్లో ఉచిత పీయూసీ (పొల్యూషన్ అండర్ కంట్రోల్ డ్రైవ్) నిర్వహించింది. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్‌లో భాగంగా సెప్టెంబర్ 7న ఈ డ్రైవ్‌ను నిర్వహిస్తే కేవలం 390మంది వాహనదారులు మాత్రమే తనిఖీలు చేయించుకున్నారు. గ్రేటర్‌లో 80 లక్షలకు పైగా వాహనాలుంటే పాల్గొంది 0.005శాతం మాత్రమే. దీన్నిబట్టి పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. **ఉచిత డ్రైవ్ నిర్వహించిన ప్రాంతాలివే..:** కాలుష్య ఉద్గారాలతో ఇంధన సామర్థ్యం, ఆరోగ్యంపై ప్రభావంతోపాటు నేషనల్ క్లీన్‌ఎయిర్ ప్రోగ్రామ్‌పై అవగాహన కల్పించేందుకు పీసీబీ ఈ ఉచిత డ్రైవ్‌ను చేపట్టింది. ఎల్బీనగర్ క్రాస్‌రోడ్స్, ఉప్పల్ భగాయత్, నాంపల్లి పోలీస్ కంట్రోల్ రూమ్, ప్రసాద్ ఐమాక్స్, దుర్గం చెరువు సమీపంలో, మియాపూర్ మెట్రోస్టేషన్ ప్రాంతాల్లో చేపట్టిన కార్యక్రమానికి సగటున 80మంది కూడా రాలేదు. పీయూసీ సర్టిఫికేట్, తనిఖీలు చేయించుకున్నారనే అంశంలో నిఘా లేకపోవడంతో డొక్కు వాహనాలు రోడ్డెక్కి కాలుష్యాన్ని పెంచేస్తున్నాయి. నగరంలో 70శాతం వాహనదారులు పీయూసీ తనిఖీలకు ఆసక్తి చూపడం లేదని, కాలుష్య ఉద్గారాల నమోదును దాచిపెడితే రూ.2వేల నుంచి రూ.5వేల వరకు జరిమానా పడొచ్చని హెచ్చరిస్తున్నారు.



నగరంలోని వాహనాలతో వెలువడుతున్న కాలుష్య ఉద్గారాలు (శాతాల్లో)	
కార్బన్‌డయాక్సైడ్	61.4
హైడ్రోకార్బన్‌లు	34
సల్ఫర్‌డయాక్సైడ్	0.54
సస్పెండెడ్ పార్టిక్యులేట్ మ్యాటర్	0.18
లెడ్	0.023

ప్రస్తుత వాహనాల సంఖ్య	
ఆటోలు	1,08,710
కాంట్రాక్టర్ క్యారేజీలు	6,947
పాఠశాలల బస్సులు	15,513
గూడ్స్ వాహనాలు	3,17,180
మాక్సీ క్యాబ్‌లు	15,744
మోటార్ క్యాబ్‌లు	81,276
మోటారు కార్లు	14,95,121
మోటారు సైకిళ్లు	59,83,443
ప్రయివేటు సర్వీసు వాహనాలు	2,300
స్టేజీ క్యారేజీలు	8,548
ట్రాక్టర్లు, ట్రాలీలు	46,192
ఈ-రిక్షాలు, ఈ-కార్టులు	41
ఇతర వాహనాలు	40,676

సుస్థిరాభివృద్ధిలో భారతీయ ప్రమాణాలు కీలకం


మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సోమాజిగూడ: సుస్థిర ప్రపంచాన్ని నిర్మించడంలో భారతీయ ప్రమాణాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. కేవలం నాణ్యమైన వస్తువులు మాత్రమే వినియోగిస్తామని, నాణ్యమైన వాతావరణాన్ని రూపొందించేందుకు సహకరిస్తామని ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ తీసుకోవాలని పిలుపునిచ్చారు. మంగళవారం సోమాజిగూడలోని కత్రియా హోటల్లో భారతీయ ప్రమాణాల బ్యూరో ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ ప్రమాణాల దినోత్సవానికి హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యతగా ప్రపంచ ప్రమాణాల దినోత్సవ సందేశంతో పాటు 17 సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. పారిశ్రామిక విధానాలు మారుతున్నాయని, సుస్థిరాభివృద్ధి లక్ష్య సాధనలో తమ పాత్ర ఉంటుందన్నారు. బీఐఎస్ శాఖాధిపతి పీవీ శ్రీకాంత్ కార్యక్రమ సందేశాన్ని వివరించారు. బీఐఎస్ విద్యార్థుల్లో స్టాండర్డ్స్ క్లబ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మోడల్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు స్వాతి, వివిధ శాఖల అధ్యాపకులు డాక్టర్ వై.వాసుదేవరెడ్డి, డాక్టర్ నరహరి సుజాతను సత్కరించారు.

దివ్యాంగులకు అతీతమైన శక్తి ఉంది

ఖైరతాబాద్: దివ్యాంగులకు అతీతమైన శక్తి ఉందని గవర్నర్ అన్నారు. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించగల సామర్థ్యం వారి దివ్య శక్తితోనే సాధ్యమౌతుందన్నారు. దృష్టి లోపం ఉన్నవారి సంక్షేమానికి కట్టుబడి ఉన్న పలు ఎన్జీవో సహకారంతో ఫ్రెండ్స్ [illegible] మంగళవారం నిర్వహించిన 'వైట్ కేన్ డే-2024' కార్యక్రమం నిర్వహించింది. గవర్నర్ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, సంయుక్త కార్యదర్శి భవానీ శంకర్, ఐటీ కమిషనర్ జీవ[illegible], కార్పొరేటర్ విజయారెడ్డి పాల్గొన్నారు.

లండన్‌లో అలయ్ బలయ్



లండన్‌లో తొలిసారిగా అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహించినట్లు లండన్‌వాసి సిస్టా చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సౌతాల్ మాజీ ఎంపీ వీరేంద్రశర్మ ఈ కార్యక్రమానికి హాజరయ్యారని వెల్లడించారు. యూకే నలుమూలల నుంచి డాక్టర్లు, ఇంజినీర్లు, వ్యాపారవేత్తలు, రాజకీయ ప్రముఖులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారని తెలిపారు. – ఈనాడు, హైదరాబాద్

ఏపీ వరద బాధితులకు విరాళం


ఏపీ సీఎం చంద్రబాబునాయుడుకు చెక్కు అందజేస్తున్న సికింద్రాబాద్ వాసులు

లాలాపేట: ఏపీలో వరద బాధితులకు సికింద్రాబాద్‌కు చెందిన పలువురు చంద్రబాబు అభిమానులు, తెదేపా నాయకులు విరాళం అందజేశారు. అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబును మంగళవారం కలిసి రూ.8లక్షల చెక్కు, రూ.లక్ష నగదు అందించారు. విరాళాలు అందించిన వారిలో తెదేపా సికింద్రాబాద్ నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జి వల్లారపు శ్రీనివాస్, సీతాఫల్‌మండి డివిజన్ అధ్యక్షుడు జీవీ కృష్ణ, పలువురు విజయకుమార్, సీతారామయ్య, నరేందర్‌బాబు, ప్రసాద్, చంద్రమౌళి ఉన్నారు.

రూ.10 నాణేలు తీసుకోండి : యూబీఐ


దుకాణదారుకు నాణేలిస్తున్న అధికారులు

ఈనాడు, హైదరాబాద్: రూ.10 నాణేల చెల్లుబాటు విషయంలో జనాల్లో ఉన్న గందరగోళాన్ని తొలగిస్తూ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ జోనల్ కార్యాలయం ప్రచార కార్యక్రమం చేపట్టింది. 'రూ.10 నాణెం స్వీకరిస్తాం' పేరుతో మంగళవారం వేర్వేరు ప్రాంతాల్లో ఈ కార్యక్రమం నిర్వహించింది. 'మేము తీసుకుంటాం.. మీరు తీసుకోండి' అంటూ అధికారులు నినాదాలిచ్చారు.

గాంధీలో ఐవీఎఫ్ కేంద్రం ప్రారంభం


వైద్యులతో మాట్లాడుతున్న మంత్రులు

గాంధీఆసుపత్రి, న్యూస్‌టుడే: వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మంగళవారం గాంధీ ఆసుపత్రిలో ఐవీఎఫ్ కేంద్రాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి ప్రారంభించారు. రూ.80 కోట్లతో నిర్మించనున్న విద్యార్థుల వసతి భవనాలకు శంకుస్థాపన చేశారు. 15 రోజుల్లో పేట్లబురుజు మెటర్నిటీ ఆసుపత్రిలోనూ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 6 క్యాన్సర్ కేంద్రాలు, 73 ట్రామా కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయించామన్నారు. ఉస్మానియా ఆస్పత్రిని గోషామహల్‌లో 32 ఎకరాల్లో రూ.2000 కోట్లతో నిర్మించేందుకు త్వరలో శంకుస్థాపన చేయబోతున్నట్లు వెల్లడించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఐఏఎస్, ఐపీఎస్, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స తీసుకోవాలని కోరారు.

స్వదేశీ మేళా 23 నుంచి 27 వరకు


వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి. చిత్రంలో ఇంద్రసేనారెడ్డి, రచ్చ శ్రీనివాస్, కేశవ్ సోనీ

బర్కత్‌పుర, న్యూస్‌టుడే: స్వదేశీ జాగరణ్ మంచ్ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి 27 వరకు నగరంలోని పీపుల్స్ ప్లాజాలో స్వదేశీ మేళా నిర్వహించనున్నారు. వెబ్‌సైట్‌ను మంగళవారం బర్కత్‌పురలోని తన నివాసంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. చేతి వృత్తుల వారి ఉత్పత్తులు, వినూత్నమైన సాంకేతిక స్వదేశీ వస్తువులు ప్రదర్శించే ఈ మేళాను ప్రజలు సందర్శించాలని కోరారు.

పౌరహక్కులు కాపాడేందుకు పోరాటం


సాయిబాబా చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి

మౌలాలి, న్యూస్‌టుడే: నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడిన వ్యక్తి ప్రొఫెసర్ సాయిబాబా అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి అన్నారు. సాయిబాబా కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించారు. ఆయన నమ్మిన సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్లడానికి, నిరంకుశ ఎన్‌డీఏ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పడానికి వామపక్షాలు ఒక వేదిక మీదకు రావాలని ఆకాంక్షించారు. సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు మారుపాక అనిల్‌కుమార్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక ఆలయాల సందర్శనకు ప్రత్యేక రైలు డిసెంబరు 5న ప్రారంభం


గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న రమేశ్ అయ్యంగార్, విగ్నేష్

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: భారతీయ రైల్వే-భారత్ గౌరవ్ రైలు పథకం ద్వారా కర్ణాటకలోని ఆలయాలను 9 రోజులపాటు సందర్శించేందుకుగానూ డిసెంబరు 5న ప్రత్యేక రైలు ప్రారంభించనున్నట్లు ప్రైవేటు సర్వీసు ప్రొవైడర్ సౌత్ స్టార్ రైల్, టూర్ టైమ్స్ సంస్థలు వెల్లడించాయి. మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో విలేకరుల సమావేశంలో టూర్ టైమ్స్ తెలుగు రాష్ట్రాల రీజినల్ డైరెక్టర్ రమేశ్ అయ్యంగార్, సౌత్ స్టార్ రైల్ డైరెక్టర్ విఘ్నేశ్ మాట్లాడారు. www.traintour.in లో గానీ 93550 21516 ద్వారా బుకింగ్ చేసుకోవచ్చని కోరారు.

ఈడీ న్యాయస్థానానికి ముఖ్యమంత్రి హాజరుకావాలని వినతి

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: ఓటుకు నోటు కేసులో ఏ-1గా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈడీ న్యాయస్థానంలో ఐడెంటిఫికేషన్ కోసం హాజరుకావడం లేదని, దీని వల్ల విచారణ ముందుకు సాగడం లేదని ఏ-4 నిందితుడు జెరూసలెం మత్తయ్య తెలిపారు. కొన్నేళ్లుగా వాయిదాలకు తిరుగుతూ.. న్యాయస్థానాల చుట్టూ తిరగలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 16న ఈడీ న్యాయస్థానంలో విచారణకు ముఖ్యమంత్రి హాజరై తనను విముక్తి చేయాలని కోరారు. మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2015లో మొదలైన ఈ కేసు అనేక మలుపులు తిరిగి తన పేరును అన్ని కేసుల్లో కొట్టి వేశారని, నాంపల్లి ఈడీ న్యాయస్థానంలో మాత్రమే పెండింగ్‌లో ఉందని గుర్తుచేశారు.

టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీన సభ 20న


గోడపత్రికలు విడుదల చేస్తున్న సూర్యం, పద్మ, ప్రవీణ్ తదితరులు

నల్లకుంట, న్యూస్‌టుడే: భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ)లో విలీనం కానుంది. ఈ నెల 20న సుందరయ్య విజ్ఞాన కేంద్రం వేదిక కానుందని ఐఎఫ్‌టీయూ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కమిటీ అధ్యక్షురాలు ఎస్.ఎల్.పద్మ తెలిపారు. మంగళవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో సమావేశంలో ఆమె మాట్లాడారు. విలీన సభ గోడపత్రికలు విడుదల చేశారు.

వసుంధర

vasundhara@eenadu.in

రష్మిక... ఐ4సీ అంబాసిడర్!



'మనం జీవిస్తోంది డిజిటల్ యుగంలో! సైబర్ దాడులు ఎటువైపు నుంచి ముంచుకొస్తాయో చెప్పడం కష్టమే. అందుకే జాగ్రత్తగా ఉండాలి. మనల్నీ, భవిష్యత్తు తరాల్నీ కాపాడుకోవాలి'... అంటూ అందరికీ అవగాహన కల్పిస్తానంటోంది నటి రష్మిక మందన్న. ఎందుకు అంటే తను ఐ4సీ అంబాసిడర్ మరి! ఇండియన్ సైబర్‌క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ)... సైబర్ నేరాలకు సంబంధించిన సమస్యలపై పనిచేస్తుంది. ఇది కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో పనిచేస్తుంది. ఈ సంస్థ 'సైబర్ సురక్షిత'పై అవగాహన కల్పించడానికి రష్మికను జాతీయ ప్రతినిధిగా ఎంపిక చేసింది. ఆన్‌లైన్ మోసాలు, డీప్‌ఫేక్ వీడియోలు, సైబర్ బుల్లీయింగ్... వంటి ఎన్నో అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తుందీమె. రష్మికనే ఎందుకు... అంటే... గతంలో అశ్లీల దుస్తులతో వస్తున్నట్టుగా ఈమె వీడియో వైరల్ అయ్యింది గుర్తుందా? ఆన్‌లైన్‌లో అది చూసి రష్మికను తిట్టినవారూ బోలెడుమందే. తీరా అది నేను కాదు అని ఆమె చెప్పడంతో ఆశ్చర్యపోవడం అందరి వంతైంది. అంతేనా పోలీసులకూ ఫిర్యాదు చేసిందామె. అప్పుడే అది 'డీప్ ఫేక్' మాయ అని తెలిసింది. ఆ తరవాత ఎంతోమంది నటీమణులు, అమ్మాయిలు దాని బారినపడ్డారు. ఒకరకంగా దాన్ని ఎదుర్కొంది కాబట్టే... రష్మికను ఎంపిక చేశారు. 'సైబర్‌క్రైమ్... చాలా ప్రమాదం. ఇది ప్రపంచవ్యాప్తంగా వ్యక్తులు, వ్యాపారాలు, కమ్యూనిటీ... ఇలా అందరిపైనా దుష్ప్రభావం చూపుతోంది. నేనూ దీనిబారిన పడ్డా. అందుకే దీనిపై అవగాహన కల్పించాలనుకున్నా. మనందరం కలిసి ఈ వేధింపులకు వ్యతిరేకంగా పోరాడాలి. మన డిజిటల్ స్పేస్‌ని కాపాడుకోవాలి' అంటోంది రష్మిక. దీనికి సంబంధించిన వీడియోను ఇన్‌స్టా వేదికగా పంచుకోగా కొద్ది గంటల్లోనే లక్షల్లో వీక్షణలొచ్చాయి కూడా.

ఆ విడాకులకి కారణం అదే!

నా జీతం... నా ఇష్టం. నేనూ సంపాదిస్తున్నా. ఎలా ఖర్చుపెట్టాలో నాకు తెలుసు. బ్యాంకుల్లో దాచడంవల్ల ఎప్పటికీ ఎదగలేం. ఎవరి గురించో అప్పు చేయడం నాకిష్టం లేదు... ఈ రకమైన సంభాషణలు మిలీనియల్స్, జెన్-జీల నుంచి తరచూ వింటున్నాం. అవక్కడితో ఆగట్లేదు... పెళ్లయిన కొన్నాళ్లకే విడాకులు కోరుతున్నాయి. ఎందుకిలా... కారణాలేంటీ... అని చూస్తే..!



ఒకప్పుడు స్త్రీలకి పుట్టింటి ఆస్తి తప్ప వేరే సంపాదన ఉండేది కాదు. భర్తే ఇంటి యజమాని. కాబట్టి ఆర్థిక విషయాలన్నీ ఒక్కరే చూసుకునేవారు. ఇప్పుడు ఇద్దరూ సంపాదిస్తున్నారు. కానీ జీతం తెచ్చి అతనికే ఇవ్వాలి అన్నదే ఇప్పటికీ చాలా కుటుంబాల్లో ఉంది. తరాలుగా వస్తోన్న పురుషాహంకారంతో పెట్టుబడుల గురించి నీకేం తెలియదు అనడమే కాదు, అమ్మాయిలతో చర్చించకుండా మగవాళ్లే నిర్ణయం తీసుకుంటున్నారు. ఇవన్నీ కూడా సంపాదిస్తోన్న స్త్రీల గౌరవాన్ని దెబ్బతీస్తున్నాయి. చేసేది లేక... కొందరు విడాకులవైపు మొగ్గు చూపుతున్నారు.

రేష్మది సంప్రదాయ కుటుంబం. ఖర్చులు తగ్గించుకుని ఇద్దరి జీతాల్లోంచి చెరి సగం బ్యాంకులో డిపాజిట్ చేద్దామంటోంది. 'జీవితంలో ఎదగాలంటే రిస్క్ తీసుకోవాలి. షేర్లు, రియల్ ఎస్టేట్‌లో ఇన్వెస్ట్ చేద్దాం' అంటాడు కరుణ్. ససేమిరా అంది రేష్మ... వాదన పెరిగింది. చినికి చినికి గాలివానగా మారింది. 'చావు మాత్రమే మనల్ని వేరుచేయగలదు' అని బాస చేసుకున్న ఎనిమిదేళ్ల ప్రేమ... ఎటు పోయిందో తెలియదు. పెళ్లి పత్రిక ఏడాది తిరక్కుండానే చిరిగిపోయింది.

భావన దీర్ఘంగా ఆలోచిస్తోంది. అప్పుడే వచ్చిన అభయ్ ఏమైందంటూ పక్కనే కూర్చున్నాడు. లోన్ కట్టమంటూ వచ్చిన లెటర్ అందించి, 'ఏమిటిది' అన్నట్లు చూసింది. 'క్రెడిట్ కార్డు లోన్... నీ శాలరీతో కట్టేద్దాంలే' క్యాజువల్‌గా అన్నాడు. 'సారీ... నా కమిట్‌మెంట్స్ నాకున్నాయి' అంది. 'అంటే ఇంటి బాధ్యత నా ఒక్కడిదేనా... నీకు లేదా...' అని అరవడమే కాదు, అన్నీ షేర్ చేసుకోవాల్సిందే అని కచ్చితంగా చెప్పాడు అభయ్. అది మొదలు... ప్రతి చిన్నదానికీ గొడవే. ఫలితం... పెళ్లైన నాలుగు నెలలకే కోర్టు మెట్లు ఎక్కాల్సి వచ్చింది.

ఈ రెండు జంటలనే కాదు, పెరుగుతోన్న విడాకుల కేసుల్లో డబ్బే ప్రధాన కారణమని అధ్యయనాలూ చెబుతున్నాయి. భాగస్వామితో మనీ గురించి చర్చించకపోవడం, ఇద్దరిలో ఒకరికి ఉద్యోగం పోవడం, పెట్టుబడులూ ఖర్చుల విషయంలో అభిప్రాయభేదాలు, ఆర్థిక క్రమశిక్షణ లేకపోవడం, ముఖ్యంగా దంపతుల మధ్య పారదర్శకత లోపించడం... వంటివన్నీ విడాకులకి దారితీస్తున్నాయి. చేసుకున్నాక తప్పదని మొదట్లో కొందరు రాజీపడినా... కాలం గడిచేకొద్దీ ఆ విభేదాలు తీవ్రమవుతున్నాయి. దాంతో ఆ బంధం బీటలు వారడానికి ఎంతోకాలం పట్టడం లేదు. వినడానికి చేదుగా ఉన్నా ఇదే నిజం. పెరుగుతోన్న విడాకుల కేసుల్లోనూ సుమారు 20- 40 శాతం జంటలు విడిపోవడానికి కారణం డబ్బే అన్నది నిపుణుల అంచనా.

ప్రేమపెళ్లి లేదా పెద్దలు కుదిర్చినది... ఏదైనా కానీ... పెళ్లికి ముందు 'ఏ రంగు ఇష్టం... హాబీలేంటీ... ఇలా ఎన్నో మాట్లాడుకుంటారు. కానీ కలిసి బతకడానికి కావాల్సిన ఆర్థిక విషయాల ప్రస్తావనే ఉండదు. అది తప్పుగా భావిస్తూ... ప్రేమ ఉంటే చాలు... డబ్బుదేముంది అనుకుంటారు. కానీ పెళ్లయ్యాకనో పిల్లలు పుట్టాకనో అసలు విషయం తెలిసి వస్తుంది. తరవాతేముందీ... ఒకరినొకరు నిందించుకోవడం, అలకలూ పోట్లాటలూ చివరి అంకం విడాకులే. అతిశయోక్తిగా అనిపించినా... రియాలిటీ ఇదే.

> **మాతో పంచుకోండి**
>
> **మీ మధ్య డబ్బు గురించిన అభిప్రాయ భేదాలు ఉంటే... వాట్సాప్ 9154091911 లేదా ఈ-మెయిల్ vasundhara@eenadu.in ద్వారా మాతో పంచుకోండి. నిపుణుల సలహాలతో ప్రచురిస్తాం. ప్రారంభంలోనే సమస్యను పరిష్కరించుకుంటే... సంసారనౌక హాయిగా సాగిపోతుంది. ఏమంటారు?**

మరేం చేయాలి?

కావాల్సిందల్లా... నమ్మకం, నిజాయతీ. ఆదాయం, ఖర్చుల గురించి దాపరికం ఉండకూడదు. చిన్న ఖర్చైనా లెక్క రాసుకోవాలి. కలిసి నిర్ణయాలు తీసుకుంటే సమస్య ఉండదు అంటున్నారు ఆర్థిక నిపుణులు. అలాగే కమ్యూనికేషన్... ముందుగానే ఆస్తులు, జీతాల గురించి ఓపెన్‌గా మాట్లాడుకోవాలి. పెళ్లికి ముందు డబ్బు గురించి మాట్లాడితే మనీ మైండ్ అనుకుంటారని సందేహించకూడదు. నేరుగా అడగలేకపోతే 'మీ లక్ష్యం ఏమిటి, డబ్బు గురించి మీ అభిప్రాయం...' ఇలా సున్నితంగా మాట్లాడటం ద్వారా వాళ్ల మనస్తత్వాన్ని కొంత అర్థం చేసుకోగలం అన్నది సైకాలజిస్టుల సలహా. మొత్తమ్మీద ఆడామగా ఇద్దరికీ భవిష్యత్‌కోసం దీర్ఘకాలిక ఆర్థిక ప్రణాళిక ఉండాలి. ఎందుకంటే 'ఏ బంధమైనా డబ్బుతోనే' అనుకునే కాలంలో ఉన్నాం.

అయితే ఒక్క సంగతి... అలవాట్లలానే ఆర్థిక అంశాలు కూడా వాళ్లు పెరిగిన వాతావరణం, కుటుంబ నేపథ్యం మీద ఆధారపడి ఉంటాయి. కాబట్టి సామరస్యంగా మాట్లాడుకుంటే చాలావరకూ సమస్య సమసిపోతుంది. లేదా పెద్దవాళ్లు, నిపుణుల సలహా తీసుకోవచ్చు. అంతేతప్ప తొందరపాటు నిర్ణయం తీసుకోవద్దు.

ఎగతాళి చేస్తున్నారు!

నేను ఓ కంపెనీలో మహిళల బృందానికి లీడ్‌గా ఉన్నాను. తరచూ మెయిళ్ల రూపంలో సమాచారం ఇస్తుంటాను. అయితే, ఆ టీమ్‌లో ఒకరు నన్ను ఎగతాళి చేస్తూ మాట్లాడుతున్నారట. తన గురించి నేను ఎప్పుడూ సానుకూలంగానే ఆలోచిస్తా. అలాంటిది నా గురించి అలా మాట్లాడడం నమ్మశక్యంగా లేదు. ఈ విషయాన్ని తనను ఎలా అడగాలి? – ఓ సోదరి

డియర్... వసుంధర



కవితా గూడపాటి
ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్

దీని గురించి మీరు అంతగా ఎందుకు ఫీల్ అవుతున్నారో అర్థం కావడం లేదు. ఆమె అలా అనడం వల్ల మీ పనిపై ఏదైనా ప్రభావం ఉందా? లేదా మీ గురించి అబద్ధాలు చెబుతున్నారా? అవి మీ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉన్నాయా? అలా ఉంటే స్పందించండి. లేదంటే అంతగా ఆలోచించాల్సిన అవసరమే లేదు. మీకు అందరూ గౌరవం ఇవ్వాలనుకోవడంలో తప్పు ఏమీ లేదు. కానీ అందరూ మన గురించి అలా ఆలోచిస్తారని అనుకోకూడదు. అంతేకాదు, కొంతమంది ఎదురుగా లేనివారి మీద ఏవో ఒక అనుచిత వ్యాఖ్యలు చేస్తుంటారు. ఒకసారి మీరు ఆమెతో మాట్లాడి చూడండి. తను చెప్పాలనుకున్నది ఏదైనా నేరుగా చెప్పమనండి. ఎగతాళిగా మాట్లాడాల్సిన అవసరాన్ని ప్రశ్నించండి. వీలుంటే మీ పైవాళ్లతోనూ మాట్లాడి వారి అభిప్రాయాలు తీసుకోండి. చివరగా ఒక బృందాన్ని లీడ్ చేస్తున్నప్పుడు ఇలాంటి చిన్న చిన్న విషయాలకు ఎక్కువగా స్పందించకండి. మీరు సరిగా పనిచేస్తున్నంత కాలం ఇలాంటివేమీ మీపై ప్రభావం చూపించలేవు అన్న విషయం గుర్తుంచుకోండి.

ట్యాబ్లెట్... ఎండని ఆపగలదా?

ఎండ నుంచి చర్మాన్ని రక్షించుకోవడం కోసం సన్‌స్క్రీన్ లోషన్ రాస్తుంటాం. సమస్యల్లా బయటికి వెళ్లిన ప్రతిసారీ తిరిగి రాయాల్సి రావడమే! ఈ ఇబ్బంది నుంచి తప్పించుకోవడానికి కొందరు 'సన్‌స్క్రీన్ పిల్'ను వాడుతున్నారు. ఇంతకీ ఇదేంటి? వేసుకుంటే క్రీమ్‌ల అవసరం ఉండదా? తెలుసుకుందాం రండి.



ఓరల్ సన్‌స్క్రీన్... ఇవీ మనం సాధారణంగా తీసుకునే సప్లిమెంట్ల లాంటివే. వీటిల్లో విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి యూవీ కిరణాల నుంచి చర్మానికి రక్షణ కలిగిస్తాయి. వీటిల్లోని పాలిపోడియం లూకొటమీస్ ఎండకి చర్మం ఎర్రబడటం, కణాలు దెబ్బతినడాన్ని ఆపగలదట. యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీరాడికల్స్‌తో పోరాడటమే కాదు చర్మకణాల ఆరోగ్యాన్నీ సంరక్షిస్తాయి. దీంతో వృద్ధాప్యఛాయలు దరి చేరవు, క్యాన్సర్ ముప్పూ తగ్గుతుంది.

ఇక క్రీముల అవసరం ఉండదా... అంటే సమాధానం కష్టమే. ఎందుకంటే... ఈ పిల్స్ శరీరం మొత్తానికి కావాల్సిన సంరక్షణ ఇస్తాయన్న మాట వాస్తవమే అయినా సన్‌స్క్రీన్ లోషన్‌నీ రాయకతప్పదు. కాకపోతే పదే పదే రాయాల్సిన శ్రమ మాత్రం తగ్గుతుంది. అలాగే, మార్కెట్‌లో దొరుకుతున్నా వీటికి ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ నుంచి ఇంకా అనుమతులు రాలేదు. కాబట్టి, దొరుకుతున్నాయి కదా అని వేసుకోవద్దనేది నిపుణుల సలహా. పైగా వీటిని కొన్నిరోజులే వాడాలి. దీర్ఘకాలం తీసుకుంటే కొత్త సమస్యలు ఎదురవొచ్చు. కాబట్టి, వైద్యుల అనుమతితో వారు సూచించిన పరిమాణంలో వేసుకుంటేనే మేలు. వారైతే రోజులో ఎంతసేపు ఎండలో ఉంటారు? చర్మ తాజా పరిస్థితి, ఇతర అనారోగ్యాలేమైనా ఉన్నాయా వంటివి గమనించి, సిఫారసు చేస్తారు. అప్పుడు సమస్య ఉండదు.

సమయం ఆదా అవుతుంది అని చాలామంది వీటివైపు మొగ్గు చూపుతున్నారు. తయారీ సంస్థలూ ఇవి మేలు చేస్తాయని సూచించినా లోషన్లకు ఈ పిల్స్ ప్రత్యామ్నాయం మాత్రం కాదు. వీటిని అదనపు రక్షణగా మాత్రమే గుర్తిస్తున్నారు నిపుణులు.

బంగారం వెండి



15న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	78,370	78,170	75,730	75,570
ఆర్నమెంట్	71,750	71,750	70,950	70,950
వెండి (కిలో)	93,375	93,427	92,500	92,900
	ప్రొద్దుటూరు		**రాజమహేంద్రవరం**	
బంగారం(24క్యా)	77,750	77,550	78,200	77,900
ఆర్నమెంట్	71,950	71,860	71,940	71,750
వెండి (కిలో)	92,200	92,700	92,500	93,000
	విశాఖపట్నం		**తమిళనాడు**	
బంగారం(24క్యా)	77,120	77,120	------	------
ఆర్నమెంట్	70,950	70,950	7,095	7,095 గ్రా
వెండి (కిలో)	94,000	92,000	103.00	102.00గ్రా

ఏ వయసులో ఏం తినాలి?

బతకడానికి ఆహారం తీసుకోవాలి కానీ, అందరి శరీర అవసరాలూ ఒకటి కాదని అర్థం చేసుకోవాలి. ముఖ్యంగా మహిళల పోషకాల అవసరాలు మగవారికంటే భిన్నంగా ఉంటాయి. వయసుని బట్టీ మారిపోతుంటాయి. మరి ఏ దశలో ఎలాంటివి తీసుకోవాలో చూద్దామా?

10-15 ఏళ్ల వయసులో...

ఎదిగే ఆడపిల్లలకు ప్రొటీన్ అవసరం ఎక్కువ. కానీ, ఈతరం ఇష్టపడే ఆహారంలో పిండి పదార్థాలు, కొవ్వులు అధికం. దాంతో ఎదుగుదల తగ్గి ఊబకాయం బారిన పడుతుంటారు. ఫలితంగా హార్మోన్ల మార్పులు.. చిన్న వయసులోనే రుతుక్రమం ఆరంభం. ఇలాకాకూడదంటే... వారికిచ్చే డైట్‌లో గుడ్లు, ఆకుకూరలు, తాజాపండ్లు, కూరగాయలతో పాటు నట్స్, వేరుశనగ, గోధుమలు, పెసలు వంటివన్నీ ఉండేలా చూడండి. స్వీట్లు, కేకులు, చాక్లెట్లకు ప్రత్యామ్నాయంగా ఫ్రూట్‌సలాడ్లు, నువ్వులు, డ్రైఫ్రూట్స్ లడ్డూలు వంటివి ఇవ్వాలి. స్నాక్స్ అంటే మొలకల చాట్, సెనగలు, బొబ్బర్లతో చేసిన వడలు వంటివి రుచి చూపించండి. ఇవన్నీ రుచిగా ఉంటాయి. శక్తినీ ఇస్తాయి.



15-30 ఏళ్ల వయసులో...

టీనేజీ మొదలుకుని ముప్పైల వరకూ మహిళల జీవితంలో కీలకదశ. ఉన్నత చదువులూ, కెరియర్, పెళ్లి... వంటి ఎన్నో ముఖ్య ఘట్టాలు జరిగేది ఇప్పుడే. ఈ హడావుడిలో పడి సరైన పోషకాహారం తీసుకోనివారు కొందరు, బరువు పెరిగిపోతామనే భయంతో లెక్కలు వేసుకుని తినేవారు మరికొందరు. ఇది నెలసరి మీదే కాదు, పునరుత్పత్తి సామర్థ్యంపైనా ప్రతికూల ప్రభావం చూపిస్తుంది. నిజానికి ఆరోగ్యానికే కాదు, అందాన్ని కాపాడుకోవాలన్నా తగిన పోషకాహారం తప్పనిసరి. అందుకే అధిక కెలొరీలు ఉండే పప్పుధాన్యాలు, నట్స్, పండ్లు, సీఫుడ్, సోయాలను తీసుకోవాలి. తృణధాన్యాలు, లోఫ్యాట్ ప్రొడక్ట్స్, పచ్చని కూరగాయలు తినాలి. రక్తహీనత రాకుండా పాలు, పౌల్ట్రీ, చేపలు, బచ్చలికూర, తోటకూర బీన్స్, కాయధాన్యాలు వంటి ఐరన్ అధికంగా ఉండే వాటిని డైట్‌లో చేర్చుకోవాలి.

30-40 ఏళ్ల వయసులో...

ఈ దశలో వ్యక్తిగత, వృత్తి బాధ్యతలు పెరుగుతాయి. దీనికితోడు హార్మోన్ల హెచ్చుతగ్గులు శారీరకంగా, మానసికంగా అలసట కలిగిస్తాయి. ముఖ్యంగా ఈస్ట్రోజన్ తగ్గడంతోపాటు అధికబరువు, డిప్రెషన్ వంటి పలు అనారోగ్య సమస్యలకూ దారితీయొచ్చు. ఈ పరిస్థితి రాకుండా పీచు పదార్థాలు తీసుకోవాలి. డైటరీ ఫైబర్, పొటాషియం, విటమిన్ ఎ,సి‌తో పాటు కొన్ని ఖనిజాలూ అవసరం. ఇవి ఆస్టియోపొరోసిస్, అధిక రక్తపోటు, గుండె జబ్బులు, మధుమేహం కొన్ని రకాల క్యాన్సర్‌లకు అడ్డుకట్ట వేస్తాయి. ఇవి గుడ్లు, బీన్స్, నట్స్-సీడ్స్‌ల్లో లభిస్తాయి. పండ్లు కూరగాయలు, మాంసం, చేపలు, పాల ఉత్పత్తులు, తృణధాన్యాల్లోనూ తగినంతగా ఉంటాయి.

40-60 ఏళ్ల వయసులో...

చాలామంది మహిళల్లో 45-55 ఏళ్ల మధ్య మెనోపాజ్ దశ ప్రారంభమవుతుంది. ఈ సమయంలో వేడి ఆవిర్లు, మూడ్ స్వింగ్స్, ఒత్తిడి, అలసట, నీరసం, వెజైనా పొడిబారిపోవడం.. వంటి చికాకులెన్నో కనిపిస్తాయి. వీటికితోడు వయసు మీద పడే కొద్దీ ఆస్టియోపోరోసిస్, కీళ్ల నొప్పులు.. వేధిస్తుంటాయి. ఈ ఇబ్బందుల్ని అధిగమించాలంటే... మెగ్నీషియం, కాల్షియం, విటమిన్ డి, ప్రొటీన్లు, ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు, యాంటీ ఆక్సిడెంట్లు అవసరం. ఇవి గింజలు, నట్స్, బీన్స్, గుడ్లు-మాంసం, చేపలు, ఆకుకూరలు, బ్రకలీ, బార్లీ.. వంటి వాటిలో ఈ పోషకాలు లభిస్తాయి.

60 ఏళ్లు దాటాక...

మహిళలకు 60 ఏళ్లు దాటితే... తీసుకునే ఆహారం త్వరగా జీర్ణమయ్యేదిగా ఉండాలి. అధికరక్తపోటు, మధుమేహం, గుండె జబ్బులు ప్రమాదకరంగా మారకుండా ఉండేందుకు చక్కెర, ఉప్పు తగ్గించి వాడాలి. తగినంత ప్రొటీన్ కోసం బీన్స్, బఠాణీలు, కాయధాన్యాలు, సీఫుడ్, పాల ఉత్పత్తులు తీసుకోవచ్చు. కూరగాయలు, పండ్ల ముక్కలు తీసుకోవాలి. నీళ్లను తగినంతగా తాగాలి.

(ప్రపంచ ఆహార దినోత్సవం)

బలహీనతను శక్తిగా మార్చుకుంటున్నారా!

రమ్య ఇంటర్వ్యూకెళ్లినప్పుడల్లా బలహీనతల గురించి చెప్పమనే ప్రశ్న దగ్గర ఫెయిల్ అవుతుంటుంది. మొండితనం, ప్రతి విషయంపట్ల అనుమానం వంటి తన బలహీనతలను చెప్పడానికి భయపడుతుంది. అయితే వీటన్నింటినీ ప్రయోజనకరంగా మార్చి చూపిస్తానని వివరించగలిగితే చాలు. ఉద్యోగాన్ని అందిపుచ్చుకోవచ్చంటున్నారు నిపుణులు. అదెలాగో చూద్దాం.



ప్రతి ఇంటర్వ్యూలో బలహీనతలనూ వివరించమనడం సహజం. కష్టమైన పని కూడా పట్టుదలగా ప్రయత్నించి పూర్తిచేయాలనే మీ మొండితనాన్ని అంతా బలహీనత అంటారని మీకు తెలుసు. అయితే ఆఫీసులో అప్పజెప్పిన ప్రాజెక్ట్ నిర్వహణ కష్టమని తెలిసినా, పట్టుదలగా సాధించడానికి ఆ మొండితనాన్నే మీరు ఆయుధంగా ఉపయోగిస్తారు. అనుకున్న లక్ష్యాన్ని పూర్తిచేయడానికి దాన్ని సంకల్పంగా మార్చుకుంటారు. సవాళ్లను దాటి లక్ష్యాలవైపు అడుగులేయడంలో, అలాగే మీ పనితీరును ప్రభావితం చేసి మంచి ప్రయోజనాలను అందించడంలో అందరూ అనుకునే మీ మొండితనమే శక్తిగా మారుతుంది. ఈ వివరణను మీ సమాధానంగా చెబితే చాలు. ఇంటర్వ్యూ చేసేవారిని మెప్పించినట్లే.

బలాలను...

బలహీనతల గురించి మాట్లాడేటప్పుడు వాటికి అనుసంధానంగా ఉండే మీ బలాలనూ హైలైట్ చేయడం మంచిది. ఒక బలహీనత గురించి చెప్పేటప్పుడు మీకున్న నైపుణ్యాలను జోడించి సమతుల్యం చేయగలగాలి. సంకోచంగా లేదా అనిశ్చితంగా లేకుండా మీరు వివరించే మీ నైపుణ్యాలు ఎదుటివారిలో భరోసా నింపుతాయి. మీ స్వీయ అవగాహన, నిజాయతీ అవతలివారికి అర్థమవుతుంది. దాంతో బలహీనతలకన్నా, బలాలకు ప్రాధాన్యతనివ్వడం మొదలుపెడతారు. అలాగే తెలియని విషయాలను అర్థంకావేమో అనే స్వీయ అనుమానాన్ని పక్కనపెట్టి మరింత అవగాహన పెంచుకోవడానికి ఆసక్తి చూపించాలి. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను అప్‌డేట్ చేసుకోవడంలో వెనకబడకూడదు. ఇవన్నీ మీ నైపుణ్యాలను మెరుగుపరిచి మిమ్మల్ని మరింత దృఢంగా మారుస్తాయి. అప్పుడు మీ బలాల పక్కన బలహీనతలు చిన్నవిగా కనిపిస్తాయి.

బుజ్జి కుక్కర్ వచ్చేసింది!

ఈ స్మార్ట్ యుగంలో వంట గదిలో ఎక్కువ సమయం ఉండే పరిస్థితి లేదు. అందుకే వంట తొందరగా పూర్తవడం కోసం సరికొత్త వస్తువులు మార్కెట్లోకి వచ్చేశాయి. అవేంటో చూసేయండి...

స్మార్ట కిచెన్

అన్నింటికీ ఒకటే...



సాధారణంగా వంట చేయాలంటే ఒక్కో రకానికి ఒక్కో వస్తువు వాడతాం. లేదంటే కుక్కర్‌లోనే రెండు మూడు రకాలు చేసుకుంటాం కూడా. అయితే, ఒక్కరి కోసం సింపుల్‌గా వండుకోవాలనుకున్నప్పుడు మాత్రం ఆ పెద్ద కుక్కర్ అవసరం ఉండదు. బదులుగా చిన్నగా ఏదైనా వస్తువు ఉంటే బాగుండనిపిస్తుంది. ఈ లోటు భర్తీ చేయడానికి వచ్చిందే 'పోర్టబుల్ కుక్కర్'. ఇది చూడ్డానికి ఓ పెద్ద సైజు గ్లాసులా ఉంటుంది. దీంతో జావ, అన్నం, సూప్‌లు, టీ, నూడుల్స్... వంటివెన్నో తయారుచేసుకోవచ్చు. పోర్టబుల్ కాబట్టి, బయటకు వెళ్లినప్పుడు మనతో తీసుకెళ్లి చక్కగా ఏదైనా ఇందులోనే వండేసుకోవచ్చు. దీన్లో టైమర్ సెట్ చేసుకుని పెట్టేస్తే చాలు. తయారీ గురించి ఆలోచనే అక్కర్లేకుండా సిద్ధమైపోతుంది.



స్టీల్ సబ్బుతోనూ...



మాంసాహారం, గుడ్లు.... లాంటివి వండినప్పుడు మన చేతులు వాసన వస్తుంటాయి కదా! రోజంతా కూడా ఆ అల్లం, వెల్లుల్లి వాసన పోదు. అలాంటి వాసనలు తొలగించుకోవడానికి వచ్చిందే ఈ 'స్టీల్ సోప్'. దీంతో చేతుల్ని 30సెకన్లు రుద్ది కడిగేస్తే సరి. దీనిలోని నెగెటివ్‌లీ ఛార్జ్‌డ్ స్టీల్ సబ్బు... నీటిలోని పాజిటివ్ ఛార్జ్‌డ్ అమైనో యాసిడ్లతో కలిసి తటస్థీకరణ చెంది... చెడు వాసనను పోగొడుతుంది. మొదట దీంతో చేతులు శుభ్రపరచుకున్నాక, కావాలంటే ఏదైనా లిక్విడ్ సోప్‌తో కడిగేసుకోవచ్చు.

క్షణాల్లో తీసేయొచ్చు...



కొన్నిసార్లు సింక్ డ్రెయిన్‌లో ఆహార వృథా చేరుతుంటుంది. దాంతో నీళ్ల పోక ఇబ్బందవుతుంది. అలాంటప్పుడు 'డ్రెయిన్ క్లీనింగ్ పైప్' ఉపయోగపడుతుంది. సన్నగా తీగలా ఉండే దీనికి చివరన గోర్లలాంటి నిర్మాణం ఉంటుంది. దీన్ని డ్రెయిన్‌లోకి పంపించి దానికున్న హ్యాండిల్‌తో లాగేస్తే సరి. పేరుకున్న వ్యర్థాలు ఈజీగా బయటకు వచ్చేస్తాయి. కిచెన్, బాత్‌రూమ్... ఇలా ఏ డ్రెయిన్‌కైనా దీన్ని వాడుకోవచ్చు.



చాంపియన్

ఉదయం 9.30 నుంచి


అశ్విన్


బుమ్రా

బ్యాటర్లు ఫామ్‌లో ఉన్నారు. బౌలర్లూ జోరుమీదున్నారు. బంగ్లాదేశ్‌పై గెలుపుతో స్వదేశంలో వరుసగా 18వ సిరీస్ విజయాన్నందుకోవడం ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తోంది. ఇలా ఎన్నో సానుకూలతల మధ్య సొంతగడ్డపై మరో టెస్టు సిరీస్ సమరానికి సిద్ధమైంది టీమ్‌ఇండియా. న్యూజిలాండ్‌తో తొలి టెస్టు నేటి నుంచే. ఫామ్ లేమితో సతమతమవుతున్న కివీస్‌కు రోహిత్ సేనను నిలువరించడం పెద్ద సవాలే. పిచ్ సీమర్లకు అనుకూలించే అవకాశముంది. బెంగళూరు వాతావరణమే ఆందోళన కలిగిస్తోంది. మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి ఉంది. ఆట సవ్యంగా సాగడం అనుమానంగా మారింది.


రోహిత్ శర్మ

ఎదురుందా?

న్యూజిలాండ్‌తో భారత్ తొలి టెస్టు నేటి నుంచే


లేథమ్

కివీస్ నిలిచేనా..

న్యూజిలాండ్ జట్టు ఇప్పటివరకు ఒక్కసారి కూడా భారత్‌లో టెస్టు సిరీస్ నెగ్గలేదు. ఈసారి కూడా ఆ జట్టుకు కష్టమే. ఆటగాళ్లు సరైన ఫామ్‌లో లేని నేపథ్యంలో కివీస్ ఎలా ఆడుతుందన్నది ఆసక్తికరం. లంకలో స్పిన్‌కు దాసోహమన్న ఆ జట్టు బ్యాటర్లు ఎలా పుంజుకుంటారో చూడాలి. సీనియర్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ ఈ మ్యాచ్‌కు అందుబాటులో లేకపోవడం కివీస్‌కు లోటే. అయితే ఆ జట్టును మరీ తక్కువగా అంచనా వేయడం పొరపాటే అవుతుంది. బెంగళూరులో పరిస్థితులు అనుకూలిస్తే కివీస్ పేసర్లు మ్యాట్ హెన్రీ, ఒరూర్కె, అనుభవజ్ఞుడైన సౌథీ భారత బ్యాటర్లకు సవాలు విసరగలరు.

బెంగళూరు

స్వదేశంలో వరుసగా 19వ టెస్టు సిరీస్ లక్ష్యంగా టీమ్‌ఇండియా పోరుకు సిద్ధమైంది. న్యూజిలాండ్‌తో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి టెస్టు బుధవారం నుంచే. కుర్రాళ్లు, సీనియర్ల మేలుకలయికతో దుర్భేద్యంగా కనిపిస్తోన్న భారత్.. ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. మరోవైపు శ్రీలంక చేతిలో ఓటమితో సన్నగిల్లిన విశ్వాసంతో న్యూజిలాండ్ ఈ సిరీస్‌లో అడుగుపెడుతోంది. డబ్ల్యూటీసీ ఫైనల్లో చోటుపై కన్నేసిన భారత్.. సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఆడాల్సిన ఎనిమిది (ఆసీస్‌తో 5 సహా) టెస్టుల్లో అయిదు గెలిస్తే రోహిత్‌సేన ఎలాంటి సందిగ్ధతకు తావు లేకుండా నేరుగా ఫైనల్లో చోటు సంపాదిస్తుంది. అదే సమయంలో కనీసం మూడు గెలిచినా అవకాశముంటుంది. ఈ నేపథ్యంలో ఆ మూడింటినీ ఇప్పుడే గెలవాలన్నది టీమ్‌ఇండియా తపన. అన్ని విభాగాల్లోనూ బలంగా కనిపిస్తోన్న ఆతిథ్య జట్టును కివీస్ ఎలా నిలువరిస్తుందో చూడాలి.

జట్లు (అంచనా)... భారత్: రోహిత్, యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్/సర్ఫరాజ్, కోహ్లి, పంత్, రాహుల్, జడేజా, అశ్విన్, ఆకాశ్‌దీప్/కుల్‌దీప్, బుమ్రా, సిరాజ్; **న్యూజిలాండ్:** కాన్వే, లేథమ్, విల్ యంగ్, రచిన్ రవీంద్ర, మిచెల్, బ్లండెల్, గ్లెన్ ఫిలిప్స్, బ్రాస్‌వెల్, సౌథీ, అజాజ్, ఒరూర్కె.

జోరుమీద రోహిత్‌సేన

టీమ్‌ఇండియా రెట్టించిన విశ్వాసంతో ఆటకు సిద్ధమైంది. బ్యాటింగ్‌లో కుర్రాళ్ల ఫామ్ ఆ జట్టుకు పెద్ద బలం. శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్ మంచి ఫామ్‌లో ఉన్నారు. ఓపెనర్‌గా కుదురుకుంటోన్న జైస్వాల్.. 189 పరుగులతో బంగ్లాతో సిరీస్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఇందులో మూడు అర్ధశతకాలున్నాయి. ఇక ఓ చక్కని శతకం సాధించిన గిల్.. 164 పరుగులతో జైస్వాల్ తర్వాత రెండో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మరోవైపు పంత్ పునరాగమనంలో అదరగొట్టాడు. సెంచరీతో సత్తా నిరూపించుకున్నాడు. భారీ ఇన్నింగ్స్‌లు ఆడకున్నా రాహుల్ కూడా లయలోనే ఉన్నాడు. సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలే సత్తా చాటాల్సిన అవసరముది. బంగ్లాతో పోరులో వీళ్లు రాణించలేకపోయారు. మరీ ముఖ్యంగా రోహిత్ పరుగుల వేటలో వెనుకబడ్డాడు. నాలుగు ఇన్నింగ్స్‌ల్లో 44 పరుగులే చేశాడు. ఈ కీలక సిరీస్‌లోనైనా ఈ బ్యాటర్లు పరుగుల బాట పడతారని జట్టు ఆశిస్తోంది. గిల్ మెడ పట్టేయడం భారత్‌ను కొంత కలవర పెడుతోంది. ఒకవేళ అతడు మ్యాచ్ సమయానికి ఫిట్‌గా లేకపోతే సర్ఫరాజ్ ఖాన్ జట్టులోకి వస్తాడు. అప్పుడు కేఎల్ రాహుల్... మూడో స్థానంలో ఆడాల్సివుంటుంది. ఇక బౌలింగ్‌లో భారత్ బలంగా ఉంది. స్పిన్‌తో అశ్విన్, జడేజా.. పేస్‌తో బుమ్రా, సిరాజ్ కివీస్‌ను శాసించడానికి సిద్ధమవుతున్నారు. అదనపు స్పిన్నర్ తీసుకోవాలా లేదా మూడో ఫాస్ట్‌బౌలర్‌ను ఆడించాలా అన్నదే ఇప్పుడు టీమ్‌ఇండియా ముందున్న ప్రశ్న. బుధవారం ఉదయం పరిస్థితుల పైనే బౌలింగ్ కూర్పు ఆధారపడి ఉంటుంది.

12

స్వదేశంలో న్యూజిలాండ్‌తో భారత్ ఆడిన టెస్టు సిరీస్‌లు. 10 భారత్ సొంతమయ్యాయి. రెండు డ్రా అయ్యాయి. కివీస్ ఒక్కసారీ సిరీస్ గెలవలేదు.

36

సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో భారత్ తలపడ్డ టెస్టులు. 17 విజయాలు సాధించిన భారత్.. రెండు మ్యాచ్‌ల్లో ఓడింది. 17 మ్యాచ్‌లు డ్రా అయ్యాయి.

పిచ్.. వాతావరణం

టెస్టు మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచింది. ముఖ్యంగా మొదటి రెండు రోజుల ఆటకు తీవ్ర అంతరాయం కలిగే అవకాశముంది. బెంగళూరులో భారీ వర్షం వల్ల మంగళవారం రోహిత్‌సేన ప్రాక్టీస్ సెషన్ కూడా తుడిచిపెట్టుకుపోయింది. అయితే మ్యాచ్ వేదిక చిన్నస్వామి స్టేడియంలో డ్రైనేజ్ సౌకర్యం బాగుండడం ఓ సానుకూలాంశం. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పిచ్ సీమర్లకు అనుకూలించే అవకాశముంది. ఇది కివీస్‌కు సంతోషాన్నిచ్చే విషయమే.

మూడేళ్లుగా ఇదే ఆట


మిథాలీరాజ్

దిల్లీ: గత మూడేళ్లుగా భారత మహిళల క్రికెట్లో ప్రగతి లేదని.. తాజాగా టీ20 ప్రపంచకప్‌లో ప్రదర్శనే ఇందుకు నిదర్శనమని మాజీ కెప్టెన్ మిథాలీరాజ్ పేర్కొంది. సుదీర్ఘ కాలం హర్మన్‌ప్రీత్ కౌర్ సారథిగా ఉన్నా.. ఐసీసీ టోర్నీల్లో జట్టు టైటిల్ గెలవలేకపోతున్న నేపథ్యంలో మిథాలి ఇలా వ్యాఖ్యానించింది. "ఆస్ట్రేలియాతో మ్యాచ్‌లో భారత్ కచ్చితంగా నెగ్గాల్సింది. కానీ ప్రతిసారీ ఆ జట్టుతో ఒకేలా ఆడి ఓడుతున్నాం. చివరి దాకా తెచ్చుకుని ఆఖర్లో విఫలమవుతున్నాం. హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలో గత రెండు మూడేళ్లలో భారత్ ఎలాంటి ప్రగతి సాధించలేదు. బలమైన జట్లను ఓడించడానికే ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి.. కానీ ప్రస్తుత బృందం చిన్న జట్లపై గెలిచి సంతృప్తిపడుతున్నట్లు కనిపిస్తోంది. ప్రతి జట్టూ ఈ విషయంలో ముందుకెళ్తుంటే భారత్ వెనుకబడుతోంది" అని మిథాలి చెప్పింది. టీమ్‌ఇండియాలో స్థిరత్వం లేదని.. ఓపెనింగ్ బాగుంటే మిడిలార్డర్ సరిగా ఆడట్లేదని ఇదే ఓటములకు కారణమవుతుందని మిథాలీ తెలిపింది. "ఓపెనర్లు సత్తా చాటాలని అనుకుంటాం. షెఫాలి దూకుడుగా ఆడాలని కోరుకుంటాం. కానీ కొన్ని సందర్భాల్లో మాత్రమే ఈ ఆశ నెరవేరుతుంది. ఓపెనర్లు బాగా ఆడితే మిడిలార్డర్ విఫలమవుతుంది. మిడిలార్డర్ గాడిలో పడితే ఓపెనింగ్ బాగుండట్లేదు. ఏళ్ల తరబడి ఇదే కథ. జట్టు కూర్పు కూడా ప్రపంచకప్‌లో భారత్‌ను దెబ్బ తీసిన అంశాల్లో ఒకటి. రిజర్వ్ బెంచ్‌ను పరీక్షించాల్సిన సమయం వచ్చింది. చిన్న జట్లతో ఆడుతున్నప్పుడు కొన్ని ప్రయోగాలు చేసి కూర్పుపై ఒక అవగాహనకు రావాలి. నేనైతే భారత్‌కు యువ కెప్టెన్ ఉండాలని కోరుకుంటున్నాను. ఈ విషయంపై సెలక్టర్లే నిర్ణయం తీసుకోవాలి" అని మిథాలి పేర్కొంది.

ఇంగ్లాండ్ ఇంటికి

మహిళల టీ20 ప్రపంచకప్

సెమీస్‌లో విండీస్, దక్షిణాఫ్రికా

దుబాయ్

మహిళల టీ20 ప్రపంచకప్‌లో గ్రూప్-బిలో అగ్రస్థానంలో ఉన్న ఇంగ్లాండ్‌కు దిమ్మదిరిగే షాక్. చివరి మ్యాచ్‌లో ఆ జట్టును 6 వికెట్ల తేడాతో మట్టికరిపించిన వెస్టిండీస్ అగ్రస్థానంతో సెమీస్‌కు దూసుకెళ్లడమే కాక.. ఇంగ్లాండ్‌ను ఇంటిముఖం పట్టించింది. 142 పరుగుల లక్ష్యాన్ని విండీస్ 2 ఓవర్లుండగానే 4 వికెట్లు కోల్పోయి ఛేదించడంతో నెట్‌రన్‌రేట్‌లో ఇంగ్లాండ్ వెనుకబడింది. విండీస్ ఘనవిజయం దక్షిణాఫ్రికాకు కలిసొచ్చి.. నెట్ రన్‌రేట్‌లో ఇంగ్లాండ్‌ను అధిగమించి సెమీస్ బెర్తును దక్కించుకుంది. మంగళవారం మొదట ఇంగ్లాండ్ 7 వికెట్లకు 141 పరుగులు చేసింది. నాట్ సీవర్ (57 నాటౌట్; 50 బంతుల్లో 5×4) టాప్ స్కోరర్. హెదర్ నైట్ (21) కూడా రాణించింది. అఫీ ఫ్లెచర్ (3/21), కెప్టెన్ హేలీ మాథ్యూస్ (2/35) ప్రత్యర్థిని కట్టడి చేశారు. ఛేదనలో ఓపెనర్లు హేలీ (50; 38 బంతుల్లో 7×4, 1×6), కియానా జోసెఫ్ (52; 38 బంతుల్లో 6×4, 2×6) మెరుపు అర్ధసెంచరీలతో విండీస్ 18 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఈ గ్రూప్‌లో వెస్టిండీస్, దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్ ఆరేసి పాయింట్లతో నిలిచినా.. మెరుగైన రన్‌రేట్‌తో విండీస్, దక్షిణాఫ్రికా నాకౌట్ చేరాయి.

ఛేదనలో దూకుడు: బలమైన బ్యాటింగ్ లైనప్ ఉన్న ఇంగ్లాండ్‌ను విండీస్ బౌలర్లు కట్టడి చేయడంతో.. కరీబియన్ జట్టుకు కూడా ఛేదన కష్టమే అనిపించింది. కానీ ఎదురుదాడికి దిగిన హేలీ మాథ్యూస్, కియానా ఇంగ్లాండ్ బౌలర్లకు అవకాశం లేకుండా చేశారు. ఈ జంట తొలి వికెట్‌కు 12.1 ఓవర్లలో 102 పరుగులు జత చేసి విండీస్‌కు బలమైన పునాది వేసింది. వీళ్లిద్దరూ స్వల్ప తేడాతో ఔటైనా.. దూకుడుగా ఆడిన డాటిన్ (27; 19 బంతుల్లో 2×4, 2×6) విండీస్‌ను విజయపథంలో నడిపించింది. కరీబియన్ జట్టు మరో 12 బంతులు ఉండగానే విజయతీరాన్ని చేరింది. అంతకుముందు ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌లో పెద్దగా మెరుపుల్లేవు. విండీస్ స్పిన్నర్ల ధాటికి క్రమం తప్పకుండా వికెట్లు చేజార్చుకున్న ఆ జట్టు కుప్పకూలుతుందేమో అనిపించింది. కానీ నాట్ సీవర్ సత్తా చాటడంతో మెరుగైన స్కోరు చేయగలిగింది.


కియానా హేలీ

ఇంగ్లాండ్: 141/7 (నాట్ సీవర్ 57 నాటౌట్, హెదర్ నైట్ 21; అఫీ ఫ్లెచర్ 3/21, హేలీ మాథ్యూస్ 2/35) **వెస్టిండీస్:** 142/4 (హేలీ 50, కియానా జోసెఫ్ 52, డాటిన్ 27; సారా గ్లెన్ 1/20, సోఫీ ఎకిల్‌స్టోన్ 1/21, నాట్ సీవర్ 1/33)

సెమీస్‌లో ఎవరితో ఎవరు

ఆస్ట్రేలియా × దక్షిణాఫ్రికా (గురువారం)
న్యూజిలాండ్ × వెస్టిండీస్ (శుక్రవారం)

షమి... ఆసీస్ పర్యటనకూ ఉండడు!


రోహిత్

బెంగళూరు

ఫాస్ట్‌బౌలర్ షమి ఆటకు దూరమై చాలా కాలమే అయింది. నిరుడు వన్డే ప్రపంచకప్ తర్వాత అతడు మళ్లీ మైదానంలో అడుగుపెట్టలేదు. చీలమండకు శస్త్రచికిత్స చేయించుకున్న షమి కోలుకుంటున్నాడు. షమి న్యూజిలాండ్‌తో సిరీస్‌లో ఆడతాడని అంతా భావించారు. కానీ అది సాధ్యం కాలేదు. అభిమానులకు నిరాశ కలిగించే విషయమేంటంటే.. పూర్తిగా కోలుకోని అతడు ఆస్ట్రేలియా పర్యటనకు కూడా దాదాపుగా దూరమైనట్లే. స్వయంగా కెప్టెన్ రోహిత్ శర్మే ఈ విషయం చెప్పాడు. పూర్తిగా కోలుకోని అతణ్ని బోర్డర్-గావస్కర్ సిరీస్‌లో ఆడించలేమని స్పష్టం చేశాడు. "నిజాయితీగా చెప్పాలంటే ప్రస్తుతం షమి విషయంలో నిర్ణయం తీసుకోవడం చాలా కష్టం. ఆస్ట్రేలియాతో సిరీస్‌కు అతడు ఫిట్‌గా ఉంటాడా లేదా అన్నది చెప్పలేం. ఇటీవల అతడి మోకాలిలో వాపు వచ్చింది. సాధారణంగా ఇలా జరగదు" అని తొలి టెస్టు నేపథ్యంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో రోహిత్ చెప్పాడు. "షమి నూరు శాతం ఫిట్‌నెస్ సాధించే క్రమంలో ఉన్నాడు. మోకాలి వాపు వల్ల అతడు కోలుకోవడం కాస్త ఆలస్యమవుతోంది. ప్రస్తుతం షమి ఎన్‌సీఏలో ఉన్నాడు. ఫిజియోలు, వైద్యులు అతడికి సహకరిస్తున్నారు. అతడు వంద శాతం ఫిట్‌నెస్ సాధించాలని మేం కోరుకుంటున్నాం. సరిగా కోలుకోని అతణ్ని ఆస్ట్రేలియాకు తీసుకెళ్లాలనుకోవట్లేదు. అలా తీసుకెళ్లడం మంచిది కాదు" అని వివరించాడు. అంతర్జాతీయ క్రికెట్ ఆడడానికి ముందు షమి కొన్ని ప్రాక్టీస్ మ్యాచ్‌ల్లో ఆడతాడని రోహిత్ తెలిపాడు.

జైస్వాల్ సంతృప్తిగా లేడు: యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్ టెస్టు క్రికెట్లో గొప్పగా రాణిస్తుండడం తనకేమీ ఆశ్చర్యం కలిగించట్లేదని రోహిత్ అన్నాడు. జైస్వాల్ ఇప్పటివరకు 11 టెస్టుల్లో 64.05 సగటుతో 1217 పరుగులు చేశాడు. అయితే ఇప్పటివరకు తాను సాధించినదాని పట్ల జైస్వాల్ సంతోషంగా లేడని రోహిత్ చెప్పాడు. "జైస్వాల్ ఆట నాకేమీ ఆశ్చర్యాన్ని కలిగించట్లేదు. ఎందుకంటే అతడు చాలా ప్రతిభావంతుడు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా రాణించే నైపుణ్యంలో అతడిలో ఉంది. అంతర్జాతీయ క్రికెట్లో విజయవంతం కావడానికి అవసరమైన లక్షణాలన్నీ జైస్వాల్‌లో ఉన్నాయి. అతడెప్పుడూ తన ఆటను మెరుగుపర్చుకోవాలని తపిస్తూ ఉంటాడు. కెరీర్‌ను గొప్పగా ఆరంభించిన అతడు ఇప్పటివరకు తాను సాధించిన దాంతో సంతోషంగా లేడు. గత ఏడాదిగా చేస్తున్న మెరుగైన ప్రదర్శను జైస్వాల్ కొనసాగిస్తాడని ఆశిస్తున్నా" అని అన్నాడు.

పేస్ బౌలింగ్ బెంచ్ బలం పెరగాలి: భారత పేస్ బౌలింగ్ బెంచ్ బలం పెరగాలని, కొందరిపైనే ఆధారపడాలనుకోవట్లేదని రోహిత్ అన్నాడు. "బ్యాటింగ్‌లో భారత్‌కు చాలా ప్రత్యామ్నాయాలున్నాయి. బౌలింగ్‌లోనూ అలాంటి ప్రత్యామ్నాయాలను సృష్టించాలనుకుటున్నాం. బెంచ్ బలాన్ని పెంచాలనుకుంటున్నాం. అప్పుడు ఎవరికి ఏదైనా జరిగినా ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదు. కొందరిపైనే మేం అతిగా ఆధారపడాలని అనుకోవట్లేదు. భవిష్యత్తుపై దృష్టి పెట్టాలి" అని చెప్పాడు.

బుమ్రా ఎప్పట్నుంచో..: న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్‌కు బుమ్రాను వైస్‌కెప్టెన్‌గా నియమించడం సరైన నిర్ణయమని రోహిత్ అభిప్రాయపడ్డాడు. అతడు నాయకత్వ బృందంలో అంతర్భాగమని, ఆటపై చాలా అవగాహన ఉందని అన్నాడు. "బుమ్రా చాలా క్రికెట్ ఆడాడు. అతడితో కలిసి నేను చాలా క్రికెట్ ఆడా. ఆటను బుమ్రా బాగా అర్థం చేసుకుంటాడు. ఎప్పటి నుంచో అతడు జట్టు నాయకత్వ బృందంలో ఉన్నాడు. అవసరమైనప్పుడు నాయకుడిగా వ్యవహరిస్తాడు" అని రోహిత్ చెప్పాడు.


హతురుసింఘపై బంగ్లా వేటు


హతురుసింఘ

ఢాకా: బంగ్లాదేశ్ చీఫ్ కోచ్ చండిక హతురుసింఘ (శ్రీలంక)పై ఆ దేశ క్రికెట్ బోర్డు (బీసీబీ) వేటువేసింది. నిరుడు భారత్‌లో జరిగిన వన్డే ప్రపంచకప్‌లో అనుచిత ప్రవర్తనకు గాను హతురుసింఘను సస్పెండ్ చేసినట్లు మంగళవారం బీసీబీ ప్రకటించింది. ఇటీవల భారత పర్యటనలో టెస్టు, వన్డే సిరీస్‌లలో వైట్‌వాష్ పరాజయాన్ని మూటగట్టుకున్న బంగ్లాకు హతురుసింఘ కోచ్‌గా వ్యవహరించాడు. హతురుసింఘ స్థానంలో వెస్టిండీస్ మాజీ ఆటగాడు ఫిల్ సిమన్స్‌కు చీఫ్ కోచ్‌గా బీసీబీ ఎంపిక చేసింది. "ప్రపంచకప్‌లో ఒక ఆటగాడిని చెంపదెబ్బ కొట్టినట్టు ఆరోపణల నేపథ్యంలో బంగ్లా చీఫ్ కోచ్ హతురుసింఘను సస్పెండ్ చేశాం. 48 గంటల సస్పెన్షన్ తర్వాత అతని కాంట్రాక్టు రద్దవుతుంది. వచ్చే ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీ వరకు ఫిల్ సిమన్స్ (వెస్టిండీస్) చీఫ్ కోచ్‌గా వ్యవహరిస్తాడు" అని బీసీబీ పేర్కొంది. చెంపదెబ్బ ఆరోపణలపై బీసీబీ విచారణ కొనసాగుతుంది.

గులామ్ సెంచరీ

పాకిస్థాన్ 259/5


కమ్రాన్ గులామ్

ముల్తాన్: ఇంగ్లాండ్‌తో తొలి టెస్టులో మొదటి ఇన్నింగ్స్‌లో 500పైన పరుగులు చేసినా.. చిత్తుగా ఓడిన ఆతిథ్య పాకిస్థాన్ రెండో టెస్టును సానుకూలంగా ప్రారంభించింది. తొలి రోజు, మంగళవారం ఆట చివరికి మొదటి ఇన్నింగ్స్‌లో 259/5తో నిలిచింది. వరుస వైఫల్యాలతో జట్టుకు దూరమైన బాబర్ అజామ్ స్థానంలో జట్టులో చోటు దక్కించుకున్న కమ్రాన్ గులామ్ (118; 224 బంతుల్లో 11×4, 1×6) అరంగేట్రంలోనే శతకంతో అదరగొట్టాడు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పాక్ ఆరంభంలోనే 19/2తో తడబడింది. అబ్దుల్ షఫీక్ (7), కెప్టెన్ షాన్ మసూద్ (3) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. ఈ రెండు వికెట్లు స్పిన్నర్ జాక్ లీచ్ (2/92) ఖాతాలోకి వెళ్లాయి. ఈ స్థితిలో సయీమ్ ఆయూబ్ (77), రిజ్వాన్ (37 బ్యాటింగ్)తో కలిసి గులామ్ పాక్ స్కోరును 200 దాటించాడు. సెంచరీ చేసిన అతను కాసేపట్లో ఆట ముగుస్తుందనగా బషీర్ బౌలింగ్‌లో బౌల్డ్ అయ్యాడు. ఆట చివరికి రిజ్వాన్, సల్మాన్ (5) క్రీజులో ఉన్నారు. గాయం నుంచి కోలుకున్న ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్‌స్టోక్స్ ఈ మ్యాచ్‌తో పునరాగమనం చేయగా.. బాబర్ అజామ్, షహీన్ అఫ్రిది లాంటి స్టార్లు లేకుండానే పాక్ బరిలో దిగింది.

లంకదే రెండో టీ20

దంబుల్లా: వెస్టిండీస్‌తో మూడు టీ20ల సిరీస్‌ను ఆతిథ్య శ్రీలంక 1-1తో సమం చేసింది. మంగళవారం ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో 73 పరుగుల తేడాతో విండీస్‌ను చిత్తు చేసింది. మొదట లంక 162/5 స్కోరు చేసింది. నిశాంక (54; 49 బంతుల్లో 9×4, 1×6) సత్తా చాటాడు. షమార్ జోసెఫ్ వేసిన ఇన్నింగ్స్ నాలుగో ఓవర్లో అతడు ఆరు బౌండరీలు సాధించాడు. కుశాల్ మెండిస్ (26), కుశాల్ పెరీరా (25) కూడా రాణించారు. ఛేదనలో వెల్లలాగె (3/9), తీక్షణ (2/7), అసలంక (2/6), హసరంగ (2/32)ల ధాటికి విండీస్ 16.1 ఓవర్లలో 89కే కుప్పకూలింది. రోమన్ పావెల్ (20) టాప్ స్కోరర్.

సోనమ్‌కు రజతం

దిల్లీ: ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్ ఫైనల్లో భారత యువ క్రీడాకారిణి సోనమ్ మస్కర్ సత్తాచాటింది. మంగళవారం ప్రారంభమైన ఈ టోర్నీలో సోనమ్ రజత పతకం సాధించింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్లో సోనమ్ (252.9) ద్వితీయ స్థానంలో నిలిచింది. పారిస్ ఒలింపిక్స్ రన్నరప్ హువాంగ్ యుటింగ్ (254.5- చైనా) పసిడి నెగ్గింది. ఎనిమిది మంది బరిలో దిగిన ఫైనల్లో మరో భారత క్రీడాకారిణి తిలోత్తమ సేన్ ఆరో స్థానంలో నిలిచింది. పురుషుల 10 మీ ఎయిర్ రైఫిల్‌లో అర్జున్ బబుతా అయిదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. మహిళల 10 మీ ఎయిర్ పిస్టల్‌లో నాలుగో స్థానం సాధించిన రిథమ్ సాంగ్వాన్‌కు త్రుటిలో కాంస్యం చేజారింది.

సింధు ముందంజ

ఒడెన్స్: డెన్మార్క్ ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ షట్లర్ పి.వి.సింధు శుభారంభం చేసింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో ఆమె 21-8, 13-7తో ఆధిక్యంలో ఉన్న దశలో ప్రత్యర్థి యు పో (చైనీస్ తైపీ) గాయంతో మ్యాచ్ నుంచి వైదొలిగింది. ఆకర్షి 13-21, 12-21తో సుపనిద (థాయ్‌లాండ్) చేతిలో, మాళవిక 13-21, 12తో నుయెన్ లిన్ (వియత్నాం) చేతిలో పరాజయం చవిచూశారు. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ కూడా తొలి రౌండ్లోనే నిష్క్రమించాడు. అతను 21-12, 19-21, 14-21తో గ్వాంగ్ జు (చైనా) చేతిలో ఓడాడు. మహిళల డబుల్స్ తొలి రౌండ్లో రుతుపర్ణ పాండా- శ్వేతపర్ణ పాండా జోడీ 18-21, 22-24తో చాంగ్ చింగ్- యాంగ్ చింగ్ (చైనీస్ తైపీ) జంట చేతిలో ఓడింది.

వరదల్లో భద్రత కోసం 'యాప్'

- వర్షాలు, విపత్తులపై ఎప్పటికప్పుడు సంకేతాలు
- ఐఎండీతో కలిసి తమిళనాడు వినూత్న ప్రయోగం



చెన్నైలో వరదముప్పు ప్రాంతాల్ని గుర్తించేలా యాప్‌లో హెచ్చరికలు

ఈనాడు–చెన్నై: తరచూ తుపాన్లు, వాయుగుండాల వంటి విపత్తులను ఎదుర్కొనే చెన్నై, తమిళనాడులోని ఇతర జిల్లాల్లోని ప్రజల్ని కాపాడేందుకు, వారికివారు రక్షణ పొందేందుకు తమిళనాడు ప్రభుత్వం ప్రత్యేకం ఏర్పాట్లు చేసింది. 'టీఎన్ అలర్ట్' అనే యాప్ రూపొందించింది. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) సహకారంతో కాలనీలవాసులను సైతం అప్రమత్తం చేస్తోంది. దీంతో డౌన్‌లోడ్లు బాగా పెరుగుతున్నాయి. చెన్నైలో ముంపునకు గురయ్యే ప్రాంతాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వరద ప్రభావంపై హెచ్చరికలు అందుతున్నాయి.

మొబైల్‌కు సందేశాలు..

✦ 24 గంటల్లో ఏ సమయంలో వర్షం ఎలా ఉంటుందనే అంచనాలు ప్రాంతాలవారీగా ఇస్తున్నారు. రానున్న 3 గంటల్లో ఉరుములు, మెరుపులు, వర్షసూచనపై నోటిఫికేషన్లు మొబైల్స్‌కు వచ్చేలా చేస్తున్నారు.

✦ వర్ష తీవ్రత ఏ స్థాయిలో ఉందో తెలిపేలా ఆకుపచ్చ, పసుపు, నారింజ, ఎరుపు రంగుల్లో హెచ్చరికలు ఇస్తున్నారు. ఇంకోవైపు ఆటోమేటిక్ రెయిన్‌గేజ్ స్టేషన్ల ద్వారా నమోదైన వర్షపాతం తెలుసుకునేలా చేస్తున్నారు.

✦ రానున్న 8, 9 రోజుల్లో వర్షపాతం పరిస్థితులపై నియోజకవర్గాలవారీగా వివరాలు అందిస్తున్నారు. ఏ రోజు ఎలా ఉండబోతుందనేది గ్రాఫిక్‌రూపకంగా యాప్‌లో పొందుపరుస్తున్నారు. జీపీఎస్ ద్వారా తామున్న ప్రాంతంతోపాటు రాష్ట్రంలోని ఇతర ప్రదేశాల గురించి తెలుసుకునే సౌకర్యం ఇందులో ఉంది. భారీ, అతిభారీ వర్షాల సమయంలో చుట్టుపక్కల ముంపు ప్రభావమున్న ప్రాంతాలను తెలుసుకునే వెసులుబాటును చెన్నైవాసులకు ఈ యాప్ ద్వారా కల్పించారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా వరద ముప్పు ఉన్న రిజర్వాయర్లను మ్యాపింగ్ చేశారు.

వర్షం, వరద ప్రభావాలపై ఫిర్యాదులకు అవకాశం కల్పించారు. అత్యవసరంగా సహాయం కావాలనుకునేవారు అధికారులకు పంపేలా ఆప్షన్ ఇచ్చారు. ఫొటోలు జోడించి పంపొచ్చు. హెల్ప్‌లైన్ కేంద్రాల్ని యాప్‌కు అనుసంధానించారు. ఫోన్ నంబర్లు వెతుక్కోకుండా జిల్లాల వారీగా అందుబాటులో ఉంచారు. కాల్‌సెంటర్‌లో ప్రజలకు మార్గనిర్దేశం చేసేందుకు 150 మంది వరకు అధికారుల్ని నియమించారు.

బిల్లుల మంజూరుకు వినతుల వెల్లువ

ఈనాడు, హైదరాబాద్: తన కుమారుడి ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బు కోసం ఏడాది నుంచి తిరుగుతున్నానని ఓ పేద తండ్రి ఆవేదన.. రోడ్డు నిర్మాణం పూర్తి చేసినా బిల్లు మంజూరు చేయడం లేదని చెక్కులు చూపిస్తూ ఓ గుత్తేదారుడి నివేదన.. ఉద్యోగ విరమణ తరువాత తమకు రావాల్సిన డబ్బులు ఇంకెప్పుడు ఇస్తారని వృద్ధుల నిలదీత.. చిన్నపాటి పెండింగ్ బిల్లుల సొమ్ము కోసం ఎన్నిసార్లు తిరగాలని ఉద్యోగుల నిట్టూర్పు.. ఇలా పదుల సంఖ్యలో బాధితులు మంగళవారం సచివాలయంలోని ఆర్థికశాఖ కార్యాలయం వద్ద వరుస కట్టారు. శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును కలిసి విన్నవించేందుకు గంటల తరబడి వేచి ఉన్నారు. ఏడాది, రెండేళ్లయినా బిల్లు మంజూరు కాలేదని పలువురు వారి టోకెన్ వివరాలను చూపి ఆయనకు మొరపెట్టుకున్నారు. కానీ ఎప్పటిలానే పరిశీలించి మంజూరు చేస్తామని చెప్పి వారిని పంపించారు. నిధుల కొరత వల్లే బిల్లులకు సొమ్ములు విడుదల చేయలేకపోతున్నట్లు ఆర్థికశాఖ వర్గాలు తెలిపాయి.


సచివాలయంలోని ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఛాంబర్ వద్ద వరుసలో నిల్చున్న బాధితులు

మరణించినా రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రాలేదు



నా స్నేహితుడు రోడ్లు, భవనాల శాఖలో పనిచేసిన పదవీ విరమణ పొందారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కోసం తిరుగుతుండగానే గత జులై 23న మరణించారు. అయినా ఇప్పటికీ అతని గ్రాట్యుటీ, పింఛను సొమ్ము విడుదల కాలేదు. నా స్నేహితుడి కూతుళ్లకు సచివాలయంలో ఎవరిని కలవాలో తెలియక నాకు టోకెన్ వివరాలు ఇచ్చి పంపడంతో అధికారులను కలిసి విన్నవించేందుకు వచ్చాను.

భార్య వైద్య బిల్లు కోసం ఏడాదిగా తిరుగుతున్నా



నేను జైళ్ల శాఖలో రిటైర్డ్ ఉద్యోగిని. నా భార్య వైద్యం కోసం చేసిన ఖర్చుల బిల్లుల మంజూరు కోసం ఏడాదిగా తిరుగుతున్నాను. టోకెన్ నంబరు ఇచ్చినా సొమ్ము విడుదల కావడం లేదు. ప్రతిసారి కరీంనగర్ నుంచి సచివాలయానికి రావడం ఇబ్బందిగా ఉంది.

ఐడీసీ భవిష్యత్తు కార్యాచరణ ఏంటి..?

- రాష్ట్రంలో లోపభూయిష్టంగా చిన్న తరహా ఎత్తిపోతల పథకాల నిర్వహణ
- రేపు బోర్డు సమావేశం


కుమురం భీం జిల్లా కౌటాలలో మూలకు చేరిన తుమ్మిడిహెట్టి ఎత్తిపోతల పథకం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో చిన్న తరహా ఎత్తిపోతల పథకాల నిర్వహణ తీసికట్టుగా మారింది. ఎక్కడికక్కడ నిధుల లేమి, నిర్వహణ, పర్యవేక్షణ లోపాలు కనిపిస్తున్నాయి. మేజర్ ప్రాజెక్టులు, ఎత్తిపోతలల నుంచి సాగునీరందని ఆయకట్టు పర్యవేక్షణ బాధ్యతను నీటిపారుదల అభివృద్ధి సంస్థ (ఐడీసీ) తీసుకుని చిన్న తరహా ఎత్తిపోతల పథకాలు నిర్మించింది. తెలంగాణ ఏర్పాటు అనంతరం తొలినాళ్లలో ఇవి బాగానే పనిచేశాయి. 2020లో శాఖ పునర్ వ్యవస్థీకరణతో చోటుచేసుకున్న సమస్యలు ఐడీసీని ఊపిరాడకుండా చేశాయి. ఇటీవల సంస్థకు విజయ్‌బాబు అధ్యక్షుడిగా నియామకమయ్యారు. ఈ నేపథ్యంలో గురువారం బోర్డు సమావేశం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఉన్న ప్రధాన కార్యాలయంలో జరగనుంది. ఇందులో ఐడీసీ భవిష్యత్ ప్రణాళికలు చర్చించే అవకాశం ఉంది.

పునర్ వ్యవస్థీకరణతో..

తెలంగాణ ఏర్పాటు తరువాత రాష్ట్ర పరిధిలోకి 643 చిన్న తరహా పథకాలు రాగా ప్రస్తుతం అందులో 221 మాత్రమే పని చేస్తున్నాయి. వీటి ద్వారా 1.25 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోంది. ఈ పథకాల్లోనూ చాలా వాటికి మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. పథకాలన్నీ సవ్యంగా నడవాలంటే కనీసం రూ.700 కోట్ల నిధుల కేటాయింపు చేయాలన్న అంచనాలు ఉన్నాయి. రాష్ట్రంలో రూ.723 కోట్లతో 37 కొత్త పథకాలు నిర్మాణంలో ఉన్నాయి. ఇవి పూర్తయితే కనీసం లక్ష ఎకరాల ఆయకట్టు సాగులోకి రానుంది. 2020కి ముందు నీటిపారుదల శాఖ పరిధిలోనే ఉన్నప్పటికీ ఐడీసీ స్వతంత్ర సంస్థగా ఉండేది. నిధుల కేటాయింపు, వ్యయం, ప్రణాళికలు, అమలు అటానమస్‌గా జరిగేవి. శాఖ పునర్ వ్యవస్థీకరణ అనంతరం ఐడీసీని విలీనం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 19 నీటిపారుదల సర్కిళ్ల పరిధిలోకి ఐడీసీ ఎత్తిపోతల పథకాలను తీసుకొచ్చారు. ఏ నిర్ణయమైనా సర్కిల్ సీఈ తీసుకుంటే తప్ప అమలు జరిగే పరిస్థితి లేదు. భారీ, మధ్య తరహా ప్రాజెక్టుల పర్యవేక్షణతోనే నీటిపారుదల ఇంజినీర్లకు తీరికలేకుండా ఉంది. దీంతో చిన్న ప్రాజెక్టుల పర్యవేక్షణ తీసికట్టుగా మారింది. ఈ నేపథ్యంలో తిరిగి ఐడీసీని స్వతంత్రంగా మార్చాలన్న డిమాండ్ ఉంది. ఈ పథకాల నిర్వహణకు ఇంజినీర్ల బృందాలను ఏర్పాటు చేయాలని మంత్రి ఉత్తమ్ నిర్ణయించి అధ్యయనానికి కమిటీని కూడా ఏర్పాటు చేశారు. కమిటీ నివేదికపై చర్చ మాత్రం జరగలేదు.

మీరు ఎవరితో ఎక్కువగా ఉంటున్నారు?



మీరు ఎవరితో ఎక్కువ సమయం గడుపుతున్నారన్నది చాలా చాలా ముఖ్యం. ఐదుగురు కోటీశ్వరులను ఎక్కువ సేపు కలుస్తూ ఉంటే.. మీరు ఆరో కోటీశ్వరుడిగా ఎదుగుతారు. ఐదుగురు ధైర్యవంతులతో అధిక సమయం ఉంటే.. ఆరో ధైర్యవంతుడిగా మారుతారు. ఐదుగురు తెలివైన వారితో ఉంటే.. ఆరో వివేకిగా పరిణతి చెందుతారు. ఒకవేళ ఐదుగురు మూర్ఖులతో ఎక్కువ సేపు గడుపుతున్నట్లయితే.. మీరు ఆరో మూర్ఖుడిగా తయారవుతారు.

– అభిజీత్ భోక్సే, ఇన్వెస్ట్‌మెంట్ నిపుణుడు


హైదరాబాద్‌లో ఎస్ఈఐ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్


మంత్రి శ్రీధర్‌బాబుతో ఎస్ఈఐ ప్రతినిధులు

ఈనాడు, హైదరాబాద్: ఆర్థిక రంగానికి చెందిన మరో అంతర్జాతీయ దిగ్గజ సంస్థ 'ఎస్ఈఐ' హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్(జీసీసీ)ను స్థాపించడానికి సంసిద్ధత వ్యక్తంచేసింది. ఇక్కడ జీసీసీ ఏర్పాటు ద్వారా వచ్చే మూడేళ్లలో నైపుణ్యం కలిగిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, ఆర్థిక రంగ నిపుణులకు సుమారు 1000కి పైగా ఉద్యోగాలు లభిస్తాయని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటించారు. ఎస్ఈఐ సంస్థ ప్రతినిధులు సచివాలయంలో మంగళవారం మంత్రి శ్రీధర్‌బాబుతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అనుకూలతలను మంత్రి వారికి వివరించారు. "బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, బీమా రంగాల్లో తెలంగాణ హబ్‌గా మారాలనేది ప్రభుత్వ లక్ష్యం. రాష్ట్రంలో ఇప్పటికే ఈ రంగంలో దిగ్గజ సంస్థలైన బ్యాంక్ ఆఫ్ అమెరికా, జేపీ మోర్గాన్, గోల్డ్‌మన్ సాక్స్, మోర్గాన్ స్టాన్లీ, వెల్స్ ఫార్గో తదితర కంపెనీలు తమ జీసీసీలను నెలకొల్పాయి. రాష్ట్రంలో ఇటీవల ప్రారంభించిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలోనూ బ్యాంకింగ్, ఫైనాన్షియల్, బీమా రంగాలకు సంబంధించిన కోర్సులను ప్రారంభించాం. తద్వారా తెలంగాణలో ఈ రంగాల్లో నిపుణులు సమృద్ధిగా అందుబాటులో వస్తారు. సంబంధిత రంగాల్లో నిపుణులను అందించడం ద్వారా అంతర్జాతీయ పెట్టుబడులను రాష్ట్రానికి ఆహ్వానించడం, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం మా ప్రధాన ధ్యేయం. ప్రభుత్వం అన్ని రకాలుగా సహకారం అందిస్తుంది" అని మంత్రి వివరించారు. ఎస్ఈఐ ప్రతినిధులు మాట్లాడుతూ.. "మా సంస్థలో ప్రపంచవ్యాప్తంగా అయిదు వేల మందికి పైగా ఉద్యోగులు సేవలందిస్తున్నారు. హైదరాబాద్‌లో జీసీసీని ప్రారంభించడాన్ని వ్యూహాత్మక పెట్టుబడిగా భావిస్తున్నాం. బ్యాంకింగ్, ఫైనాన్సింగ్, బీమా రంగాల్లో సేవలకు తెలంగాణలో అనుకూల వాతావరణం ఉంది. ఇక్కడ నెలకొల్పనున్న మా గ్లోబల్ కేంద్రం.. డిజిటల్ ఇంజినీరింగ్‌కు మద్దతు ఇవ్వడంలో కీలక పాత్ర పోషిస్తుంది" అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎస్ఈఐ సంస్థ ప్రతినిధులు జాచరీ ఉమాక్, డేవిడ్ లాంగ్‌డేల్, భరద్వాజ్, మీనాక్షి మీల్, షానూ మనియార్, ఐటీ శాఖ సలహాదారు సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గట్టిమేలు తలపెడదాం గట్టెక్కించి నిలబెడదాం!

నెలన్నర కిందట వచ్చిన వర్షాలకు ఎంతో మంది బాధితులు సర్వస్వం కోల్పోయారు. నిత్యావసరాలు మొదలు రోజువారీ ఉపాధికి దూరమైన వారు ఎందరో! వారందరినీ గట్టెక్కించేందుకు ప్రభుత్వంతో పాటు మానవత్వంతో వివిధ సంస్థలు, వ్యక్తులూ ముందుకొస్తున్నారు.


దివ్వెల హరి శ్రీనివాస్, హైదరాబాద్
విరాళం: రూ.2,00,000

తెలుగు రాష్ట్రాల్లోని వరద బాధితులకు అండగా నిలిచేందుకు రామోజీ గ్రూపు తరఫున రూ.5 కోట్లతో ఏర్పాటు చేసిన 'ఈనాడు సహాయ నిధి'కి ఉదారంగా విరాళాలు ఇస్తున్న దాతలకు కృతజ్ఞతలు. ఈనాడు పిలుపు అందుకొని స్పందిస్తున్న సహృదయుల వివరాలు..

ఈనాడు సహాయనిధికి విరాళాలిచ్చిన దాతలు

వ్యక్తులు / సంస్థలు	సాయం (రూ.లలో)
ఎం.వేదవతి, హైదరాబాద్	2,01,116
కొత్త ప్రమీల (కీ.శే.కొత్త రాములు గారి జ్ఞాపకార్థం), హైదరాబాద్	50,000
పొన్నమనేని నిరంజనరావు, కాగజ్‌నగర్, కుమురం భీం జిల్లా	26,000
కట్నేని సీతారామమ్మ, సికింద్రాబాద్	11,111
సిరిపురపు సాంబశివరావు, అచ్చియ్యపేట, తూర్పుగోదావరి జిల్లా	10,500
కోనేరు రవీంద్రనాథ్‌ఠాగూర్, విజయవాడ	10,116
మంగు సత్య వీర వెంకటేశ్వరరావు, గుంతకల్లు, అనంతపురం జిల్లా	10,001
సి.చెన్నకేశవరావు, హైదరాబాద్	10,000
వెంకట యోగ సంపత్‌కుమార్, సికింద్రాబాద్	10,000
దాట్ల ఆదర్శ్ వర్మ, దాట్ల సాయినాథ్ వర్మ, విశాఖపట్నం	5,116
కొటమల భోగయ్య (విశ్రాంత సైనికోద్యోగి), రామచంద్రాపురం, సంగారెడ్డి జిల్లా	5,116
శ్రీ గాయత్రి వయోవృద్ధుల సంఘం, కరీంనగర్	5,016
తోట సూర్యనారాయణ, విజయవాడ	5,000
రుద్రరాజు వెంకట సూర్యనారాయణరాజు, గణపవరం, పశ్చిమ గోదావరి జిల్లా	5,000
నాగళ్ల రాంబాబు, హైదరాబాద్	5,000
డా.ఆకృతి కోదండరామయ్య, విజయవాడ	5,000
ఎం.హరినారాయణరెడ్డి, మిత్రులు, మిట్టూరు, చిత్తూరు జిల్లా	5,000
నిమ్మకాయల శ్రీనివాసరావు, విశాఖపట్నం	5,000
లింగ బోజయ్య మురళీధర్ ఛారిటబుల్ ట్రస్టు, సికింద్రాబాద్	5,000

కష్టంలో ఉన్నారు.. కరుణ చూపుదాం

RAMOJI GROUP

దాతలకు ముఖ్య సూచన: మీరిచ్చే విరాళాలకు రసీదులు పొందేందుకు ఈ వివరాలు పంపవలసిందిగా మనవి. 1. దాత పేరు 2. పూర్తి చిరునామా 3. పాన్‌కార్డు నంబరు.
- ఈ వివరాలను 9154990933 నంబరుకు లేదా relieffund@eenadu.in ఈ మెయిల్ ఐడీకి పంపగలరు.

విరాళాలు పంపవలసిన ఎకౌంట్ వివరాలు
ఈనాడు రిలీఫ్ ఫండ్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సైఫాబాద్ బ్రాంచి,
SB A/C No: 370602010006658
IFSC: UBIN0537063

దేశ ప్రయోజనాలను వ్యతిరేకిస్తున్న భారాస: బండి సంజయ్

ఈనాడు, హైదరాబాద్: దేశభద్రత వ్యవస్థ ఏర్పాటును వ్యతిరేకించడమంటే దేశ ప్రయోజనాలను వ్యతిరేకించినట్లేనని కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాడు భారాస ప్రభుత్వమే అనుమతి ఇచ్చి తర్వాత వాళ్లే వ్యతిరేకించడం ఏమిటని ప్రశ్నించారు. "లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు బుద్ధిచెప్పినా భారాసలో మార్పు రాలేదు. దేశభద్రతకు సంబంధించిన అంశాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అన్ని రాజకీయ పార్టీలు రాజీలేకుండా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది. భారాస నేతలు వ్యతిరేకించడమంటే దేశభద్రతను వ్యతిరేకిస్తున్నట్లే. దామగుండం అడవుల్లో రాడార్‌స్టేషన్ ఏర్పాటు ఇప్పటి అంశం కాదు. 14 ఏళ్లుగా పెండింగ్‌లో ఉంది. రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చొరవతోనే సాధ్యమైంది. భారాస నేతల ద్వంద్వవైఖరికి ఇది నిదర్శనం. అనుమతి ఇచ్చింది ఆనాటి సీఎం కేసీఆర్.. మాజీమంత్రి కేటీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే కేసీఆర్ ఫాంహౌస్ ఎదుట ధర్నాచేయాలి" అని సంజయ్ పేర్కొన్నారు.

భాజపా సంస్థాగత ఎన్నికల నిర్వహణాధికారిగా లక్ష్మణ్

ఈనాడు, దిల్లీ: భాజపా ఎంపీ కె.లక్ష్మణ్‌కు పార్టీ నాయకత్వం మరోసారి కీలక బాధ్యతలను అప్పగించింది. పార్టీ సంస్థాగత ఎన్నికల నిర్వహణ అధికారిగా (రిటర్నింగ్ ఆఫీసర్) ఆయన్ను నియమిస్తూ పార్టీ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగినట్లు పేర్కొన్నారు. లక్ష్మణ్‌తో పాటు పార్టీ ఎంపీలు నరేశ్‌బన్సల్, సంబిత్‌పాత్ర, పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు రేఖావర్మలను సహ ఎన్నికల నిర్వహణ అధికారులుగా (కో-రిటర్నింగ్ ఆఫీసర్స్‌గా) నియమించినట్లు తెలిపారు. లక్ష్మణ్ ఇప్పటికే ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడిగా, పార్టీ పార్లమెంటరీ బోర్డు, కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యుడిగా ఉన్నారు.

నేటి నుంచి జిల్లాలకు భాజపా ముఖ్యనేతలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో భాజపా సభ్యత్వ నమోదును సమీక్షించేందుకు ముఖ్య నేతలకు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు భాజపా సభ్యత్వ నమోదు రాష్ట్ర ఇన్‌ఛార్జి ఎన్.రాంచందర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీకి సంబంధించిన జిల్లాల్లో ఆయా నేతలు బుధవారం నుంచి ఈ నెల 24 వరకు పర్యటిస్తారని.. సభ్యత్వ నమోదు ప్రక్రియను సమీక్షించడంతో పాటు జిల్లా, మండల, యూనిట్లకు మార్గదర్శకం చేస్తారని వివరించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ హనుమకొండ జిల్లా, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ మేడ్చల్-మల్కాజిగిరి అర్బన్, భాజపా జాతీయ ఉపాధ్యక్షురాలు డి.కె.అరుణ నారాయణపేట, పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ హైదరాబాద్ సెంట్రల్, ఎంపీ ఈటల రాజేందర్ నిజామాబాద్, భాజపా శాసనసభాపక్షనేత ఎ.మహేశ్వర్‌రెడ్డి వికారాబాద్ జిల్లాల్లో పర్యవేక్షిస్తారని వెల్లడించారు.

మంచిర్యాల ఎమ్మెల్యే నివాసంలోకి చొరబడిన దుండగులు

మంచిర్యాల సిటీ, న్యూస్‌టుడే: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు నివాసంలోకి ముగ్గురు దుండగులు చొరబడిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పట్టణ సీఐ బన్సీలాల్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తులు ముఖానికి ముసుగు ధరించి రాముని చెరువు కట్టగుండా వచ్చి ఎమ్మెల్యే నివాసంలోకి ప్రవేశించారు. అక్కడే ఉన్న వాచ్‌మెన్‌పై దాడి చేయబోగా అతడు అప్రమత్తమై కేకలు వేయడంతో పారిపోయారు. చొరబడిన వ్యక్తులు మారణాయుధాలతో వచ్చారని వాచ్‌మన్ తెలిపారు.

మాట మార్చడం భారాసకు అలవాటే!

- 'రాడార్' అనుమతులపై 2017లోనే జీవో..
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



ఈనాడు, హైదరాబాద్: అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోమాట మాట్లాడటం భారాసకు అలవాటేనని కేంద్రమంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. దేశభద్రత, రక్షణ విషయంలో భారాస మొదటి నుంచి బాధ్యతారాహిత్యంతో వ్యవహరిస్తోందని.. కేవలం రాజకీయ అస్తిత్వం కోసం ప్రజల్లో తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశ రక్షణశాఖకు సహకరించకపోగా పోరాటం చేస్తామంటూ కేసీఆర్, కేటీఆర్ మాట్లాడుతున్నారని, ఈ వ్యాఖ్యలను సమాజం ఖండించాలన్నారు. "పాకిస్థాన్‌పై భారత్ సర్జికల్ స్ట్రైక్స్, చైనా సైనికులతో ఘర్షణలపై భారాస నాయకులు బాధ్యతారాహితంగా మాట్లాడారు. దేశభద్రతకు, రక్షణశాఖకు సంబంధించి మరో ప్రతిష్ఠాత్మకమైన రాడార్‌సెంటర్ ప్రాజెక్టు తెలంగాణకు రావడం మంచి పరిణామం. 2010లో నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ హయాంలో ఈ ప్రాజెక్టుకు ప్రతిపాదన రాగా తర్వాత అనేక అనుమతులు వచ్చాయి. 2017 డిసెంబరు 12వ తేదీన తెలంగాణ ప్రభుత్వానికి సంబంధించి పర్యావరణ, అటవీ శాఖ అనుమతులు ఇస్తూ జీవో ఇచ్చింది. దామగుండం అటవీప్రాంతంలో 1,100 హెక్టార్ల భూమిని రాడార్‌సెంటర్ ఏర్పాటుకు ఇచ్చారు. భారాస అధికారంలో ఉన్నప్పుడు జీవోలు విడుదల చేసి, ప్రాజెక్టు పనులు మొదలుపెట్టగానే సికింద్రాబాద్‌లో బైసన్‌పోలో భూమి సచివాలయానికి ఇవ్వాలని అప్పుడే పంచనామా చేసి భూమి కేటాయిస్తామని చెప్పింది. బైసన్‌పోలో భూమి ఇవ్వకూడదని క్రీడాకారులు, పర్యావరణవేత్తలు రక్షణశాఖకు ఉత్తరాలు రాయడంతో పాటు కోర్టును ఆశ్రయించారు. దామగుండం అటవీప్రాంతంలో చెట్లు, రక్షణకు అటవీశాఖకు రక్షణశాఖ రూ.130 కోట్లు కేటాయించింది. మొత్తం చెట్లు నరికేస్తారని, దామగుండ రామలింగేశ్వర స్వామి ఆలయానికి భక్తులను వెళ్లనివ్వరని తప్పుడు ప్రచారం చేయడం సబబు కాదు. ఆలయానికి మరిన్ని సౌకర్యాలు కల్పించేలా రక్షణశాఖతో చర్చిస్తాం. లక్షా 95 వేల చెట్లు ఉన్నాయి.. 1,500 చెట్లను మాత్రం రీలొకేట్ చేస్తారు" అని కిషన్‌రెడ్డి వివరించారు.

నేతలంతా కలిసికట్టుగా పనిచేయాలి

- మెదక్, ఆదిలాబాద్ జిల్లా సమీక్ష సమావేశాల్లో మహేశ్‌కుమార్ గౌడ్


మెదక్ జిల్లా నేతలతో సమీక్ష సమావేశంలో మహేశ్ కుమార్‌గౌడ్, దీపా దాస్‌మున్షీ, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ తదితరులు

ఈనాడు, హైదరాబాద్: నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, పార్టీ నేతలంతా భేషజాలకు పోకుండా కలిసికట్టుగా పనిచేసి, స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించాలని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సూచించారు. పార్టీలో క్రమశిక్షణ చాలా కీలకమని దాన్ని ఉల్లంఘిస్తే ఊరుకునేది లేదని ఆయన పార్టీ శ్రేణులను హెచ్చరించారు. మంగళవారం నుంచి గాంధీ భవన్‌లో ఉమ్మడి జిల్లాల నేతలతో సమీక్షలను ఆయన ప్రారంభించారు. తొలిరోజు మెదక్, ఆదిలాబాద్ జిల్లాల్లో పార్టీ పనితీరుపై చర్చించారు. నేతల అభిప్రాయాలను విడివిడిగా అడిగి తెలుసుకున్నారు. ఆయా జిల్లాలకు చెందిన మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, సీతక్క, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్, ఎమ్మెల్యేలు రోహిత్‌రావు, ప్రేమ్‌సాగర్ రావు, మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, నిర్మలా జగ్గారెడ్డి, ఎన్నికల్లో పోటీచేసిన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు, రెండు జిల్లాల సీనియర్ నాయకులతో పాటు ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ సమావేశంలో పాల్గొన్నారు. మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ..."ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు అద్భుతమైన పాలన చేస్తున్నారు. నేతలంతా ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. పథకాల అమలులో నాయకులు అక్రమాలకు పాల్పడినట్టు తేలితే కఠినంగా వ్యవహరిస్తాం. ప్రభుత్వ పథకాలు 100 శాతం అర్హులకు అందేలా చూడాలి. రాబోయే స్థానిక సంస్థలు, ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలి" అన్నారు. దీపా దాస్‌మున్షీ మాట్లాడుతూ మెదక్ అంటే కాంగ్రెస్ పార్టీకి అత్యంత ప్రాధాన్యం ఉన్న జిల్లా. ఇందిరాగాంధీ గతంలో ఎంపీగా పనిచేశారు. మెదక్ జిల్లాలో భారాస తరఫున కేసీఆర్, హరీశ్‌రావువంటి నేతలున్నందున కాంగ్రెస్ పటిష్ఠానికి పార్టీ నేతలంతా కష్టపడి పని చేయాలన్నారు.


స్వల్పకాలిక రుణాలను 'దీర్ఘకాలికం'గా మార్చాలి!

ఏఐఐబీ ప్రతినిధులతో మంత్రి ఉత్తమ్ చర్చలు



ఈనాడు, హైదరాబాద్: పెనుభారంగా మారిన స్వల్పకాలిక రుణాలను దీర్ఘకాలిక రుణాల కింద మార్చుకుని వడ్డీ, కిస్తీల భారాన్ని తగ్గించుకునేందుకు నీటిపారుదలశాఖ కీలక ప్రయత్నాలు చేస్తోంది. ఈ మేరకు హైదరాబాద్ జలసౌధలో మంగళవారం రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) ప్రతినిధులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నీటిపారుదలశాఖకు ప్రస్తుతం ఉన్న స్వల్పకాలిక రుణాలను 'దీర్ఘకాలికం'గా మార్చడంవల్ల వడ్డీ చెల్లింపుల్లో వెసులుబాటు ఉంటుందన్నారు. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు ఈ రుణాలను వర్తింపజేయాలని బ్యాంక్ ప్రతినిధులను మంత్రి కోరారు. గిరిజనులు అత్యధికంగా ఉన్న ములుగు జిల్లాతో పాటు ఫ్లోరైడ్ పీడిత ప్రాంతం ఉమ్మడి నల్గొండ జిల్లాలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ఈ రుణాలను వినియోగించేలా చూడాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఎస్ఎల్బీసీ, పాలమూరు-రంగారెడ్డి, డిండి ప్రాజెక్టులున్న నల్గొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాలతో పాటు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో నిర్మించతలపెట్టిన ప్రాజెక్టులకు దీర్ఘకాలిక రుణాలు వినియోగించే వెసులుబాటు కలుగుతుందన్నారు. ఏఐఐబీ నుంచి 7 నుంచి 8 శాతం వడ్డీకే రుణం లభించే అవకాశాలున్న నేపథ్యంలో రుణాల రీషెడ్యూల్‌కు ఉన్న సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయాలని రాహుల్ బొజ్జాను మంత్రి ఆదేశించారు.

శ్రమదోపిడీకి గురవుతున్న పోలీసులు: హరీశ్‌రావు



ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వం తీరుతో పోలీస్ కానిస్టేబుళ్లు శ్రమ దోపిడీకి గురవుతున్నారని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీసులపై శ్రమ దోపిడీ విధానాన్ని అమలు చేస్తున్నారని అన్నారు. టీఎస్ఎస్‌పీ కానిస్టేబుళ్లు 15 రోజులకు ఒకసారి బదులు.. నెలకు ఒకసారి ఇంటికి వెళ్లేలా సెలవుల నిబంధనలు మార్చడం దుర్మార్గమని వ్యాఖ్యానించారు. "సివిల్, ఏఆర్, ఇతర విభాగాల పోలీసులకు 15 రోజుల టీఏ అమల్లో ఉండగా.. కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని 7 రోజులకు కుదించింది. వారికి పెండింగ్‌లో ఉన్న టీఏ, ఎస్ఎల్, జీపీఎఫ్‌లను తక్షణమే విడుదల చేయాలి. పెండింగ్‌లో ఉన్న 'సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్' డబ్బులు చెల్లించాలి. పదవీ విరమణ ప్రయోజనాలను వెంటనే కల్పించాలి. సివిల్ పోలీసు వాహనాల డీజిల్ బకాయిలు, పోలీస్ స్టేషన్ల నిర్వహణ నిధులు విడుదల చేయాలి" అని హరీశ్‌రావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. భారాస ప్రభుత్వ హయాంలో మహాత్మా జ్యోతిబా ఫులే బీసీ ఓవర్సీస్ విద్యా నిధి పథకంలో ఆర్థిక సహాయం పొందిన 65 మంది బీసీ విద్యార్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు నిధులు విడుదల చేయడం లేదని హరీశ్‌రావు ప్రశ్నించారు.

◆ హైదరాబాద్ గచ్చిబౌలిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిపై అత్యాచారం జరగడంపై ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని చూడాలని డిమాండ్ చేశారు.

బీసీ గురుకుల సొసైటీ న్యాయ కళాశాలల్లో 19న స్పాట్ కౌన్సెలింగ్

ఈనాడు, హైదరాబాద్: బీసీ సంక్షేమ గురుకుల న్యాయ కళాశాలల్లో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ఖాళీ సీట్లకు ఈ నెల 19న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు గురుకుల సొసైటీ కార్యదర్శి సైదులు తెలిపారు. మహేశ్వరంలోని బాలుర కళాశాలలో బీబీఏ ఎల్ఎల్‌బీలో 47 సీట్లు, హనుమకొండలోని బాలికల కళాశాలలో బీఏఎల్ఎల్‌బీలో 39 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఐదేళ్ల న్యాయకోర్సు ప్రవేశపరీక్ష ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ నెల 19న ఉదయం 10గంటలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో ఆయా కళాశాలల్లో ప్రిన్సిపాళ్లకు దరఖాస్తు చేయాలని సూచించారు. మధ్యాహ్నం 2 గంటలకు సీట్లు కేటాయిస్తామని వెల్లడించారు.

విదేశీ విద్య దరఖాస్తు గడువు పెంపు...

అంబేడ్కర్ విదేశీ విద్య పథకం కింద ఎస్సీ విద్యార్థుల దరఖాస్తు గడువును ఈ నెల 29 వరకు పొడిగించినట్లు ఎస్సీ సంక్షేమ శాఖ అదనపు సంచాలకురాలు డి.ఉమాదేవి తెలిపారు. మరిన్ని వివరాలకు ఈ-పాస్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

విద్యుత్తు సమస్యల పరిష్కార బాధ్యతలు సీఈలకు

ఈనాడు, హైదరాబాద్: విద్యుత్తు సమస్యలపై ఫిర్యాదుల పరిష్కారానికి అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా చీఫ్ ఇంజినీర్ల (సీఈ)కు బాధ్యతలు అప్పగిస్తూ దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకుని పనిచేయాలని సీఈలను ఆదేశించారు. విద్యుత్తు కోతలు విధిస్తున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్న నేపథ్యంలో.. క్షేత్రస్థాయిలో సమస్యల సత్వర పరిష్కారానికి వీరిని నియమించినట్లు తెలుస్తోంది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జిగా సీఈ నందకుమార్, ఉమ్మడి నల్గొండకు సీఈ నర్సింలు, మహబూబ్‌నగర్‌కు కె.రాములు, రంగారెడ్డి, వికారాబాద్‌లకు బాలస్వామి, పాతబస్తీకి రంగనాథ్‌రాయ్, మిగిలిన హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల్లోని నియోజకవర్గాలకు నరసింహస్వామి ఇన్‌ఛార్జులుగా నియమితులయ్యారు.

ఝార్ఖండ్‌లో అభ్యర్థుల ఖరారుకు

భాజపా కేంద్ర ఎన్నికల కమిటీ భేటీ



దిల్లీ: ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలకు అభ్యర్థులను ఖరారు చేసేందుకు భాజపా కేంద్ర ఎన్నికల కమిటీ మంగళవారం సాయంత్రం దిల్లీలో సమావేశమైంది. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా, భాజపా అధ్యక్షుడు జె.పి.నడ్డా, పార్టీ ఝార్ఖండ్ భాజపా వ్యవహారాల ఇన్‌ఛార్జి అన్నపూర్ణా దేవి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బాబూలాల్ మరాండీ తదితరులు హాజరయ్యారు. ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, అధికార జేఎంఎంను వీడి ఇటీవలే భాజపాలో చేరిన చంపయీ సోరెన్ కూడా భేటీలో పాల్గొన్నారు.

వయనాడ్ అభ్యర్థిగా ప్రియాంకా గాంధీ



దిల్లీ: కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీకి సిద్ధమయ్యారు. రాహుల్ గాంధీ గెలిచి రాజీనామా చేసిన కేరళలోని వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గ ఉప ఎన్నికలో ఆమె పోటీ చేయనున్నారు. ఈ నియోజకవర్గానికి ఉప ఎన్నిక కోసం ఎన్నికల సంఘం మంగళవారం షెడ్యూల్‌ను ప్రకటించింది. ఆ వెంటనే తమ పార్టీ అభ్యర్థిగా ప్రియాంక పోటీ చేస్తారని కాంగ్రెస్ ప్రకటించింది. ఆమె గెలిస్తే చట్టసభల్లోకి తొలిసారిగా అడుగుపెడతారు. అంతేకాదు.. ఒకేసారి ముగ్గురు గాంధీ కుటుంబ సభ్యులు చట్టసభల్లో ఉంటారు. ఇప్పటికే సోనియా గాంధీ రాజ్యసభ సభ్యురాలిగా ఉన్నారు. రాహుల్ లోక్‌సభ సభ్యుడు. ప్రియాంక గెలిస్తే ఆ కుటుంబం నుంచి మూడో వ్యక్తి అవుతారు. నవంబరు 13న వయనాడ్‌లో పోలింగ్ జరగనుంది.

మహా ఉత్కంఠ



ఏక్‌నాథ్ శిందే దేవేంద్ర ఫడణవీస్ అజిత్ పవార్

- అర డజను పార్టీలకు సవాల్
- ప్రజా కోర్టులో తేలనున్న అసలైన శివసేన, ఎన్సీపీ
- మహారాష్ట్రలో ఎన్నికల సంగ్రామం

దేశం మొత్తం ఆసక్తిగా ఎదురు చూస్తున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. శివసేన, ఎన్సీపీ చీలిక తర్వాత జరుగుతున్న తొలి అసెంబ్లీ ఎన్నికలు కావడంతో దేశవ్యాప్తంగా ఈ ఆసక్తి నెలకొంది. అసలైన శివసేన, ఎన్సీపీ ఏవో ప్రజలు తేల్చనున్నారు. మొత్తంగా ఆరు పార్టీలకు ఇవి అత్యంత కీలకంగా మారాయి. భాజపా, శివసేన, ఎన్సీపీ, శివసేన (ఉద్ధవ్), ఎన్సీపీ (శరద్ చంద్ర పవార్), కాంగ్రెస్‌లకు ఇది అగ్ని పరీక్షే. చీలిక రాజకీయాలకు, మరాఠా కోటా రిజర్వేషన్ల అంశానికి, ప్రతిపక్ష పోరాటానికి ఈ ఎన్నికలు పరీక్షగా నిలవనున్నాయి. మహారాష్ట్రలో 288 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి.

- దశాబ్దాలుగా తమ పార్టీల్లో ఏకఛత్రాధిపత్యం వహించిన పవార్, ఠాక్రే కుటుంబాలకు ఈ ఎన్నికలు అత్యంత ప్రతిష్ఠాత్మకం.
- పార్టీలను చీల్చి శివసేన, ఎన్సీపీల అధికారిక హోదాను దక్కించుకున్న ఏక్‌నాథ్ శిందే, అజిత్ పవార్‌లకూ కీలకం.
- గత ఎన్నికల్లో అధికారానికి చేరువగా వచ్చి శివసేనతో విభేదాల కారణంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయిన భాజపాకు, గతంలో సుదీర్ఘ కాలం మహారాష్ట్రలో అధికారం చెలాయించిన కాంగ్రెస్‌కు ఈ ఎన్నికలు అత్యంత ప్రతిష్ఠాత్మకం.

రెండు కూటముల మధ్యే..

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు భాజపా, శివసేన, ఎన్సీపీ ఆధ్వర్యంలోని మహాయుతి, శివసేన (ఉద్ధవ్), కాంగ్రెస్, ఎన్సీపీ (ఎస్పీ) ఆధ్వర్యంలోని మహా వికాస్ అఘాడీల (ఎంవీఏ) మధ్యే సాగనున్నాయి. రెండు కూటములు ఇంకా సీట్ల సర్దుబాటుపై నిర్ణయం తీసుకోలేదు.



ఉద్ధవ్ ఠాక్రే శరద్ పవార్ నానా పటోలే

ప్రభావం చూపనున్న అంశాలు	పార్టీల్లో చీలికలు, మరాఠా కోటా, అభివృద్ధి పథకాలు, పార్టీలపై ఆధిపత్యం.

లోక్‌సభ ఎన్నికల్లో..

లోక్‌సభ ఎన్నికల్లో 30 సీట్లను గెలుచుకుని ఎంవీఏ మంచి ఫలితాలను సాధించింది. భాజపా కూటమి కేవలం 17 సీట్లలోనే విజయం సాధించింది. అయితే అసెంబ్లీ ఎన్నికల పరిస్థితులు వేరేలా ఉంటాయి. ఇందులో రాష్ట్ర స్థాయి అంశాలకు ప్రాధాన్యం ఉంటుంది.

గత ఐదేళ్లలో అనూహ్య పరిణామాలు

మహారాష్ట్ర రాజకీయాల్లో గడచిన ఐదేళ్లలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా, శివసేన ఎన్నికలకు ముందు పొత్తు పెట్టుకున్నాయి. ఆ ఎన్నికల్లో భాజపాకు 105, శివసేనకు 56 సీట్లు దక్కాయి. ఎన్సీపీ 44, కాంగ్రెస్ 54 సీట్లలో గెలిచాయి. ముఖ్యమంత్రి పదవి విషయంలో విభేదాలు తలెత్తడంతో సిద్ధాంతపరంగా తన బద్ధ శత్రువులైన కాంగ్రెస్, ఎన్సీపీతో శివసేన జట్టు కట్టింది. ఉద్ధవ్ ఠాక్రే ముఖ్యమంత్రి అయ్యారు.

2022లో శివసేన నేత ఏక్‌నాథ్ శిందే అనూహ్యంగా పార్టీని చీల్చి భాజపాతో జట్టు కట్టారు. కాషాయ పార్టీ మద్దతుతో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. మరుసటి ఏడాది ఎన్సీపీలోనూ చీలిక వచ్చింది. శరద్ పవార్‌తో విభేదించి అజిత్ పవార్ మహాయుతి కూటమిలో చేరారు. ఉప ముఖ్యమంత్రి అయ్యారు.

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు అసలైన శివసేన, ఎన్సీపీ ఏవనేది తేల్చనున్నాయి. ఎక్కువ మంది ఎమ్మెల్యేల మద్దతుతో తమవే అసలైన శివసేన, ఎన్సీపీ అని శిందే, అజిత్ పవార్ అసెంబ్లీలో నిరూపించుకున్నా.. ప్రజా కోర్టులో ఎవరికి మద్దతుందనేది ఇప్పుడు తేలనుంది.

- ఈనాడు ప్రత్యేక విభాగం

ఝార్ఖండ్‌లో హోరాహోరీ



- ఎన్డీఏ, ఇండియా కూటముల మధ్య తీవ్ర పోటీ



హేమంత్ సోరెన్



అర్జున్ ముండా

ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే, ఇండియా కూటమి మధ్య ద్విముఖ పోరు జరగనుంది. 2019లో పోగొట్టుకున్న అధికారాన్ని ఎలాగైనా దక్కించుకోవాలని భాజపా నేతృత్వంలోని ఎన్డీయే, అధికారాన్ని నిలబెట్టుకోవాలని ఝార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం)- కాంగ్రెస్ కూటమి హోరాహోరీగా పోరాడేందుకు సిద్ధమయ్యాయి. ఎన్నికల సంఘం మంగళవారం వెలువరించిన షెడ్యూలు ప్రకారం.. నవంబరు 13, 20 తేదీల్లో రెండు విడతలుగా ఇక్కడ పోలింగ్ జరగనుంది. విజయంపై రెండు కూటములూ ధీమాగా ఉన్నాయి.

భాజపా ఎజెండా ఇదీ..

- బంగ్లాదేశీల చొరబాటు, అవినీతి అంశాలే ఎజెండాగా ఇప్పటికే రాష్ట్రంలో భాజపా ప్రచారం ప్రారంభించింది. ప్రధాని మోదీ, అమిత్ షా రాష్ట్రంలో పర్యటించారు.
- మనీ లాండరింగ్ కేసులో ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ అరెస్టునూ ఎన్డీయే కూటమి ప్రస్తావిస్తోంది.
- టికెట్ల ప్రకటనలో భాజపా దూకుడు ప్రదర్శిస్తోంది. తొలి జాబితాను 48 గంటల్లో వెల్లడిస్తామని ప్రకటించింది.
- పొత్తులో భాగంగా ఆల్ ఝార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్ (ఏజేఎస్‌యూ) 9 నుంచి 11 స్థానాల్లో పోటీ చేయనుంది. నీతీశ్ కుమార్ నేతృత్వంలోని జేడీయూకు రెండు సీట్లను భాజపా ఇవ్వనుంది.

బలాలు

- ప్రచారంలో నేతల దూకుడు.
- ఏజేఎస్‌యూతో పొత్తు.
- రాష్ట్రంలో క్షీణించిన శాంతి భద్రతలపై ప్రచారం.
- గిరిజనుల్లో ప్రాబల్యమున్న చంపయీ సోరెన్ భాజపాలో చేరడం.
- శిబూ సోరెన్ కోడలు సీతా సోరెన్ పార్టీలోకి రావడం.
- గిరిజన నేత అర్జున్ ముండా పార్టీకి నాయకత్వం వహించడం.

బలహీనతలు

- రాష్ట్రంలో రాజకీయ అనిశ్చితికి భాజపా కారణమని ప్రజలు భావించడం.
- హేమంత్‌ను అరెస్టు చేయడం, ఆయన భార్య రాజకీయాల్లోకి వచ్చి అసెంబ్లీ ఉప ఎన్నికల్లో విజయం సాధించడం.
- మొత్తం 81 సీట్లలో 28 ఎస్టీలకు రిజర్వు కావడం. వాటిలో జేఎంఎం బలంగా ఉండటం.

అధికార కూటమి ఇలా..

- సంక్షేమ పథకాలను ఇండియా కూటమి నమ్ముకుంది.
- హేమంత్ సోరెన్ అరెస్టును రాజకీయ ప్రేరేపిత చర్యగా జేఎంఎం ఆరోపిస్తోంది.
- కలిసే పోటీ చేస్తామని జేఎంఎం, కాంగ్రెస్ ఇప్పటికే ప్రకటించాయి.

బలాలు

- హేమంత్ అరెస్టుతో గిరిజన సెంటిమెంటు బలపడటం.
- పలు సంక్షేమ పథకాల అమలు.
- సర్నాను ప్రత్యేక మతంగా గుర్తించాలని తీర్మానించడం. కేంద్రానికి లేఖ రాయడం.

బలహీనతలు

- ప్రముఖ నేతలు ఎన్డీయే కూటమిలో చేరడం.
- ఇండియా కూటమిలో విభేదాలు.



వైఫల్యాలకు వెరవకండి

వైఫల్యాలకు ఎప్పుడూ భయపడకండి. ఎన్ని వైఫల్యాలు ఎదురైతే మీరు అంతగా నేర్చుకోవచ్చు. ఎంతగా నేర్చుకుంటే.. అంతగా నవ కల్పనలకు శ్రీకారం చుట్టవచ్చు. ప్రతి వైఫల్యం ఒక గొప్ప పాఠం. వాటిని మీకు సానుకూలంగా మార్చుకోండి.

– బియాట్రిజ్ సిల్వా, కంటెంట్ క్రియేటర్

ప్రిడేటర్ డ్రోన్ల కొనుగోలుకు ఒప్పందం



దిల్లీ: సైనిక దళాలను మరింత బలోపేతం చేసేలా భారత్ కీలక ముందడుగు వేసింది. అమెరికా నుంచి అత్యాధునిక సాయుధ ఎంక్యూ-9బీ ప్రిడేటర్ డ్రోన్ల కొనుగోలు ఒప్పందంపై సంతకం చేసింది. దిల్లీలో మంగళవారం భారత రక్షణ శాఖ ఉన్నతాధికారుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. దీని కింద.. అమెరికా ఆయుధ దిగ్గజం 'జనరల్ అటామిక్స్' నుంచి మన దేశం మొత్తం 31 డ్రోన్లను కొనుగోలు చేస్తుంది. ఇందుకు సుమారు 400 కోట్ల డాలర్లు (రూ.33,600 కోట్ల)ను వెచ్చించనుంది. డ్రోన్ల మరమ్మతులు, నిర్వహణకు సంబంధించి కూడా రక్షణ శాఖకు, జనరల్ అటామిక్స్‌కు మధ్య విడిగా ఒక ఒప్పందం కుదిరింది. ఎంక్యూ-9బీ హంటర్ కిల్లర్ డ్రోన్ల కొనుగోలుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఎస్) గతవారం అంగీకారం తెలిపింది. సైనిక దళాల నిఘా సామర్థ్యాన్ని బలోపేతం చేసుకునేందుకు భారత్ వీటిని సమకూర్చుకుంటోంది. ముఖ్యంగా చైనాతో ఉన్న వివాదాస్పద సరిహద్దుల వెంబడి వీటి సేవలను వినియోగించుకునే అవకాశం ఉంది. నిఘాతోపాటు దాడులు చేయగల సామర్థ్యం వీటి సొంతం. 2022 జులైలో కాబుల్ నడిబొడ్డులో హెల్‌ఫైర్ క్షిపణి ప్రయోగంతో అల్‌ఖైదా ఉగ్రముఠా నాయకుడు అల్ జవహరిని మట్టుబెట్టిన ఎంక్యూ-9 రీపర్ డ్రోన్‌కు సంబంధించిన మరో వేరియంటే ఈ ప్రిడేటర్ డ్రోన్. చాలా ఎక్కువ ఎత్తులో విహరించగలిగే ఈ లోహవిహంగం.. ఏకబిగిన సుమారు 40 గంటలకుపైగా గాల్లో ఉండగలదు. ఇది నాలుగు హెల్‌ఫైర్ క్షిపణులను, 450 కిలోల బాంబులను మోసుకెళ్లగలదు. ఇప్పుడు కొనుగోలు చేయబోయే 31 డ్రోన్లలో నౌకాదళానికి 15 దక్కనున్నాయి. వాయుసేన, సైన్యానికి చెరో 8 లోహవిహంగాలను కేటాయించనున్నారు.

రైలు కిటికీ నుంచి జారిపడ్డ చిన్నారి

16 కి.మీ. కాలినడకన గాలించి కాపాడిన రైల్వే పోలీసులు




ఇంటర్నెట్ డెస్క్: కుటుంబంతో కలిసి రైల్లో ప్రయాణిస్తున్న ఓ 8 ఏళ్ల చిన్నారి ఊహించని ప్రమాదానికి గురైంది. తెరిచి ఉన్న అత్యవసర కిటికీ నుంచి జారి కిందపడిపోయింది. మధ్యప్రదేశ్ నుంచి ఉత్తరప్రదేశ్‌లోని మథుర వెళ్లేందుకు ఓ కుటుంబం తమ చిన్నారితో కలిసి రైలెక్కింది. వీరు బోగీలోని అత్యవసర కిటికీ వద్ద ఉన్న సీట్లలో కూర్చున్నారు. గాలి తగిలేందుకు వీలుగా ప్రయాణికులు ఆ కిటికీని తెరిచారు. మార్గమధ్యంలో ఆ బాలిక కిటికీ నుంచి బయటకు జారి కిందపడిపోయింది. గమనించిన చిన్నారి తండ్రి లలిత్‌పుర్ రైల్వే పోలీసులను ఆశ్రయించారు. రాత్రివేళ 16 కిలోమీటర్ల మేర కాలినడకన గాలింపు చేపట్టిన పోలీసులు పట్టాల పక్కన చెట్ల పొదల్లో గాయాలతో స్పృహకోల్పోయిన స్థితిలో బాలికను గుర్తించారు. అటుగా వెళ్తున్న గూడ్స్ రైలును ఆపి లలిత్‌పుర్ ఆసుపత్రిలో చేర్పించారు. ఇందుకు సంబంధించిన వీడియోను ఉత్తర్‌ప్రదేశ్ పోలీసులు సామాజిక మాధ్యమాల్లో ఉంచారు.

ప్రామాణిక 40 శాతం వైకల్యం

ఎంబీబీఎస్‌లో ప్రవేశానికి అవరోధం కాదు

- విద్యార్థి సామర్థ్యాన్ని నిపుణులు నిర్దేశించాలి
- సుప్రీంకోర్టు స్పష్టీకరణ



దిల్లీ: వ్యక్తి శారీరక వైకల్యం ప్రామాణిక 40 శాతం లేదా అంతకన్నా అధికంగా ఉన్నంత మాత్రాన ఎంబీబీఎస్‌లో ప్రవేశానికి అవరోధం కాజాలదని సుప్రీంకోర్టు మంగళవారం విస్పష్టం చేసింది. వైద్యవిద్యను అభ్యసించదలచిన ఆ విద్యార్థికి తగిన సామర్థ్యం, అర్హతల గురించి నిపుణులు సమర్పించే నివేదిక ఆధారంగానే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని జస్టిస్ బి.ఆర్.గవాయి, జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్ ధర్మాసనం తెలిపింది. ఎంబీబీఎస్‌లో చేరడానికి ఓంకార్ అనే విద్యార్థికి అనుమతిస్తూ సెప్టెంబరు 18న వెలువరించిన ఉత్తర్వులకు సంబంధించిన సమగ్ర కారణాలను వెల్లడించింది. వైద్య విద్యలో ప్రవేశానికి ఓంకార్ అర్హుడేనని, అతని వైకల్యం ఎంబీబీఎస్ చదువుకు అవరోధం కాదని మెడికల్ బోర్డు ఇచ్చిన నివేదికను ధర్మాసనం ఉటంకించింది. వైకల్యం ప్రామాణిక 40 శాతాన్ని మించితే ఎంబీబీఎస్‌లో ప్రవేశ అర్హత ఉండదన్న గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ రెగ్యులేషన్-1997ను సవాల్ చేస్తూ ఓంకార్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

మాజీ సీజేఐపై ఆరోపణలు..

పిటిషనర్‌పై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం

దిల్లీ: ఉద్యోగం నుంచి ఉద్వాసనకు గురైన ఓ వ్యక్తి తనకు న్యాయం చేయాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌లో మాజీ సీజేఐ జస్టిస్ రంజన్ గొగొయ్ పేరును చేర్చడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ పిటిషన్‌ను తోసిపుచ్చడంతో పాటు ఆ వ్యక్తిని కోర్టు గది నుంచి తీసుకెళ్లాలని భద్రతా సిబ్బందిని జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ ధర్మాసనం ఆదేశించింది. అరుణ్ రామచంద్ర హుబ్లీకర్ అనే వ్యక్తి తనను అన్యాయంగా ఉద్యోగం నుంచి తొలగించారని ఆరోపిస్తూ గతంలో దాఖలు చేసిన పిటిషన్‌ను అప్పటి ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ రంజన్ గొగొయ్ కొట్టివేశారు. ఇటీవల మళ్లీ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన హుబ్లీకర్... ఈ దఫా మాజీ సీజేఐ జస్టిస్ రంజన్ గొగొయ్ పేరును చేర్చడంతో పాటు ఆయనపై అంతర్గత విచారణ జరపాలని కోరారు. ఈ పిటిషన్‌ను సెప్టెంబరు 30న పరిశీలించిన సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ధర్మాసనం...మాజీ న్యాయమూర్తిని ప్రతివాదిగా చేర్చడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. జస్టిస్ రంజన్ గొగొయ్ పేరును తొలగిస్తేనే విచారణ జాబితాలో పిటిషన్‌ను చేరుస్తామని స్పష్టం చేసింది. పిటిషనర్ అందుకు సుముఖత తెలిపారు. మంగళవారం విచారణ సమయంలో పిటిషనర్ మళ్లీ మాజీ సీజేఐ పేరును ప్రస్తావించడంతో జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ ధర్మాసనం మండిపడింది. జరిమానా విధిస్తామని హెచ్చరించింది. పిటిషన్‌లో ఏమీ లేదని పేర్కొనగా హుబ్లీకర్ ఎదురు ప్రశ్నలకు దిగారు. దీంతో ఆగ్రహించిన ధర్మాసనం వ్యాజ్యాన్ని కొట్టివేస్తున్నట్లు తెలిపింది. హుబ్లీకర్‌ను కోర్టు గది నుంచి బయటకు తీసుకెళ్లాలని భద్రతా సిబ్బందిని ఆదేశించింది.

పార్టీల ఉచిత వాగ్దానాలను కట్టడి చేయండి

- సుప్రీంకోర్టులో పిటిషన్... కేంద్రం, ఈసీకి నోటీసులు

దిల్లీ: ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఇచ్చే ఉచిత హామీలకు ఒక పరిమితి లేకుండా పోతోందని, వాటిని నియంత్రించేలా ఎలక్షన్ కమిషన్(ఈసీ)ని ఆదేశించాలని కోరుతూ సుప్రీంకోర్టులో తాజాగా మరో పిటిషన్ దాఖలైంది. అపరిమిత వాగ్దానాల వల్ల ప్రభుత్వ ఖజానాపై విపరీతమైన భారంపడుతోందని పిటిషనర్ పేర్కొన్నారు. బెంగళూరు నివాసి శశాంక్ జె.శ్రీధర చేసిన ఈ అభ్యర్థనను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం మంగళవారం పరిశీలించింది. ఇదే అంశంపై పెండింగ్‌లో ఉన్న కేసులతో కలిపి విచారణ జరపాలని నిర్ణయించింది. కేంద్రానికి, ఈసీకి నోటీసులు జారీ చేసింది. ఈ ధర్మాసనంలో జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్ర సభ్యులుగా ఉన్నారు. ఎన్నికల సమయంలో ఓటర్లకు పార్టీలు ఇచ్చే ఉచిత హామీలను లంచాలుగా పరిగణించాలని పిటిషనర్ విజ్ఞప్తి చేశారు. రాజకీయ పార్టీలకు ఓట్ల వర్షం కురిపించే ఉచిత హామీల అమలును పర్యవేక్షించే యంత్రాంగం ఏదీ దేశంలో లేదని గుర్తు చేశారు. గతంలో ఇదే అంశమై అశ్వినీ ఉపాధ్యాయ్ దాఖలు చేసిన పిటిషన్‌పై సత్వర విచారణ జరపాలని సీనియర్ న్యాయవాది విజయ్ హన్సారియా విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో అనుచిత లబ్ధిపొందడం కోసం ఇచ్చే ప్రజాకర్షక హామీలపై నిషేధం విధించాలని కోరారు.

బీమా సేవలను పెంచేందుకు

వికలాంగుల నియమాల్లో సవరణలు!

దిల్లీ: బీమా మౌలిక సదుపాయాలను పూర్తిగా అందుబాటులోకి తీసుకువచ్చే లక్ష్యంతో వికలాంగుల హక్కుల నియమాలు-2017 చట్టానికి కేంద్రం సవరణలను ప్రతిపాదించింది. ఈ డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను అక్టోబరు 7న సామాజిక న్యాయం, సాధికారిక మంత్రిత్వ శాఖ విడుదల చేసింది. ఈ ప్రతిపాదనలపై 30 రోజుల్లోగా తమ అభిప్రాయాలను తెలపాలని ప్రజలను కోరింది. ఈ మార్పులు ప్రత్యేకంగా 'బీమా రంగంలో మౌలిక సదుపాయాలు, సేవల మార్గదర్శకాలు, ప్రమాణాలు'ను ఉద్దేశించినదేనని ఆర్థిక శాఖలోని సేవల విభాగం వివరించింది. వికలాంగుల హక్కుల (సవరణ) నియమాలు-2024గా పిలిచే ఈ ముసాయిదాలో బీమా సేవలను పూర్తిగా అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కొత్త ప్రమాణాలను ప్రవేశపెట్టనుంది.

ఒమర్ ప్రమాణం నేడే

శ్రీనగర్: జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రిగా నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) నాయకుడు ఒమర్ అబ్దుల్లా ప్రమాణ స్వీకారానికి రంగం సిద్ధమైంది. శ్రీనగర్‌లోని ఎస్‌కేఐసీసీలో ముఖ్యమంత్రి, ఆయన మంత్రిమండలితో బుధవారం ఉదయం 11.30 గంటలకు లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ప్రమాణం చేయించనున్నారు. ఈ కార్యక్రమానికి ఇండియా కూటమి సభ్యులకూ ఆహ్వానాలు పంపినట్లు నేషనల్ కాన్ఫరెన్స్ వర్గాలు తెలిపాయి.

మరో ఇద్దరు వైద్యులకు అస్వస్థత

- 11వ రోజుకు చేరిన కోల్‌కతా జూడాల నిరశన దీక్ష



కోల్‌కతాలో వైద్య సిబ్బంది ఆందోళన

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో నిరాహార దీక్ష చేస్తున్న జూనియర్ వైద్యుల్లో మరో ఇద్దరు మంగళవారం అనారోగ్యానికి గురయ్యారు. ప్రభుత్వం, ఆందోళనకారుల మధ్య సోమవారం జరిగిన చర్చలు విఫలం కావడంతో జూడాలు తమ 'దీక్ష'ను కొనసాగిస్తున్నారు. దీంతో మంగళవారం నాటికి నిరశన కార్యక్రమం 11వ రోజుకు చేరింది. కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ వైద్య కళాశాల, ఆసుపత్రికి చెందిన ఓ జూనియర్ వైద్యురాలు హత్యాచారానికి గురికావడంతో బాధితురాలికి న్యాయం కోరుతూ జూడాలు ఆందోళన బాటపట్టారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ పంత్ సోమవారం 12 వైద్య సంఘాల ప్రతినిధులతో స్వాస్థ్య భవన్‌లో నిర్వహించిన చర్చలు ఎటువంటి ఫలితానివ్వలేదు. మరోవైపు ఆందోళన చేస్తున్న జూడాలు మంగళవారం కోల్‌కతాలోని రాణి రశ్మోణీ రోడ్‌లో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఇందులో స్థానిక ప్రజలు కూడా పెద్ద ఎత్తున పాల్గొని బాధితురాలి కుటుంబానికి న్యాయం కావాలంటూ డిమాండ్ చేశారు.

పకడ్బందీగా జూడా కేసు దర్యాప్తు

సుప్రీంకోర్టుకు సీబీఐ వెల్లడి

దిల్లీ: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ ఆసుపత్రిలో హత్యాచారానికి గురైన జూనియర్ వైద్యురాలి కేసులో దర్యాప్తు పకడ్బందీగా సాగుతోందని సీబీఐ మంగళవారం సుప్రీంకోర్టుకు వెల్లడించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్ర నేతృత్వంలోని ధర్మాసనానికి సీబీఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఐదవ స్థాయీ నివేదికను సమర్పించారు. ఈ కేసులో నిందితుడు సంజయ్ రాయ్‌పై ఈ నెల 7న అభియోగాలు నమోదు చేశామని వెల్లడించారు. ఈ కేసులో ఇతరుల ప్రమేయంపై మరో మూడు వారాల్లో దర్యాప్తు నివేదికను సమర్పించాలని ధర్మాసనం సీబీఐని కోరింది. ఇదిలా ఉండగా దేశవ్యాప్తంగా వైద్యులు, వైద్య సేవల సిబ్బంది భద్రతపై నిబంధనావళి రూపకల్పనకు ఏర్పడిన నేషనల్ టాస్క్ ఫోర్స్ (ఎన్‌టీఎఫ్) పనితీరు నత్తనడకన సాగుతుండటంపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది.

వీడ్కోలు సభలో కలెక్టర్ ముందే అవమానం..

కేరళలో అదనపు జిల్లా మేజిస్ట్రేట్ ఆత్మహత్య

కన్నూర్: బదిలీ వీడ్కోలు సభలో తనపై అవినీతి ఆరోపణలు రావడాన్ని అవమానంగా భావించిన ఓ ప్రభుత్వ ఉన్నతాధికారి ఆత్మహత్యకు పాల్పడ్డారు. కేరళకు చెందిన నవీన్‌బాబు కన్నూర్ జిల్లాలో అదనపు జిల్లా మేజిస్ట్రేట్‌గా పని చేశారు. ఇటీవల ఆయనకు సొంత జిల్లా పతనంతిట్టకు బదిలీ అవడంతో ఉద్యోగులంతా సోమవారం వీడ్కోలు సభ నిర్వహించారు. ఆ సభకు జిల్లా కలెక్టర్ సైతం హాజరయ్యారు. సీపీఎం నాయకురాలు, జిల్లా పంచాయతీ అధ్యక్షురాలు పీపీ దివ్య సభలో మాట్లాడుతూ నవీన్‌బాబు అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. పెట్రోల్ బంకు అనుమతికి సంబంధించిన దస్త్రాన్ని ఎన్నో రోజులు పక్కన పెట్టి రెండ్రోజుల కిందటే ఆమోదించారని, అలా ఎందుకు చేశారో తెలుసని ఆమె అన్నారు. వాస్తవానికి ఈ కార్యక్రమానికి ఆహ్వానం లేకున్నా ఆమె హాజరయ్యారు. కార్యక్రమం ముగిసిన అనంతరం జ్ఞాపిక బహూకరణ సమయంలో ఆమె వేదికపై నుంచి వేగంగా వెళ్లిపోయారు. ఈ సభకు హాజరైన కలెక్టర్ ముందే దివ్య తనపై అవినీతి ఆరోపణలు చేయడాన్ని అవమానంగా భావించిన నవీన్‌బాబు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. మంగళవారం తన అధికారిక నివాసంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. పతనంతిట్ట ఏడీఎంగా బాధ్యతలు స్వీకరించేందుకు బాబు మంగళవారం చెంగనూర్ రైల్వే స్టేషన్‌కు రావాల్సి ఉంది. అయితే రైలు వచ్చినా ఆయన రాలేదు. కుటుంబసభ్యులు కన్నూర్ అధికారులను సంప్రదించడంతో ఆత్మహత్య సంగతి వెలుగులోకి వచ్చింది.

హింసకు చరమగీతం పాడదాం

మణిపుర్ ప్రజలకు మైతేయ్, కుకీ, నాగా ఎమ్మెల్యేల పిలుపు

దిల్లీ: మణిపుర్‌లోని మైతేయ్, కుకీ, నాగా వర్గాలకు చెందిన సుమారు 20 మంది ఎమ్మెల్యేలు మంగళవారం దిల్లీలో సమావేశమయ్యారు. రాష్ట్రంలో నెలకొన్న జాతుల మధ్య పోరుకు శాంతియుత పరిష్కారం కనుగొనే దిశగా తాజా పరిణామం చోటు చేసుకుంది. రెండు గంటలపాటు సాగిన చర్చల భేటీలో భాజపా ఎంపీ సంబిత్ పాత్ర కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న హింసాయుత చర్యలకు చరమగీతం పాడాలని, ఇకపై అమాయకులైన పౌరులెవ్వరూ ప్రాణాలు కోల్పోరాదని రాష్ట్ర ప్రజలకు సమావేశం ఏకాభిప్రాయంతో పిలుపునిచ్చింది. కేంద్ర హోంశాఖ చొరవతో జరిగిన ఈ సమావేశానికి కేంద్రహోం మంత్రి అమిత్ షా, మణిపుర్ ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్ హాజరుకాలేదు.

ప్రాణం తీసిన కంటెంట్ పిచ్చి

స్పెయిన్‌లో వంతెన ఎక్కుతూ జారిపడి బ్రిటన్ యువకుడి దుర్మరణం

ఇంటర్నెట్ డెస్క్: కంటెంట్ క్రియేట్ చేసి షేర్‌లు, లైక్‌లు పొందాలనే పిచ్చిలో పడి బ్రిటన్‌కు చెందిన ఓ ఇన్‌ఫ్లుయెన్సర్ స్పెయిన్‌లోని ఎత్తైన వంతెన పైనుంచి పడి ప్రాణాలు కోల్పోయాడు. ఆదివారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్పెయిన్‌లోని కాస్టిల్లా-లా మంచా తీగల వంతెనను ఎక్కేందుకు బ్రిటన్‌కు చెందిన ఓ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ (26) యత్నించాడు. ఈ క్రమంలోనే బాధితుడు కిందపడి మృతి చెందాడు. సోషల్ మీడియాలో కంటెంట్ క్రియేట్ చేయడానికే అతను వంతెన ఎక్కేందుకు యత్నించాడు. బాధితుడికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియరాలేదు. ఈ వంతెనను ఎక్కడంపై నిషేధం ఉంది. అయినా పర్యాటకులు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టేందుకు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని అక్కడి అధికారి ఒకరు పేర్కొన్నారు.



నా కుమార్తెను అక్రమంగా జైల్లో నిర్బంధించారు

పారిశ్రామికవేత్త పంకజ్ ఓస్వాల్ వెల్లడి



ఇంటర్నెట్ డెస్క్: భారత సంతతికి చెందిన ప్రముఖ స్విస్ వ్యాపారవేత్త ఉగాండాలో నిర్బంధానికి గురయ్యారు. దీనిపై ఆమె తండ్రి, స్విట్జర్లాండ్‌లో ప్రముఖ వ్యాపారవేత్తగా పేరు గడించిన భారత సంతతికి చెందిన పంకజ్ ఓస్వాల్ ఉగాండా అధ్యక్షుడికి లేఖ రాయడంతో ఈ విషయం బహిర్గతమైంది. తన 26ఏళ్ల కుమార్తె వసుంధర ఓస్వాల్‌ను ఉగాండాలో అక్రమంగా జైలులో ఉంచారని ఆయన ఆరోపించారు. ఈ చర్యలతో ఆమె ప్రాథమిక హక్కులను హరించారని అన్నారు. కుటుంబసభ్యులను కలవడానికి, న్యాయ సహాయం పొందడానికి కూడా అనుమతించట్లేదని, ఆమె ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. పంకజ్ ఓస్వాల్ తెలిపిన వివరాల ప్రకారం.. తన కుమార్తె వసుంధర ఓస్వాల్ పీఆర్‌వో ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో కార్పొరేట్, రాజకీయ అవకతవకల ఆరోపణలతో కొందరు అధికారులు విచారణ జరపకుండా ఆమెను అక్టోబరు 1న నిర్బంధించారు. తమ కంపెనీకి చెందిన మాజీ ఉద్యోగి చేసిన తప్పుడు ఆరోపణలతో తమ కుమార్తెను అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నారని పంకజ్ ఓస్వాల్ తెలిపారు. ఆమెను అపరిశుభ్రమైన ప్రదేశంలో ఉంచి విచారించారని.. అక్కడే 90 గంటల పాటు నిర్బంధించారన్నారు. దీనిపై విచారణ జరిపిన స్థానిక న్యాయస్థానం ఆమెను విడుదల చేయాలని ఆదేశించినప్పటికీ పోలీసులు.. అలసత్వం వహిస్తూ, ఇతర అభియోగాలు మోపుతున్నారని తెలిపారు. ఈ విషయాలను ఆమె కుటుంబ సభ్యులు వసుంధర ఓస్వాల్ అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ చేశారు.

30 శాతం ఖాళీలే!

- ప్రభుత్వ వైద్య కళాశాలల్లో బోధనాసిబ్బంది కొరత
- బోధన, వైద్య సేవలపై తీవ్ర ప్రభావం
- నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో జరిగిన అధ్యయనంలో వెల్లడి



అత్యున్నత ప్రమాణాలు ఉండాల్సిన.. మెరుగైన పరిశోధనావకాశాలు కల్పించాల్సిన వైద్య కళాశాలలపై బోధనాసిబ్బంది కొరత తీవ్ర ప్రభావం చూపుతోంది. ఎంపిక విధానంలో లోపాలు, నియామకాల్లో జాప్యం, ఖాళీలపై స్పష్టత లేమి, నైపుణ్యాల పెంపునకు అవకాశాలు పరిమితంగా ఉండటం, పరిశోధనలకు తోడ్పాటు లేకపోవడం వంటి కీలక సమస్యలున్నట్లు ఓ అధ్యయనంలో వెల్లడైంది. 'ప్రభుత్వ వైద్య కళాశాలల్లో బోధనాసిబ్బంది నియామకాలకు అవరోధాలు' అనే అంశంపై నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో అధ్యయనం చేసిన సహమంత్రన్ అనే సంస్థ ఇటీవల ప్రత్యేక నివేదిక విడుదల చేసింది. అధ్యయనం నాటికి ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం దేశంలోని 602 వైద్య కళాశాలల్లో 1,38,028 మంది బోధకులు ఉండాలి. కానీ, రెగ్యులర్, కాంట్రాక్టు కలిపి 96,649 మంది మాత్రమే ఉన్నారు. అంటే ఖాళీల సంఖ్య 29.98%. జైపుర్‌లోని సవాయ్ మాన్‌సింగ్ మెడికల్ కాలేజ్, మైసూర్ మెడికల్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లలో మాత్రమే వంద శాతం బోధనాసిబ్బంది ఉన్నారు. సూపర్ స్పెషాలిటీలు, సర్జికల్ స్పెషాలిటీ విభాగాలు, అనాటమీ, ఫోరెన్సిక్ మెడిసిన్, ప్రీ క్లినికల్ స్పెషాలిటీలో అత్యధిక ఖాళీలు ఉంటున్నాయి.

కారణాలెన్నో..

- ప్రభుత్వ వైద్య కళాశాలల్లో బోధనాసిబ్బంది నియామక ప్రక్రియలో అంతులేని ఆలస్యం జరుగుతోంది. ఖాళీల ప్రకటన నుంచి ఎంపికైనవారికి ఆఫర్ లెటర్ జారీ చేసేవరకు పడుతున్న సగటు సమయం 7 నెలలు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా చేపడుతున్న రిక్రూట్‌మెంట్లలో కొన్ని సందర్భాల్లో రెండేళ్ల నుంచి నాలుగేళ్లు పడుతోంది. ప్రత్యేక మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డులు ఉన్నచోట మాత్రం నియామకాలు త్వరగానే పూర్తవుతున్నాయి.
- సర్జన్లు, సూపర్ స్పెషాలిటీ నిపుణులకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో అధిక వేతనాలు ఉండటం వల్ల వైద్య కళాశాలల్లో చేరేందుకు సుముఖత కనబర్చడం లేదు.
- ఎన్ఎంసీ తనిఖీలకు ముందు ఫ్యాకల్టీని కళాశాలలు బదిలీ చేయడం, కింది క్యాడర్‌లో నిర్ణీత పదోన్నతి విధానం లేకపోవడం, విద్యాసంవత్సరం పూర్తయిన తర్వాత కాంట్రాక్టు బోధనాసిబ్బందిని కొనసాగించకపోవడం లేదా మెరుగైన అవకాశాల కోసం వారు ఉద్యోగాలను వీడుతుండటం వంటివి జరుగుతున్నాయి.
- సమీప భవిష్యత్‌లో ఏర్పడే ఖాళీలను పరిగణనలోకి తీసుకోకుండా నియామక ప్రక్రియ చేపడుతుండటంతో కొరత కొనసాగుతూనే ఉంది.
- డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ(డీపీసీ)ల సమావేశాలను సక్రమంగా నిర్వహించకపోవడం వల్ల సైతం పోస్టుల భర్తీలో జాప్యం జరుగుతోంది.
- కాంట్రాక్టు బోధనాసిబ్బంది క్రమబద్ధీకరణ అంశం కూడా నియామకాలపై ప్రభావం చూపుతోంది. న్యాయవివాదాలు.. కోర్టు కేసుల వల్లా జాప్యం జరుగుతోంది.


పనిభారం అధికమై..

రెగ్యులర్ ఫ్యాకల్టీ ఎక్కువగా ఉన్నచోట బోధనా ప్రమాణాలు మెరుగ్గా ఉన్నా.. మిగతాచోట్ల తద్భిన్నంగా ఉంటోంది. విద్యార్థులు-బోధకుల నిష్పత్తిని, రోగులు-వైద్యుల నిష్పత్తిని పట్టించుకోకపోవడం బోధన, వైద్య సేవలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఓపీడీ, ఐపీడీ, ఎమర్జెన్సీ విభాగాల్లో కొన్నిచోట్ల మూడు నాలుగు రెట్లు ఎక్కువగా పనిభారం ఉంటోంది. ఫలితంగా బోధనపై ప్రభావం పడుతోంది. పనిభారాన్ని పర్యవేక్షించే వ్యవస్థ, జవాబుదారీతనాన్ని గుర్తించే విధానం ఉండటం లేదు. మెరుగైన పనితీరు ప్రాతిపదికగా ప్రోత్సాహకాలు ఉండటం లేదని పలువురు పేర్కొంటున్నారు. వైద్య కళాశాలల్లో చేపట్టే నియామకాల్లో అసోసియేట్ ప్రొఫెసర్ తర్వాత అన్నీ ఓపెన్ పొజిషన్లు ఉండాలి. వైద్యవిద్యలో పరిశోధనలకు సానుకూల వాతావరణం కల్పించాలని, ప్రతి రాష్ట్రంలో ఒక మెడికల్ కాలేజీని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని నివేదిక పేర్కొంది.

రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో 35 శాతం..

రాష్ట్రంలో 34 ప్రభుత్వ వైద్య కళాశాలలు ఉన్నాయి. వీటిలో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు.. ఇలా అన్ని పోస్టుల్లోనూ ఖాళీలున్నాయి. మొత్తం 6,099 పోస్టులకుగాను 2,131 (35 శాతం) ఖాళీగా ఉన్నాయి. ప్రొఫెసర్ల పోస్టుల్లో సగానికి పైగా ఖాళీగా ఉండటం గమనార్హం. కాంట్రాక్టు విధానంలో ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి ప్రకటనలు ఇస్తున్నా.. హైదరాబాద్‌లోని కళాశాలల్లో కొన్ని విభాగాలకు ఒకరిద్దరు వస్తున్నా జిల్లాల్లో స్పందన ఉండటం లేదు. అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులను పూర్తిగా రిక్రూట్‌మెంట్ ద్వారానే భర్తీ చేయాల్సి ఉంటుంది.

రాష్ట్రంలోని 34 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పరిస్థితిదీ..



- ఈనాడు, హైదరాబాద్





కుంచం మహేశ్వరరావు తూట చంద్ర ధనశేఖర్ చల్లా గుణరంజన్

ఏపీ హైకోర్టుకు ముగ్గురు న్యాయమూర్తులు

అడ్వొకేట్ల కోటా నుంచి సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు

ఈనాడు- దిల్లీ, అమరావతి: ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయవాదులుగా సేవలందిస్తున్న కుంచం మహేశ్వరరావు, తూట చంద్ర ధనశేఖర్, చల్లా గుణరంజన్‌లను అదే హైకోర్టులో న్యాయమూర్తులుగా నియమించడానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయ్‌లతో కూడిన కొలీజియం మంగళవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, హైకోర్టులోని ఇద్దరు సీనియర్ న్యాయమూర్తులను సంప్రదించి ఈ ముగ్గురినీ హైకోర్టు న్యాయమూర్తులుగా నియమించాలని కోరుతూ మే 15న పంపిన ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు కొలీజియం పేర్కొంది.

కుంచం మహేశ్వరరావు

కుంచం సుశీలమ్మ, కోటేశ్వరరావు దంపతులకు మహేశ్వరరావు తిరుపతిలో జన్మించారు. తిరుపతిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లా కళాశాలలో న్యాయశాస్త్రాన్ని అభ్యసించారు. 1998లో బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకున్నారు. సీనియర్ న్యాయవాది వేదుల శ్రీనివాస్ వద్ద కొంతకాలం ప్రాక్టీసు చేశారు. సివిల్, క్రిమినల్, రాజ్యాంగ సంబంధ కేసులలో పట్టు సాధించారు. హైకోర్టు ప్యానల్ న్యాయవాదిగా, భారత బార్ కౌన్సిల్, ఎఫ్‌సీఐ, పలు బీమా సంస్థలకు న్యాయవాదిగా పనిచేసిన అనుభవం ఉంది. తండ్రి కోటేశ్వరరావు అసిస్టెంట్ పోలీసు కమిషనర్‌గా పదవీ విరమణ చేశారు.

తూట చంద్ర ధనశేఖర్

తూట శైలజ, చంద్రశేఖరన్ దంపతులకు చంద్ర ధనశేఖర్ జన్మించారు. తిరుపతి జిల్లా సత్యవేడు స్వస్థలం. నెల్లూరు వీఆర్ న్యాయ కళాశాలలో న్యాయశాస్త్రాన్ని అభ్యసించారు. 1999లో బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేయించుకున్నారు. మాజీ ఏజీ పి.వేణుగోపాల్ వద్ద వృత్తిని ప్రారంభించారు. 2019లో ప్రభుత్వ న్యాయవాదిగా పనిచేశారు. ట్యాక్స్, రెవెన్యూ, భూసేకరణ, సివిల్, క్రిమినల్ చట్టాలపై అనుభవం గడించారు.

చల్లా గుణరంజన్

చల్లా చంద్రమ్మ, నారాయణ దంపతులకు గుణరంజన్ జన్మించారు. వీరిది అనంతపురం జిల్లా తాడిపత్రి. తండ్రి నారాయణ న్యాయవాది. విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చల్లా కోదండరామ్‌కు గుణరంజన్ సోదరుడి వరుస అవుతారు. 2001 మార్చి 21న బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకున్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టు, వివిధ ట్రైబ్యునళ్లలో రెండు దశాబ్దాలుగా న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్నారు. సివిల్, క్రిమినల్ చట్టాలతోపాటు విద్యుత్, పర్యావరణ, ట్యాక్స్, కంపెనీ లా, దివాలా తదితర చట్టాలపై అనుభవం గడించారు. పలు ప్రఖ్యాత సంస్థలకు న్యాయ సలహాదారుగా వ్యవహరిస్తున్నారు.

■ సుప్రీంకోర్టు తాజాగా చేసిన ముగ్గురు పేర్ల సిఫారసులకు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రపతి ఆమోద ముద్ర వేస్తే ఏపీ హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 29కి చేరుతుంది.

అమెరికాలో రోడ్డు ప్రమాదం.. ఏపీకి చెందిన ముగ్గురు మృతి

మృతులు ఉమ్మడి చిత్తూరుకు చెందినవారు

ఈనాడు, అమరావతి: అమెరికాలోని రాండాల్ఫ్ సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో అయిదుగురు ప్రవాస భారతీయులు మృతి చెందారు. వారిలో ఒక మహిళ సహా ముగ్గురు ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన వారు ఉన్నారు. రాష్ట్ర రహదారిపై దక్షిణ బాన్‌హామ్‌కు ఆరు మైళ్ల దూరంలో సాయంత్రం 6.45 గంటలకు (అమెరికా కాలమానం) రెండు వాహనాలు ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్లు టెక్సాస్ పబ్లిక్ సేఫ్టీ వర్గాలు తెలిపాయి. ప్రమాదానికి సంబంధించి పూర్వాపరాలు, మృతుల వివరాలు తెలియాల్సి ఉందని అక్కడి ప్రవాస భారతీయ ప్రతినిధులు తెలిపారు. ఘటనను ఏపీ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లామన్నారు.


నైరుతి రుతుపవనాల నిష్క్రమణం పూర్తి

ఈనాడు, హైదరాబాద్: నైరుతి రుతుపవనాల తిరోగమనం పూర్తయింది. ఈ ఏడాది రుతుపవనాలు అంచనా తేదీ కన్నా ముందుగా జూన్ మొదటి వారంలోనే రాష్ట్రంలోకి ప్రవేశించాయి. ఉత్తర భారతదేశం నుంచి తిరోగమనాన్ని ప్రారంభించిన నైరుతి మంగళవారం రాష్ట్రం నుంచి పూర్తిగా నిష్క్రమించింది. ఈశాన్య రుతుపవనాలు చురుకుగా కదులుతున్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది. మరోవైపు దక్షిణ బంగాళాఖాతం మధ్య ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడిందని, ఇది వాయుగుండంగా మారి గురువారం నాటికి దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరం వైపునకు కదిలే అవకాశాలు ఉన్నాయని తెలిపింది. ఈ ప్రభావంతో బుధ, గురు, శుక్రవారాల్లో రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు పేర్కొంది. మంగళవారం రాష్ట్రంలోనే అత్యధికంగా వికారాబాద్ జిల్లా యాలాల్ మండలం ధవలాపూర్‌లో 4.5 సెం.మీల వర్షం కురిసింది. నాగర్‌కర్నూల్, మేడ్చల్ మల్కాజిగిరి, నారాయణపేట, యాదాద్రి, జనగామ, హైదరాబాద్, రంగారెడ్డి, ఆదిలాబాద్ తదితర జిల్లాల్లో చాలా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయి.

ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల్ని విలీనం చేయాలి

టీజేఎంయూ వినతి

ఈనాడు, హైదరాబాద్: ఎన్నికల ప్రణాళికలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీన ప్రక్రియను వెంటనే చేపట్టాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ (టీజేఎంయూ) విజ్ఞప్తి చేసింది. సంఘం సెక్రటరీ జనరల్ హనుమంతు ముదిరాజ్, ఇతర నేతలు సోమవారం రాత్రి సచివాలయంలో మంత్రిని కలిసి ఆర్టీసీ ఉద్యోగుల డిమాండ్లు, సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. గత ప్రభుత్వం కార్మిక సంఘాల్ని రద్దు చేసి నిరంకుశంగా ప్రవర్తించిందని, కార్మిక సంఘాల్ని పునరుద్ధరించాలని కోరారు. 2013 వేతన సవరణకు సంబంధించిన బకాయిల్ని చెల్లించాలని అడిగారు.



ఫిట్‌గా ఉంటే ఎక్కువ గౌరవం!

ఆరోగ్యంగా, మంచి ఫిట్‌నెస్‌తో ఉండేవారిని ఇతరులు ఎక్కువగా గౌరవిస్తారు. మీరు అంగీకరించినా.. అంగీకరించకపోయినా ఇది వాస్తవం. మీలోని కష్టపడేతత్వం, ఆత్మగౌరవం, క్రమశిక్షణ వంటి లక్షణాలకు.. ఫిట్‌గా ఉన్న మీ శరీరం అద్దం పడుతుంది. దాన్ని డబ్బుతోనో, హోదాతోనో కొనుక్కోలేరు. ఇష్టంతో కష్టపడుతూ సాధించుకోవాల్సిందే.

– మకెంజీ స్మిత్, పర్ఫార్మెన్స్ కోచ్

ఇంటింటా ఇంకుడు గుంతలు ఉండాల్సిందే

- నీటి పొదుపుపై రాష్ట్ర సర్కారు మార్గదర్శకాలు

ఈనాడు, హైదరాబాద్: భూగర్భ జలాలను పెంపొందించడంతోపాటు వర్షపునీటిని ఒడిసిపట్టడానికి, ఇంటింటా ఇంకుడు గుంతలు తవ్వించేందుకు రాష్ట్ర, జిల్లా, జీహెచ్ఎంసీ స్థాయి కమిటీలు విస్తృత చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. దీన్ని ప్రాధాన్యాంశంగా గుర్తించాలని నిర్దేశించింది. నీటిని పొదుపు చేసేందుకు ఏర్పాటు చేసిన కమిటీలకు మార్గదర్శకాలు జారీ చేస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నీటి వృథాను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలను నిర్దేశిస్తూ ఈ ఏడాది మార్చి నెలలో హైకోర్టు జారీచేసిన ఆదేశాల్లో భాగంగా రాష్ట్రస్థాయిలో ఉన్నత స్థాయి కమిటీ, జిల్లా, జీహెచ్ఎంసీ స్థాయిలో పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటుచేస్తూ ఇదివరకే ఉత్తర్వులు జారీ అయ్యాయి. వీటికి సంబంధించిన మార్గదర్శకాలను తాజాగా విడుదల చేశారు. ఇందులో మూడు కమిటీలకు వేర్వేరుగా లక్ష్యాలు నిర్దేశించారు.

■ భూగర్భ జలాల పెంపు, వర్షపునీటి నిల్వకు రాష్ట్రస్థాయిలో అనుసరించాల్సిన విధానాల రూపకల్పన, నీటి



పొదుపునకు నిర్దేశించిన పథకాల పురోగతిని పర్యవేక్షించడం, ఈ పథకం విజయవంతం అయ్యేలా ప్రగతి సూచికలు రూపొందించడం వంటి బాధ్యతలను రాష్ట్ర స్థాయి ఉన్నత కమిటీలకు అప్పగించారు.

■ కొత్త, పాత భవనాలు అన్నింటిలోనూ ఇంకుడుగుంతలు నిర్మించేలా చూడడం, సహజ సిద్ధమైన చెరువులు, కుంటల వంటి వాటిని సంరక్షించి పునరుద్ధరించడం, అడ్డగోలుగా బోర్లు తవ్వకుండా కఠిన చర్యలు తీసుకోవడం, భూగర్భ, ఉపరితల జలాల వాడకాన్ని నియంత్రించడం తదితరాలను జిల్లా కమిటీలకు నిర్దేశించారు.

■ నీటి నియంత్రణ విధానాలు పాటించని వారికి జరిమానా విధించడం, గృహ, వ్యాపార, పారిశ్రామిక భవనాల్లో వర్షపునీటి నిల్వను కచ్చితంగా పాటించేలా చూడటం, వర్షపునీటిని సమర్థంగా ఒడిసిపడుతున్న వారిని గుర్తించి ప్రోత్సాహకాలు ఇవ్వడం వంటి కార్యక్రమాల అమలును జీహెచ్ఎంసీ స్థాయి పర్యవేక్షణ కమిటీలకు అప్పగించారు.

పూర్తి వివరాలు www.eenadu.net లో

విపత్తులను ఎదుర్కొనేందుకు 2 వేల మందితో ప్రత్యేక బలగం

- శిక్షణ ఏర్పాట్లను సమీక్షించిన సీఎస్

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో విపత్తులను సమర్థంగా ఎదుర్కొనేందుకు 2 వేల మందితో ప్రభుత్వం ప్రత్యేక బలగాన్ని ఏర్పాటు చేస్తోంది. అగ్నిమాపక శాఖకు చెందిన 10 బృందాలు, తెలంగాణ స్పెషల్ పోలీస్ బెటాలియన్‌లోని 10 కంపెనీలతో 'తెలంగాణ రాష్ట్ర డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్' ఏర్పాటు చేయాలన్న సీఎం ఆదేశాలతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ బలగాల శిక్షణ, ఇతర అవసరాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సంబంధిత శాఖలతో మంగళవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. వచ్చే నెల మొదటి వారం నుంచి మొదటి బ్యాచ్‌కు శిక్షణ ప్రారంభించాలని అధికారులకు సూచించారు. ఫైర్ సర్వీసెస్ డీజీ నాగిరెడ్డి మాట్లాడుతూ.. అవసరమైన పరికరాలు, శిక్షణ అందించడం ద్వారా అగ్నిమాపక శాఖలోని పది బృందాలను ఎస్‌డీఆర్ఎఫ్ స్టేషన్లుగా అప్‌గ్రేడ్ చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో డీజీపీ జితేందర్, విపత్తు నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్, టీజీఎస్‌పీ ఏడీజీ సంజయ్‌కుమార్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తుల్లేని విక్రయాల్ని ప్రోత్సహించాలి: పౌరసరఫరాల శాఖ

ఈనాడు, హైదరాబాద్: ఉత్పత్తుల విక్రయాల విధానం వినియోగదారుడికి లాభదాయకంగా ఉండాలని ఆహారం, పౌరసరఫరాల శాఖ స్పష్టం చేసింది. మధ్యవర్తులు లేకుండా విక్రయాల్ని ప్రోత్సహించేందుకు సంబంధిత శాఖల మధ్య సమన్వయం ఉండాలని పేర్కొంది. ఈ అంశంపై శాఖ ముఖ్య కార్యదర్శి డీఎస్ చౌహాన్ మంగళవారం హైదరాబాద్‌లోని సివిల్ సప్లైస్ భవన్‌లో సమావేశం నిర్వహించారు. పరిశ్రమలు, వాణిజ్య పన్నులు, డ్రగ్స్ నియంత్రణ, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్, ఎక్సైజ్, పోలీసు శాఖల అధికారులతో పాటు అసోసియేషన్ ఆఫ్ డైరెక్ట్ సెల్లింగ్ ఎంటిటీస్ ఆఫ్ ఇండియా తదితర సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. తయారీదారుల నుంచి ఉత్పత్తులు వినియోగదారునికి చేరే 'డైరెక్ట్ సెల్లింగ్ (నేరుగా విక్రయాల)' విధానం అమలుకు.. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆహారం, పౌరసరఫరాల శాఖ రాష్ట్రంలో నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తోంది. ప్రకటనల ఖర్చు, హోల్‌సేల్, రిటైలర్ల మార్జిన్ల కారణంగా ఆయా ఉత్పత్తుల కొనుగోలుదారులకు లాభదాయకంగా ఉండటం లేదనే విషయాల్ని పౌరసరఫరాల శాఖ ప్రతినిధులకు వివరించింది. 'డైరెక్ట్ సెల్లింగ్' విధానం బలోపేతానికి మార్గదర్శకాలపై సంబంధిత సంస్థలు, శాఖల అభిప్రాయాల్ని ఈ సమావేశంలో తీసుకుంది.



కార్లను ఇళ్ల ముందు ఉంచితే, వరదల్లో కొట్టుకుపోవచ్చన్న ఆందోళనతో చెన్నైవాసులు ఇలా ఫ్లైఓవర్లపై నిలిపారు. చెన్నై-వేళచ్చేరి ఫ్లైఓవర్‌పై కార్ల వరుసలు

చెన్నైలో 300 ప్రాంతాలు జలమయం

ఈనాడు, చెన్నై: చెన్నై నగరం, పరిసర ప్రాంతాల్లో రెండ్రోజులుగా భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం అతిభారీ వర్షాలు పడతాయని తొలుత ఆరెంజ్ అలర్ట్ జారీచేశారు. పరిస్థితులు తీవ్రమై వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. చెన్నైవ్యాప్తంగా పలుచోట్ల 10 సెం.మీ. పైన వర్షపాతం నమోదైంది. రెండ్రోజుల వర్షాలతో నగరం అతలాకుతలమైంది. 300 ప్రాంతాలు నీట మునిగాయి. పలు సబ్‌వేల్లో 3 అడుగుల మేర నీరు చేరింది. విపత్తు నిర్వహణ సిబ్బంది, ఫైర్, రెస్క్యూ, చెన్నై గ్రేటర్ కార్పొరేషన్ సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం, సిబ్బందిని, సహాయక యంత్రాల్ని ముందే లోతట్టు ప్రాంతాలకు చేర్చడంతో ముంపు ముప్పు కొంత తప్పింది. తాంబరం కార్పొరేషన్‌లోని లోతట్టు ప్రాంతాలకు పడవలు పంపుతున్నారు.

27న ఐఎంఏ రాష్ట్ర శాఖ ఎన్నికలు

వివిధ పదవులకు పలువురు ఏకగ్రీవం

సుల్తాన్‌బజార్, న్యూస్‌టుడే: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర శాఖ ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగుతోందని ఐఎంఏ ఎన్నికల కమిషన్ ఛైర్మన్ డా.విజయ్‌చందర్‌రెడ్డి పేర్కొన్నారు. రెండేళ్లకోసారి జరిగే ఎన్నికలకు సంబంధించి పోటీ లేకపోవడంతో పలువురి ఎన్నిక ఏకగ్రీవమైందని తెలిపారు. మంగళవారం కోఠిలోని ఐఎంఏ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిషన్ సభ్యులతో కలిసి ఆయన ఈ వివరాలు వెల్లడించారు. "2024-25 సంవత్సరానికి జోన్-1 నుంచి అధ్యక్షుడిగా డా.ద్వారకానాథ్, 2025-26కు జోన్-3 నుంచి డా.విజయ్‌కుమార్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా 2024-25కు జోన్-1 నుంచి డా.సాయిరాం, 2025-26 సంవత్సరానికి డా.విజయ్‌రావులు ఏకగ్రీవమయ్యారు. జోన్-3 నుంచి 2024-25కు జోనల్ కార్యదర్శిగా డా.మల్లేశం, 2025-26కు డా.రూప్‌లాల్, జోన్-2 నుంచి సంయుక్త కార్యదర్శిగా డా.యు.రామకృష్ణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా డా.సునీతతో పాటు రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులుగా 29 మంది, కేంద్ర వర్కింగ్ కమిటీ సభ్యులుగా 10 మంది ఎన్నిక ఏకగ్రీవమైంది. ఐఎంఏ-ఏఎంఎస్(అకాడమీ ఆఫ్ మెడికల్ స్పెషాలిటీ) 2024-25 సంవత్సరానికి ఛైర్మన్‌గా డా.శేఖర్ రెడ్డి, వైస్‌ఛైర్మన్‌గా డా.సంపత్‌సింగ్, కార్యదర్శిగా డా.కె.ఎస్.గిఫ్టన్, కోశాధికారిగా డా.పెంటాచారి, ఐఎంఏ-సీజీపీ(కాలేజ్ ఆఫ్ జనరల్ ప్రాక్టీషనర్) డైరెక్టర్‌గా 2024-25 ఏడాదికి డా.కె.వసంతకుమారి, 2024-26 సంవత్సరానికి కార్యదర్శిగా డా.మధుసూదన్ జోషీలు ఎన్నికయ్యారు. పోటీ ఉన్న చోట ఆయా పోస్టులకు ఈ నెల 27న ఐఎంఏ రాష్ట్ర కార్యాలయంలో పోలింగ్ జరుగుతుంది' అని విజయ్‌చందర్‌రెడ్డి పేర్కొన్నారు.

తల్లిపై కన్నేశాడు.. కూతుర్ని కడతేర్చాడు

- కత్తితో పొడిచి ఏడేళ్ల బాలిక హత్య
- హైదరాబాద్ సూరారంలో దారుణం

ఈనాడు, హైదరాబాద్, కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే: ఓ వివాహిత మీద కన్నేసిన దుర్మార్గుడు.. తనకు అడ్డొస్తుందనే ఉద్దేశంతో ఏడేళ్ల బాలికను కిరాతకంగా హతమార్చాడు. గోనె సంచిలో మూటకట్టి అటవీ ప్రాంతంలో విసిరేశాడు. హైదరాబాద్‌లోని సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో దసరా రోజు జరిగిన ఈ దారుణం మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం..ఆదిలాబాద్ జిల్లా బేల మండలం పాటగూడ గ్రామానికి చెందిన మిశ్రమ్ ప్రభాకర్ (40) ఏడు నెలల క్రితం హైదరాబాద్ వచ్చాడు. కూలి పనులు చేసుకునే అతను, పాటగూడ గ్రామానికే చెందిన ఇద్దరు కుమార్తెలున్న మహిళతో కలిసి కుత్బుల్లాపూర్ పరిధి సూరారం జీవన్‌జ్యోతినగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఆమె పెద్ద కుమార్తెకు ఏడేళ్లు. ప్రభాకర్‌కు తన ప్రాంతానికే చెందిన, జీవన్‌జ్యోతినగర్ సమీపంలో నివాసం ఉంటూ కూలి పనులు చేసుకునే తిరుపతితో పరిచయముంది. ప్రభాకర్ ఇంట్లో తరచూ ఇద్దరూ మద్యం తాగేవారు. ఆ క్రమంలో మహిళపై కన్నేసిన తిరుపతి,. ప్రభాకర్‌తోపాటు ఇద్దరు పిల్లల అడ్డు తొలగించుకుంటే ఆమెను సొంతం చేసుకోవచ్చని పథకం వేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఈ నెల 12న ఉదయం ఆమె పెద్ద కుమార్తెను ద్విచక్ర వాహనంలో తన ఇంటికి తీసుకెళ్లాడు. మధ్యాహ్నం 3 గంటలకు తిరిగి తీసుకొచ్చి వదిలేశాడు. సాయంత్రం 5 గంటల సమయంలో ప్రభాకర్ ఇంటి వద్ద ఎవరూ లేని సమయం చూసి బాలికను మళ్లీ తీసుకెళ్లాడు. పొద్దుపోయే వరకూ ద్విచక్రవాహనంపై తిప్పుతూ..చీకటిపడ్డాక మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధి బాసరేగడి గ్రామం దగ్గర కత్తితో పొడిచి చంపేశాడు. బాలిక మరణించినట్లు నిర్ధారించుకున్నాక గోనె సంచిలో మూటకట్టి.. అక్కడికి సమీపంలోని అటవీ ప్రాంతంలో విసిరేశాడు.

బాలిక అదృశ్యమైనట్టు వచ్చిన ఫిర్యాదుతో

బాలిక అదృశ్యమైనట్టు ప్రభాకర్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలించారు. తిరుపతి చిన్నారిని ద్విచక్ర వాహనంలో తీసుకెళ్లినట్లు సీసీ కెమెరాల ద్వారా గుర్తించారు. అప్పట్నుంచి అజ్ఞాతంలో ఉన్న నిందితుడిని మంగళవారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకుని విచారించారు. చిన్నారిని హత్య చేసినట్టు నిందితుడు అంగీకరించడంతో, మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. బాలిక హత్యకు ఇంకేమైనా కారణాలున్నాయా? అనే దిశగా విచారిస్తున్న పోలీసులు.. కేసు వివరాలు బుధవారం వెల్లడించే అవకాశముంది.

హైడ్రా ఏర్పాటు చట్టవిరుద్ధమెలా అవుతుంది?

- పిటిషనర్లకు హైకోర్టు ప్రశ్న
- జీవో 99పై కౌంటర్ల దాఖలుకు ప్రభుత్వానికి ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ స్థలాలు, చెరువుల పరిరక్షణ నిమిత్తం ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా చట్టవిరుద్ధమెలా అవుతుందని పిటిషనర్లను హైకోర్టు ప్రశ్నించింది. హైడ్రా చట్టవిరుద్ధంగా చర్యలు చేపడితే వాటిని ప్రశ్నించే అధికారం ఉంటుంది తప్ప ఏర్పాటునే ఎలా ప్రశ్నిస్తారంది. ఒకవేళ చట్టవిరుద్ధంగా ప్రైవేటు ఆస్తుల్లోకి చొరబడినా, ఆస్తులను కూల్చివేసినా నష్టపరిహారం కోరుతూ కింది కోర్టుల్లో పిటిషన్‌లు దాఖలు చేసుకోవచ్చంది. కోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా చర్యలు చేపడితే కోర్టు ధిక్కరణ కింద చర్యలు తీసుకునేలా ఆదేశించాలని కోరవచ్చంది. అంతేకాకుండా కూల్చివేతలకు సంబంధించి చట్టప్రకారం నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలని ఇదే హైకోర్టు ఆదేశాలిచ్చిన విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలంది. అయినా ఇరుపక్షాల వాదనలను విని తేలుస్తామని స్పష్టం చేసింది. హైడ్రా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 99 చట్టబద్ధతను సవాల్ చేస్తూ హైదరాబాద్ నానక్‌రాంగూడకు చెందిన డి.లక్ష్మి, మల్కాజిగిరికి చెందిన ఎండీ అహ్మద్ అజీమ్‌లు దాఖలు చేసిన రెండు వేర్వేరు పిటిషన్‌లపై జస్టిస్ సి.వి.భాస్కర్‌రెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు సుధాకర్‌రెడ్డి, విజయలక్ష్మి వాదనలు వినిపిస్తూ కోర్టు ఉత్తర్వులున్నప్పటికీ ప్రైవేటు స్థలంలో నిర్మాణాలను హైడ్రా కూల్చివేసిందన్నారు. భూఆక్రమణల చట్టం కింద చర్యలు తీసుకునే పరిధి దానికి లేదన్నారు. జీహెచ్ఎంసీ తీసుకోవాల్సిన చర్యలను హైడ్రాకు బదలాయించడం చెల్లదన్నారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది తేరా రజనీకాంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ చట్టప్రకారం నోటీసులు జారీ చేసి.. చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయమూర్తి రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను ఈ నెల 29కు వాయిదా వేశారు. మూసీ పరిరక్షణలో భాగంగా చేసిన మార్కింగ్‌లపై అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ దాఖలైన పలు పిటిషన్‌లపై విచారించిన న్యాయమూర్తి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మార్కెట్‌కు తెచ్చేముందే పంట వివరాల నమోదు

ఈనాడు, హైదరాబాద్: "మార్కెట్ యార్డులకు, సీసీఐ కొనుగోలు కేంద్రాలకు, ప్రైవేటు వ్యాపారుల వద్దకు ధాన్యాన్ని, పత్తిని తరలించే ముందే... వ్యవసాయాధికారుల వద్ద పంటల వివరాలు నమోదు చేసుకోవాలి. తద్వారా అమ్మకాలు వేగంగా ముగిసి, వెంటనే డబ్బు జమ అవుతుంది'' అని రైతులకు వ్యవసాయశాఖ సూచించింది. పత్తిని ప్లాస్టిక్ సంచుల్లోకాకుండా పాత చీరల్లో, నూలు దుప్పట్లలో కట్టుకొని తీసుకు రావాలని కోరింది. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధర క్వింటాలుకు రూ.7,520 కంటే తక్కువకు విక్రయించవద్దని పేర్కొంది. పత్తి, ధాన్యం కొనుగోళ్ల సీజన్ ప్రారంభం దృష్ట్యా రైతులను అప్రమత్తం చేస్తూ మంగళవారం పలు సూచనలు చేసింది.

"సన్న, దొడ్డు ధాన్యాన్ని... సాధారణ, గ్రేడ్-ఎ ధాన్యాన్ని కలపవద్దు. అలా చేస్తే తక్కువ ధరలే వచ్చి, రైతుకు నష్టం జరుగుతుంది. సాధారణ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2,300, 'ఎ' గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2,320 మద్దతు ధర వస్తుంది. ప్రభుత్వ విధివిధానాలను అనుసరించి సన్నధాన్యానికి క్వింటాకు అదనంగా రూ.500 బోనస్ లభిస్తుంది. ధాన్యాన్ని శుభ్రం చేసేందుకు కొనుగోలు కేంద్రాల వద్ద ఏర్పాటుచేసిన తూర్పార యంత్రాలను ఉపయోగించుకోవచ్చు'' అని వివరించింది.

ఏఐతో ఆరోగ్య సంరక్షణ.. వ్యవసాయాభివృద్ధి..

దిల్లీ, కాన్పూర్, రోపార్‌లలో ఉత్కృష్ట కేంద్రాల ప్రారంభం

ఈనాడు, హైదరాబాద్: కృత్రిమమేధ(ఏఐ) సాయంతో ఆరోగ్య సంరక్షణ.. వ్యవసాయం.. సుస్థిర నగరాల అభివృద్ధి కోసం కేంద్ర విద్యాశాఖ భారీ కార్యాచరణ చేపట్టింది. ఈ మేరకు దిల్లీ, కాన్పూర్, రోపార్‌లలో ఉత్కృష్ట కేంద్రాల (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్)ను వర్చువల్ పద్ధతిలో మంగళవారం ప్రారంభించింది. దేశంలోని ఐఐటీలు, ఎన్ఐటీలు, కేంద్రీయ విశ్వవిద్యాలయాలు ఈ కేంద్రాలు సూచించిన పరిశోధనలపై దృష్టి కేంద్రీకరించనున్నాయి. ఇందులో భాగంగా పరిశోధనలు, అంకుర సంస్థలకు తోడ్పాటు కోసం వచ్చే నాలుగేళ్లలో రూ.990 కోట్లు ఖర్చు చేయనున్నట్లు కేంద్రం తెలిపింది. పంజాబ్, హరియాణా సహా రైతులు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో వ్యవసాయం లాభసాటిగా మార్చే పరిశోధనలను ఐఐటీ రోపార్ ఉత్కృష్ట కేంద్రం పర్యవేక్షించనుంది. సుస్థిర నగరాల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను ఏఐ సహకారంతో ఐఐటీ కాన్పూర్ ఆచార్యులు విశ్లేషించనున్నారు. ట్రాఫిక్ నిర్వహణ, తాగునీరు, విద్యుత్, ఇంధనం ప్రజలందరికీ అందేలా చేయాలన్నది ప్రథమ లక్ష్యం. గ్రామీణ ప్రాంతాలు, బస్తీలు, పట్టణాల్లో ఆధునిక వైద్యసేవలు అందించడంపై దిల్లీ ఎయిమ్స్‌లోని ఉత్కృష్ట కేంద్రం పనిచేయనుంది.

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి

భాజపా ఎంపీ ధర్మపురి అర్వింద్

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: 'రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వస్తుందని భావించాం.. కేవలం ఎనిమిది సీట్లకే పరిమితం కావాల్సి వచ్చింది. పార్లమెంటు ఎన్నికల్లో భాజపాకు ఓటేసిన వారు ఎమ్మెల్యే ఎన్నికల్లో ఎందుకు వేయలేదో రాష్ట్ర నాయకత్వం ఆలోచిస్తే బాగుంటుంది. ప్రజలు మాకు ఓటేసేందుకు సిద్ధంగా ఉన్నారు.. ఇప్పటి నుంచే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాల్సిన అవసరం ఉంది' అని నిజామాబాద్ పార్లమెంటు సభ్యుడు, భాజపా నేత ధర్మపురి అర్వింద్ పేర్కొన్నారు. నిజామాబాద్‌లో మంగళవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 'జీహెచ్ఎంసీ ఎన్నికల్లో 48 మంది కార్పొరేటర్లను గెలిపించుకున్నాం.. అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం హైదరాబాద్ చుట్టుపక్కల ఒక ఎమ్మెల్యే సీటూ గెలవలేకపోయాం, దీనిపై పార్టీ ఆలోచన చేయాలి' అని సూచించారు.

మంథని ఆర్డీవో సరెండర్

మంథని, న్యూస్‌టుడే: పెద్దపల్లి జిల్లా మంథని ఆర్డీవో హనుమానాయక్‌ను రాష్ట్ర భూపరిపాలన ప్రధాన కమిషనర్‌కు సరెండర్ చేస్తూ కలెక్టర్ శ్రీహర్ష మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంచిర్యాల-వరంగల్ గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి భూసేకరణలో, సింగరేణి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలులో నిర్లక్ష్యం వహించడంతో పాటు కోర్టు ఆదేశాలను అమలుపర్చకపోవడం, అక్రమాలకు పాల్పడినట్లు ఫిర్యాదులు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మంథని ఇన్‌ఛార్జి ఆర్డీవోగా పెద్దపల్లి ఆర్డీవో గంగయ్యకు బాధ్యతలు అప్పగించారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి: టీఎన్‌జీఓ

ఈనాడు, హైదరాబాద్: ఉద్యోగుల పెండింగ్ డీఏలు విడుదల చేయాలని, సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి మంగళవారం టీఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ వినతిపత్రం సమర్పించారు. స్టాండింగ్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని, ఏపీ నుంచి తెలంగాణకు తిరిగి వచ్చిన ఉద్యోగులకు పోస్టింగ్ ఇచ్చి జీతాలు చెల్లించాలని తదితర సమస్యలను విన్నవించారు.



బుడిబుడి అడుగులతో నేర్చుకోండి

మీరేదైనా కొత్త భాష నేర్చుకుంటున్నారనుకోండి. అందులో మొదటి పాఠం పూర్తికాగానే.. ఐక్యరాజ్య సమితిలో ఆ భాషకు అనువాదకులుగా మారగలరా? లేదు కదా..! కానీ ఆ కొత్త భాషలో కప్పు కాఫీ ఆర్డర్ చేయడమో.. ఇతరులను పలకరించడమో ప్రారంభించగలరు. వ్యాపారం సహా మీరు తలపెట్టే ఇతర బృహత్తర పనుల విషయంలోనూ ఇదే వర్తిస్తుంది. కొత్తలో చాలా ఇబ్బందిగా అనిపిస్తుంది. అయినా బెంబేలెత్తిపోకండి. బుడిబుడి అడుగులతో నైపుణ్యాలు అలవర్చుకోండి. తప్పులు సరిదిద్దుకోండి. క్రమంగా మీరే రాణిస్తారు.

– మార్క్ రాండాల్ఫ్, నెట్‌ఫ్లిక్స్ సహ వ్యవస్థాపకుడు

అద్దె రాలేదు.. ఇదేం బాలేదు!

- యజమానుల నిరసన
- ప్రైవేటు భవనాల్లో నడుస్తున్న గురుకులాలకు తాళాలు
- నెలల తరబడి బకాయిలు..
- కొంతమేర విడుదల చేసిన ప్రభుత్వం



మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని బీసీ గురుకుల భవనానికి తాళం వేసి నిరసన తెలుపుతున్న యజమానులు ★ మంచిర్యాల జిల్లా తాండూరులో..

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రైవేటు భవనాల్లో నడుస్తున్న గురుకులాలు, సంక్షేమ వసతిగృహాలకు ప్రభుత్వం ప్రతినెలా అద్దె డబ్బులు సక్రమంగా విడుదల చేయకపోవడంతో బకాయిలు భారీగా పెరిగిపోయాయి. ఈ నిధులను విడుదల చేయాలంటూ కొన్నినెలలుగా యజమానులు కోరుతున్నా ఫలితం లేకపోవడంతో మంగళవారం ప్రైవేటు భవనాల యజమానుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆయా యజమానులు గురుకులాలకు తాళాలు వేసి నిరసన తెలిపారు. బకాయిలు చెల్లించిన తరువాతే తాళాలు తీస్తామని, పరిస్థితిని అర్థం చేసుకోవాలంటూ బ్యానర్లు ప్రదర్శించారు. ఉదయాన్నే పాఠశాలకు చేరుకున్న ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందిని లోపలికి వెళ్లనీయకపోవడంతో బయటే నిలబడాల్సి వచ్చింది. క్షేత్రస్థాయి పరిస్థితులు తెలుసుకున్న సంక్షేమ గురుకుల సొసైటీల కార్యదర్శులు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ప్రభుత్వం కొన్ని సొసైటీల్లో తాత్కాలిక ఉపశమనం కోసం 3 నుంచి 4 నెలల అద్దె బకాయిలు విడుదల చేసింది. సాయంత్రానికి పాఠశాలల ప్రిన్సిపాళ్ల ఖాతాల్లో డబ్బులు జమకావడంతో చెక్కులు జారీచేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

60% అద్దె భవనాల్లోనే..

రాష్ట్రంలో 5 నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థుల కోసం 1,023 గురుకులాలున్నాయి. వీటిలో 662 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. గ్రామాలు, పట్టణాలు, నగరాల వారీగా చదరపు అడుగుకు రూ.9 నుంచి రూ.20 వరకు అద్దెలు ఖరారయ్యాయి. ఒక్కో గురుకులం దాదాపు 40 వేల చ.అడుగుల విస్తీర్ణంలో ఉంది. ప్రాంతాలవారీగా నెలకు అద్దె కింద రూ.4 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు సొసైటీలు చెల్లిస్తున్నాయి. ఈ బకాయిలు భారీగా పెరిగిపోయాయి. అలాగే అదనపు సౌకర్యాల కోసం నిర్మాణాలకు రెండేళ్ల క్రితం అద్దె ఖరారైనా ఇప్పటివరకు విడుదల చేయలేదు. ఈ లెక్కన ఏటా ప్రైవేటు భవనాల్లోని గురుకులాలు, వసతిగృహాలకు చెల్లించాల్సిన అద్దె దాదాపు రూ.300 కోట్ల వరకు ఉంటోంది. సంక్షేమ సొసైటీలు అద్దె చెల్లించేందుకు వీలుగా నెల, రెండునెలలకోసారి బిల్లులు సిద్ధంచేసి ట్రెజరీకి పంపిస్తున్నా.. అవన్నీ ఆంక్షలతో అక్కడే నిలిచిపోయాయి. ట్రెజరీల్లో అద్దెబకాయిల బిల్లులు రూ.200 కోట్ల వరకు ఉన్నట్లు అంచనా.

✦ బీసీ సంక్షేమ సొసైటీ పరిధిలో ఏడాదికి అద్దె డిమాండ్ రూ.120 కోట్లు. మార్చి నుంచి సెప్టెంబరు వరకు 7 నెలల బకాయిలు ఉండగా.. ఇందులో 3 నెలలకు రూ.39 కోట్లు విడుదలయ్యాయి. ఇంకా 4 నెలల బకాయిలున్నాయి.

✦ మైనార్టీ సొసైటీలో 14 నెలలుగా అద్దె చెల్లించలేదు. ఏటా రూ.90 కోట్లు చెల్లించాలి. మంగళవారం భవన యజమానుల ఆందోళన నేపథ్యంలో ప్రభుత్వం 4 నెలల బకాయిలు రూ.28 కోట్లు విడుదల చేసింది.

సొసైటీలవారీగా అద్దెభవనాలు..	
వెనుకబడిన తరగతులు	306
మైనార్టీ సంక్షేమం	179
సాంఘిక సంక్షేమం	135
గిరిజన సంక్షేమం	42

✦ ఎస్సీ గురుకుల సొసైటీలో చివరగా జనవరిలో అద్దె చెల్లించగా 8 నెలల బకాయిలున్నాయి. తాజాగా 2 నెలలకు మాత్రమే నిధులు మంజూరయ్యాయి.

✦ గురుకుల పాఠశాలలతో పోల్చితే సంక్షేమ వసతిగృహాల్లో అద్దె బకాయిల భారం అధికంగా ఉంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమశాఖల్లో కొన్ని వసతిగృహాలకు రెండేళ్లుగా చెల్లించడం లేదు.

వారం రోజుల్లో చెల్లించాలి..

– దేవేందర్‌రెడ్డి, అధ్యక్షుడు, తెలంగాణ గురుకుల ప్రైవేటు భవనాల యజమానుల సంఘం

పండగలోపు 50% బకాయిలు ఇస్తామని హామీఇచ్చినా నెరవేరలేదు. మంగళవారం గురుకులాలకు తాళాలు వేయడంతో ప్రభుత్వం కొంతమేర మంజూరు చేసింది. మిగతా బకాయిలు వారం రోజుల్లో ఇవ్వాలని కోరుతున్నాం. కొన్నిచోట్ల ఒప్పందాల కాలపరిమితి ముగిసినా అద్దె పెంచలేదు. గ్రామాలు, పట్టణాలు, నగరాల వారీగా అద్దెఖరారు సమానంగా ఉండాలి. సొసైటీలవారీగా వేర్వేరు ధరలు ఉండకూడదు. అద్దె పెంపు, ఇతర విషయాలపై త్వరలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కలను కలవనున్నాం. ప్రస్తుతం సొసైటీల వారీగా రెండు, మూడు నెలల బకాయిలు విడుదల చేసినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు.

భద్రాద్రి రామయ్యకు యూట్యూబ్ ఛానల్

'భద్రాద్రి దివ్యక్షేత్రం' పేరుతో ఏర్పాటు

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం రామాలయం తరఫున 'భద్రాద్రి దివ్యక్షేత్రం' పేరిట యూట్యూబ్ ఛానల్‌ను ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈఓ రమాదేవి మంగళవారం ప్రకటించారు. ఇందులో భద్రాచలంలోని ఉత్సవాల విశేషాలను, పూజల సమస్త సమాచారాన్ని అప్‌లోడ్ చేయనున్నారు. దీంతో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న రామ భక్తులకు ఇక్కడి రోజువారీ క్రతువుల గురించి వివరించే వెసులుబాటు లభించింది. ఇప్పటికే ఇది ట్రయల్ రన్ పూర్తి చేసుకుంది. భద్రాచలం రాములవారికి రెండు తెలుగు రాష్ట్రాలలో దాదాపు 1300 ఎకరాల భూమి ఉంది. సుమారు 68 కిలోల బంగారం, 980 కిలోల వెండి ఉంది. వీటికి సంబంధించిన పూర్తి వివరాలతో 20 నిమిషాల నిడివి ఉన్న ఏవీని తయారు చేశారు. దీన్ని త్వరలో భద్రాద్రి దివ్యక్షేత్రం యూట్యూబ్ ఛానల్‌లో అప్‌లోడ్ చేయనున్నారు. దీంతో పాటు ఆలయంలో నిర్వహించిన పలు ఉత్సవాల వీడియోలను సైతం ఇందులో పొందుపర్చనున్నారు.



భద్రాద్రి ఆలయం

ఝార్ఖండ్ ఎన్నికలకు ఏఐసీసీ పరిశీలకుడిగా భట్టి విక్రమార్క

ఈనాడు, దిల్లీ: ఝార్ఖండ్‌లో నవంబరు 13, 20 తేదీల్లో జరగబోయే ఎన్నికలకు ఏఐసీసీ సీనియర్ పరిశీలకుడిగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క నియమితులయ్యారు. పార్టీ సీనియర్ నేతలు తారిక్ అన్వర్, లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష మాజీ నేత అధీర్ రంజన్ చౌధురిలతోపాటు భట్టి విక్రమార్కను సీనియర్ పరిశీలకులుగా నియమిస్తూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మంగళవారం ప్రకటన విడుదల చేశారు.

మరాఠ్వాడ, ఉత్తర మహారాష్ట్ర పరిశీలకులుగా ఉత్తమ్, సీతక్క: మహారాష్ట్రలో వచ్చే నెల 20న జరగబోయే ఎన్నికలకు ఏఐసీసీ సీనియర్ పరిశీలకులుగా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క నియమితులయ్యారు. మరాఠ్వాడా ప్రాంత బాధ్యతలను రాజస్థాన్ మాజీ ఉపముఖ్యమంత్రి సచిన్ పైలట్‌తో కలిసి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఉత్తర మహారాష్ట్ర బాధ్యతలను కర్ణాటక రాజ్యసభ సభ్యుడు సయ్యద్ నజీర్ హుస్సేన్‌తో కలిసి మంత్రి సీతక్క పర్యవేక్షిస్తారు.

విద్యార్థుల జీవితాలతో రేవంత్ సర్కారు చెలగాటం

కేటీఆర్ విమర్శ



ఈనాడు, హైదరాబాద్: లక్షల మంది విద్యార్థుల జీవితాలతో రేవంత్‌రెడ్డి సర్కారు చెలగాటమాడుతోందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. "గురుకులాల్లో నాణ్యమైన ఆహారం లేకుండా చేసి భద్రతపరంగా విద్యార్థులను భయాందోళనలకు గురిచేశారు. గురుకుల భవనాలకు కనీసం అద్దె కూడా చెల్లించడంలేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకారవేతనాలు చెల్లించకుండా విద్యార్థులను తీవ్ర మానసిక ఆందోళనకు గురిచేస్తున్నారు. సీఎంకు విద్యారంగంలో సమస్యలు తెలుసుకునే ఓపిక లేదు. సమస్యలు పరిష్కరించకుంటే విద్యార్థులతో కలిసి పోరాటాలు చేస్తాం" అని ఓ ప్రకటనలో కేటీఆర్ పేర్కొన్నారు.

ఉట్నూరులో కేటీఆర్‌పై కేసు నమోదు

ఉట్నూరు, న్యూస్‌టుడే: మూసీనది ప్రక్షాళన, హైడ్రాపై సామాజిక మాధ్యమాల్లో భారాస నేత కేటీఆర్ ప్రజలను రెచ్చగొడుతున్నారని... ఆయనపై చర్యలు తీసుకోవాలని ఈ నెల 2న కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ ఫిర్యాదుచేశారు. ఈ మేరకు కేటీఆర్‌పై సీఐ మొగిలి సోమవారం కేసు నమోదు చేశారు.

గురుకులాలకు అద్దె బకాయిలు విడుదల చేయాలి

డిప్యూటీ సీఎం ఆదేశాలు



ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రైవేటు భవనాల్లో కొనసాగుతున్న సంక్షేమ గురుకులాలకు అద్దె బకాయిలు విడుదల చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు అనుగుణంగా గురుకులాల్లో విద్యార్థుల మెస్‌ఛార్జీలు పెంచాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. అన్ని విషయాలు పరిగణనలోకి తీసుకుని మెస్, కాస్మోటిక్, ట్యూటర్ల ఛార్జీల పెంపుపై సంక్షేమ శాఖలు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. గురుకుల సొసైటీల కార్యదర్శులు రోజూ ఒక గురుకులాన్ని సందర్శించాలని, నెలాఖరులోగా ఎన్ని సందర్శించారు.. ఏయే చర్యలు చేపట్టారన్న విషయాలపై నివేదికలు ఇవ్వాలని కోరారు. మంగళవారమిక్కడ సచివాలయంలో గురుకుల కార్యదర్శులతో భట్టి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ "రాష్ట్రంలో వసతిగృహాలు, గురుకులాల మెస్, కాస్మోటిక్ బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నాం. అధికారులు బోధనలో నాణ్యత పెంచేలా చర్యలు తీసుకోవాలి. బోధనపై ఉపాధ్యాయులు, అధ్యాపకులకు నిపుణులతో అవసరమైన సూచనలు, సలహాలు అందించాలి. టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్ఎం) వినియోగాన్ని పెంచాలి. అద్దె భవనాల యజమానులు ఒప్పందం మేరకు సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపట్టాలి. గురుకులాల్ని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సందర్శించాలని ఇప్పటికే సూచించాం" అని తెలిపారు. ఈ సమీక్షలో ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు బుర్రా వెంకటేశం, సందీప్‌కుమార్ సుల్తానియా, కృష్ణభాస్కర్, సైదులు, తఫ్సీర్ ఇక్బాల్, సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చదువులకు ఇబ్బందులు కలిగిస్తే క్రిమినల్ కేసులు

గురుకుల అద్దె భవనాల యజమానులకు మంత్రి పొన్నం హెచ్చరిక



హైదరాబాద్, న్యూస్‌టుడే: అద్దె బకాయిల నెపంతో ఎవరైనా గురుకుల భవనాలకు తాళాలు వేస్తే తక్షణ చర్యలుంటాయని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. విద్యార్థుల చదువులకు ఇబ్బందులు కలిగిస్తే క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు. మంగళవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఎక్కడైనా భవనాల యజమానులు ఇబ్బందులు పెడితే గురుకుల ప్రిన్సిపాళ్లు స్థానిక పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేయాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలో గురుకులాలను మూసి వేసే కుట్ర జరుగుతోందంటూ భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ 'ఎక్స్'లో పోస్ట్ చేయడాన్ని మంత్రి ఖండించారు. అధికారంలో ఉన్నప్పుడు రూ.వేల కోట్ల బకాయిలు పెట్టి, ఇప్పుడు పోస్ట్ చేస్తారా? అని నిలదీశారు.

- కేటీఆర్ వల్లే రాష్ట్రంలో గురుకులాలకు తాళాలు వేసే పరిస్థితి వచ్చిందని మంత్రి సీతక్క ఆరోపించారు. గురుకులాలు మూత పడే పరిస్థితి ఉండదని స్పష్టం చేశారు.

డిప్యుటేషన్‌పై మేడ్చల్ జిల్లాకు ఏడుగురు ఉపాధ్యాయులు

ఈనాడు, హైదరాబాద్: పాఠశాల విద్యాశాఖలో డిప్యుటేషన్ల పర్వం మొదలైంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు ఏడుగురు ఉపాధ్యాయులను ఈ విద్యా సంవత్సరం వరకు డిప్యుటేషన్‌పై బదిలీ చేస్తూ విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 5న ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి. బదిలీపై వచ్చిన ఏడుగురిలో ఆరుగురు ఇతర జిల్లాల నుంచి వచ్చారు. మరొకరు మేడ్చల్ జిల్లాలో పనిచేస్తున్నవారే కావడం గమనార్హం.

ఇకపై రోజుకు 2.4 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి: సీఎండీ

ఈనాడు, హైదరాబాద్: ఇకపై రోజుకు 2.4 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయాలని అన్ని ఏరియాల జనరల్ మేనేజర్ల(జీఎం)ను సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం సింగరేణి భవన్ నుంచి అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లతో బొగ్గు ఉత్పత్తిపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. కంపెనీ నిర్దేశించుకున్న ఉత్పత్తి, ఉత్పాదకత పెంపునకు ప్రతిఒక్కరు సమన్వయంతో పనిచేయాల్సిందేనని స్పష్టం చేశారు.

EENADU Vol: 51, Iss: 66 | Printed and Published by D N Prasad on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt. Ltd. Printed at Ushodaya Publications, Eenadu Press, Plot No. A-1/1, Block No. 3, Industrial Development Area, Uppal, Hyderabad, Medchal District - 500 039, Telangana State. Published at Eenadu Corporate Office, Ramoji Film City, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy District - 501 512, Telangana State. Editor: D N Prasad. Phone: 040-22232223. RNI No. 27656/75. Regd. No. HSE/1009/2024-26, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao



రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తున్న అల్జీర్స్ విశ్వవిద్యాలయం ప్రతినిధి

'మేక్ ఇన్ ఇండియా'లో పాల్గొనండి

- అల్జీరియా కంపెనీలకు రాష్ట్రపతి పిలుపు

అల్జీర్స్: భారత్, అల్జీరియా దేశాలు పరస్పర ఆర్థిక సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పిలుపునిచ్చారు. ఆఫ్రికా దేశమైన అల్జీరియాలో పర్యటిస్తోన్న ఆమె రాజధాని అల్జీర్స్‌లో 'అల్జీరియన్-ఇండియన్ ఎకనామిక్ ఫోరమ్'ను ఉద్దేశించి ప్రసంగించారు. సులభతర వాణిజ్యం ద్వారా భారత్ సత్వరాభివృద్ధిని సాధిస్తోందని తెలిపారు. 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమంలో భాగస్వాములు కావాలని అల్జీరియా కంపెనీలకు సూచించారు. తద్వారా 'మేక్ ఫర్ వరల్డ్'కు ప్రేరణగా నిలవాలని అభిలషించారు. అల్జీరియాలోని వివిధ రంగాల్లో ఉన్న అవకాశాలను భారత కంపెనీలు అందిపుచ్చుకోవాలని రాష్ట్రపతి కోరారు. అల్జీర్స్‌లో నిర్వహించిన మరో కార్యక్రమంలో ద్రౌపదీ ముర్ము గౌరవ డాక్టరేట్ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ విషయాన్ని సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా రాష్ట్రపతి కార్యాలయం వెల్లడించింది.

ఆన్‌లైన్ నమోదు లేకున్నా అయ్యప్ప దర్శనం

- నిరసనలతో వెనక్కు తగ్గిన కేరళ ప్రభుత్వం

తిరువనంతపురం: శబరిమల అయ్యప్ప దర్శనానికి ఆన్‌లైన్‌లో మాత్రమే నమోదు చేసుకోవాలన్న తమ నిర్ణయాన్ని కేరళ ప్రభుత్వం వెనక్కు తీసుకుంది. సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతుండటంతో తన నిర్ణయాన్ని మార్చుకుంది. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోకపోయినా భక్తులకు అయ్యప్ప దర్శనం కల్పిస్తామని ముఖ్యమంత్రి పినరయి విజయన్ మంగళవారం అసెంబ్లీలో స్పష్టం చేశారు. వర్చువల్ నమోదు గురించి తెలియకుండా వచ్చిన వారికీ దర్శనం ఉంటుందని స్పష్టం చేశారు. ప్రమాదానికి గురైనప్పుడు లేదా తప్పిపోయినప్పుడు భక్తులను గుర్తించేందుకు ఆన్‌లైన్ నమోదు ఉపయోగపడుతుందని అన్నారు. ఈ విధానం తిరుపతిలోనూ అమలులో ఉందని గుర్తుచేశారు. కాగా గత ఏడాదిలానే స్పాట్ బుకింగ్ విధానాన్ని కొనసాగించనున్నారా లేదా అన్న విషయంపై స్పష్టతనివ్వలేదు.

మహారాష్ట్ర, ఝార్ఖండ్ రాష్ట్రాల్లో ఒంటరి పోటీ: మాయావతి

లఖ్‌నవూ/దిల్లీ: మహారాష్ట్ర, ఝార్ఖండ్ రాష్ట్రాల శాసనసభల ఎన్నికలతోపాటు ఉత్తర్‌ప్రదేశ్‌లో 9 అసెంబ్లీ స్థానాలకు జరగనున్న ఉప ఎన్నికల్లో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) ఒంటరిగా పోటీ చేస్తుందని ఆ పార్టీ చీఫ్ మాయావతి మంగళవారం వెల్లడించారు. ఈ ఎన్నికలు ధనబలం, కండబలానికి అతీతంగా జరిగేలా చూడటం ఎన్నికల సంఘం (ఈసీ) బాధ్యతగా 'ఎక్స్' ద్వారా ఆమె పేర్కొన్నారు.

బశీర్హాట్ ఉప ఎన్నిక మాటేమిటి?: టీఎంసీ

మహారాష్ట్ర, ఝార్ఖండ్ రాష్ట్రాల ఎన్నికల షెడ్యూలు ప్రకటించిన ఈసీ పశ్చిమ బెంగాల్‌లోని బశీర్హాట్ లోక్‌సభ స్థానం ఉప ఎన్నికను ఎందుకు ప్రకటించలేదని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీ మంగళవారం ప్రశ్నించింది. ఈసీ భాజపా ఆదేశాల మేరకు కావాలనే బశీర్హాట్ విషయంలో వ్యూహాత్మక జాప్యం చేస్తోందని తప్పుబట్టింది. టీఎంసీ పార్లమెంటు సభ్యుడు ఎస్.కె. నూరుల్ ఇస్లాం (61) క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ సెప్టెంబరు 25న మృతిచెందడంతో బశీర్హాట్ లోక్‌సభ స్థానం ఖాళీ అయింది. ఎన్నికల పిటిషను పెండింగు కారణంగా ఈ స్థానానికి ఉప ఎన్నిక తేదీని ప్రకటించడం లేదని చెప్పడం కావాలనే జాప్యం చేయాలని చూసే ఎత్తుగడగా టీఎంసీ పేర్కొంది.

ట్రంపెట్‌ను స్తంభింపజేయలేం

- 'బాకా' ప్రముఖంగా కనిపించేలా మాత్రం చూస్తాం
- ఎన్సీపీ(ఎస్పీ)కి తేల్చిచెప్పిన ఈసీ

దిల్లీ: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లోని (ఈవీఎంలు) బ్యాలట్ యూనిట్లపై ఎన్సీపీ (ఎస్పీ) ఎన్నికల చిహ్నం 'బాకా' ప్రముఖంగా కనిపించేలా చూడాలన్న ఆ పార్టీ విజ్ఞప్తికి కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) మంగళవారం అంగీకారం తెలిపింది. అదే సమయంలో ట్రంపెట్ గుర్తును స్తంభింపజేయాలన్న వినతిని మాత్రం తోసిపుచ్చింది. 'మనిషి బాకా ఊదుతున్న' తమ పార్టీ ఎన్నికల గుర్తు ఈవీఎం బ్యాలట్ కేంద్రాలపై ప్రముఖంగా కనిపించడం లేదంటూ ఎన్సీపీ (ఎస్పీ) ఎన్నికల సంఘం దృష్టికి తీసుకొచ్చిందని సీఈసీ రాజీవ్‌కుమార్ తెలిపారు. "బ్యాలట్ యూనిట్లపై మీ పార్టీ గుర్తు ఎలా ఉండాలనుకుంటున్నారో స్పష్టం చేయాల్సిందిగా మేం వారిని కోరాం. అందుకు వారు మూడు ఐచ్ఛికాలను సమర్పించారు. మేం వారు చేసిన సూచనల్లో మొదటి దానిని ఆమోదించాం" అని వెల్లడించారు. ఎన్నికల చిహ్నాల జాబితా నుంచి ట్రంపెట్‌ను తొలగించాలన్న డిమాండ్‌ను మాత్రం తోసిపుచ్చామని స్పష్టంచేశారు. ఎన్నికల గుర్తుల కేటాయింపునకు సంబంధించి ప్రస్తుతం ఉన్న విధానానికి ఆటంకాలు సృష్టించాలనుకోవట్లేదని చెప్పారు. మనిషి బాకా ఊదుతున్న గుర్తుకు ట్రంపెట్ గుర్తుకు ఎలాంటి పోలికా లేదని ఈ సందర్భంగా రాజీవ్‌కుమార్ ఉద్ఘాటించారు. అయితే ఈ రెండు గుర్తులూ ఒకేలా ఉన్నాయని, ఆ కారణంగానే లోక్‌సభ ఎన్నికల సమయంలో ఓటర్లు గందరగోళానికి గురయ్యారని శరద్‌పవార్ పార్టీ వాదిస్తోంది.

సీబీఐ మాజీ అధిపతి పీసీ శర్మ మృతి

దిల్లీ: సీబీఐ మాజీ డైరెక్టర్ పీసీ శర్మ (82) మూడు రోజులుగా ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి 7.45 గంటలకు మృతి చెందారు. బుధవారం ఆయన అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు వెల్లడించారు. 1966 ఐపీఎస్ బ్యాచ్, అస్సాం కేడర్‌కు చెందిన శర్మ 2001, ఏప్రిల్ 30న సీబీఐ అధిపతిగా బాధ్యతలు చేపట్టారు. 2003, డిసెంబరు 6 వరకూ ఆ పదవిలో కొనసాగారు. ముంబయి బాంబు పేలుళ్ల కేసులో దోషి అబూ సలేంను పోర్చుగల్ నుంచి స్వదేశానికి రప్పించడంలో శర్మ కీలకపాత్ర పోషించారు.

మరింత ముదిరి పాకాన

- భారత్ సహకరించడం లేదంటూ ట్రూడో ఆక్రోశం
- బిష్ణోయ్ ముఠాతో లంకె పెడుతూ కొత్త ఆరోపణలు
- తీవ్రంగా ఖండించిన భారత్



టొరంటో, దిల్లీ: భారత్-కెనడా దౌత్య వివాదం మరింత ముదిరి పాకాన పడుతోంది. కవ్వింపు చర్యలకు పాల్పడుతున్న కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో తాజాగా మరిన్ని ఆరోపణలు చేశారు. సమస్యల పరిష్కారానికి భారత్ సహరించడం లేదంటూ ఆక్రోశం వెళ్లగక్కారు. గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ ముఠాతో భారత ప్రభుత్వ ఏజెంట్లకు సంబంధాలున్నాయని చెప్పేందుకు ప్రయత్నించారు. ఆరుగురు కెనడా దౌత్యవేత్తలు ఈ నెల 19వ తేదీ అర్ధరాత్రిలోగా దేశం విడిచి వెళ్లిపోవాలని, కెనడాలోని భారత దౌత్యాధికారులు స్వదేశానికి వచ్చేయాలని భారత్ ప్రకటించిన నేపథ్యంలో ట్రూడో హడావిడిగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు.

ఏం చేయడానికైనా వెనుకాడను

"కెనడా గడ్డపై కెనడా పౌరుడు హర్దీప్ సింగ్ నిజ్జర్‌ను హత్య చేయడంలో భారత ప్రభుత్వ ఏజెంట్ల ప్రమేయం ఉందని 'రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీస్' (ఆర్‌సీఎంపీ) నివేదిక సమర్పించింది. ప్రజా భద్రతకు ముప్పు కలిగించే కార్యకలాపాల్లో వీరు నిమగ్నమై ఉన్నారనే ఆధారాలను అందులో చూపించింది. ఏజెంట్లపై చట్టపరమైన చర్యలు చేపట్టేందుకు ప్రయత్నించినా భారత్ మాకు సహకరించడం లేదు. భారత ప్రభుత్వానికి చెందిన ఆరుగురు ఏజెంట్లు నేర కార్యకలాపాలకు ఆసక్తి చూపుతున్నట్లు ధ్రువీకరణ అయింది. ఆ ఆరుగురు కెనడా వదిలివెళ్లాలి. భారత సార్వభౌమాధికారాన్ని, ప్రాదేశిక సమగ్రతను మేం గౌరవిస్తాం. భారత్ నుంచి మేమూ అదే ఆశిస్తున్నాం. ప్రధానిగా పౌరుల భద్రతకు భరోసా ఇవ్వడం నా బాధ్యత. దానికోసం ఏం చేయడానికైనా వెనుకాడను" అని ట్రూడో పేర్కొన్నారు.

ఆంక్షలకు సిద్ధం!

హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్య జరిగిన దగ్గరినుంచి భారత్‌తో కయ్యానికి కాలు దువ్వుతోన్న కెనడా ఇప్పుడు ఏకంగా ఆంక్షలకు సిద్ధమవుతున్నట్లు కనిపిస్తోంది. ఆ దేశ విదేశాంగ మంత్రి మెలానీ జోలీ ఆ అర్థం వచ్చేలా వ్యాఖ్యలు చేశారు. నిర్ణయం తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నామంటూ రెచ్చగొట్టేలా స్పందించారు. బిష్ణోయ్ గ్యాంగ్‌తో కలిసి భారత ఏజెంట్లు.. ఖలిస్థాన్ అనుకూలురను లక్ష్యంగా చేసుకుని కెనడా భూభాగంపై పని చేస్తున్నారంటూ కెనడా ఆరోపించింది.

నిందలు వేయడం వారికి అలవాటే

అస్పష్టమైన ఆరోపణలు చేయడం, తిరస్కరిస్తే నిందలు మోపడం వంటి విధానాన్ని కెనడా మొదటి నుంచీ అవలంబిస్తోందని భారత్ ఆరోపించింది. నిజ్జర్ హత్య కేసుకు సంబంధించి విశ్వసనీయమైన సమాచారాన్ని ఇచ్చామని కెనడా చేస్తున్న వాదనల్లో నిజం లేదని తెలిపింది. పాత విషయాలను ట్రూడో మళ్లీ తెరపైకి తెచ్చారని విదేశీ వ్యవహారాల శాఖ వర్గాలు పేర్కొన్నాయి. ట్రూడో ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశాయి. అదే పాత ట్రూడో, అదే పాత కారణాలతో, అదే పాత విషయాలను చెప్పారని ఎద్దేవా చేశాయి.

✦ ట్రూడోతో బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ ఫోన్లో మాట్లాడారు. చట్ట ప్రకారం పాలించడానికి ఉన్న ప్రాముఖ్యాన్ని ఇరువురు నేతలూ అంగీకరించారు.

అంతర్గత రాజకీయాలతోనే అక్కసు

- భారత్‌పై కెనడా తీరుకు కారణం అదే!
- తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటున్న ట్రూడో

ఇంటర్నెట్ డెస్క్: చూస్తుండగానే అధికారంపై పట్టు సడలిపోవడం.. దేశ ప్రజలతోపాటు సొంత పార్టీలోనూ వ్యతిరేకత.. వీటన్నింటినీ తప్పించుకోవడానికి ఇప్పుడు కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోకు అత్యవసరంగా ఓ సంచలన ఘటన కావాల్సి వచ్చింది. తనను తాను బలోపేతం చేసుకొనేందుకు అది ఉపయోగపడాలి. దీంతో దాదాపు ఏడాదికిపైగా కోల్డ్‌స్టోరేజ్‌లో పడేసిన నిజ్జర్ హత్య కేసును మళ్లీ బయటకు తీసి భారత్‌పై నిందలు మోపే పని మొదలుపెట్టారని విశ్లేషకులు చెబుతున్నారు. భారత ప్రభుత్వ ఏజెంట్లు కెనడా వాసులకు ప్రాణాంతకంగా మారారని, వారిని కఠినంగా ఎదుర్కొన్నామని పేరు తెచ్చుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు.

పాతాళంలోకి ప్రతిష్ఠ

2015లో అధికారంలోకి వచ్చిన లిబరల్ పార్టీ రెండేళ్ల నుంచి ప్రజాభిమానం కోల్పోవడం మొదలైంది. 2017లో ఆగాఖాన్ సంస్థ నుంచి బహుమతుల రూపంలో పరస్పర విరుద్ధ ప్రయోజనాలు పొందడం, 2019లో న్యాయ వ్యవస్థలో జోక్యానికి సంబంధించిన ఎస్ఎన్‌సీ-లవలిన్ వివాదం, బ్లాక్ ఫేస్ వివాదం వంటివి ట్రూడో ప్రతిష్ఠను దెబ్బతీశాయి. 2019లో ఆ పార్టీ బలం బాగా తగ్గిపోయి మిత్రపక్షాలపై ఆధారపడాల్సి వచ్చింది. మరుసటి ఏడాదే ఆర్థిక మంత్రి బిల్‌తో ట్రూడోకు వివాదం మొదలైంది. బిల్ తన పదవికి రాజీనామా చేశారు. పూర్తి మెజార్టీ సాధించవచ్చని ఆశపడి 2021లో మళ్లీ ఎన్నికలకు వెళ్లి ట్రూడో చేతులు కాల్చుకొన్నారు. మరోసారి మైనార్టీ ప్రభుత్వమే ఏర్పాటు చేయాల్సి వచ్చింది. ఈ ఏడాది జులైలో ఉప ఎన్నికల్లో పార్టీకి అత్యంత పట్టున్న సీట్లలో కూడా ఓటమి ఎదురైంది.



ప్రతిపక్ష నేత కంటే వెనుకంజ

ట్రూడోపై కెనడా ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొంది. ఇటీవల ఇప్సాస్ విడుదల చేసిన పోల్స్‌లో ఆయన్ని 26% మంది మాత్రమే ప్రధానిగా చూడాలనుకుంటున్నారు. ప్రతిపక్ష నేత, కన్జర్వేటివ్ పార్టీ నేత పెర్రీ పోయిలీవ్రే కంటే ఇది ఏకంగా 19 శాతం తక్కువ. ట్రూడో ప్రభుత్వం పతనం ఖాయమని జులైలో కూడా సర్వేలు వెలువడ్డాయి. ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకున్నట్లు న్యూ డెమొక్రటిక్ పార్టీ ప్రకటించింది. ఈ పార్టీ కోసమే భారత్‌తో ట్రూడో విరోధం పెట్టుకోవడం గమనార్హం. రెండ్రోజుల క్రితమే ట్రూడోకు వ్యతిరేకంగా ఆ దేశ పార్లమెంటు హాల్లో స్వపక్షీయులే సంతకాల సేకరణ చేపట్టినట్లు సీబీసీ పత్రిక పేర్కొంది. భారీ సంఖ్యలో లిబరల్ ఎంపీలు దీనిలో పాల్గొన్నట్లు తెలుస్తోంది. వచ్చేఏడాది అక్టోబరులో జరగనున్న ఫెడరల్ ఎన్నికలకు ఆయన నేతృత్వంలో వెళితే ఓటమి ఖాయమని సొంత పార్టీ నేతలకే అర్థమైపోయింది.

సిక్కు ఓట్ల కోసం.. ఖలిస్థానీ రాగం..!

కెనడాలో దాదాపు 7,70,000 మంది సిక్కు ఓటర్లు ఉన్నారు. దేశంలో నాలుగో అతిపెద్ద జాతి ఇది. వారిలో కొద్దిమంది బలమైన వ్యక్తులు భారత్‌లో వేర్పాటువాదానికి మద్దతు పలుకుతున్నారు. దీంతో వారిని మచ్చిక చేసుకోవడానికి ట్రూడో ఖలిస్థానీ అనుకూల వైఖరి ప్రదర్శిస్తున్నారు. ఇందుకోసం భారత్-కెనడా సంబంధాలను దెబ్బతీయడానికి కూడా వెనుకాడటం లేదు. 2018లో ట్రూడో భారత్ సందర్శనకు వచ్చినపుడు కెనడా హైకమిషనర్ ఇచ్చిన విందుకు జస్పాల్ అత్వాల్‌ను ఆహ్వానించారు. పంజాబ్ మంత్రి హత్యకు కుట్రపన్నినట్లు అత్వాల్‌పై ఆరోపణలున్నాయి. 2023 జీ20 సమావేశాల అనంతరం కెనడా సర్కారు నిజ్జర్ హత్య వివాదాన్ని ఎగదోసే ప్రయత్నం మొదలుపెట్టింది. అప్పటినుంచి ఇరు దేశాల సంబంధాలు గణనీయంగా దెబ్బతిన్నాయి. భారత్‌తో చర్చల్లో ఉన్న ఎఫ్‌టీఏ ఒప్పందాన్ని పక్కన పెట్టేశారు.

తెగేదాకా లాగుతున్న ట్రూడో

తాజా పరిణామాల నేపథ్యంలో భారత్‌పై ఆంక్షలు విధించే అంశాన్ని తాము పరిశీలిస్తున్నట్లు ట్రూడో మంత్రివర్గంలోని మెలానీ జోలీ పేర్కొన్నారు. అదే సమయంలో ఎన్డీపీ నేత జగ్మీత్ సింగ్ కూడా భారత్‌పై ఆంక్షలు విధించాలని వంతపాడారు. ఫెడరల్ ఎన్నికలకు ఏడాది సమయమే ఉండటంతో ఎలాగైనా ఎన్‌డీపీ మద్దతు సాధించడం, లేదా దాని ఓటర్లను ఆకర్షించడమే లక్ష్యంగా ట్రూడో రాజకీయాలు సాగుతున్నాయి.

ఎలా ఉన్నారు?



- పరస్పరం పలకరించుకున్న జైశంకర్, పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్

ఇస్లామాబాద్: షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సులో పాల్గొనేందుకు పాకిస్థాన్ వెళ్లిన భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్ పొరుగుదేశ ప్రధానితో కొద్దిసేపు ముచ్చటించారు. పాకిస్థాన్ కాలమానం ప్రకారం జైశంకర్ విమానం మంగళవారం సాయంత్రం 3.30 గంటలకు ఇస్లామాబాద్ శివారులోని నూర్ ఖాన్ వైమానిక స్థావరంలో దిగింది. అనంతరం ఆ దేశ ఉన్నతాధికారులు జైశంకర్‌కు స్వాగతం పలికారు. మరోవైపు, ఎస్‌సీఓ సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన సభ్యదేశాల ప్రతినిధులకు పాక్ ప్రధాని మంగళవారం రాత్రి తన నివాసంలో విందు ఇచ్చారు. ఈ సందర్భంగా జైశంకర్, షెహబాజ్‌లు కరచాలనం చేసుకున్నారు. కొద్దిసేపు మాట్లాడుకున్నారు. ఎస్‌సీఓ సదస్సులో భారత బృందానికి జైశంకర్ నేతృత్వం వహిస్తారు. తొమ్మిదేళ్ల తర్వాత భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి పాకిస్థాన్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. 2015 డిసెంబరులో అప్పటి విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ పాకిస్థాన్‌లో పర్యటించారు.

ఇస్లామాబాద్ చేరుకున్న భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్‌కు ఓ చిన్నారి స్వాగతం

వక్ఫ్ బిల్లుపై భేటీలో నియమాల ఉల్లంఘన

- లోక్‌సభ స్పీకర్‌కు విపక్షాల లేఖ
- వరుసగా రెండోరోజు వాకౌట్

దిల్లీ: వక్ఫ్ సవరణ బిల్లు పరిశీలనకు జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) ఛైర్మన్ జగదాంబికా పాల్ నిర్వహించిన సమావేశం పార్లమెంటు ప్రవర్తనా నియమావళిని పూర్తిగా ఉల్లంఘించిందంటూ ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎంపీలు మంగళవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. వక్ఫ్ ఆస్తులను దోచుకున్నారంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కె.రెహమాన్ ఖాన్ సహా పలువురు విపక్ష నేతల పేర్లతో కర్ణాటక రాష్ట్ర మైనారిటీస్ కమిషన్ మాజీ ఛైర్మన్ అన్వర్ మణిప్పాడి కమిటీకి సమర్పించిన నివేదికకు నిరసనగా సోమవారం జేపీసీ సమావేశాన్ని ప్రతిపక్షాల సభ్యులు బహిష్కరించారు. ఈ నేపథ్యంలో స్పీకర్‌కు లేఖ రాసిన విపక్ష నేతలు.. భాజపా ఎంపీలు తమ పట్ల అభ్యంతరకర పదజాలం వాడుతున్నారని ఆరోపిస్తూ వరుసగా రెండోరోజు భేటీని గంటసేపు బాయ్‌కాట్ చేశారు. జేపీసీ ఛైర్మన్ జగదాంబికా పాల్ ఈ సమావేశాన్ని పక్షపాత ధోరణితో నిర్వహిస్తున్నారని కాంగ్రెస్ సభ్యులు గౌరవ్ గొగొయ్, సయ్యద్ నసీర్ హుసేన్, ఇమ్రాన్ మసూద్.. డీఎంకే ఎంపీలు ఎ.రాజా, ఎం.ఎం.అబ్దుల్లా, ఆలిండియా ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, టీఎంసీ సభ్యుడు కల్యాణ్ బెనర్జీ లేఖలో ఆరోపించారు. వక్ఫ్ సవరణ బిల్లుపై చర్చించాల్సిన సమావేశాన్ని రాజకీయ ప్రేరేపిత ఆరోపణలకు వేదికగా మార్చారని ఆక్షేపించారు. రాజ్యసభలో విపక్ష నేతగా రాజ్యాంగపరమైన ఉన్నత పదవిలో ఉన్న ఖర్గే ఈ సమావేశంలో లేరని విపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలిపినా, సాక్షిని మాట్లాడేందుకు ఛైర్‌పర్సన్ అనుమతించారని తెలిపారు. సమావేశంలో విపక్ష సభ్యులకు తగినంత సమయం ఇవ్వడం లేదని, పక్షపాత రహితంగా పార్లమెంటరీ నిబంధనలకు అనుగుణంగా కమిటీ సమావేశాన్ని నిర్వహించేలా స్పీకర్ తక్షణం జోక్యం చేసుకోవాలని లేఖలో కోరారు. మరోవైపు.. విపక్ష సభ్యులు జేపీసీ ఛైర్మన్‌ను దుర్భాషలాడుతున్నారని సమావేశంలో పాల్గొన్న భాజపా సభ్యులు ఆరోపించారు. వక్ఫ్ బోర్డుల్లో మహిళలను చేర్చాలన్న ప్రతిపాదనపై విపక్ష సభ్యులతో భాజపా ఎంపీలు నిశికాంత్ దుబే, దిలీప్ సైకియా, అభిజిత్ గంగూలీ తీవ్ర వాగ్వాదానికి దిగారు.

అటువంటి సంబంధం అత్యాచారం కాదు

- ఏకాభిప్రాయంతో కొనసాగిన 'బంధం'పై అలహాబాద్ హైకోర్టు

ప్రయాగ్‌రాజ్: అత్యాచారాన్ని నిర్వచించే ఐపీసీ సెక్షన్ 375 ప్రకారం ఎలాంటి మోసపూరిత అంశాలు లేకుండా దీర్ఘకాలంపాటు ఏకాభిప్రాయంతో కొనసాగిన శారీరక సంబంధాన్ని అత్యాచారంగా పరిగణించలేమని అలహాబాద్ హైకోర్టు వ్యాఖ్యానించింది. వివాహ వాగ్దానాలు మొదటి నుంచి నేరపూరితమని రుజువైతే తప్ప ఏకాభిప్రాయంతో కొనసాగిన శారీరక సంబంధాన్ని అత్యాచారంగా చూడలేమని పేర్కొంది. ఈ మేరకు పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ మహిళపై అత్యాచారానికి పాల్పడ్డారన్న ఆరోపణలతో మొరాదాబాద్‌కు చెందిన పిటిషన్‌దారుడు శ్రేయ్ గుప్తాపై క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను రద్దు చేస్తూ జస్టిస్ అనీష్‌కుమార్ గుప్తా తీర్పు వెలువరించారు. తన భర్త మరణించిన తరువాత శ్రేయ్ గుప్తా వివాహ వాగ్దానంతో తనకు దగ్గరై శారీరక సంబంధం పెట్టుకున్నారని ఓ మహిళ మొరాదాబాద్ మహిళా ఠాణాలో చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. గుప్తా తనను మోసం చేసి మరో మహిళతో వివాహ నిశ్చితార్థం చేసుకున్నారని ఆమె పేర్కొంది. పైగా మా ఇద్దరి సన్నిహిత వీడియోలను విడుదల చేయకుండా ఉండేందుకు రూ.50 లక్షలు డిమాండ్ చేశారని ఆరోపించారు. వీటి ఆధారంగా ట్రయల్ కోర్టు ఐపీసీ సెక్షన్ 376(అత్యాచారం), 386(దోపిడీ) కింద గుప్తాపై దాఖలు చేసిన 2018 ఆగస్టు 9 నాటి ఛార్జి పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకుంది. దీంతో ఆయన తనపై క్రిమినల్ ప్రొసీడింగ్‌లను రద్దు చేయాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన కోర్టు.. ఫిర్యాదుదారు తన భర్త జీవించి ఉన్నప్పటి నుంచే 12-13 ఏళ్లుగా నిందితుడితో శారీరక సంబంధం కొనసాగించారని గమనించింది. నయీమ్ అహమ్మద్ వర్సెస్ స్టేట్ ఆఫ్ హరియాణా కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రస్తావిస్తూ.. వివాహ వాగ్దానాలు ఉల్లంఘించిన ప్రతి వ్యక్తిపై సెక్షన్ 376 ప్రకారం అత్యాచారానికి పాల్పడ్డారని విచారణ జరపడం మూర్ఖత్వమని హైకోర్టు పునరుద్ఘాటించింది. ఫిర్యాదుదారు చేసిన అత్యాచారం లేదా దోపిడీ ఆరోపణలు చట్టపరమైన ప్రమాణాలకు అనుగుణంగా లేవని పేర్కొంది.

ఇరాన్ అణు, చమురు స్థావరాలపై దాడి చేయం

- అమెరికాకు మాటిచ్చిన నెతన్యాహు

వాషింగ్టన్: ఇరాన్ అణు, చమురు స్థావరాలపై దాడి చేయబోమని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మాటిచ్చారు. ఇటీవల వారి మధ్య జరిగిన ఫోన్ సంభాషణలో ఈ విషయం చర్చకు వచ్చినట్లు సమాచారం. ఇరువురు నేతలు ఇరాన్‌పై ప్రతీకార దాడులకు సంబంధించిన విషయాలపై చర్చించినట్లు అమెరికాకు చెందిన ఓ అధికారి పేర్కొన్నారు. ఇరాన్ చమురు స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులకు తెగబడితే ఇంధన ధరలు పెరిగిపోతాయని పలువురు విశ్లేషకులు ఆందోళన చెందుతున్నారు. ఇది అమెరికా ఎన్నికలపై తీవ్ర ప్రభావం చూపుతుందని, ఇజ్రాయెల్ ప్రత్యామ్నాయం ఆలోచించాలని నెతన్యాహుకు బైడెన్ సూచించారు. ఆయన సూచనల మేరకు ఇరాన్ చమురు స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులను విరమించుకున్నట్లు తెలుస్తోంది.

బాహ్య ప్రపంచంలోకి ఖుద్స్ ఫోర్స్ చీఫ్

ఇంటర్నెట్ డెస్క్: ఇరాన్‌కు చెందిన అత్యున్నత దళం ఖుద్స్ ఫోర్స్ చీఫ్ ఇస్మాయిల్ ఖానీ చాలారోజుల తర్వాత బాహ్య ప్రపంచానికి కనిపించారు. ఆయన ఓ కార్యక్రమంలో పాల్గొన్న చిత్రాలను ఇరాన్ ప్రభుత్వ టీవీ ప్రసారం చేసింది. కొన్నాళ్ల క్రితం ఇజ్రాయెల్ చేసిన దాడిలో ఆయన మరణించినట్లు ప్రచారం జరిగింది. అనంతరం.. ఇరాన్ రహస్యాలను ఇజ్రాయెల్‌కు చేరవేయడంతో ఆయనను అరెస్టు చేసినట్లు వార్తలొచ్చాయి. హెజ్‌బొల్లా చీఫ్ హత్యలో ఖానీ పేరున్నట్లు కథనాలొచ్చాయి. ఒక దశలో ఇంటరాగేషన్‌లో ఆయన కుప్పకూలినట్లు వీటిల్లో పేర్కొన్నారు. ఇరాన్ ఈ ఆరోపణలను తోసిపుచ్చింది. ఇవి పూర్తిగా అవాస్తవమని దౌత్యవర్గాలు పేర్కొన్నాయి. ఆయనకు సుప్రీం లీడర్ ఖమేనీ చేతుల మీదుగా అత్యున్నత పురస్కారం ఇవ్వనున్నట్లు మరోవైపు ఐఆర్‌జీసీ పేర్కొంది. ఇటీవల మరణించిన ఐఆర్‌జీసీ కమాండర్ అబ్బాస్‌కు సంబంధించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇరాన్‌కు విదేశాల్లో అవసరమైన ఆపరేషన్లను ఖుద్స్ ఫోర్స్ నిర్వహిస్తుంది. లెబనాన్‌లో హెజ్‌బొల్లా, గాజాలో హమాస్, యెమెన్‌లో హూతీలకు ఇది చేదోడువాదోడుగా ఉంటుంది.

ఒక్కనెలలో 84.5 లక్షల వాట్సప్ ఖాతాలపై వేటు



ఇంటర్నెట్ డెస్క్: మెటాకు చెందిన మెసేజింగ్ యాప్ వాట్సప్‌ను భారత్‌లో కోట్లాదిమంది వినియోగిస్తుండగా.. దీన్ని అడ్డాగా చేసుకొని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. ఇటీవలి కాలంలో ఈ తరహా మోసాలు విపరీతంగా పెరిగాయి. ఈ నేపథ్యంలో ఐటీ యాక్ట్, 2021 నిబంధనలను అనుసరించి ఆగస్టు నెలలో మొత్తం 84.58 లక్షల ఖాతాలను నిషేధించినట్లు వాట్సప్ పేర్కొంది. ఇందులో సుమారు 16.61 లక్షల ఖాతాలను ముందుజాగ్రత్త చర్యగా నిషేధించామని తెలిపింది. మోసానికి అవకాశం ఉండే బల్క్ మెసేజీలు లేదా అసాధారణ సందేశాలను వాట్సప్ తన స్వయంచాలక విధానం ద్వారా ముందుగానే గుర్తించి ఈ చర్యలు చేపట్టింది. ఆగస్టు నెలలోనే గ్రీవెన్స్ మెకానిజం ద్వారా వినియోగదారుల నుంచి 10,707 ఫిర్యాదులు అందినట్లు వాట్సప్ వెల్లడించింది.

కలహాలకు దూరం సుమా

- శ్రేణులకు కాంగ్రెస్ దిశానిర్దేశం

దిల్లీ: అంతర్గత కలహాలకు ఏమాత్రం తావు ఇవ్వొద్దని మహారాష్ట్ర, ఝార్ఖండ్‌లలో పార్టీ శ్రేణులకు కాంగ్రెస్ పార్టీ దిశా నిర్దేశం చేసింది. ఇటీవల హరియాణా ఎన్నికల్లో చేదు ఫలితాలకు కొంతవరకు అంతర్గత లుకలుకలే కారణమనే విశ్లేషణలు వెలువడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇంటిని చక్కదిద్దుకోవడంపై పార్టీ అధిష్ఠానం ప్రత్యేకంగా దృష్టి సారించింది. పార్టీ సహచరులపై, ఇండియా కూటమిలోని ఇతర పక్షాల నేతలపై బాహాటంగా ఎలాంటి వ్యతిరేక వ్యాఖ్యలు చేయొద్దని గట్టిగా హెచ్చరించింది. తేడా వస్తే కఠిన చర్యలు ఉంటాయని పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ స్పష్టంగా సందేశమిచ్చారు. ఈ మేరకు ఒక అంతర్గత సమావేశంలో వారిద్దరూ మాట్లాడారు. ఇండియా కూటమిలోని మూడు పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు అంశం 80% వరకు కొలిక్కి వచ్చింది. ఎక్కువ స్థానాలు గెలుచుకున్న పార్టీకి చెందిన ముఖ్యమంత్రి అభ్యర్థిని ఎంపిక చేయడం ఇంతవరకు కూటమిలో ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుతం మహారాష్ట్రలో విపక్షంలో అతిపెద్ద పార్టీగా ఉన్నందువల్ల సీఎం పీఠం తమకే దక్కాలనే భావన కాంగ్రెస్ నేతల్లో బలంగా ఉంది. తాము రేసులో ఉన్నామంటూ ఇప్పటికే కొందరు నేతలు సంకేతాలు ఇస్తూ వచ్చారు. ముఖ్యంగా లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత పార్టీకి ఊపు వచ్చింది.

7 విమానాలకు ఎక్స్ వేదికగా బెదిరింపులు

- షికాగో విమానం కెనడాకు దారిమళ్లింపు
- సౌదీ-లఖ్‌నవూ విమానం జైపుర్‌కు..

దిల్లీ: భారత విమానాలకు బాంబు బెదిరింపులు ఆగడం లేదు. తాజాగా దిల్లీ నుంచి అమెరికాలోని షికాగో వెళుతున్న ఎయిరిండియా విమానం సహా ఏడు విమాన సర్వీసులకు 'ఎక్స్' వేదికగా బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో భద్రతా సంస్థలు ఉరుకులు పరుగులు పెట్టాయి. మరోవైపు, దేశ వాణిజ్య రాజధాని ముంబయి నుంచి బయలుదేరాల్సిన మూడు అంతర్జాతీయ విమాన సర్వీసులకు సోమవారం బాంబు బెదిరింపులు వచ్చిన సంగతి తెలిసిందే. దిల్లీ-షికాగో మధ్య నడిచే ఎయిరిండియా విమానం ఏఐ127 మంగళవారం దిల్లీ నుంచి బయలుదేరింది. ఈ విమానానికి భద్రతా ముప్పు పొంచిఉందంటూ ఎక్స్‌లో ఓ పోస్టు కనిపించింది. ముందుజాగ్రత్త చర్యగా ఆ విమానాన్ని కెనడాలోని ఇకలుట్ విమానాశ్రయానికి మళ్లించినట్లు ఎయిరిండియా పేర్కొంది. మంగళవారం తెల్లవారుజామున దిల్లీ నుంచి బయలుదేరిన ఈ విమానం అమెరికా కాలమానం ప్రకారం ఉదయం 7 గంటలకు షికాగో చేరుకోవాల్సి ఉంది. బెదిరింపులు వచ్చిన సర్వీసుల్లో జైపుర్ నుంచి అయోధ్య మీదుగా బెంగళూరుకు వెళ్లే ఎయిరిండియా విమానం, దర్భంగా నుంచి ముంబయి వెళ్లే స్పైస్‌జెట్ విమానం, పశ్చిమబెంగాల్‌లోని బాగ్డోరా నుంచి బెంగళూరు వెళ్లే ఆకాశా ఎయిర్ విమానం, సౌదీఅరేబియాలోని దమ్మామ్ విమానాశ్రయం నుంచి లఖ్‌నవూ వచ్చే ఇండిగో విమానం, అమృత్‌సర్-డెహ్రాడూన్-దిల్లీ అలయన్ ఎయిర్ విమానం, మదురై నుంచి సింగపూర్ వెళ్లాల్సిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ఉన్నాయి. లఖ్‌నవూ రావాల్సిన సర్వీసును బెదిరింపు నేపథ్యంలో రాజస్థాన్‌లో జైపుర్‌లో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. ఆ విమానంలో ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని అధికారులు తెలిపారు. అయోధ్యలో తనిఖీల అనంతరం ఎయిరిండియా విమానం బెంగళూరు బయలుదేరింది. అదే సమయంలో తమ విమానాల్లో ఎలాంటి పేలుడు పదార్థాలు లేనట్లు తనిఖీల అనంతరం అధికారులు ప్రకటించారని ఆకాశ ఎయిర్, స్పైస్‌జెట్‌లు ప్రకటించాయి.

ఇల్లు జప్తుతో వీధినపడ్డ కేరళ గృహిణి.. రుణం తీర్చి ఆదుకొన్న 'లులు' అధినేత






ఇంటర్నెట్ డెస్క్: అప్పులవాళ్లు ఇల్లు స్వాధీనం చేసుకోవడంతో ఆసరా కోల్పోయి ఇద్దరు పిల్లలతో ఎటువెళ్లాలో తెలియక వీధినపడ్డ కేరళ గృహిణికి 'లులు' గ్రూప్ ఛైర్మన్ ఎం.ఎ.యూసుఫ్ అలి ఆపన్నహస్తం అందించారు. కేరళలోని నార్త్ పరవూర్‌కు చెందిన సంధ్య, ఆమె భర్త ఇంటి నిర్మాణం కోసం ఒక ప్రైవేటు సంస్థ వద్ద 2019లో రూ.4 లక్షల రుణం తీసుకున్నారు. ఈ అప్పు వడ్డీలు పెరిగి రూ.8 లక్షలైంది. అప్పు తీరకముందే.. భార్యాపిల్లల్ని వదిలేసి రెండేళ్ల కిందట ఆమె భర్త ఎటో వెళ్లిపోయాడు. బతుకుతెరువు కోసం ఒక దుస్తుల దుకాణంలో పనిచేస్తున్న సంధ్యపై రుణభారం పడింది. ఆ మొత్తం చెల్లించాలంటూ ఆమెకు నాలుగుసార్లు నోటీసులు ఇచ్చిన రుణసంస్థ ఇంటిని జప్తు చేసింది. సంధ్య, ఆమె పిల్లలు కట్టుబట్టలతో రోడ్డుపై నిలబడ్డారు. మీడియా ద్వారా ఈ విషయం యూసుఫ్ అలి దృష్టికి వెళ్లింది. ఆయన తమ సిబ్బందిని పంపి రుణం మొత్తం చెల్లించడమే కాకుండా, సంధ్యకు రూ.10 లక్షల ఆర్థికసహాయం కూడా చేశారు. లులు గ్రూప్ మీడియా ప్రతినిధి ఆమెకు ఇంటి తాళంచెవి అందజేశారు.


ట్రంప్‌ను ఏమైనా చేస్తే.. అది అమెరికాపై దాడే

- ఇరాన్‌కు బైడెన్ సర్కారు హెచ్చరిక

ఇంటర్నెట్ డెస్క్: అమెరికా మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌పై వరుస హత్యాయత్నాలతో బైడెన్ సర్కారులో ఆందోళన మొదలైంది. ఇప్పటికే ఆయన ఇరాన్ హిట్‌లిస్ట్‌లో ఉండడంతో టెహ్రాన్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ట్రంప్‌కు వ్యతిరేకంగా కుట్ర యత్నం చేసినా.. దాన్ని యుద్ధాన్ని ప్రేరేపించే చర్యగానే భావిస్తామని అమెరికా అధికారి ఒకరు పేర్కొన్నారు. ట్రంప్‌నకు ముప్పు అంశంపై జో బైడెన్ నిత్యం తాజా సమాచారం తెలుసుకోవడంతో పాటు.. తగిన చర్యలకు తన బృందాన్ని ఆదేశిస్తున్నారని సదరు అధికారి తెలిపారు. ఇరాన్ కుట్రలపై దృష్టిపెట్టాలని ఆయన సూచించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఇరాన్‌లో ఉన్నత స్థాయి అధికారులకు బైడెన్ సూచనల మేరకు ఈ సందేశాన్ని పంపినట్లు తెలుస్తోంది. ట్రంప్ హత్యాయత్నానికి కుట్రలు చేయడాన్ని తక్షణమే ఆపేయాలని కోరినట్లు సమాచారం. అంతేకాదు.. ఏ హత్యాయత్నమైనా జరిగితే దానిని యుద్ధాన్ని ప్రేరేపించే చర్యగానే అమెరికా భావిస్తుందని స్పష్టం చేసినట్లు సమాచారం. మరోవైపు ఇరాన్ తాము అమెరికా వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం లేదని స్పష్టంచేసింది. అదే సమయంలో వాషింగ్టన్ మాత్రం తమ అంతర్గత విషయాల్లో ఏళ్ల తరబడి జోక్యం చేసుకొంటోందని ఆరోపించింది.

పెన్సిల్వేనియాపై పట్టుకు కమల, ట్రంప్ హోరాహోరీ





ఓక్స్: అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలను మలుపు తిప్పగల రాష్ట్రాల్లో ఆధిక్య సాధనకు పాలక, ప్రతిపక్ష అభ్యర్థులైన కమలా హారిస్ (59), డొనాల్డ్ ట్రంప్ (78) తమ కృషిని ముమ్మరం చేశారు. 19 నియోజక గణ ఓట్లు ఉన్న పెన్సిల్వేనియా రాష్ట్రంలో సోమవారం నాటికి వారు 46 ప్రచార సభలు నిర్వహించారు. ఎక్కువ నియోజక గణ ఓట్లు ఉన్న మిషిగన్‌లో 33, విస్కాన్సిన్ రాష్ట్రాలలో 29 సభలు నిర్వహించారు. సోమవారం పెన్సిల్వేనియా రాష్ట్రంలోని ఎరీలో ఉపాధ్యక్షురాలు, డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్ ప్రచారం చేయగా, అదే రాష్ట్రంలోని ఫిలడెల్ఫియా నగర శివార్లలో రిపబ్లికన్ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రచార సభ నిర్వహించారు. ఈ రాష్ట్రంలో తపాలా ఓట్లను ఎక్కువ సంఖ్యలో సాధించడానికి కమల ప్రయత్నిస్తున్నారు. ట్రంప్ సోమవారం ఓక్స్‌లో ప్రసంగిస్తూ తాను అధ్యక్షుడినైతే చమురు కోసం డ్రిల్లింగ్‌ను విపరీతంగా పెంచేస్తానని ప్రకటించారు. దీనివల్ల చమురు, గ్యాస్ ధరలు తగ్గిపోతాయన్నారు.

అయిదేళ్లలో 5 లక్షల ఉద్యోగాలు

టాటా గ్రూప్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్



దిల్లీ: వచ్చే అయిదేళ్లలో తయారీ రంగంలో టాటా గ్రూపు 5 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తుందని టాటా సన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ వెల్లడించారు. సెమీ కండక్టర్లు, విద్యుత్ వాహనాలు, బ్యాటరీలు, వాటి సంబంధిత రంగాల్లో మా పెట్టుబడుల వల్ల, ఇన్ని ఉద్యోగాలు వస్తాయని ఇండియన్ ఫౌండేషన్ ఫర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కార్యక్రమంలో ఆయన చెప్పారు. ఈ ఉద్యోగాలు పలు రూపాల్లో ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతాయని విశ్లేషించారు. తయారీ రంగంలో ఉద్యోగాలు సృష్టించకుంటే.. అభివృద్ధి చెందిన దేశంగా అవతరించలేమని వివరించారు. అస్సాంలో సెమీకండక్టరు ప్లాంటు, విద్యుత్ వాహనాలు, బ్యాటరీల కోసం తయారీ యూనిట్లను ఏర్పాటు చేస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. దేశంలో ప్రతి నెలా 10 లక్షల మంది కొత్తగా ఉద్యోగ విపణిలోకి వస్తున్నారని, వారికి అవకాశం కల్పించాల్సి ఉందని ఆయన వివరించారు. 'దేశంలో మొత్తం 10 కోట్ల ఉద్యోగాలను సృష్టించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా సెమీకండక్టర్ల లాంటి కొత్త తరం తయారీ రంగంపై దృష్టి పెట్టాలి. ఇందులో లభించే ప్రతి ఒక్క ఉద్యోగానికి అనుబంధంగా మరో 8-10 పరోక్ష ఉద్యోగావకాశాలు ఏర్పడతాయ'ని చంద్రశేఖరన్ తెలిపారు.

సైబర్ సెక్యూరిటీ నిపుణులకు అమిత గిరాకీ



కంపెనీలే అన్వేషిస్తున్నాయ్

ఈనాడు, హైదరాబాద్: ఐటీ రంగంలో కొంతకాలంగా అవకాశాల కొరత ఐటీ నిపుణులను ఇబ్బంది పెడుతోంది. కానీ సైబర్ సెక్యూరిటీ విభాగం దీనికి మినహాయింపుగా కనిపిస్తోంది. సైబర్ సెక్యూరిటీ నైపుణ్యాలున్న వారు ఎవరూ ఖాళీగా ఉండాల్సిన అవసరం లేనంతగా, ఈ విభాగంలో ఉద్యోగాలు లభిస్తున్నాయి. వాస్తవానికి ఐటీ కంపెనీలే సైబర్ సెక్యూరిటీలో సమర్థుల కోసం అన్వేషిస్తున్నాయి. మానవ వనరుల సేవల సంస్థ ఇండీడ్, తాజా నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. గత ఏడాది కాలంలో సైబర్ సెక్యూరిటీ ఉద్యోగాల సంఖ్య 14% పెరిగినట్లు ఈ సంస్థ వివరించింది.

బెంగళూరుకు పోటీగా హైదరాబాద్

సైబర్ సెక్యూరిటీ ఉద్యోగాల లభ్యత బెంగళూరులో అధికంగా ఉన్నట్లు ఇండీడ్ నివేదిక పేర్కొంది. ఐటీ పరిశ్రమకు కేంద్ర స్థానమై ఐటీ ఎగుమతుల్లో అగ్రగామిగా ఉండటం, ఎన్నో ఎంఎన్‌సీ కంపెనీలు కొలువ తీరడం ఇందుకు నేపథ్యం. తర్వాత స్థానాల్లో దిల్లీ ఎన్‌సీఆర్, హైదరాబాద్, ముంబయి ఉన్నాయి. బెంగళూరుకు గట్టి పోటీగా ఎదుగుతున్న నేపథ్యంలో హైదరాబాద్‌లోనూ సైబర్ సెక్యూరిటీ ఉద్యోగాలు అధికంగా లభిస్తున్నాయని తెలుస్తోంది.

✦ ఎక్కడి నుంచి అయినా పనిచేసే అవకాశం కూడా ఈ రంగ నిపుణులకు లభిస్తోంది. అవసరమైన సాంకేతిక అర్హతలతో పాటు మెరుగైన కమ్యూనికేషన్ స్కిల్స్ ఉన్న వారికి సైబర్ సెక్యూరిటీ ఉద్యోగాలు అధిక ప్యాకేజీలతో లభిస్తున్నట్లు సమాచారం.

సైబర్ సెక్యూరిటీ ఉద్యోగార్థులకు కావాల్సిన నైపుణ్యాలు

కమ్యూనికేషన్ స్కిల్స్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఫైర్‌వాల్; అజూరే, ఏడబ్ల్యూఎస్

ఈనాడు బిజినెస్

వరల్డ్‌స్టీల్ ఛైర్మన్‌గా టి.వి.నరేంద్రన్

దిల్లీ: టాటా స్టీల్ ఎండీ, సీఈఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న టి.వి.నరేంద్రన్ వరల్డ్‌స్టీల్ అసోసియేషన్ (ప్రపంచ ఉక్కు సంఘం) ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. జేఎస్‌డబ్ల్యూ గ్రూపు ఛైర్మన్ సజ్జన్ జిందాల్ తర్వాత భారత్ నుంచి ఈ పదవికి ఎన్నికైన రెండో వ్యక్తిగా నరేంద్రన్ నిలిచారు. ఆ సంస్థకు 17 మందితో కూడిన ఎగ్జిక్యూటివ్ కమిటీలోనూ సభ్యుడిగా నరేంద్రన్ నియమితులయ్యారు. ఈ కమిటీలో జిందాల్, యార్సెలర్ మిత్తల్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ ఎల్ఎన్ మిత్తల్ కూడా సభ్యులుగా ఉన్నారు.

'బిజినెస్ ఫిన్లాండ్'తో సైయెంట్ జట్టు

ఈనాడు, హైదరాబాద్: పరిశోధనలకు నిధులు సమకూర్చే ఫిన్లాండ్ ప్రభుత్వ సంస్థ 'బిజినెస్ ఫిన్లాండ్'తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు సైయెంట్ లిమిటెడ్ వెల్లడించింది. కృత్రిమ మేధ (ఏఐ), 5జీ, అంతరిక్ష పరిజ్ఞానం, రోబోటిక్స్ విభాగాల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆవిష్కరించడం లక్ష్యంగా ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపింది. ఇందులో భాగంగా ఐరోపాలో.. ముఖ్యంగా ఫిన్లాండ్‌లో అంకుర సంస్థలు, ఇతర టెక్నాలజీ సంస్థలతో సైయెంట్ కలిసి పనిచేస్తుంది. సైయెంట్ భాగస్వామ్యంతో పరిశోధనలు- డిజిటల్ పరిశ్రమలకు ఫిన్లాండ్‌ను కేంద్ర స్థానంగా తీర్చిదిద్దాలనేది తమ ఉద్దేశమని బిజినెస్ ఫిన్లాండ్ డైరెక్టర్ (మధ్యప్రాచ్యం, భారత్) గిట్టా పెరెజ్ అన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆవిష్కరించడానికి ఇది తమకు గొప్ప అవకాశమని సైయెంట్ సీటీఓ, అధ్యక్షుడు రజనీష్ కిని అభిప్రాయపడ్డారు.

ట్రూ గుడ్‌కు రూ.75 కోట్ల పెట్టుబడులు

ఈనాడు, హైదరాబాద్: చిరు ధాన్యాల ఆహార పదార్థాలను ఉత్పత్తి చేసే సంస్థ ట్రూ గుడ్ రూ.75 కోట్ల పెట్టుబడులను సమీకరించింది. ప్యూరో వెల్‌నెస్‌తో పాటు, ఓక్స్ అసెట్ మేనేజ్‌మెంట్, వి ఓషన్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఈ మొత్తాన్ని సమకూర్చాయి. విస్తరణ, పంపిణీ సామర్థ్యాలను పెంచుకునేందుకు ఈ నిధులను వినియోగించనున్నట్లు కంపెనీ సీఈఓ రాజు భూపతి వెల్లడించారు.

జులై- సెప్టెంబరు త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2024-25	నికర లాభం/(నష్టం) 2023-24	మొత్తం ఆదాయం 2024-25	మొత్తం ఆదాయం 2023-24
పీవీఆర్ ఐనాక్స్	(12.1)	166.2	1622.1	1999.9
హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ	576.61	436.52	1058.19	765.35
హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్	433	377	16570	14756
ర్యాలీస్ ఇండియా	98	82	928	832

అంతర్జాతీయ డిజిటల్ నిబంధనావళి



ఏఐ వినియోగంలో నైతిక విలువలు అవసరం: ప్రధాని

దిల్లీ: విమాన రంగానికి ప్రపంచవ్యాప్త నియమావళి ఉన్నట్లుగానే.. డిజిటల్ సాంకేతికత వినియోగంపైనా అంతర్జాతీయ స్థాయిలో ఒక నియమావళి ఉండాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. కృత్రిమ మేధ (ఏఐ)ను ఉపయోగించే సమయంలో నైతిక విలువలు పాటించాలనీ అన్నారు. డిజిటల్‌గా అనుసంధానమైన ప్రపంచంలో, భద్రతను విస్మరించడానికి వీలు లేదని పేర్కొన్నారు. నాలుగేళ్లకు ఒకసారి జరిగే వరల్డ్ టెలికమ్యూనికేషన్ స్టాండర్డైజేషన్ అసెంబ్లీ (డబ్ల్యూటీఎస్ఏ)- 2024ను దిల్లీలోని భారత్ మండపంలో ప్రధాని మోదీ మంగళవారం ప్రారంభించారు. దేశీయ ఆవిష్కరణలు ప్రదర్శించేందుకు నిర్వహించే ఇండియన్ మొబైల్ కాంగ్రెస్ (ఐఎమ్‌సీ) 8వ ఎడిషన్‌ను కూడా ఈ కార్యక్రమంలోనే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని ఏమన్నారంటే..

ఏం చేయాలి.. ఏం చేయకూడదు

డిజిటల్ నిబంధనలు కేవలం వ్యక్తిగత గోప్యతను కాపాడడం, తప్పుడు సమాచారాన్ని నిలువరించడం, టెక్ దిగ్గజాలకు బాధ్యతను గుర్తుచేయడం వంటి సామాజిక ప్రాముఖ్యతలకే పరిమితం కాదు. వస్తువులు, సేవల వాణిజ్యమూ డేటా ప్రసారంపైనే ఆధారపడి ఉంటుందన్న విషయం గుర్తుంచుకోవాలి. సరిహద్దుల్లేని డేటా వల్ల సైబర్ ముప్పు పొంచి ఉంటుంది కాబట్టి సాధారణ ప్రజల భద్రత కోసం 'చేయాల్సినవి, 'చేయకూడనివి' ఏంటనే అంశాలను స్పష్టంగా రూపొందించాలి. అంతర్జాతీయ సంస్థలు ఇందుకు బాధ్యత తీసుకోవాలి.

డిజిటల్ లావాదేవీల్లో 40% వాటా మనదే

టెలికాం, సంబంధిత సాంకేతికత విషయంలో ముందుకెళుతున్న దేశాల్లో భారత్ కూడా ఒకటి. ఇక్కడ 120 కోట్ల మంది మొబైల్ వినియోగదార్లు, 95 కోట్ల మంది ఇంటర్నెట్ వినియోగదార్లున్నారు. మొత్తం ప్రపంచంలో 40 శాతానికి పైగా డిజిటల్ లావాదేవీలు ఇక్కడే జరుగుతున్నాయి. దశాబ్దకాలంలో మొబైల్ దిగుమతుల దేశం స్థాయి నుంచి, ఎగుమతి దేశంగా భారత్ మారింది. 2014లో దేశంలో 2 మొబైల్ తయారీ యూనిట్లు ఉంటే.. ఇప్పుడు ఆ సంఖ్య 200పైకి చేరింది.

✦ భారతీయ వినియోగదార్ల డేటాను దేశంలోనే నిల్వ చేసేలా చర్యలు తీసుకోవాలని రిలయన్స్ జియో ఛైర్మన్ ఆకాశ్ అంబానీ తెలిపారు. 'పట్టణ ప్రాంతాల్లో సేవలందించాలనుకునే శాటిలైట్ కంపెనీలు కూడా మాలాగే టెలికాం లైసెన్సులకు ఫీజులు చెల్లించాలి. వారికి అవే నిబంధనలు వర్తింపజేయాలి' అని భారతీ ఎయిర్‌టెల్ ఛైర్మన్ సునీల్ మిత్తల్ చెప్పారు.

జియో నుంచి రెండు ఫీచర్ ఫోన్లు



4జీ సాంకేతికతతో పనిచేసే ఫీచర్ ఫోన్లు జియోభారత్ వి3, జియో భారత్ వి4 4జీ ఫోన్లను రిలయన్స్ ఆవిష్కరించింది. జియో టీవీ, జియో సినిమా, జియోపే వంటి ప్రీ ఇన్‌స్టాల్డ్ జియో యాప్‌లు, ఇన్ బిల్ట్ సౌండ్ బాక్స్ వంటి ఫీచర్లు లభిస్తాయి. 23 భారతీయ భాషల మద్దతూ ఉంటుంది. వీటి ధర రూ.1099. నెలవారీ రూ.123 రీఛార్జితో అపరిమిత కాలింగ్, 14జీబీ డేటా అందిస్తారు.

'శాట్‌కామ్ కంపెనీలకు స్పెక్ట్రమ్ వేలం ఉండదు'

శాట్‌కామ్ స్పెక్ట్రమ్‌నూ వేలం వేయాలంటూ టెలికాం కంపెనీలు చేసిన డిమాండ్‌ను టెలికాం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తోసిపుచ్చారు. వేలం లేకుండా ఇచ్చినా, శాటిలైట్ ఆధారిత కమ్యూనికేషన్ సేవలకిచ్చే రేడియోవేవ్స్‌కు నిర్దిష్ట ధర అంటూ ఉంటుందని.. దానిని ట్రాయ్ నిర్ణయిస్తుందని చెప్పారు.

కోడి గుడ్లు

16న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	480
వరంగల్	482
విజయవాడ	515
గోదావరి	515
విశాఖపట్నం	515
చిత్తూరు	538

విమాన ప్రయాణికులు 1.30 కోట్లు



విమానాల ఆలస్యం వల్ల 2,16,484 మందిపై ప్రభావం పడగా, వారికి సౌకర్యాలు కల్పించేందుకు కంపెనీలు రూ.2.4 కోట్లు ఖర్చు పెట్టాయి.

ముంబయి: దేశీయ విమాన మార్గాల్లో ప్రయాణికుల సంఖ్య పెరుగుతూనే ఉంది. సెప్టెంబరులో 1.30 కోట్ల మంది ప్రయాణించినట్లు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) తెలిపింది. 2023 సెప్టెంబరులో ప్రయాణించిన 1.22 కోట్ల మందితో పోలిస్తే, ఈ సంఖ్య 6% అధికం. విమానాల సమయపాలనను బెంగళూరు, దిల్లీ, హైదరాబాద్, ముంబయి విమానాశ్రయాల్లో నమోదైన రాకపోకల వివరాల ఆధారంగా తీసుకున్నారు. విమానాల రద్దు వల్ల 48,222 మంది ఇబ్బంది పడగా, వారికి పరిహారం ఇచ్చేందుకు సంస్థలు రూ.88.14 లక్షలు వెచ్చించాయి.

2024 సెప్టెంబరులో	మార్కెట్ వాటా	ప్రయాణికులు (లక్షలు)	సమయ పాలన
ఇండిగో	63%	82.12	69.2%
ఎయిరిండియా	15.1%	19.69	68.1%
విస్తారా	10%	13.08	69.1%
ఏఐఎక్స్ కనెక్ట్	4.1%	5.35	70.1%
ఆకాశ ఎయిర్	4.4%	5.73	61.1%
స్పైస్‌జెట్	2%	2.61	30.4%

2023 జనవరి-సెప్టెంబరులో ప్రయాణికుల సంఖ్య 11.29 కోట్లు

2024 జనవరి-సెప్టెంబరులో ప్రయాణికుల సంఖ్య 11.85 కోట్లు



బీమా సుగమ్ ఇండియా ఫెడరేషన్ ఎండీగా ప్రసూన్ సిక్దర్

ఈనాడు, హైదరాబాద్: అందరికీ బీమా అందించాలనే లక్ష్యంతో భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ) తీసుకొచ్చిన వినూత్న ఆవిష్కరణ బీమా సుగమ్. అన్ని బీమా సంస్థలు అందించే పాలసీలు ఒకే చోట అందుబాటులోకి తీసుకురావడమే దీని ప్రధాన లక్ష్యం. ఇప్పటి వరకు బీమా విస్తృతి లేని ప్రాంతాలకు చేరడంతో పాటు, క్లెయిం చెల్లింపులు, ఫిర్యాదుల పరిష్కారం, ఇతర సేవలను ఒకే చోట అందించడం దీని వెనుక ప్రణాళిక. ఈ నేపథ్యంలో బీమా సంస్థల ఆధ్వర్యంలో బీమా సుగమ్ ఇండియా ఫెడరేషన్ ఏర్పాటయ్యింది. దీనికి తొలి మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓగా ప్రసూన్ సిక్దర్ ఎంపికయ్యారు. ఈ పదవిలో ఈయన మూడేళ్లపాటు కొనసాగుతారు. ఈయన మణిపాల్ సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్‌కు ఎండీ, సీఈఓగా ఉన్నారు. బీమా రంగంలో సిక్దర్‌కు 25ఏళ్లకు పైగా అనుభవం ఉంది. బీమా సుగమ్ ఇండియా ఫెడరేషన్ వ్యవస్థాపక డైరెక్టర్, నామినేషన్ అండ్ రెమ్యునరేషన్ కమిటీ ఛైర్మన్ తపన్ సింఘేల్ నేతృత్వంలోని కమిటీ, కీలకమైన ఈ పదవికి వచ్చిన దరఖాస్తులు పరిశీలించాక సిక్దర్‌ను ఎంపిక చేసింది. అందరికీ బీమా అందించాలనే నియంత్రణ సంస్థ లక్ష్యాన్ని వాస్తవ రూపంలోకి తీసుకొచ్చేందుకు, బీమా సంస్థలతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తామని ప్రసూన్ సిక్దర్ తెలిపారు.

స్కోడా కాంపాక్ట్ ఎస్‌యూవీ కైలాక్

2025 ప్రారంభంలో విపణిలోకి



దిల్లీ: కాంపాక్ట్ స్పోర్ట్స్ వినియోగ వాహనం (ఎస్‌యూవీ) కైలాక్‌ను భారత విపణిలోకి వచ్చే ఏడాది ప్రారంభంలో విడుదల చేయనున్నట్లు స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ పీటర్ జనెబా వెల్లడించారు. ప్రస్తుతం మన దేశంలో కంపెనీ 4 మోడళ్ల (కుశాక్, స్లేవియా, కొడియాక్, సూపర్బ్)ను విక్రయిస్తోంది. దేశీయ విపణిలో అధిక విక్రయాలు నమోదవుతున్న 4 మీటర్ల లోపు ఎస్‌యూవీ విభాగంలోకి వచ్చే ఏడాది ప్రారంభంలో అడుగుపెట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు స్కోడా ఆటో తెలిపింది. మారుతీ సుజుకీ బ్రెజా, హ్యుందాయ్ వెన్యూ, కియా సోనెట్‌లతో స్కోడా కైలాక్ పోటీ పడనుంది. కైలాక్ ప్రాజెక్టుపై స్కోడా సుమారు 25 కోట్ల యూరోల (సుమారు రూ.2,300 కోట్ల) పెట్టుబడులు పెట్టింది.

సొంత మార్గంలో నడవాలి: వేణు శ్రీనివాసన్



దిల్లీ: తయారీ రంగంలో ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా అవతరించాలన్నా.. అత్యుత్తమ సేవలు, ఉత్పత్తులకు వేదికగా నిలవాలన్నా.. తనకంటూ సొంత విధానాన్ని రూపొందించుకుని, ఆ మార్గంలో మన దేశం నడవాలని టీవీఎస్ మోటార్ కంపెనీ గౌరవ ఛైర్మన్ వేణు శ్రీనివాసన్ అభిప్రాయపడ్డారు. జర్మనీ, అమెరికా, జపాన్, కొరియా, చైనా లాంటి దేశాలను అనుసరించడాన్ని కొనసాగిస్తే.. ప్రపంచంతో పోలిస్తే భారత్ వెనకబడే ఉంటుందని ఇండియన్ ఫౌండేషన్ ఫర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కార్యక్రమంలోతెలిపారు. 'గతంలో ప్రపంచంలోనే అత్యంత ముఖ్య ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటి. 700 ఏళ్ల క్రితం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో నాలుగో వంతు వాటా భారత్ నుంచే ఉండేది. వ్యాపారాలకు ప్రధాన కేంద్రంగా ఉండటంతో పాటు రోడ్డు, సముద్ర మార్గాల్లోనూ భారత్‌దే హవా. అలాంటిది ఇప్పుడు వస్తువులు, సేవల అంతర్జాతీయ వాణిజ్యంలో భారత్ వాటా చాలా తక్కువ స్థాయికి పరిమితమైంద'ని ఆయన అన్నారు. అందువల్ల తనకంటూ ప్రత్యేక వృద్ధి మార్గాన్ని మనం రూపొందించుకోవాలన్నారు.

వినూత్న ఉత్పత్తుల సృష్టికి అపార అవకాశాలు

భారత్‌లోని ఇంజినీరింగ్ సామర్థ్యాలకు అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలను జోడిస్తే, రాబోయే తరం కోసం వినూత్న ఉత్పత్తులను సృష్టించేందుకు అద్భుత అవకాశాలు ఉన్నాయని బోయింగ్ ఇండియా ప్రెసిడెంట్ సలీల్ గుప్తా తెలిపారు. 'వాహనం, ఇండస్ట్రియల్ ఇంజినీర్డ్ సిస్టమ్స్, రక్షణ'.. ఏ రంగాన్ని తీసుకున్నా, అపార అవకాశాలకు వేదికగా భారత్ ఉందని ఆయన తెలిపారు. అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలో సత్తా చాటేందుకు ప్రయత్నించడంతో పాటు, అక్కడి అవకాశాలను అందిపుచ్చుకోవడంపై భారతీయ కంపెనీలు దృష్టి సారించాలని సూచించారు.

ఎన్నికల ప్రభావం పడని విధంగా అభివృద్ధి ప్రణాళిక: 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలంటే.. ప్రస్తుత స్థాయికి 6-7 రెట్లు అధికంగా వృద్ధి సాధించాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఇందుకోసం ఎన్నికల ప్రక్రియ ప్రభావం పడని విధంగా అభివృద్ధి ప్రణాళికను ప్రభుత్వం రూపొందిస్తోందని చెప్పారు. '2047 కల్లా అభివృద్ధి చెందిన దేశంగా అవ్వాలంటే తలసరి ఆదాయం 18,000 డాలర్ల (సుమారు రూ.15,00,000)కు చేరాలి. జీడీపీ 30 లక్షల కోట్ల డాలర్లను అందుకోవాలి. ప్రస్తుతం జీడీపీ 4 లక్షల కోట్ల డాలర్లు కాగా.. తలసరి ఆదాయం 3000 డాలర్లు (సుమారు రూ.2,50,000) మాత్రమే. అంటే వచ్చే 25 ఏళ్లలో ప్రస్తుత స్థాయికి 6-7 రెట్ల అధికంగా అభివృద్ధిని సాధించాలి. ఇందుకు బలమైన పునాది, అత్యంత అప్రమత్తతతో కూడిన వ్యూహాల అమలు అవసరం. ఎన్నికల వల్ల, ఆగని విధంగా ఈ ప్రణాళికను రూపొందించుకోవాల'ని మంత్రి వివరించారు.

సూచీల ఎఫ్‌అండ్‌ఓ కాంట్రాక్టుల పరిమితి పెంపు

ముంబయి: ట్రేడింగ్ సభ్యులకు సూచీల ఫ్యూచర్స్, ఆప్షన్స్‌లో పొజిషన్స్ పరిమితిని రూ.7,500 కోట్లు లేదా మార్కెట్‌లోని మొత్తం ఓపెన్ ఇంట్రస్ట్‌లో 15 శాతానికి సెబీ పెంచింది. ఇంతకుముందు ఈ పరిమితి గరిష్ఠంగా రూ.500 కోట్లు లేదా మొత్తం ఓపెన్ ఇంట్రస్ట్‌లో 15 శాతంగా ఉంది. పొజిషన్లకు సంబంధించి సవరించిన ఈ పరిమితి తక్షణమే అమల్లోకి వస్తుందని సెబీ తెలిపింది. సూచీల ఫ్యూచర్స్, ఆప్షన్లకు పొజిషన్ల పరిమితులు వేర్వేరుగా వర్తిస్తాయని పేర్కొంది. ఈక్విటీ డెరివేటివ్స్‌కు ముందు రోజు ఓపెన్ ఇంట్రస్ట్ ఆధారంగా పొజిషన్లను పర్యవేక్షించడం 2025 ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం అవుతుందని సెబీ తెలిపింది.

18% తగ్గిన డీబీ కార్ప్ నికరలాభం

దిల్లీ: దేశంలోని అతిపెద్ద ప్రింట్ మీడియా కంపెనీల్లో ఒకటైన డీబీ కార్ప్, సెప్టెంబరు త్రైమాసికానికి రూ.82.57 కోట్ల ఏకీకృత నికరలాభాన్ని ప్రకటించింది. 2023-24 ఇదే కాల లాభం రూ.100.25 కోట్లతో పోలిస్తే, ఇది 17.63% తక్కువ. ఇదే సమయంలో కార్యకలాపాల ఆదాయం కూడా రూ.586.04 కోట్ల నుంచి 4.62% తగ్గి, రూ.558.95 కోట్లకు పరిమితమైంది. వ్యయాలు స్వల్పంగా పెరిగి రూ.472.17 కోట్లకు చేరాయి.

రుతుపవనాల వర్షాలు ఎక్కువ కాలం కొనసాగడం, మార్కెట్లో వాణిజ్య కార్యకలాపాలు నిదానించడం, వినియోగదారుల వ్యయాలు తగ్గడం తమ లాభాదాయలపై ప్రభావం చూపినట్లు సంస్థ ఎండీ సుధీర్ అగర్వాల్ తెలిపారు. 2023-24 సెప్టెంబరు త్రైమాసికంలో ఎన్నికల వల్ల అధిక ఆదాయం లభించినట్లు వివరించారు. భవిష్యత్తు బాగుంటుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

✦ 5 దినపత్రికలు దైనిక్ భాస్కర్, దివ్య భాస్కర్, దివ్య మరాఠీ, సౌరాష్ట్ర సమాచార్, డీబీ స్టార్ లను డీబీ కార్ప్ ప్రచురిస్తోంది. 94.3 మై ఎఫ్ఎం రేడియో కూడా ఈ సంస్థదే.

✦ సమీక్షా త్రైమాసికంలో ప్రింటింగ్, పబ్లిషింగ్ సంబంధిత వ్యాపార విభాగాల ఆదాయం 6% తగ్గి రూ.517.58 కోట్లకు చేరితే, రేడియో నుంచి 16.31% పెరిగి రూ.41.41 కోట్లకు చేరింది. ప్రకటనల ఆదాయం 6.67% తగ్గి రూ.401.4 కోట్లకు, సర్క్యులేషన్ ఆదాయం 2.48% తగ్గి రూ.117.5 కోట్లకు చేరింది.

✦ రూ.10 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.5 చొప్పున రెండో మధ్యంతర డివిడెండ్ చెల్లించాలని సంస్థ డైరెక్టర్ల బోర్డు ప్రతిపాదించింది.

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర లాభంలో 44% వృద్ధి

దిల్లీ: ప్రభుత్వరంగ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీఓఎం), సెప్టెంబరు త్రైమాసికంలో రూ.1,327 కోట్ల నికరలాభాన్ని ఆర్జించింది. 2023-24 ఇదే కాల లాభం రూ.920 కోట్లతో పోలిస్తే, ఇది 44% ఎక్కువ. ఇదే సమయంలో మొత్తం ఆదాయం రూ.5,736 కోట్ల నుంచి రూ.6,809 కోట్లకు పెరిగింది. నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 3.88% నుంచి 3.98 శాతానికి పెరగడం ప్రత్యేకతగా బీఓఎం మేనేజింగ్ డైరెక్టర్ నిధు సక్సేనా వెల్లడించారు. ప్రభుత్వరంగ బ్యాంకుల్లో తమదే అత్యధికమని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తంమీద నికరలాభం రూ.5,000 కోట్లను అధిగమిస్తామని, ఎన్ఐఎం 3.75-3.85% శ్రేణిలో ఉంచగమనే విశ్వాసాని వ్యక్తం చేశారు. నికర వడ్డీ ఆదాయం రూ.2,432 కోట్ల నుంచి రూ.2,807 కోట్లకు పెరిగింది. స్థూల నిరర్థక ఆస్తులు (జీఎన్‌పీఏ) 2.19% నుంచి 1.84 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.23% నుంచి 0.20 శాతానికి మెరుగయ్యాయి. ఎన్‌పీఏలకు కేటాయింపులు మార్పుమీ లేకుండా రూ.598 కోట్లుగానే ఉన్నాయి.

పెద్ద షేర్లకు అమ్మకాల ఒత్తిడి

ఎఫ్ఐఐల అమ్మకాలు: రూ.1,748.71 కోట్లు

డీఐఐల కొనుగోళ్లు: రూ.1,654.96 కోట్లు

సెన్సెక్స్ ▼153 81820 | నిఫ్టీ ▼71 25057



సమీక్ష

రిలయన్స్ ఇండస్ట్రీస్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వంటి పెద్ద షేర్లకు అమ్మకాల ఒత్తిడి తలెత్తడంతో సూచీలు మంగళవారం నష్టపోయాయి. గత నెలలో ద్రవ్యోల్బణం పెరగడమూ మదుపర్ల సెంటిమెంటును దెబ్బతీసింది. మిశ్రమ అంతర్జాతీయ సంకేతాలు, లాభాల స్వీకరణ వంటివీ ప్రభావం చూపాయి. దీంతో సెన్సెక్స్ 153 పాయింట్లు, నిఫ్టీ 71 పాయింట్ల మేర నష్టపోయాయి. బ్యారెల్ ముడి చమురు 4.71% తగ్గి 73.81 వద్ద ట్రేడవుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 1 పైసా లాభపడి 84.04 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ ఉదయం 82,101.86 పాయింట్ల వద్ద సానుకూలంగా (క్రితం ముగింపు 81,973.05) ప్రారంభమైంది. 82,300.44 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ, అమ్మకాల వల్ల 81,635.57 పాయింట్ల కనిష్ఠ స్థాయిని చేరింది. చివరకు 152.93 పాయింట్ల నష్టంతో 81,820.12 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 70.60 పాయింట్లు కోల్పోయి 25,057.35 వద్ద స్థిరపడింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 20 నష్టపోయాయి. బజాజ్ ఫైనాన్స్ 2.73%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.09%, టాటా స్టీల్ 1.67%, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ 1.18%, టాటా మోటార్స్ 1.14%, టెక్ మహీంద్రా 1%, యాక్సిస్ బ్యాంక్ 0.80%, ఇండస్ఇండ్ బ్యాంక్ 0.77%, కోటక్ బ్యాంక్ 0.73%, నెస్లే ఇండియా 0.72%, బజాజ్ ఫిన్‌సర్వ్ 0.66%, సన్ ఫార్మా 0.63%, టీసీఎస్ 0.46% చొప్పున తగ్గాయి. ఐసీఐసీఐ బ్యాంక్ 1.90%, భారతీ ఎయిర్‌టెల్ 1.26%, ఏషియన్ పెయింట్స్ 1.01%, అల్ట్రాటెక్ సిమెంట్ 0.83%, హెచ్‌సీఎల్ టెక్ 0.76%, అదానీ పోర్ట్స్ 0.68% లాభపడ్డాయి.

✦ అంతర్జాతీయ మీడియా దిగ్గజం **వాల్ట్ డిస్నీ** భారత వ్యాపారాన్ని **రిలయన్స్ ఇండస్ట్రీస్** మీడియా ఆస్తులతో విలీనం చేసే ప్రక్రియ ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం (అక్టోబరు-డిసెంబరు)లో పూర్తవుతుందని ఎక్స్ఛేంజీలకు రిలయన్స్ సమాచారమిచ్చింది.

✦ సెప్టెంబరు త్రైమాసికంలో అంచనాలను మించి రాణించినందున **హెచ్‌సీఎల్ టెక్** షేరు బీఎస్ఈలో 0.76% లాభంతో రూ.1,870.05 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 1.40% పెరిగి 52 వారాల గరిష్ఠ స్థాయి రూ.1,882ను తాకింది.

✦ **గరుడ కన్‌స్ట్రక్షన్ అండ్ ఇంజినీరింగ్** షేరు అరంగేట్రంలో రాణించింది. ఇష్యూ ధర రూ.95తో పోలిస్తే బీఎస్ఈలో షేరు ట్రేడింగ్ 8.63% లాభంతో రూ.103.20 వద్ద నమోదైంది. ఒక దశలో 27.08% పెరిగి రూ.120.73 వద్ద గరిష్ఠాన్ని తాకినా, చివరకు 12.45% లాభంతో రూ.106.83 వద్ద స్థిరపడింది.

✦ **అదానీ ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్ లిమిటెడ్, తమ నిర్వహణలోని** తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయ (టీఆర్‌వీ) విస్తరణ కోసం 2027 నాటికి రూ.1,300 కోట్ల పెట్టుబడులు పెట్టబోతున్నట్లు ప్రకటించింది.

✦ **ఎంసీఎక్స్‌లో కాటన్ సీడ్ వాష్ ఆయిల్ ఫ్యూచర్స్:** దిగ్గజ కమొడిటీ ఎక్స్ఛేంజ్ ఎంసీఎక్స్ , కొత్తగా కాటన్ సీడ్ వాష్ ఆయిల్ ఫ్యూచర్స్‌ను ప్రారంభించినట్లు మంగళవారం ప్రకటించింది. ఈ కాంట్రాక్టు ట్రేడింగ్ యూనిట్ 5 టన్నులుగా ఉంటుందని పేర్కొంది. కనీస విలువ 10 కిలోగ్రాములకు రూపాయిగా ఉంటుంది. 12% మార్జిన్ చెల్లించాల్సి ఉంటుంది.

✦ **రూ.2,500 కోట్ల సమీకరణ:** ఆదిత్య బిర్లా సన్ లైఫ్ (ఏబీఎస్ఎల్) ఏఎంసీ విదేశీ మదుపర్ల నుంచి 300 మిలియన్ డాలర్ల (సుమారు రూ.2,500 కోట్ల) ప్రైవేట్ క్రెడిట్ ఫండ్‌ను సమీకరించనున్నట్లు సీఈఓ, ఎండీ ఎ.బాలసుబ్రమణియన్ వెల్లడించారు.

✦ **స్పైస్‌జెట్‌కు ఊరట:** విమానయాన సంస్థలో తలెత్తిన లోపాలను సరిదిద్దేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు, బాధ్యతలను నెరవేర్చేందుకు నిధులను సమీకరించిన నేపథ్యంలో అదనపు నిఘా పాలన నిబంధన పరిధి నుంచి స్పైస్‌జెట్‌ను తొలగించినట్లు విమానయాన నియంత్రణ సంస్థ **డీజీసీఏ** మంగళవారం తెలిపింది.

✦ **కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో 5% వాటా విక్రయం నేటి నుంచి:** కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో 5% వాటాను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్)లో విక్రయిస్తున్నట్లు దీపమ్ కార్యదర్శి తుహిన్ కాంత పాండే తెలిపారు. ఒక్కో షేరుకు కనీస ధరను రూ.1,540గా నిర్ణయించారు. 16, 17 తేదీల్లో ఓఎఫ్ఎస్ ఉండనుంది. రిటైల్‌యేతర మదుపర్లు బుధవారం, రిటైల్ మదుపర్లు, ఉద్యోగులు గురువారం బిడ్లు దాఖలు చేయాల్సి ఉంటుంది.

రూ.38,811 కోట్లు తగ్గిన రిలయన్స్ మార్కెట్ విలువ

రిలయన్స్ ఇండస్ట్రీస్ సెప్టెంబరు త్రైమాసిక లాభం 5% తగ్గిన నేపథ్యంలో, మంగళవారం బీఎస్ఈలో ఈ షేరు 2.09% తగ్గి రూ.2,687.90 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.38,811.03 కోట్లు కోల్పోయి రూ.18,18,654.15 కోట్లకు పరిమితమైంది.

హ్యుందాయ్ ఐపీఓకు తొలి రోజు 18% స్పందన

హ్యుందాయ్ మోటార్ ఇండియా రూ.27,870 కోట్ల మెగా ఐపీఓకు తొలి రోజున 18% స్పందన లభించింది. యాంకర్ ఇన్వెస్టర్లకు 4.24 కోట్ల షేర్లు కేటాయించగా, మిగిలిన 9,97,69,810 షేర్లను కంపెనీ ఇష్యూలో ఆఫర్ చేసింది. మంగళవారం మొత్తం 1,77,89,457 షేర్లకు బిడ్లు లభించాయి. రిటైలర్ల నుంచి 26% స్పందన లభించింది. రేపటి (ఈనెల 17)తో ఈ ఐపీఓ ముగియనుంది. ఇష్యూ ధరల శ్రేణి రూ.1,865-1,960.

✦ వారీ ఎనర్జీస్ తాజా షేర్ల ఇష్యూ ద్వారా రూ.3,600 కోట్ల నిధుల సమీకరణ నిమిత్తం ఈ నెల 21-23 తేదీల్లో తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు రానుంది. ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్)లో మరో 48 లక్షల ఈక్విటీ షేర్లను విక్రయించనుంది. యాంకర్ మదుపర్లు ఈ నెల 18న బిడ్లు దాఖలు చేసుకోవచ్చు.

నేటి బోర్డు సమావేశాలు: బజాజ్ ఆటో, ఎల్ అండ్ టీ టెక్నాలజీ సర్వీసెస్, ఎంఫసిస్, క్రిసిల్, సౌత్ ఇండియన్ బ్యాంక్, ఆదిత్య బిర్లా మనీ

ఈనాడు సినిమా

చారిత్రక ప్రపంచంలోకి అడుగు



సాయిదుర్గా తేజ్

ఆ నేల అతని రాక కోసం ఎదురు చూసింది. మరి అతను ఎప్పుడొచ్చాడు? ఆ నేల చరిత్ర ఏమిటో తెలియాలంటే సాయిదుర్గా తేజ్ 18వ చిత్రం విడుదల వరకు ఎదురు చూడాల్సిందే. రోహిత్.కె.పి దర్శకత్వంలో పీరియాడిక్ యాక్షన్ డ్రామా కథతో రూపొందుతున్న చిత్రమిది. సాయిదుర్గా తేజ్ సరసన ఐశ్వర్య లక్ష్మి నటిస్తోంది. ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై కె.నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇదివరకు 'హను-మాన్' చిత్రాన్ని నిర్మించారు. సాయిదుర్గా తేజ్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం ఈ సినిమా ప్రపంచాన్ని పరిచయం చేస్తూ ఓ ప్రత్యేకమైన వీడియోని విడుదల చేసింది చిత్రబృందం. చారిత్రక వాతావరణాన్ని ఆవిష్కరిస్తున్న సెట్స్, నటీనటుల సన్నద్ధతతో కూడిన ఆ వీడియో... ఇది లార్జర్ దేన్ లైఫ్ తరహా సినిమా అని స్పష్టం చేస్తోంది. సాయిదుర్గా తేజ్ మునుపెన్నడూ చేయని శక్తిమంతమైన పాత్రని ఇందులో చేస్తున్నారని, ఆయన కనిపించే విధానం కూడా ప్రత్యేకంగా ఉంటుందని సినీ వర్గాలు తెలిపాయి. తెలుగుతోపాటు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది.

నవంబరు నుంచే రంగంలోకి!



ఎన్టీఆర్

దేవర'తో ఘన విజయాన్ని అందుకున్న ఎన్టీఆర్ తన అభిమానులకీ, ప్రేక్షకులకీ కృతజ్ఞతలు చెబుతూ ఓ ప్రకటనని విడుదల చేశారు. గత నెల రోజులుగా సినిమాని ఒక పండుగలా భావించి... భుజాలపై మోసి ఇంతటి ఘన విజయాన్ని అందించారంటూ చిత్రబృందంలోని ప్రతి ఒక్కరి కృషిని గుర్తు చేసుకున్నారు. ప్రేక్షకులు, అభిమానుల ప్రేమాభిమానాలే తనని ఈ స్థాయికి చేర్చాయని, ఎప్పుడూ గర్వపడే చిత్రాలే చేయడానికి ప్రయత్నిస్తానని అందులో పేర్కొన్నారు. విజయోత్సాహంలో ఉన్న ఎన్టీఆర్ తదుపరి సినిమాల కోసం రంగంలోకి దిగేందుకు సన్నద్ధమవుతున్నారు. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో... ఎన్టీఆర్ కథానాయకుడిగా నటిస్తున్న సినిమా చిత్రీకరణ నవంబరు నుంచే షురూ కానుంది. అయితే ఎన్టీఆర్ లేని సన్నివేశాలతో మొదట కొంత భాగం చిత్రీకరణ సాగనున్నట్టు సమాచారం. అదే నెలలోనే 'వార్ 2'కి సంబంధించిన కీలక షెడ్యూల్‌లో పాల్గొననున్న ఎన్టీఆర్, అది పూర్తయిన వెంటనే ప్రశాంత్ నీల్ చిత్రం కోసం రంగంలోకి దిగనున్నట్టు సినీ వర్గాలు స్పష్టం చేశాయి. 'వార్ 2' ఎన్టీఆర్ చేస్తున్న తొలి హిందీ చిత్రం కావడం గమనార్హం.



వరుణ్ ధావన్, సమంత

నదియాను కాపాడే హనీ బన్నీ

'ప్రతిరోజూ ఓ కొత్త ముప్పు తలెత్తుతుంది. ప్రతి గంట గతం కంటే క్రూరమైంది. ప్రశ్నేమిటంటే ఆ ముప్పు మిమ్మల్ని నాశనం చేస్తుందా? లేదా? మీరు ఆ ముప్పును నాశనం చేస్తారా?' అంటూ 'సిటాడెల్: హనీ బన్నీ' హంగామాను మొదలు పెట్టింది సిరీస్ బృందం. అందాల తార సమంత, వరుణ్ ధావన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న స్పై యాక్షన్ థ్రిల్లర్ సిరీస్ ఇది. 1990ల కాలం నాటి నేపథ్యంలో రాజ్ అండ్ డీకే తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సిరీస్ ట్రైలర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది సిరీస్‌బృందం. తమ కుమార్తె నదియాను కాపాడేందుకు ఏమైనా చేసే తల్లిదండ్రులుగా వరుణ్, సమంత కనిపించారు. తాజాగా విడుదలైన ట్రైలర్‌లోని యాక్షన్ సన్నివేశాలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు వరుణ్, సమంత. ఇందులో కేకే మేనన్, సిమ్రన్, సోహమ్ మజుందార్, సాకిబ్ సలీమ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. రుస్సో బ్రదర్స్ నిర్మించారు. శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సిరీస్ నవంబరు 7న ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఎల్లమ్మ హీరో నితిన్?



నితిన్

విజయవంతమైన 'బలగం' తర్వాత దర్శకుడు వేణు యెల్దండి తెరకెక్కించనున్న చిత్రం... 'ఎల్లమ్మ'. దిల్‌రాజు నిర్మాణంలో ఈ చిత్రం రూపుదిద్దుకోనుంది. ప్రస్తుతం స్క్రిప్ట్ దశలో ఉన్న ఈ సినిమా వచ్చే ఏడాది పట్టాలెక్కనుంది. ఇందులో నటించే కథానాయకుడు ఎవరనేది దాదాపు ఖరారైనట్టే. నితిన్ ఈ కథకి పచ్చజెండా ఊపినట్టు తెలిసింది. మొదట ఈ ప్రాజెక్ట్ విషయంలో నాని పేరు తెరపైకొచ్చింది. ఆ తర్వాత మరో హీరో పేరు కూడా వినిపించినా, నితిన్ ఈ కథని మెచ్చి రంగంలోకి దిగాలని నిర్ణయించినట్టు తెలిసింది. 'బలగం' తరహాలోనే తెలంగాణ నేపథ్యంలో సాగే కథతో ఈ చిత్రం రూపు దిద్దుకోనుంది. వచ్చే ఏడాది చిత్రీకరణ మొదలు పెడతామని ఇటీవల ఓ వేడుకలో నిర్మాత దిల్‌రాజు తెలిపారు.

'పతంగ్' ఎగిరేది ఆ రోజునే



వంశీ, ప్రీతి


గాలిపటాల్ని ఎగరేస్తూ ఆనందంతో కేరింతలు కొట్టని బాల్యం అరుదు. పల్లె, పట్టణం, అబ్బాయిలు, అమ్మాయిలు... ఇలాంటి తేడాల్లేకుండా ఎప్పుడో ఒకసారి పతంగులు చేతపట్టి ఆకాశంవైపు చూసినవాళ్లే. ఆ నేపథ్యంలో రూపొందిన కామెడీ స్పోర్ట్స్ డ్రామా చిత్రమే... 'పతంగ్'. ప్రీతి పగడాల, ప్రణవ్ కౌశిక్, వంశీ పూజిత్ ప్రధాన పాత్రధారులుగా నటించారు. ప్రముఖ గాయకుడు ఎస్పీ చరణ్ ఓ కీలక పాత్రని పోషించారు. ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకుడు. విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మక, సురేశ్ కొత్తింటి నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమాని డిసెంబరు 27న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టు సినీ వర్గాలు ప్రకటించాయి. "పతంగుల పోటీ నేపథ్యంలో, కథే హీరోగా రూపొందిన చిత్రమిది. థియేటర్లలో యూత్ ఫెస్టివల్‌ని తలపిస్తూ ఆద్యంతం వినోదాన్ని పంచుతుందీ చిత్రం. ఎంతో నాణ్యంగా తెరపైకి తీసుకొచ్చాం. కొత్త రకమైన కథల్ని ప్రోత్సహిస్తున్న తెలుగు ప్రేక్షకులకు మా ప్రయత్నం తప్పక మెప్పిస్తుంది" అన్నారు నిర్మాతలు. ఈ చిత్రానికి క్రియేటివ్ నిర్మాత: నాని బండ్రెడ్డి, సంగీతం: జోస్ జిమ్మి, ఛాయాగ్రహణం: శక్తి అర్విండ్.

బోల్తాకొట్టింది రీమేక్ పిట్ట

రీమేక్ కథలను టచ్ చేయని కథానాయకులు ఉండరనడంలో సందేహమే లేదు. తమ కెరీర్‌లో ఇలాంటి రీమేక్ కథలతోనే ఎక్కువ చిత్రాలు చేసి బ్లాక్ బస్టర్ విజయాలు అందుకున్న స్టార్ హీరోలు చాలా మందే ఉన్నారు. బ్లాక్ అండ్ వైట్ కాలం నుంచే ఇలాంటి కథల ట్రెండ్ ఇటు దక్షిణాదిలోనూ, బాలీవుడ్‌లోనూ కొనసాగుతున్న సంగతి తెలిసిందే. కానీ ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు. ఓటీటీల రాకతో రీమేక్ చిత్రాలపై సినీప్రియులు అంతగా ఆసక్తి చూపించడం లేదు. ప్రేక్షకులు భాషతో సంబంధం లేకుండా ఓటీటీల్లో సినిమాలు చూడటం, మరోవైపు ప్రేక్షకుల అభిరుచుల్లో మార్పు రావడం కూడా ఈ రీమేక్ చిత్రాల హవా తగ్గడానికి కారణాలు అంటున్నారు సినీ విమర్శకులు.



'జెర్సీ'



'విక్రమ్ వేధ'

● ఒకప్పుడు స్టార్ హీరోలు.. రూ.వందల కోట్లు రాబట్టే చిత్రాలంటే ఉత్తరాదిలోనే. అందుకే అప్పట్లో హిందీ చిత్రాల్ని దక్షిణాదిలో రీమేక్ చేసి ప్రేక్షకులు ముందుకు తీసుకొచ్చేవారు దర్శకనిర్మాతలు. సినీ ప్రియులు సైతం ఇలాంటి చిత్రాలను ఆస్వాదించడంలో ఆసక్తి చూపించేవారు. కానీ.. ప్రస్తుతం ఆ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. దక్షిణాది దర్శకనిర్మాతలు హిందీ చిత్రాలను రీమేక్ చేయడానికి అంతగా ఆసక్తి చూపించడం లేదు. ఎందుకంటే ఆ కథలు ఇక్కడి ప్రేక్షకుల్ని ఆకట్టుకోవడంలో చాలా వరకూ విఫలం అవుతున్నాయి. దీనికి ఉదాహరణే ఇటీవలే విడుదలైన 'మిస్టర్ బచ్చన్' చిత్రం. బాలీవుడ్ కథానాయకుడు అజయ్ దేవగణ్ ప్రధాన పాత్ర పోషించిన 'రైడ్'కు దీన్ని రీమేక్‌గా తెరకెక్కించారు. రవితేజ నటించిన ఈ సినిమా బాక్సాఫీసు వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది. ' 'దక్షిణాది చిత్రపరిశ్రమల్లోని ప్రేక్షకులు వారి అభిమాన హీరోల్ని తెరపై ప్రత్యేకంగా చూడాలని కోరుకుంటారు. ఇప్పటికే హిందీలో వచ్చిన సినిమాలు, అందులోని పాత్రల్లో వారు ఆరాధించే నటుల్ని చూడడానికి ఇష్టపడరు. అందుకే ప్రస్తుతం దక్షిణాదిలో హిందీ చిత్రాల రీమేక్‌కు పెద్దగా డిమాండ్ లేదు. దీంతో పాటు దక్షిణాదిలో కథ చెప్పే పద్ధతి, దాన్ని తెరపై చూపించే విధానం చాలా ప్రత్యేకంగా ఉంటుంది'' అంటూ ముక్తా ఆర్ట్స్, ముక్తా ఏ2 సినిమాస్ మేనేజింగ్ డైరెక్టర్ రాహుల్ పూరి అన్నారు. అందుకే దక్షిణాది హీరోలు, దర్శకులు సొంత కథల్ని తెరకెక్కించడం వైపే మొగ్గు చూపుతున్నారు.



'బచ్చన్ పాండే'

◆ దక్షిణాదిలోనే కాదు.. ఇటు బాలీవుడ్‌లోనూ ఇదే పరిస్థితి. దక్షిణాదిలో హిట్టయిన కథలు హిందీ రీమేక్‌గా తెరకెక్కి పరాజయం పాలవుతున్నాయి. ఈ తరహాలో గత రెండేళ్లలో తెలుగు, తమిళ చిత్రాలకు రీమేక్‌గా వచ్చిన 'జెర్సీ', 'తడప్', 'బచ్చన్‌పాండే', 'విక్రమ్ వేధ' లాంటి చిత్రాలు ఉత్తరాది బాక్సాఫీసు వద్ద ఆశించిన ఫలితాల్ని ఇవ్వలేకపోయాయి. ఈ మధ్య కాలంలో అమితాబ్ నటించిన 'పింక్' చిత్రం తెలుగులో 'వకీల్‌సాబ్'గా, తమిళంలో 'నేర్కొండ పార్వై'గా వచ్చి కొంత విజయాన్ని సాధించిందే తప్పా.. పూర్తి స్థాయిలో సినీప్రియుల్ని మెప్పించలేకపోయింది. దీంతో దక్షిణాదిలోనే కాదు.. బాలీవుడ్‌లోనూ ఈ రీమేక్ సినిమాలపై అభిమానులు అంతగా ఆసక్తి చూపించట్లేదనేది సినీవిమర్శకుల మాట.

◆ "మిస్టర్ బచ్చన్' లాంటి చిత్రాలు బాక్సాఫీసు వద్ద ఆశించిన స్థాయిలో ఆడకపోవడానికి కంటెంట్ కూడా మరో కారణం. రీమేక్ చిత్రమైన కథలో కొత్తదనాన్ని కోరుకుంటారు సినీప్రియులు. 'రైడ్' ఒక థ్రిల్లర్ కథ. ఇది హిందీ ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నా... కంటెంట్ కారణంగా తెలుగు అభిమానుల్ని ఆకర్షించలేకపోయింది. కాబట్టి ఇలాంటి సబ్జెక్ట్‌ను ఎంచుకునేటప్పుడు ఆచితూచి అడుగులేస్తే ఫలితాన్ని అందుకోవచ్చు. దీంతో పాటు కొవిడ్ సమయంలో లాక్‌డౌన్ వల్ల ఓటీటీలు విపరీతంగా ప్రేక్షకుల్ని ఆకర్షించాయి. హాలీవుడ్, బాలీవుడ్, కోలీవుడ్ అంటూ భాషతో సంబంధం లేకుండా భిన్నమైన చిత్రాలను ఓటీటీ వేదికగా సబ్‌టైటిల్స్‌తో అందుబాటులో ఉంచారు. ఇదే సినీప్రియుల్ని ఆకర్షించడానికి ముఖ్య కారణం'' అని కొందరు సినీ విమర్శకులు అన్నారు.

బఘీర... రుధిర హర



శ్రీమురళి

అగ్ర దర్శకుడు ప్రశాంత్ నీల్ అందించిన కథతో... 'ఉగ్రమ్' ఫేమ్ శ్రీమురళి కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'బఘీర'. డా.సూరి దర్శకత్వం వహిస్తున్నారు. హోంబలే ఫిల్మ్స్ పతాకంపై విజయ్ కిరగందూర్ నిర్మిస్తున్నారు. రుక్మిణీ వసంత్, ప్రకాశ్‌రాజ్, రంగాయణ రఘు, అచ్యుత్ కుమార్, గరుడ రామ్ కీలక పాత్రలు పోషించారు. దీపావళి సందర్భంగా అక్టోబరు 31న విడుదల కానున్న ఈ సినిమాని తెలుగులో ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. "అద్భుతమైన విజువల్స్, థ్రిల్లింగ్ యాక్షన్‌తో కూడిన చిత్రమిది. ప్రశాంత్ నీల్ రాసిన శక్తివంతమైన ఈ కథలో... శ్రీమురళి కనిపించే తీరు, ఆయన నటన ఆకట్టుకుంటుంది. తెలుగులో ప్రచార కార్యక్రమాల్ని త్వరలోనే ప్రారంభిస్తాం. ఈ నెల 17న రుధిర హర... అంటూ సాగే ఈ చిత్రంలోని పాటని విడుదల చేస్తామ''ని సినీ వర్గాలు తెలిపాయి.

కాలప్రయాణంతో... 'రివైండ్'



సాయిరోనక్, అమృత

సాయిరోనక్, అమృత చౌదరి జంటగా తెరకెక్కుతున్న చిత్రం 'రివైండ్'. కల్యాణ్ చక్రవర్తి స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. ఈ నెల 18న చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా దర్శక నిర్మాత మాట్లాడుతూ "కాలప్రయాణం ఆధారంగా తెరకెక్కిన చిత్రమిది. తెలుగు ప్రేక్షకులు కొత్తదనాన్ని ఎప్పుడూ ప్రోత్సహిస్తారు. ఓ సరికొత్త కాన్సెప్ట్‌తో రూపొందిన ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకుల మెప్పు పొందుతుందనే నమ్మకం ఉంది. సినిమాపై మాకున్న నమ్మకంతో ఇప్పటికే చాలా మందికి చూపించాం. సినిమా నచ్చి పంపిణీదారులు విడుదల చేయడానికి ముందుకొచ్చారు. పాటలు ఇప్పటికే విశేష ఆదరణ పొందాయి. చిత్రం కూడా తప్పకుండా అందరికీ నచ్చుతుంది. దక్షిణాదిలో ఒకే రోజు చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం" అన్నారు. సురేశ్, జబర్దస్త్ నాగి, కె.ఎ.పాల్‌రామ్, అభిషేక్ విశ్వకర్మ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: ఆశీర్వాద్, ఛాయాగ్రహణం: శివరామ్ చరణ్.

నాని సరసన ఎవరు?



జాన్వీ కపూర్



శ్రద్ధా కపూర్

నాని కథానాయకుడిగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ఓ చిత్రం మొదలైన సంగతి తెలిసిందే. విజయవంతమైన 'దసరా' తర్వాత, అదే బృందం కలిసి చేస్తున్న చిత్రమిది. సికింద్రాబాద్ నేపథ్యంలో సాగే ఓ పీరియాడిక్ కథని సిద్ధం చేశారు శ్రీకాంత్. 'దసరా' సినిమాతో పోలిస్తే వంద రెట్లు అధిక ప్రభావం చూపించే కథ అని సినిమా వర్గాలు చెబుతున్నాయి. ఇందులో కథా నాయిక ఎవరనే విషయంపై ఇంకా స్పష్టత లేదు. మొదట జాన్వీ కపూర్ పేరు ప్రచారంలోకి వచ్చింది. తాజాగా బాలీవుడ్‌కి చెందిన మరో భామ శ్రద్ధా కపూర్‌నీ చిత్రబృందం సంప్రదించినట్టు తెలిసింది. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాలో, అందుకు తగ్గ కథానాయికే ఉండాలనేది దర్శకనిర్మాతల ఆలోచనగా తెలుస్తోంది. అందుకే జాతీయ స్థాయిలో గుర్తింపు ఉన్న కథానాయిక ఎంపికపైనే దృష్టి పెట్టారు. మరి ఎవరు ఖరారవుతారనేది చూడాలి.

ప్రియాంక ఉగ్రావతారం



ప్రియాంక

నా సినీ ప్రయాణంలో నేను చేసిన తొలి యాక్షన్ చిత్రం ఇదే అన్నారు ప్రియాంకా ఉపేంద్ర. ఆమె ప్రధాన పాత్రధారిగా రూపొందిన చిత్రం 'ఉగ్రావతారం'. సుమన్, నటరాజ్ పేరి, అజయ్, పవిత్రా లోకేశ్, సాయిదీనా ఇతర కీలక పాత్రలు పోషించారు. గురుమూర్తి దర్శకుడు. ఎస్.జి.సతీశ్ నిర్మాత. నవంబరు 1న ప్రేక్షకుల ముందుకు రానుందీ చిత్రం. మంగళవారం హైదరాబాద్‌లో ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. నిర్మాత రాజ్ కందుకూరి ముఖ్య అతిథిగా హాజరై ట్రైలర్‌ని, కరాటే రాజు, సత్యప్రకాశ్ పాటని విడుదల చేశారు. అనంతరం ప్రియాంకా ఉపేంద్ర మాట్లాడుతూ "హైదరాబాద్‌తో నాకు ఎంతో అనుబంధం ఉంది. నా భర్త, కథానాయకుడు ఉపేంద్రని నేను తొలిసారి కలిసింది ఇక్కడే. నా సినిమా ప్రచారం కోసం హైదరాబాద్‌కి రావడం ఆనందంగా ఉంది. నా తొలి పాన్ ఇండియా సినిమా, యాక్షన్ ప్రధానమైన సినిమా ఇదే. దర్శకుడు గురుమూర్తి వల్లే ఈ చిత్రం చేశా. మంచి కథ, కథనం, మాటలు, సంగీతంతో రూపొందిన ఈ చిత్రం అందరికీ నచ్చుతుంది" అన్నారు. దర్శకుడు గురుమూర్తి మాట్లాడుతూ "సమాజాన్ని పట్టి పీడిస్తున్న సమస్యల్ని స్పృశిస్తూ, మంచి సందేశంతో ఈ చిత్రం చేశా. ఓ కొత్త రకమైన పాత్రలో సందడి చేస్తారు ప్రియాంక" అన్నారు. ఈ కార్యక్రమంలో రచయిత కిన్నాల్ రాజుతోపాటు, చిత్రబృందం పాల్గొంది.

సరదా కుర్రాడు డిటెక్టివ్‌గా మారితే..!



రామ్ కార్తీక్

ప్రేమకథగా మొదలై... మిస్టరీ థ్రిల్లర్‌గా మలుపు తీసుకునే మా చిత్రం అడుగడుగునా ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుందన్నారు రామ్‌కార్తీక్. ఆయన కథానాయకుడిగా... మనోజ్ పల్లేటి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వీక్షణం'. కశ్వి కథానాయిక. పి.పద్మనాభరెడ్డి, అశోక్‌రెడ్డి నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 18న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు రామ్‌కార్తీక్. "ఓ సరదా కుర్రాడి పాత్ర నాది. పక్కవాళ్ల జీవితాల్లో ఏం జరుగుతోందో తెలుసుకోవాలనే కోరిక ఉంటుంది. ఆ మనస్తత్వం తనకి ఎన్ని ఇబ్బందుల్ని సృష్టించిందనేది ఇందులో కీలకం. సరదా కుర్రాడు కాస్త డిటెక్టివ్‌లా మారిపోయి, ఏం చేశాడన్నది ఆసక్తికరం. గతంలో థ్రిల్లర్ సినిమాలు చేశాను కానీ, మిస్టరీ థ్రిల్లర్ కథల్లో నటించడం మాత్రం ఇదే తొలిసారి. గత చిత్రాలతో పోలిస్తే ఇందులో మరింత పరిణతితో నటించానని సినిమా చూసినవాళ్లంతా మెచ్చుకున్నారు థ్రిల్లర్ సినిమాల్లో మైండ్ గేమ్ కీలకం. ప్రేక్షకుల్ని చివరిదాకా కట్టిపడేస్తేనే విజయవంతం అవుతాయి. అందుకే మా దర్శకుడు మనోజ్ స్క్రిప్ట్‌ని పలు కోణాల్లో రాసుకుని, ప్రత్యేకమైన స్క్రీన్‌ప్లేతో తెరకెక్కించారు. హీరో ఒకరిని గమనిస్తూ ఉంటే, తెలియకుండా తననీ మరో కన్ను వెంటాడుతూ ఉంటుంది. అందుకే 'వీక్షణం' అనే పేరు పెట్టాం. ఊహకందని మలుపులు ప్రేక్షకుల్ని అలరిస్తాయి. సాయిరామ్ కెమెరా పనితనం, సమర్థ్ సంగీతం చిత్రానికి ప్రధానబలం" అని చెప్పారు రామ్‌కార్తీక్. తన ప్రయాణం గురించి వివరిస్తూ... "2016లో వచ్చిన 'దృశ్యకావ్యం' నుంచి నా కెరీర్ కొనసాగుతోంది. గతేడాది చేసిన 'గ్రేట్ ఇండియన్ సూసైడ్' నాకు మంచి పేరు తెచ్చింది. 'వీక్షణం' నన్ను హీరోగా మరో మెట్టు ఎక్కిస్తుంది. వాసు దర్శకత్వంలో ప్రస్తుతం ఓ సినిమా చేస్తున్నా" అన్నారు రామ్‌కార్తీక్.

లావా నుంచి అగ్ని3



లావా కంపెనీ తాజా మధ్యశ్రేణి స్మార్ట్‌ఫోన్‌ను పరిచయం చేసింది. దీని పేరు 'లావా అగ్ని3. మీడియాటెక్ డైమెన్సిటీ 7300× చిప్‌సెట్‌తో ఆండ్రాయిడ్ 14 మీద పనిచేస్తుంది. 120హెచ్‌జడ్ రిఫ్రెష్ వేగంతో కూడిన 6.78 అంగుళాల ఎమోలెడ్ తెర, 1200నిట్స్ గరిష్ఠ ప్రకాశం, వెనకాల మూడు కెమెరాల సెటప్, 16 మెగాపిక్సెల్ సెల్ఫీ కెమెరా వంటి ఫీచర్లున్నాయి. 5,000ఎంఏహెచ్ బ్యాటరీ కలిగుంది. ఫోన్ వెనకాల 1.74 అంగుళాల ఎమోలెడ్ టచ్‌స్క్రీన్ కూడా ఉంటుంది. కాల్స్ స్వీకరించటం, మెసేజ్‌లకు త్వరగా జవాబులివ్వటం వంటి పనులకిది తోడ్పడుతుంది. నాలుగేళ్ల వరకు మూడు ఓఎస్ వర్షన్లు, సెక్యూరిటీ అప్‌డేట్స్ లభిస్తాయి. లావా అగ్ని3 రెండు రకాల్లో అందుబాటులో ఉంది. ఛార్జర్ లేకుండా 8జీబీ ర్యామ్, 128జీబీ స్టోరేజీ రకం రూ.20,999కు లభిస్తుంది. ఇదే కన్ఫిగరేషన్‌తో ఛార్జర్‌తో కూడిన ఫోన్ ధర రూ.22,999. అదే 256జీబీ స్టోరేజీ రకమైతే రూ.24,999కి లభిస్తుంది.

పిక్సెల్ 9 ప్రొ ప్రి ఆర్డర్స్ ఆరంభం

గూగుల్ పిక్సెల్ 9, ప్రొ ఎక్స్ఎల్, ప్రొ ఫోల్డ్‌తో పాటే పిక్సెల్ 9 ప్రొ రకం కూడా గత ఆగస్టులోనే లాంచ్ అయ్యింది. కానీ అప్పుడు మనదేశంలో అమ్మకానికి పెట్టలేదు. ఎట్టకేలకు గురువారం నుంచి ఆన్‌లైన్‌లో ప్రి-ఆర్డర్స్ ఆరంభం కానున్నాయి. టెన్సర్ జీ4 ఎస్ఓసీ, టైటన్ ఎం2 సెక్యూరిటీ చిప్‌తో కూడిన ఇది ఆండ్రాయిడ్ 14తో పనిచేస్తుంది. 6.3 అంగుళాల సూపర్‌యాక్చువా (ఎల్‌టీఓపీ) ఓఎల్ఈడీ తెర, 120హెచ్‌జడ్ రిఫ్రెష్ వేగం, 3వేల నిట్స్ వరకు గరిష్ఠ ప్రకాశం వంటి ఫీచర్లున్నాయి. వెనకాల మూడు కెమెరాల (50 మెగా పిక్సెల్ ప్రధాన సెన్సర్,



48 మెగా పిక్సెల్ షూటర్, 48 మెగా పిక్సెల్ పెరిస్కోప్ టెలిఫొటో కెమెరా) వ్యవస్థ.. అలాగే సెల్ఫీలు, వీడియో కాల్స్ కోసం 42 మెగాపిక్సెల్ కెమెరా ఉంటాయి. హేజెల్, పోర్సెలిన్, రోజ్ క్వార్ట్జ్, ఒబ్సిడియాన్ రంగుల్లో లభిస్తుంది. 16జీబీ ర్యామ్, 256 జీబీ స్టోరేజీ రకం ధర రూ.1,09,999గా నిర్ణయించారు.

భూమి మీద చంద్రుడు!


జాబిల్లి మీద మరోసారి అడుగు పెట్టటానికి వివిధ దేశాల శాస్త్రవేత్తలు చాలా కృషి చేస్తున్నారు. అక్కడికి చేరుకున్నాక ఎలా వ్యవహరించాలో వ్యోమగాములకు ముందే శిక్షణ ఇవ్వాలనీ ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ (ఈఎస్ఏ), జర్మన్ ఏరోస్పేస్ ఏజెన్సీ (డీఎల్ఆర్) సంయుక్తంగా ఓ వినూత్న ప్రయోగానికి సిద్ధమయ్యాయి. భూమ్మీద చంద్రుడి వాతావరణాన్ని, పరిస్థితులను సృష్టించటం దీని ప్రత్యేకత. ఓ భారీ పెట్టెలో ఏర్పాటు చేసిన దీని పేరు లూనా అనలాగ్ ఫెసిలిటీ. భూమ్మీద చంద్రుడని అభివర్ణిస్తున్న దీన్ని ఇటీవలే ప్రారంభించారు.

భూమ్మీద చంద్రుడిని తిరిగి సృష్టించాలంటే మూడు అంశాలు తప్పనిసరి. ఒకటి- చంద్రుడి మట్టి (రెగోలిత్) వంటి రసాయన మిశ్రమం గల ఇసుక పదార్థం. రెండు- సూర్యుడి కోణాన్ని అనుకరించే ప్రత్యేకమైన కాంతి. మూడు- స్వల్ప గురుత్వాకర్షణ. చంద్రుడి గురుత్వాకర్షణ భూ గురుత్వాకర్షణలో ఆరింట ఒక వంతు మాత్రమే ఉండటం వల్ల గురుత్వాకర్షణ సిమ్యులేటర్ అవసరం. ఓ పెద్ద పెట్టె మాదిరిగా ఉండే లూనా కేంద్రంలో చంద్రుడి మట్టి, ప్రత్యేక కాంతి సాధ్యమైనప్పటికీ గురుత్వాకర్షణను మాత్రం ఇంకా సాధించాల్సి ఉంది. ఇటలీలోని మౌంట్ ఎట్నా అగ్ని పర్వతం, జర్మనీలోని ఈఫిల్ ప్రాంతం నుంచి మట్టి.. నార్వే నుంచి రాళ్లను సేకరించి చంద్రుడి మట్టిని తయారుచేశారు. లూనాలో ఇటీవల ఇద్దరు వ్యోమగాములు నడిచారు కూడా. రోబో కుక్క, నమూనా ట్రాలీ వెంట రాగా పారలతో కృత్రిమ చంద్రుడి నుంచి నమూనాలూ తీశారు. వ్యోమగాములు నడుస్తున్నప్పుడు సూర్యుడి నుంచి వస్తున్నట్టుగా నిర్దిష్ట కోణం నుంచి కాంతిని ప్రసరింపజేశారు. చంద్రుడి మీదికి వెళ్లినప్పుడు సూర్యరశ్మి వ్యోమగాముల దృష్టికి అడ్డుతగులుతుంది. దీన్ని ఎలా అధిగమించాలో నేర్చుకోవటానికే ఈ ఏర్పాటు. అయితే ఆనాటి అపోలో 11 ప్రయోగ దృశ్యాల్లో కనిపించినట్టు వ్యోమగాములు గెంతలేదు. దీనికి కారణం చంద్రుడి మీదున్నట్టు గురుత్వాకర్షణ లేకపోవటమే.



స్వల్ప గురుత్వాకర్షణ ఎలా?

సాధారణంగా గురుత్వాకర్షణ రహిత లేదా స్వల్ప గురుత్వాకర్షణను సృష్టించటానికి, దాని అనుభూతిని పొందటానికి వ్యోమగాములు పారబాలిక్ విమానాలు, ఈత కొలనులను ఉపయోగించుకుంటారు. పారాబాలిక్ విమానాలు ఎత్తు నుంచి 45 డిగ్రీల కోణంలో కొద్దిసేపు ఉన్నట్టుండి కిందికి దిగుతాయి. దీంతో ఆ సమయంలో స్వల్ప గురుత్వాకర్షణ పరిస్థితి ఏర్పడుతుంది. స్పేస్‌సూట్ ధరించిన వ్యోమగాములు ఇందులో శిక్షణ తీసుకుంటారు. అయితే లూనా అనలాగ్ ఫెసిలిటీ పొడి నేల కావటం వల్ల ఈ రెండు పద్ధతులూ పనికిరావు. వీటికి బదులుగా గ్రావిటీ ఆఫ్‌లోడ్ సిస్టమ్‌ను రూపొందించాలని భావిస్తున్నారు. తోలుబొమ్మల మాదిరిగా వ్యోమగాములను వేలాడదీస్తే ఎలా ఉంటుందో ఊహించుకోండి. ఇదీ అలాగే అనిపిస్తుంది. స్పేస్‌సూట్ల వెనకాల అమర్చిన తీగలు వ్యోమగాములు నడుస్తున్నప్పుడు వెనక్కి లాగుతాయి, గెంతినప్పుడు గాల్లో తేలియాడుతున్నట్టు చేస్తాయి. ఈ విధానం ఇంకా ప్రయోగాత్మక దశలోనే ఉంది.



ఏంటీ ప్రయోజనం?

లూనా అనలాగ్ ఫెసిలిటీని లూనా కేంద్రాన్ని 12 ఏళ్లుగా అభివృద్ధి చేస్తున్నారు. దీన్ని 700 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నెలకొల్పారు. ఇందులో 900 టన్నుల రెగోలిత్‌ను నింపారు. ఇది ముమ్ముందు చంద్రుడి మీదికి వెళ్లే వ్యోమగాముల శిక్షణ, పరిశోధనలకు ఉపయోగపడుతుంది. దీని ఉపరితలాన్ని మూడు మీటర్ల లోతు వరకు తవ్వటానికీ వీలుంటుంది. దీని కంట్రోల్ రూమ్‌ను జర్మనీతో పాటు ప్రపంచవ్యాప్తంగా వివిధ కేంద్రాలతో అనుసంధానం చేయొచ్చు కూడా. అందువల్ల అక్కడ ఇస్తున్న శిక్షణను, ప్రయోగాలను ప్రత్యక్షంగా చూడొచ్చు. అంతరిక్ష సంస్థలు, విద్యా సంస్థలు, అంతరిక్ష వ్యాణిజ్య సంస్థలు సైతం దీన్ని వాడుకోవచ్చు. లూనా అనలాగ్ ఫెసిలిటీని ఇంకా విస్తరించే అవకాశమూ ఉంది. దీనికి పక్కనే అదనంగా మరో రెండు మాడ్యూల్స్ ఉన్నాయి. వీటిల్లో ఒకటి హ్యాబిటేట్ సిమ్యులేటర్. రెండోది గ్రీన్‌హౌజ్. అతి చల్లటి అంతరిక్ష వాతావరణాల్లో ఆహారాన్ని పండించే విధానాన్ని సిమ్యులేట్ చేయటానికి ఉద్దేశించిన ఎడెన్ ఐఎస్ఎస్ అనే ప్రయోగంలో ఒక భాగమే ఈ గ్రీన్‌హౌజ్. ప్రధాన ప్రాంగణానికి పక్కనే ఖాళీ ప్రదేశం కూడా ఉంటుంది. దీన్ని లూనా 2, మార్స్ శిక్షణకూ వాడుకోవచ్చు. కృత్రిమ మేధతో పాటు రోబోటిక్స్‌నూ దీనికి సమ్మిళితం చేయటం విశేషం.

- చంద్రుడి మీద ఉన్నట్టుగా లావా గొట్టాలను పోలిన నిర్మాణాలూ లూనా కేంద్రంలో ఉంటాయి. చిన్న చిన్న ఉల్కల నుంచి తప్పించుకోవటానికి, స్థిరంగా ఉష్ణోగ్రత కల్పించే ఆవాసాలుగా వాడుకోవటానికి అవసరమైన శిక్షణకు తోడ్పడతాయి.

విద్యుత్తు కుట్లు!



పెద్ద గాయమైనప్పుడో, శస్త్రచికిత్స చేసినప్పుడో దారంతో కుట్లు వేయటం గమనించే ఉంటారు. ఇవి కోత అంచులను పట్టి ఉంచి, గాయం త్వరగా మానటానికి తోడ్పడతాయి. ఇప్పుడు చైనా పరిశోధకులు వీటిని మరింత అధునాతనంగా మార్చారు. గాయం త్వరగా మానేలా చేసే, ఇన్‌ఫెక్షన్ ముప్పును తగ్గించే సరికొత్త కుట్టు దారాలను రూపొందించారు. ఒత్తిడికి గురైనప్పుడు.. అంటే కదలటం వంటి సందర్భాల్లో గాయాన్ని విద్యుత్తుతో ప్రేరేపించటం వీటి ప్రత్యేకత. గాయం త్వరగా మానటానికి విద్యుత్తు ప్రేరేపణలు తోడ్పడతాయన్నది తెలిసిన విషయమే. ఇది అక్కడికి కణాలను చేరవేయటం వంటి ప్రక్రియలతో త్వరగా మానేలా చేస్తుంది. కుట్టు వేసే దారాలకూ ఈ శక్తిని సంతరింపజేయటమే ఇప్పుడు ఆసక్తి రేపుతోంది. ఇవి పూర్తిగా సహజంగానే క్షీణిస్తాయని, స్వీయ విద్యుత్తు ఉత్పత్తి శక్తిని కలిగుంటాయని పరిశోధకులు చెబుతున్నారు. అంటే విద్యుత్తు ప్రేరేపణల కోసం అదనంగా పరికరాల అవసరం లేదన్న మాట. తనకుతానే క్షీణించే పాలిమర్‌లో మెగ్నీషియం తంతువులను జోడించి ఈ దారాలను రూపొందించారు. వీటిని మరో బయో డిగ్రేడబుల్ పదార్థం పొరలో పెట్టి, విద్యుదావేశం పుట్టుకు వచ్చేలా తయారు చేశారు. కండరాలు ముడుచుకొని, సాగే క్రమంలో దీనిలోని పదార్థాలు విద్యుదావేశం పొందుతున్నట్టు పరీక్ష ప్రయోగాల్లో తేలింది. ఉదాహరణకు- రబ్బరు బెలూన్‌ను జుట్టు మీద రాస్తే విద్యుదావేశం పుట్టుకొస్తుంది కదా. సరిగ్గా కొత్త కుట్టు దారాలూ ఇలాగే పని చేస్తాయి. కండరాలు ముడుచుకొని, వదులైనప్పుడు ఈ దారాల్లోని మధ్య, వెలుపలి పొరల్లో వ్యతిరేక ఆవేశాలను పుట్టించటం ద్వారా ఇవి విద్యుత్తును సృష్టిస్తాయి. ఫలితంగా కోత ఉన్న చోట విద్యుత్ క్షేత్రం పుట్టుకొచ్చి, గాయం త్వరగా మానటానికి తోడ్పడుతుంది.

గూగుల్ డాక్స్‌లో ట్యాబ్స్


పెద్ద డాక్యుమెంట్ల నిర్వహణ, ముఖ్యమైన అంశాల గుర్తింపు కోసం గూగుల్ డాక్స్ కొత్తగా ట్యాబ్స్ ఫీచర్‌ను ప్రవేశపెట్టింది. ఒక డాక్యుమెంట్‌లో చాలా విభాగాలను క్రియేట్ చేసుకోవటానికిది తోడ్పడుతుంది. ప్రతి భాగానికి ప్రత్యేక శీర్షిక, ఐడీని పెట్టుకోవచ్చు. దీంతో సంక్లిష్ట కంటెంట్‌ను చూడటం, మార్పులు చేర్పులు చేసుకోవటం తేలికవుతుంది. అవసరమైన విషయాన్ని త్వరగా గుర్తించటానికి, ఏకాగ్రతతో పనిచేయటానికి వీలవుతుంది. డాక్యుమెంట్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చటానికి సబ్‌ట్యాబ్స్‌నూ జోడించుకోవచ్చు. ఉదాహరణకు- ఇంటి బడ్జెట్‌ను రూపొందిస్తున్నారనుకోండి. ప్రయాణాలు, ఇంధనం, చిల్లర ఖర్చులకు ఎంతవుందో విడి విడిగా వర్గీకరించుకోవచ్చు. కావాలనుకుంటే ఈ ట్యాబ్స్‌ను పునర్ వ్యవస్థీకరించుకోవచ్చు, అన్నింటినీ కలిపేయొచ్చు. అవసరమనుకుంటే విస్తరించుకోవచ్చు కూడా.

పెద్ద ఉద్యోగం వచ్చిందంటూ వాట్సప్‌లో సందేశం అందిందా? భారీగా జీతమిస్తామని ఊరిస్తోందా? వీలైన సమయాల్లోనే, ఎక్కడి నుంచైనా పని చేయొచ్చని ఆహ్వానిస్తోందా? అయితే అది రిక్రూట్‌మెంట్ కుంభకోణం కావొచ్చు. సామాజిక మాధ్యమాల్లో ఇలాంటి ఉద్యోగ 'ఎర'లు ఎక్కువవుతున్నాయి. ఏమరపాటుతో ఉంటే మోసగాళ్ల వలలో పడిపోవటం ఖాయం. ఉద్యోగం మాట దేవుడెరుగు. డబ్బులు పోగొట్టుకునే ప్రమాదముంది. ఇలాంటి మోసాల నుంచి తప్పించుకునేదెలా?

ఉద్యోగ ఎరలో పడొద్దు!

ఇప్పుడు సామాజిక మాధ్యమాలదే హవా. వాట్సప్ వంటివి రోజువారీ జీవితంలో భాగంగా మారాయి. పుట్టినరోజులు, పండుగల శుభాకాంక్షల దగ్గరి నుంచి ఆన్‌లైన్ అంగళ్ల డెలివరీ సమాచారం వరకూ అన్నీ వీటి ద్వారానే అందుతున్నాయి. అనుక్షణం మన వెంటే ఉంటూ స్నేహితులు, తోటి ఉద్యోగులు, కుటుంబ సభ్యులతో ముచ్చటించుకునే వేదికలుగా స్థిరపడ్డాయి. వ్యాపారాలకూ ఉపయోగపడుతున్నాయి. ఇలాంటి విస్తృత వేదికల్లో తెలిసినవారి నుంచి ఉద్యోగ సమాచారం, ఆహ్వానాలు అందటం మామూలే. కానీ అజ్ఞాత వ్యక్తులు, సంస్థల నుంచి వస్తే మాత్రం అనుమానించాల్సిందే. అది మోసం కావొచ్చు. మెటా సంస్థ గోప్యత, భద్రతను ఎప్పటికప్పుడు మెరుగు పరుస్తున్నప్పటికీ ఇటీవల వాట్సప్‌లో రిక్రూట్‌మెంట్ మోసాలు బాగా పెరిగి పోయాయి. అపరిచిత వ్యక్తులను చేరుకోవటానికి మోసగాళ్లకు ఇది తేలికైన మార్గంగానూ మారిపోయింది.





ఎలా గుర్తించాలి?

'ఫలానా సంస్థ పర్సనల్ మేనేజర్‌ని. ఆన్‌లైన్‌లో పార్ట్‌టైమ్ ఉద్యోగులను నియమిస్తున్నాం. రోజుకు కొద్ది గంటలు పనిచేస్తే చాలు. భారీగా జీతమిస్తాం. ఇష్టముంటే ఈ నంబరుకు కాల్ చేయండి. లేదా లింకును క్లిక్ చేయండి.' రిక్రూట్‌మెంట్ మోసాల మెసేజ్‌లు ఇలాగే ఊరించి, వలలో పడేసుకోవటానికి ప్రయత్నిస్తాయి. కొత్తగా ఉద్యోగాల కోసం వెతికేవారు, ఇప్పటికే ఉద్యోగాల కోసం వెతికి వేసారినవారు వీటికి బాగా ఆకర్షితుల వుతుంటారు. విశ్వసనీయమైన కంపెనీలేవీ ముందుగా ఫోన్ లేదా ఈమెయిల్ ద్వారా సంప్రదించకుండా నేరుగా సోషల్ మీడియాలో ఉద్యోగాలను ఆఫర్ చేయవనే సంగతిని అంతా తెలుసుకోవాలి. మోసగాళ్లు అవి నిజమైన ఉద్యోగ ఆహ్వానాలేనని నమ్మించటంలో బాగా ఆరితేరిపోయారనీ గ్రహించాలి. ప్రముఖ కంపెనీ ప్రొఫైల్ పిక్చర్‌నూ వాడుకోవచ్చు. తాను కంపెనీలో ఉన్నతాధికారిననీ చెప్పుకోవచ్చు. ఇలాంటి ఆహ్వానాలు వచ్చినప్పుడు ఆన్‌లైన్‌లో కంపెనీ వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఫోన్ నంబరును తెలుసుకొని, దానికి ఫోన్ చేయాలి. వివరాలను ఒకటికి రెండు సార్లు తనిఖీ చేసుకోవాలి. ఏదైనా అనుమానం వస్తే దూరం పెట్టేయాలి.

ప్రతిస్పందించారో.. అంతే

మరీ ఎక్కువ జీతంతో ఊరించే అయాచిత ఉద్యోగ ఆహ్వానాలకు స్పందించొద్దు. ముఖ్యంగా వ్యక్తిగత వివరాలు అడుగుతున్నా, తక్కువ కాలమే అందుబాటులో ఉంటుందంటూ త్వరగా అప్లయి చేసుకోవాలని తొందర పెట్టినా అనుమానించాలి. ఇవి మోసాలకు స్పష్టమైన సంకేతాలని తెలుసుకోవాలి. ఇలాంటి ఉద్యోగ ఆఫర్లకు ఆకర్షితులు కావొద్దు. అప్లయి చేసే ముందు ఆ ఆఫర్ ఎక్కడి నుంచి వచ్చిందో ధ్రువీకరించుకోవటం తప్పనిసరి.

అంతర్జాతీయ ఉద్యోగాల ఎరతో

విదేశాల్లో పనిచేయాలనే కోరిక గలవారిని దృష్టిలో పెట్టుకొని వాట్సప్‌లో తరచూ అంతర్జాతీయ ఉద్యోగాల ఆహ్వానాలు అందటమూ చూస్తుంటాం. అంతర్జాతీయ ఫోన్ నంబరుతో మెసేజ్ వస్తే ఎవరికైనా ఉత్సాహంగానే ఉంటుంది. కానీ 99% సందర్భాల్లో అవి మోసపూరితమైనవే అయ్యింటాయి. నేరగాళ్లు అప్లికేషన్, రిజిస్ట్రేషన్ రుసుము పేరుతో డబ్బులు గుంజటానికి ప్రయత్నిస్తుంటారు. విశ్వసనీయ సంస్థలు తమ కంపెనీలో చేరాలని ఎవరినీ డబ్బులు అడగవు. ఒకవేళ ఉద్యోగులను వేరే చోటుకు మారిస్తే కంపెనీలే తగు ఏర్పాట్లు చేస్తాయి. కాబట్టి అంతర్జాతీయ ఉద్యోగ ఆఫర్లు వస్తే ఆ కాంటాక్టులను బ్లాక్ చేయటం ఉత్తమం.

ఆ ఉత్తరాల వలలో పడొద్దు

ఆన్‌లైన్ మోసగాళ్లు రోజురోజుకీ తెలివి మీరుతున్నారు. అధికారికమైనవని అనిపించేలా కంపెనీ లెటర్‌హెడ్‌తోనూ ఉద్యోగ ఆహ్వానాల మెసేజ్‌లు పంపిస్తుంటారు. నిజంగా నమ్మించేలా మెసేజ్‌లు పంపుతుంటారు. అత్యవసరంగా ఉద్యోగం కావాల్సినవారు వీటిని గుర్తించలేక, వలలో పడిపోతుంటారు. నిజానికి ఇంటర్వ్యూ లేదా సంప్రదింపుల విధివిధానాలు లేకుండా విశ్వసనీయమైన కంపెనీలు ఆఫర్ లెటర్లను పంపించవని గుర్తించాలి. అంతకుముందు ఎలాంటి సంప్రదింపులు జరపకపోయినా ఆఫర్ లెటర్ వస్తే మోసమేనని అనుకోవాలి. కొత్త ఉద్యోగం పొందటం అటుంచండి. ఉన్న డబ్బులు కోల్పోయే ప్రమాదముంది.

ఊరించే మాటలకు మోసపోవద్దు

అధిక జీతాలు ఇస్తామనే కాదు.. వీలైనప్పుడే పని చేయండి, ఎక్కడి నుంచైనా పని చేయండి అంటూ ఊరించే ఆహ్వానాలతోనూ మోసగాళ్లు బురిడీ కొట్టిస్తుంటారు. కొన్ని కంపెనీలు ఇలాంటి సదుపాయాలు కల్పించే మాట నిజమే అయినా కేవలం వాట్సప్ ద్వారా సందేశాలు పంపించవు. ఇలాంటి వాటిని మోసగాళ్లు మనల్ని నమ్మించటానికి వేసే ఎత్తులుగానే పరిగణించాలి.

అంగటి సరుకులా వ్యక్తిగత వివరాలు

ప్రస్తుత డిజిటల్ యుగంలో గోప్యతకు దాదాపు చోటే లేదనుకోవాలి. కొన్ని వేల రూపాయలకే పెద్దఎత్తున ఫోన్ నంబర్లు, ఈమెయిల్ చిరునామాలు అమ్మటం చూస్తూనే ఉన్నాం. వీటిని మోసగాళ్లు కొని భారీ ఎత్తున ప్రజలకు గాలం వేస్తుంటారు. ఒకట్రెండు శాతం మందైనా వలలో పడకపోరని భావిస్తుంటారు. దురదృష్టం కొద్దీ చాలామంది ఈ మోసగాళ్ల వలలో పడి, డబ్బులు పోగొట్టుకుంటున్నారు. మీరూ వీరి జాబితాలో చేరుతారో లేదోనన్నది మీ చేతుల్లోనే ఉందని తెలుసుకోవాలి.

ఒకటికి రెండు సార్లు ఆచితూచి

వాట్సప్‌లో అందిన ఉద్యోగ ఆహ్వానం ఎంత నమ్మకమైనదని అనిపించినా ఒకటికి రెండు సార్లు ఆచితూచి వ్యవహరించాలి. అలాంటి కంపెనీ నిజంగా ఉందో లేదో ధ్రువీకరించుకోవాలి. ముఖ్యంగా ఏదైనా ప్రత్యేకమైన ఆఫర్ ఇస్తే తప్పకుండా అనుమానించాలి. ఆ కంపెనీ నంబరును నెట్‌లో వెతికి, కాల్ చేయాలి. ఏ విషయమూ తేల్చుకోలేనప్పుడు స్నేహితులు, కుటుంబ సభ్యులతో చర్చించి, అభిప్రాయం తీసుకోవాలి.

ద్వేష భాషకు షోర్ కళ్లెం!

ఇప్పుడు ప్రతిదానికీ సామాజిక మాధ్యమాలే. ఇవి ప్రపంచవ్యాప్తంగా ఎక్కడేం జరుగుతున్నా క్షణాల్లో తెలియజేస్తున్నాయి. తమ వ్యక్తిగత అభిప్రాయాలను తెలపటానికీ ఎంతోమందిని వీటిని వాడుకుంటున్నారు. అయితే అందరికీ అవి నచ్చకపోవచ్చు. అసమంజసంగా, భావోద్వేగాలను రెచ్చగొట్టేలా ఉండొచ్చు. గత సంవత్సరంలో ద్వేష (హేట్) వ్యాఖ్యలు 45% పెరిగినట్టు నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదిక పేర్కొంటోంది. దీన్ని అరికట్టటానికి మెషిన్ లెర్నింగ్ ఇంజినీర్ అనింద్రియ బరువా 'షోర్ ఏఐ' అనే అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్ఫేస్ (ఏపీఐ) రూపొందించారు. ప్రత్యేకించి మనదేశాన్ని దృష్టిలో పెట్టుకుని తీసుకొచ్చిన ఇది ఇటీవల గూగుల్ ఏఐ సమిట్ 2024లో అవార్డునూ గెలుచుకుంది. ఏఐ ఫర్ సోషల్ గుడ్ విభాగంలో పురస్కారాన్ని దక్కించుకుంది. ఇదో అధునాతన కృత్రిమ మేధ బాట్. ఇది



భారతీయ భాషలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తుంది. భారీ, క్రౌడ్ సోర్స్‌డ్ సమాచార నిధితో షోర్ ఏఐకి శిక్షణ ఇచ్చారు. కంటెంట్ మోడరేషన్ ఏపీఐగా పనిచేస్తుంది. ద్వేషపూరిత మాటలను గుర్తించటానికి, నిలువరించటానికి దీన్ని వేర్వేరు వేదికల మీద వాడుకోవచ్చు. ఇది ఇమేజెస్, రీల్స్, యూట్యూబ్ షార్ట్స్‌తో పాటు ఇతర ప్రజాదరణ కంటెంట్ ఫార్మాట్లనూ విశ్లేషించగలదని, ద్వేష భావనలను సమర్థంగా నిలువరించగలదని చెబుతున్నారు.

వాట్సప్ కాల్ లింక్ షేర్ తేలికగా..

బృంద, వ్యక్తిగత ఛాట్స్‌లో వీడియో, ఆడియో కాల్స్‌ను త్వరగా షేర్ చేయటానికి వాట్సప్ కొత్త ఫీచర్‌ను పరీక్షిస్తోంది. గూగుల్ మీట్, జూమ్‌లో మనం వీడియో సమావేశాల లింక్ మీద క్లిక్ చేసి, ఇతరులతో జాయిన్ అవుతాం కదా. వాట్సప్ కొత్త ఫీచర్ కూడా ఇలాగే పనిచేస్తుంది. నిజానికి ఆడియో, వీడియో కాల్స్ షేరింగ్ సదుపాయం వాట్సప్‌లో ఇప్పటికే ఉంది. కాకపోతే ఇదో పెద్ద తతంగంలా అనిపిస్తుంది. ముందుగా కాల్స్ ట్యాబ్‌లకి వెళ్లి క్రియేట్ కాల్ లింక్ ద్వారా కాల్ టైప్‌ను ఎంచుకొని, తర్వాత ప్లస్ మీట మీద తాకాల్సి ఉంటుంది. ఇప్పుడిది సులభం కానుంది. ప్రస్తుతానికి ఈ ఫీచర్ బీటా టెస్టర్లకు అందుబాటులో ఉంది. త్వరలోనే విస్తృతంగా అందుబాటులోకి రానుంది. మరి దీన్నెలా వాడుకోవాలి?

- ముందుగా కనెక్ట్ కావాలనుకునే బృంద లేదా వ్యక్తిగత ఛాట్‌ను ఓపెన్ చేయాలి.
- కింద బార్ మీదుండే అటాచ్‌మెంట్ గుర్తును నొక్కి, కాల్ లింక్‌ను తాకాలి.
- అప్పుడు ఆడియో లేదా వీడియో కాల్ ఆప్షన్ కనిపిస్తుంది. ఇష్టమైనది ఎంచుకోవాలి.
- అనంతరం ఆకుపచ్చ రంగులో కనిపించే లింక్ బటన్‌ను నొక్కితే అది అవతలివారికి చేరుతుంది.



\- ఇతరులకు కాల్ లింక్‌ను పంపించినప్పుడు ఇద్దరూ జాయిన్ కాల్‌ను నొక్కితేనే మాట్లాడుకోవటం మొదలవుతుందని గుర్తించాలి. గ్రూప్ కాల్స్‌కూ ఇదే వర్తిస్తుంది. అటాచ్‌మెంట్ మెనూలోని కొత్త కాల్ లింక్ బటన్ తేలికగా వాడుకోవటానికి వీలుంటుంది. అందువల్ల ఎక్కువమంది యూజర్లకు నచ్చుతుందని భావిస్తున్నారు.

లో లైట్ మోడ్ కూడా

వెలుతురు తక్కువగా ఉన్నప్పుడు వీడియో కాల్స్ మాట్లాడుకోవటానికి వీలు కల్పించే **లో లైట్ మోడ్‌**నూ వాట్సప్ తీసుకొచ్చింది. వీడియో కాల్స్‌లో బ్యాక్‌గ్రౌండ్, ఫిల్టర్లను యాడ్ చేయటానికి ఇటీవల పరిచయం చేసిన అప్‌డేట్స్‌లో ఇదొక ఫీచర్. ఐఓఎస్, ఆండ్రాయిడ్ రెండు వర్షన్ల మీదా అందుబాటులో ఉంటుంది. కాకపోతే వెబ్ యాప్‌నకు ఇంకా వర్తింప జేయలేదు. దీన్ని వాడుకోవటమెలా?

- వాట్సప్ ఓపెన్ చేయాలి.
- వీడియో కాల్‌కు కనెక్ట్ కావాలి.
- కాల్ మాట్లాడుతున్నప్పుడు పైన కుడిమూలన కనిపించే బల్బ్ గుర్తు మీద తాకాలి.
- ఒకవేళ నప్పదని అనుకుంటే లో లైట్ మోడ్‌ను ఆఫ్ చేసుకోవచ్చు.

ఇటీవల సామాజిక మాధ్యమాల్లో నియర్-ఫీల్డ్ కమ్యూనికేషన్ (ఎన్ఎఫ్‌సీ) స్మార్ట్‌ఫోన్ కేసులు హల్‌చల్ చేస్తున్నాయి. ఫోన్ వెనకాల నచ్చిన ఫొటో లేదా గ్రాఫిక్‌ను డిస్‌ప్లే చేయటం ద్వారా యూజర్లు తమ భావాలను వ్యక్తం చేయటానికివి తోడ్పడతాయి. అందుకే వీటిపై చాలామంది మొగ్గు చూపుతున్నారు. ఇంతకీ వీటికి ఇంతటి ప్రత్యేకత తెచ్చిపెట్టిందేంటో తెలుసా? ఎన్ఎఫ్‌సీ పరిజ్ఞానంతో పాటు రంగురంగుల ఇ-ఇంక్ డిస్‌ప్లే. ఇదే దీనికి గుండె కాయ.

స్మార్ట్‌ఫోన్‌కు ఎన్ఎఫ్‌సీ అందం!



ప్రస్తుతం ఎన్ఎఫ్‌సీ కేసులు రకరకాల స్మార్ట్‌ఫోన్లకు.. ముఖ్యంగా సామ్‌సంగ్, యాపిల్ ఫ్లాగ్‌షిప్ పరికరాలకు అందుబాటులో ఉన్నాయి. ఎన్ఎఫ్‌సీ అనేది బ్లూటూత్, వై-ఫై మాదిరిగా డేటాను ప్రసారం చేసే పరిజ్ఞానం. అయితే ఇది చాలా నెమ్మదిగా ప్రసారం చేస్తుంది. పేరుకు తగ్గట్టుగానే ఈ కేసులు ఎన్ఎఫ్‌సీని సపోర్టు చేసే ఫోన్లతోనే పనిచేస్తాయి. వీటిని ఫోన్‌కు జత చేయగానే అవి ఎన్ఎఫ్‌సీ సాయంతో అనుసంధానమవుతాయి. చాలా కేసులు యాప్ ద్వారా ఇమేజ్ లేదా గ్రాఫిక్‌ను ప్రసారం చేస్తాయి. ఇంతకీ ఇవెలా పనిచేస్తాయి? అమెజాన్ కిండిల్ వంటి ఇ-బుక్ రీడర్లలో ఉండే ఇ-ఇంక్ డిస్‌ప్లే పరిజ్ఞానంతోనే ఇవి పని చేస్తాయి. చాలా కేసులు కొంతవరకు ఫోన్‌కు రక్షణగానూ నిలుస్తాయి. కాకపోతే మామూలు కేసుల మాదిరిగా ప్రమాదాలను అంతగా తట్టుకోలేవు. వీటి ధర ఎక్కువ కావటం వల్ల బడ్జెట్ ఫోన్లకు అంతగా లభ్యం కావటం లేదనే చెప్పుకోవచ్చు. తక్కువ ధర ఎన్ఎఫ్‌సీ కేసులు ఒకే రంగు ఇ-ఇంక్ డిస్‌ప్లేను కలిగుంటాయి. మధ్యశ్రేణి కేసులు మూడు రంగులు, ఖరీదైనవి నాలుగు రంగుల డిస్‌ప్లేతో వస్తున్నాయి. వీటిల్లో పిక్చర్ నాణ్యత కూడా చాలా బాగుంటుంది.

బ్యాటరీ అవసరం లేదు

ఎన్ఎఫ్‌సీ కేసుల గొప్పతనమేంటంటే బ్యాటరీ అవసరం లేకపోవటం. ప్రత్యేకంగా విద్యుత్తు అవసరం లేకుండా పని చేసే ఎన్ఎఫ్‌సీ చిప్ ఈ ఇమేజ్‌లను ప్రసారం చేస్తుంది. ఇది ఫోన్ నుంచే అవసరమైన విద్యుత్తును సంగ్రహిస్తుంది. అలాగని ఫోన్ బ్యాటరీ మీద ప్రభావం చూపదు. ఎందుకంటే దీనికి చాలా చాలా తక్కువ విద్యుత్తే అవసరమవుతుంది. ఎన్ఎఫ్‌సీ కేస్ మీదుండే రంగుల ఇ-ఇంక్ ఫోన్ వెనకాల ఇమేజ్‌ను డిస్‌ప్లే చేస్తుంది. ఫోన్‌లో వీటికి అవసరమైన యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవటం తప్పించి ఎన్ఎఫ్‌సీ స్మార్ట్‌ఫోన్ కేసులతో ప్రస్తుతానికి చిక్కులేవీ లేవు. స్మార్ట్‌ఫోన్ మరింత అందంగా, ఆకర్షణీయంగా, నచ్చిన విధంగా కనిపించాలని భావించేవారికివి మంచి ఎంపిక అనటంలో సందేహమేమీ లేదు. నచ్చిన హీరో లేదా హీరోయిన్ ఫొటో ఫోన్ వెనకాల కనిపిస్తుంటే ఆ జోషే వేరు కదా.

ప్రిపరేషన్ టెక్నిక్

సోషల్ స్టడీస్ చదివేటప్పుడు పరీక్షలకు ముఖ్యమైన తేదీలు, సంవత్సరాలు ఒక పక్కన రాసిపెట్టుకొని మళ్లీ మళ్లీ చదవాలి. తెలిసిన వాళ్ల పుట్టిన రోజులు, ఇతర సంఘటనలకు సంబంధించిన తేదీలకు, సంవత్సరాలకు వాటిని లింక్ చేసి గుర్తుంచుకోడానికి ప్రయత్నించాలి.

డీఎస్సీ-2024 విద్యా దృక్పథాలు

కరెంట్ అఫైర్స్

■ ఆసియా బిలియర్డ్స్ ఛాంపియన్‌షిప్-2024లో పురుషుల టైటిల్ విజేతగా ఎవరు నిలిచారు? (సౌదీ అరేబియాలోని రియాద్‌లో నిర్వహించిన ఈ టోర్నీలో ఈయన ఫైనల్లో భారత్‌కి చెందిన పంకజ్ అద్వానీని ఓడించి టైటిల్ విజేతగా నిలిచాడు. ఈయనకు ఇది మూడో ఆసియా బిలియర్డ్స్ టైటిల్. మహిళల ఆసియా స్నూకర్ ఛాంపియన్‌షిప్‌ను అనుపమ రామచంద్రన్ గెలుచుకుంది. ఈమె ఫైనల్లో థాయ్‌లాండ్‌కు చెందిన పంచయ చన్నోయిని ఓడించి తన తొలి అంతర్జాతీయ టైటిల్‌ను నెగ్గింది. **జ:** ధ్రువ్ సిత్వాలా



మాదిరి ప్రశ్నలు

■ 15వ అగ్రికల్చరల్ లీడర్‌షిప్ అవార్డుల కమిటీ 2024 సంవత్సరానికిగాను ఏ రాష్ట్రాన్ని ఉత్తమ వ్యవసాయ రాష్ట్రంగా ప్రకటించింది? (భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పి.సదాశివం నేతృత్వంలోని కమిటీ ఈ రాష్ట్రాన్ని ఉత్తమ వ్యవసాయ రాష్ట్ర అవార్డుకు ఎంపిక చేసింది. 21 లక్షల హెక్టార్లలో దేశంలోనే అతిపెద్ద వెదురు పెంపకం మిషన్‌ను ఈ రాష్ట్రం ప్రారంభించింది.) **జ:** మహారాష్ట్ర

■ ప్రపంచంలోనే అతిపెద్ద సౌరశక్తి ఉత్పత్తిదారుగా ఏ దేశం నిలిచింది? (తాజాగా ప్రపంచ సౌరశక్తి సామర్థ్యం ఒక టెరావాట్‌ను అధిగమించింది. 250 గిగావాట్ల ఉత్పత్తితో ఈ దేశం సౌరశక్తి ఉత్పత్తిలో అగ్రగామిగా నిలిచింది.) **జ:** చైనా

మరింత సమాచారం

జనరల్ స్టడీస్
సైన్స్ అండ్ టెక్నాలజీ

చికిత్స లేదు.. నివారణే శరణ్యం!

మానవ జాతిని తరతరాలుగా పట్టి పీడిస్తున్న వ్యాధులకు ప్రధాన కారణాల్లో వైరస్ ఒకటి. సాధారణ జలుబు, పోలియో, హెపటైటిస్, మెదడువాపు, గవదబిళ్లలు, తట్టు తదితరాలన్నీ వైరస్ కారక వ్యాధులే. శాస్త్రవిజ్ఞానం అభివృద్ధి, పరిశోధనల ఫలితంగా ఇలాంటి ఎన్నో వ్యాధులకు నేడు మందులు, ముందస్తు నివారణ టీకాలు వస్తున్నాయి. అయినప్పటికీ ఎప్పటికప్పుడు కొత్తరకం వైరస్‌లు పుట్టుకొస్తూ మానవాళి ఆరోగ్యానికి సవాళ్లు విసురుతున్నాయి. ప్రస్తుతం ఈ కోవలో ఉన్నవే నిఫా, జికా, చాందిపురా వంటి ప్రమాదకర వైరస్‌లు. వీటితో వచ్చే వ్యాధులకు నిర్దిష్ట చికిత్స లేకపోవడంతో ప్రాణాంతకంగా మారి కలవర పెడుతున్నాయి. ఈ వైరస్ వ్యాధులకు కారణాలు, వ్యాపించే విధానం, లక్షణాలను అభ్యర్థులు పరీక్షల కోణంలో తెలుసుకోవాలి. నివారణ చర్యలు, అందుబాటులోకి వచ్చిన వ్యాక్సిన్ల వివరాలపై అవగాహన పెంచుకోవాలి.

వైరస్ వ్యాధులు

నిఫా వైరస్

భారతదేశంలో తొలిసారిగా 2023, సెప్టెంబరులో నిఫా వైరస్ ఇన్‌ఫెక్షన్‌ను కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ నిర్ధారించింది. కేరళలోని కోజికోడ్ జిల్లాలో 6 నిఫా వైరస్ కేసులు బయటపడగా, వారిలో ఇద్దరు మరణించారు. అయితే 2001 నుంచి ఇప్పటి వరకు కేవలం కేరళ రాష్ట్రంలోనే 6 సార్లు ఇలాంటి నిఫా వైరస్ ప్రబలింది.




* నిఫా వైరస్‌ను మొదటగా 1999లో మలేసియాలో పందులు పెంచే రైతుల్లో, 2001లో బంగ్లాదేశ్‌లో, ఆ తర్వాత ఇండొనేసియా, మడగాస్కర్, ఫిలిప్పైన్స్, థాయిలాండ్, కాంబోడియా వంటి అనేక దేశాల్లో గుర్తించారు.

వ్యాపించే విధానం: ఈ వైరస్ గబ్బిలాలు, పందుల నుంచి మనుషులకు సంక్రమిస్తుంది. ఈ విధంగా జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధులను జూనోటిక్ వ్యాధులు అంటారు. జంతువుల లాలాజలం, మలం, మూత్రం వంటి వాటిని మానవులు ముట్టుకున్నప్పుడు వైరస్ సోకుతుంది. మనిషి నుంచి వెలువడే స్రావాల ద్వారా వేరొకరికి సంక్రమిస్తుంది.

వ్యాధి లక్షణాలు, చికిత్స: ఈ వైరస్ సంక్రమణ వల్ల తీవ్రమైన శ్వాససంబంధ ఇబ్బందులు కలుగుతాయి. మెదడు ప్రభావితమై మరణానికి దారితీస్తుంది. వ్యాధి సోకిన వారిలో 40 నుంచి 100 శాతం వరకు మరణాలు సంభవించవచ్చు. నిఫా వైరస్ బాధితులకు నిర్దిష్ట చికిత్స గానీ, నివారణకు వ్యాక్సిన్ గాని అందుబాటులో లేదు. వ్యాధి లక్షణాల ఆధారంగా చికిత్స చేస్తున్నారు.

నివారణ చర్యలు: జంతువుల విసర్జకాలకు దూరంగా ఉండాలి. గబ్బిలాలు తిన్న పండ్లు, కూరగాయలను కడిగి లేదా పూర్తి పొట్టు తీసి తినాలి. అడవి జంతువులకు దూరంగా ఉండాలి. వ్యాధి సోకిన పెంపుడు జంతువుల దగ్గర పనిచేసేటప్పుడు చేతులకు తొడుగులు, ముఖానికి మాస్క్ ధరించాలి. వ్యాధి సోకిన వ్యక్తులను వేరుగా ఉంచి చికిత్స అందించాలి. పరిశుభ్రత పాటించాలి, చేతులు తరచూ కడుక్కోవాలి.

జికా వైరస్ వ్యాధి



జికా వైరస్ వల్ల ఈ వ్యాధి వస్తుంది. దేశంలో జికా వైరస్‌ను తొలిసారి గుజరాత్‌లో 2016లో కనుక్కున్నారు. ఆ తర్వాత తమిళనాడు, మధ్యప్రదేశ్, రాజస్థాన్, కేరళ, మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్, దిల్లీ, కర్ణాటక రాష్ట్రాల్లో ఈ వైరస్ బాధితులను గుర్తించారు. ఇటీవలి కాలంలో 2024, జులైలో మహారాష్ట్రలో 8 మంది వ్యాధిగ్రస్తులను గుర్తించారు.

* జికా వైరస్‌ను వ్యాధి నిర్ధారణ పరీక్ష ద్వారా గుర్తించడానికి నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (పుణె), నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (దిల్లీ)లో ఏర్పాట్లు ఉన్నాయి.

వ్యాధి లక్షణాలు, చికిత్స: జికా వైరస్ సోకిన వారికి చర్మంపై దద్దుర్లు, జ్వరం, కండ్లకలక, కండరాల నొప్పులు, కీళ్లనొప్పులు, తలనొప్పి వంటి లక్షణాలు ఉంటాయి. గర్భిణికి ఈ వైరస్ సోకితే గర్భస్రావం కలిగే అవకాశం ఉంది. జికా వైరస్ వ్యాధికి నిర్దిష్ట చికిత్స లేదు. నొప్పిని, వాపులను తగ్గించే మాత్రలు వేసుకోవడం, శరీర ఉష్ణోగ్రతను నియంత్రించే ఔషధాలు వాడటం, నీరు ఎక్కువగా తాగడం వంటి చర్యల ద్వారా వ్యాధి తీవ్రతను తగ్గించవచ్చు.

వ్యాధి వ్యాపించే విధానం, నివారణ చర్యలు: జికా వైరస్ ఎడిస్ ఈజిప్టై అనే దోమ కుట్టడం వల్ల ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. గర్భిణికి వస్తే గర్భంలో ఉన్న శిశువుకు సంక్రమిస్తుంది. లైంగిక సంపర్కం, రక్తమార్పిడి, అవయవ మార్పిడి వంటి విధానాల ద్వారా కూడా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవడం, చుట్టుపక్కల దోమలు పెరగకుండా చూడటం, దోమలను సంహరించడం వంటి పద్ధతుల ద్వారా ఈ వ్యాధి వ్యాపించకుండా చూడవచ్చు. వ్యాధి సోకిన వ్యక్తులు తగిన జాగ్రత్తలు పాటించాలి. * జికా వైరస్‌ను మొదట 1947లో ఉగాండాలో రీసస్ కోతి నందు కనుక్కున్నారు. 1950లో ఆఫ్రికా దేశాల్లో చాలామందిలో ఈ వైరస్ సంక్రమణను గుర్తించారు. 1960 నుంచి 1980 మధ్య ఆఫ్రికా, ఆసియా దేశాలలో, 2007 నుంచి ఆఫ్రికా, ఆసియా దేశాలతో పాటు అమెరికా వంటి ప్రాంతాల్లో వ్యాధి వేగంగా ప్రబలింది.

చాందిపురా వైరస్



చాందిపురా వైరస్ వల్ల అక్యూట్ ఎన్‌సెఫలైటిస్ సిండ్రోమ్ అనే వ్యాధి వస్తుంది. 2024 జూన్-ఆగస్టు మధ్యలో ఈ వ్యాధి సోకిన 245 మందిని గుర్తించినట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ ప్రకటించగా, అందులో 82 మంది చనిపోయినట్లు ధ్రువీకరించారు.

చాందిపురా వైరస్‌ను మొదటగా 1965లో మహారాష్ట్రలోని నాగ్‌పుర్ జిల్లాలో చాందిపురా అనే ప్రదేశంలో గుర్తించారు. దీంతో అదే పేరు పెట్టారు. జికా, నిఫా వంటివి ఆఫ్రికా దేశాల నుంచి భారతదేశంలోకి ప్రవేశించి మానవులకు సంక్రమణం చెందితే చాందిపురా వైరస్‌ను మాత్రం ఇక్కడే గుర్తించడం గమనార్హం.

* చాందిపురా వైరస్ రాబ్డోవిరిడే కుటుంబానికి చెందినది. ఈ వైరస్ శాండ్‌ఫ్లై, కీటకాలు, దోమలు, రక్తాన్ని పీల్చే పేను వంటి వాటి ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. గుజరాత్‌లో ఈ వైరస్ ఒక రకమైన శాండ్‌ఫ్లై (ఫ్లిబోటమస్ పపాటాసి) వల్ల సంక్రమించింది. ఈ వైరస్ సోకినవారిలో 56% నుంచి 75% వరకు మరణించారు. ఈ వ్యాధి ముఖ్యంగా 15 సంవత్సరాల్లోపు పిల్లల్లో ఎక్కువగా కనిపిస్తుంది. వ్యాధి లక్షణాలు వెల్లడైన 48 నుంచి 72 గంటల్లో తగిన చికిత్స అందకపోతే మరణించే అవకాశం ఉంది.

వ్యాధి లక్షణాలు, చికిత్స: ఈ వైరస్ సంక్రమణం వల్ల మొదట ఫ్లూతోపాటు జ్వరం, మూర్ఛ, విరేచనాలు, తీవ్రమైన మెదడువాపు వంటి లక్షణాలు కనిపిస్తాయి. దీనికి నిర్దిష్ట ఔషధాలు, ప్రత్యేక చికిత్స లేవు. వ్యాధి లక్షణాల ఆధారంగా చికిత్స చేస్తున్నారు. రోగికి ఆక్సిజన్ అందించడం, మూర్ఛ రాకుండా మందులు ఇవ్వడం, ఎలక్ట్రోలైట్లు తగ్గకుండా చూసుకోవడం, శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడం వంటి పద్ధతులు పాటించాలి. రక్త పరీక్షల ద్వారా వైరస్ ఉనికిని నిర్ధారించవచ్చు. సాధారణ మెదడువాపు, చాందిపురా వైరస్ వల్ల కలిగే అక్యూట్ ఎన్‌సెఫలైటిస్ సిండ్రోమ్‌కు మధ్య తేడాను గమనించి చికిత్స అందించాలి.

నివారణ చర్యలు: ఈ వ్యాధి శాండ్‌ఫ్లై కీటకం కుట్టడం వల్ల సంక్రమిస్తుంది. అందుకే ఈ కీటకం కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అటవీ ప్రాంతాలకు దగ్గరగా ఉన్నవారు కీటకాలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. జంతువుల శరీరంపై ఉండే రక్తాన్ని పీల్చే పేను వంటివి మనల్ని కుట్టకుండా చూసుకోవాలి. దోమలను సంహరించే పద్ధతులు పాటిస్తూ, వాటి నుంచి శరీరాన్ని కాపాడుకోవాలి.




రచయిత: డాక్టర్ బి. నరేశ్

JUNIOR INTER Physics Q&A

Body does change with time

Motion in a Straight Line

2 Marks



1) The states of motion and rest are relative. Explain.

A: Rest and motion are relative.

Rest: position of the body does not change with time is known as Rest.

Motion: position of the body does change with time is known as Motion.

A body can be in the rest or in motion w.r.t. reference frame. A man in a moving train is at rest w.r.t. a co-passenger, but he is in motion w.r.t a man on the ground.

2) How is average velocity different from instantaneous velocity?

A: Average velocity: It is the ratio of total displacement to total time interval.

Instantaneous velocity: velocity of the body at a particular instant of time is called instantaneous velocity.

The average velocity does not give any details of the motion of the particle. It gives only the result of the motion. The instantaneous velocity defines how fast the particle moves at a particular instant of time. In uniform motion the instantaneous velocity is equal to the average velocity.

3) Give an example where the velocity of an object is zero but its acceleration is not zero.

A: When the body is projected vertically upwards, at the Maximum highest point, its velocity is zero. But its acceleration ($a = g$) is not equal to zero.

\- K. Chiranjeevi

Some More Imp Questions


4 Marks

For answers

1) A car travels the first third of a distance with a speed of 10 kmph, the second third at 20 kmph and the last third at 60 kmph. What is its mean speed over the entire distance?

2) A ball is dropped from the roof of a tall building and simultaneously another ball is thrown horizontally with some velocity from the same roof. Which ball lands first? Explain your answer.

ఆ కేసులో బయటపడిన భద్రతా చట్టాల బలహీనతలు!



చట్టం అంటే విధిగా పాటించాల్సిన నియమం. సమాజ సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యక్తుల ప్రవర్తనను నియంత్రించేందుకు, వ్యక్తిగత హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం దానిని రూపొందిస్తుంది. ప్రతి ఒక్కరికీ రాజకీయ, ఆర్థిక, సామాజిక హక్కులు, అవకాశాలు అందాలని చాటే సామాజిక న్యాయం చట్టాల్లో ప్రతిబింబిస్తుంది. భారత రాజ్యాంగం సమన్యాయాన్ని నిర్దేశిస్తోంది. ఈ స్ఫూర్తికి అనుగుణంగా దేశంలో కాలానుగుణంగా ఏర్పాటైన ముఖ్యమైన చట్టాలు, వాటి ఉద్దేశాల గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. చరిత్రలో అతిపెద్ద పారిశ్రామిక విపత్తుగా నిలిచిన భోపాల్ గ్యాస్ దుర్ఘటన, దాని పర్యవసానాలు, బాధితుల పక్షాన జరిగిన పోరాటాలతో పాటు కాలుష్యం బారి నుంచి ప్రజలను రక్షించేందుకు ఉన్న నియమాలు, దుర్బల స్థితిలో ఉండే బాలలు, బలహీన వర్గాల సంక్షేమం కోసం చట్టపరంగా జరిగిన కసరత్తును తెలుసుకోవాలి.

చట్టం - సామాజిక న్యాయం

డీఎస్సీ 2024 - పౌరశాస్త్రం

1. పవర్‌లూమ్‌ల పోటీని ఎదుర్కోలేక 1980-1990 కాలంలో ఏ ప్రాంతంలోని కార్మికులు జౌళి మిల్లులు మూసివేశారు?
   1) నాగ్‌పుర్ 2) అహ్మదాబాద్
   3) హుబ్లీ 4) ముర్షిదాబాద్

2. కింద పేర్కొన్న అంశాలలో సరైన జవాబును గుర్తించండి.
   ఎ) 2011 జనాభా గణాంకాల ప్రకారం భారతదేశంలో 5-14 సంవత్సరాల మధ్య వయసున్న 4 మిలియన్ల మంది పిల్లలు ప్రమాదకరమైన వివిధ వృత్తుల్లో పనిచేస్తున్నారు.
   బి) పీడనాన్ని నిరోధించే హక్కు ప్రకారం వెట్టిచాకిరీ, బలవంతంగా తక్కువ వేతనాలకు పనిచేయించడం నేరం.
   సి) రాజ్యాంగం ప్రకారం 14 సంవత్సరాల కంటే తక్కువ వయసున్న పిల్లలను కర్మాగారాలు, గనుల్లో పనిచేయించడం నేరం.
   డి) ప్రతి కార్మికుడికి న్యాయమైన వేతనాలు అందేలా చూడడానికి ప్రభుత్వం పని ప్రదేశాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి.
   1) ఎ, బి, డి 2) ఎ, బి, సి
   3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి

3. బాలకార్మిక నియంత్రణ చట్టానికి సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
   ఎ) భారత పార్లమెంటు 1986లో 'బాలకార్మిక నిషేధ చట్టం' రూపొందించింది.
   బి) భారత పార్లమెంటు 2016లో బాలకార్మిక నిషేధ చట్టాన్ని సవరించింది.
   సి) 2016లో సవరించిన బాలకార్మిక నిషేధ చట్టం ప్రకారం చట్టాన్ని ఉల్లంఘించిన వారికి రూ.20 వేల నుంచి రూ.50 వేల జరిమానా విధిస్తారు.
   డి) 2016 నాటి బాలకార్మిక నిషేధ సవరణ చట్టాన్ని 2022లో సవరించారు.
   1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

4. 'బాలకార్మిక నిషేధ సవరణ చట్టం, 2016' లోని అంశాన్ని గుర్తించండి.
   ఎ) 14 సంవత్సరాల కంటే తక్కువ వయసున్న పిల్లలను అన్ని వృత్తులలో నియమించడం నేరం.
   బి) కౌమార వయస్సులో ఉన్నవారిని (14-18 ఏళ్లు) ప్రమాదకర పనుల్లో నియమించరాదు.
   సి) ఈ చట్టాన్ని ఉల్లంఘించిన వారికి 6 నెలల నుంచి 2 సంవత్సరాల వరకు జైలు శిక్ష విధిస్తారు.
   డి) పనిలో ఉన్న పిల్లలను రక్షించి, పునరావాసం కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది.
   1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
   3) ఎ, డి, బి 4) ఎ, బి, సి, డి

5. బాలల సంక్షేమానికి ఉద్దేశించిన ఆన్‌లైన్ పోర్టల్ **"PENCIL"** కు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
   1) Protection for Effective Enforcement for no child labour.
   2) Platform for effective enforcement for no child labour.
   3) Platform for efficiency Encouragement for no child labour.
   4) Precaution for efficiency encouragement for no child labour.

6. **"PENCIL"** కు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
   ఎ) ఇది 2017 నుంచి అమలులోకి వచ్చింది.
   బి) ఫిర్యాదులను నమోదు చేయడం, పిల్లల జాడ కనిపెట్టడం.
   సి) National Child Labour Project (NCLP) కార్యక్రమాలను అమలుజరిగేలా చూడటం, పర్యవేక్షించడం.
   డి) దీన్ని తమిళనాడు రాష్ట్రంలోని మందుగుండు సామగ్రి విక్రయ సంఘం సుప్రీంకోర్టులో సవాలు చేసింది.
   1) ఎ, బి, డి 2) ఎ, బి, సి
   3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి

7. భోపాల్ గ్యాస్ దుర్ఘటన ఎప్పుడు సంభవించింది?
   1) 1984, డిసెంబరు 1 2) 1984, నవంబరు 2
   3) 1984, డిసెంబరు 2 4) 1984, ఏప్రిల్ 2

8. భోపాల్ గ్యాస్ దుర్ఘటనకు సంబంధించిన అంశాన్ని గుర్తించండి.
   ఎ) 'యూనియన్ కార్బైడ్' (UC) అనే పురుగుమందులు ఉత్పత్తి చేసే అమెరికన్ కంపెనీ వల్ల ఇది జరిగింది.
   బి) మిథైల్-ఐసోసైనేట్ అనే అత్యంత విషపూరిత వాయువు విడుదలైంది.
   సి) ఈ దుర్ఘటన జరిగిన 3 రోజుల్లో 8000 మందికి పైగా చనిపోయారు.
   డి) 50,000 మంది ప్రజలు ఏ పని చేయలేనంత అనారోగ్యంతో ఉన్నారు.
   1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

9. యూనియన్ కార్బైడ్ కంపెనీ లోపాన్ని గుర్తించండి.
   ఎ) ఖర్చులను తగ్గించుకోవాలనే ఉద్దేశంతో సరైన భద్రతా చర్యలు పాటించలేదు.
   బి) 1980-1984 మధ్య మిథైల్-ఐసోసైనేట్ (MIC) ప్లాంట్ కోసం పనిచేసే సిబ్బందిని 12 నుంచి 6 కి తగ్గించింది.
   సి) కార్మికుల భద్రతా శిక్షణా వ్యవధిని 6 నెలల నుంచి 15 రోజులకు తగ్గించారు.
   డి) MIC ప్లాంట్‌లో నైట్‌షిఫ్ట్ వర్కర్ పోస్టును రద్దు చేశారు.
   1) ఎ, బి, సి 2) ఎ, బి, డి
   3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి

10. కింద పేర్కొన్న అంశాలలో సరైన జవాబును గుర్తించండి.
    ఎ) యూనియన్ కార్బైడ్ (UC) కి వ్యతిరేకంగా సివిల్ కేసులో ప్రభుత్వం బాధితులకు ప్రాతినిధ్యం వహించింది.
    బి) UC కంపెనీ 3 బిలియన్ డాలర్ల నష్టపరిహారం ఇవ్వాలని 1985లో ప్రభుత్వం కేసు దాఖలు చేసింది.
    సి) 1989లో 470 మిలియన్ డాలర్లకు UC అంగీకరించింది.
    డి) ప్రభుత్వం - యూనియన్ కార్బైడ్ చేసుకున్న ఒప్పందాన్ని సుప్రీంకోర్టు రద్దు చేసింది.
    1) ఎ, బి, డి 2) ఎ, బి, సి
    3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి

11. 1984 నాటి దుర్ఘటనకు కారణమైన యూనియన్ కార్బైడ్ కంపెనీ ఛైర్మన్ ఎవరు?
    1) ఆండర్సన్ బి) మైఖేల్
    3) ఫిలిప్స్ 4) సార్స్‌మోర్

12. కిందివాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.
    ఎ) 1978లో MIC ఉత్పత్తి యూనిట్‌ను ఏర్పాటు చేయడం భద్రతా ఉల్లంఘన అని భోపాల్‌లోని కొంతమంది మున్సిపల్ అధికారులు అభ్యంతరం వ్యక్తంచేశారు.
    బి) ఉద్యోగాలు కల్పిస్తూ రాష్ట్రంలో పెట్టుబడులకు దోహదపడుతుందని, అందువల్ల 'భోపాల్ ప్లాంట్' అవసరమని ప్రభుత్వం భావించింది.
    సి) ఆర్టికల్ 21లో హామీ ఇచ్చిన ప్రకారం రాజ్యాంగంలో జీవించే హక్కును ఉల్లంఘించకుండా చూసుకోవడం ప్రభుత్వ బాధ్యత.
    డి) ఇండియాలో భద్రత చట్టాలు పేలవంగా ఉన్నాయని భోపాల్ గ్యాస్ దుర్ఘటన ద్వారా వెల్లడైంది.
    1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
    3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

13. యూనియన్ కార్బైడ్ సంస్థ తన కార్యకలాపాలను నిలిపివేయడంతో ఈ ప్లాంట్ బాధ్యత తీసుకున్న ఏ సంస్థ విష పదార్థాలను తొలగించే బాధ్యత తీసుకోవడానికి నిరాకరించింది?
    1) డవ్ కెమికల్ సంస్థ 2) డచ్ కెమికల్ సంస్థ
    3) డిజార్డ్ కెమికల్ సంస్థ 4) డిమైన్ కెమికల్ సంస్థ

14. కాలుష్యరహిత నీరు, గాలిని అనుభవించే హక్కు ఆర్టికల్ 21 లో పేర్కొన్న జీవించే హక్కులో అంతర్భాగమని 1991లో ఏ కేసు సందర్భంగా సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది?
    1) సుందర్‌లాల్ బహుగుణ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా
    2) సుభాష్‌కుమార్ వర్సెస్ స్టేట్ ఆఫ్ బిహార్
    3) సందీప్ పాండే వర్సెస్ స్టేట్ ఆఫ్ ఉత్తర్‌ప్రదేశ్
    4) నవీన్ జిందాల్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర

15. కిందివాటిలో సరైన జవాబును గుర్తించండి.
    ఎ) వాహనాల నుంచి వెలువడే వాయువులు పర్యావరణ కాలుష్యానికి ప్రధాన కారణాలు.
    బి) డీజిల్ ఉపయోగించే అన్ని ప్రజారవాణా వాహనాలు 'కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్' (సీఎన్‌జీ) కి మారాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.
    సి) వాహనాలలో సీఎన్‌జీ వాడటం వల్ల దిల్లీ లాంటి నగరాలలో వాయు కాలుష్యం గణనీయంగా తగ్గింది.
    డి) సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ న్యూదిల్లీలో ఉంది.
    1) ఎ, బి, డి 2) ఎ, సి, డి
    3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి

16. పురుగుమందులు, ఆస్బెస్టాస్, జింక్, సీసం ఉత్పత్తి చేసే పరిశ్రమలకు ఆతిథ్యం ఇస్తున్న దేశాలను గుర్తించండి.
    1) దక్షిణాసియా దేశాలైన భారతదేశం, బంగ్లాదేశ్, పాకిస్థాన్
    2) ఆఫ్రికా దేశాలైన కెన్యా, ఘనా
    3) యూరోప్ దేశాలైన స్వీడన్, బ్రిటన్, ఫ్రాన్స్
    4) లాటిన్ అమెరికా దేశాలైన బ్రెజిల్, పెరూ

17. షిప్ బ్రేకింగ్‌కు సంబంధించిన అంశాన్ని గుర్తించండి.
    ఎ) షిప్ బ్రేకింగ్ అనేది దక్షిణాసియాలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రమాదకర పరిశ్రమ.
    బి) ఉపయోగం లేని పాత ఓడల్ని తుక్కుగా మార్చేందుకు బంగ్లాదేశ్, భారతదేశంలోని షిప్ యార్డులకు పంపుతున్నారు.
    సి) స్క్రాపింగ్ కోసం వస్తున్న నౌకల్లో చాలా ప్రమాదకరమైన, హానికరమైన పదార్థాలు ఉంటాయి.
    డి) ప్రపంచంలో అతి పెద్ద షిప్ బ్రేకింగ్ కేంద్రం నార్వేలో ఉంది.
    1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
    3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

18. 'అలంగ్' నౌకాశ్రయం ఏ రాష్ట్రంలో ఉంది?
    1) పశ్చిమ బెంగాల్ 2) ఒడిశా
    3) గుజరాత్ 4) తమిళనాడు

19. SDG అంటే?
    1) sustainable development goal
    2) sustainable demographic guard
    3) superlative decent growth
    4) safe development growth

20. కింద పేర్కొన్న అంశాలకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
    ఎ) వన్యప్రాణుల సంరక్షణ చట్టం, 1972
    బి) వెట్టిచాకిరీ నిషేధ చట్టం, 1976
    సి) అటవీ రక్షణ చట్టం, 1980
    డి) స్త్రీ, పురుషులకు సమానపనికి సమాన వేతనం చెల్లించే చట్టం, 1976
    1) ఎ, బి, డి 2) ఎ, బి, సి
    3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి

21. PETA అంటే?
    1 Public for encouragement treatment of animals
    2) People for ethical treatment of animals
    3) People for every time of actual act
    4) Pupil for economic tricar of animals




రచయిత: బంగారు సత్యనారాయణ

సమాధానాలు

1-2; 2-4; 3-1; 4-4; 5-2; 6-2; 7-3; 8-4; 9-4; 10-2; 11-1; 12-4; 13-1; 14-2; 15-4; 16-1; 17-1; 18-3; 19-1; 20-4; 21-2.

కొల్లాయిడ్ ద్రావణాలు



తోకభాగం గ్రీజును కరిగిస్తే.. తలభాగం మురికిని తొలగిస్తుంది!

పరిరక్షణ కొల్లాయిడ్‌లు

- కొల్లాయిడ్ ద్రావణాలకు విద్యుద్విశ్లేష్యకాన్ని కొద్ది పరిమాణంలో కలిపినప్పుడు అవక్షేపణం చెంది గడ్డ కడతాయి. ఈ ప్రక్రియను స్కందనం (Coagulation) అంటారు.
- లయోఫిలిక్ సోల్‌లు (ద్రవప్రియ కొల్లాయిడ్‌లు), లయోఫోబిక్ సోల్‌ల (ద్రవవిరోధి కొల్లాయిడ్‌లు) కంటే స్థిరమైనవి. దీనికి కారణం లయోఫిలిక్ కొల్లాయిడ్ కణాలు అత్యధిక పరిమాణంలో ఆర్ద్రీకరణం చెందడం. లయోఫిలిక్ కొల్లాయిడ్ కణాలు అవి విక్షేపణం చెంది ఉన్న ద్రవం పొరతో కప్పి ఉంటాయి.
- ద్రవప్రియ కొల్లాయిడ్‌లకు ద్రవవిరోధి కొల్లాయిడ్‌లను పరిరక్షించే స్వభావం ఉంటుంది. ద్రవవిరోధి కొల్లాయిడ్ ద్రావణానికి కొద్దిగా ద్రవప్రియ కొల్లాయిడ్ ద్రావణం కలపడం వల్ల దానికి స్థిరత్వం చేకూరుతుంది.
- ద్రవవిరోధి కొల్లాయిడ్ కణాల చుట్టూ ద్రవప్రియ కొల్లాయిడ్ కణాలు ఒక రక్షణ వలయంగా ఏర్పడి ద్రవవిరోధి కొల్లాయిడ్ ద్రావణం స్కందనం చెందకుండా నివారిస్తాయి. కాబట్టి ద్రవప్రియ కొల్లాయిడ్‌లను 'పరిరక్షణ కొల్లాయిడ్‌లు' అంటారు.
- లయోఫిలిక్ కొల్లాయిడ్‌ల పరిరక్షణ సామర్థ్యాన్ని పరిమాణాత్మకంగా వివరించేందుకు జిగ్మాండీ అనే శాస్త్రవేత్త 'గోల్డ్ సంఖ్య'ను (Gold number) ప్రవేశపెట్టారు.
- 10 మి.లీ. ప్రమాణ గోల్డ్ సోల్‌కు 1 మి.లీ. 10% సోడియం క్లోరైడ్ ద్రావణాన్ని చేర్చడం ద్వారా ఏర్పడే స్కందనాన్ని నివారించడానికి కలపాల్సిన ద్రవప్రియ కొల్లాయిడ్ కనీస ద్రవ్యరాశిని (మిల్లీగ్రాముల్లో) తెలిపే విలువను 'గోల్డ్ సంఖ్య' అంటారు.
- గోల్డ్ సంఖ్య పరిమాణం పెరిగిన కొద్దీ ద్రవప్రియ కొల్లాయిడ్ పరిరక్షక సామర్థ్యం తక్కువగా ఉంటుంది.

పరిరక్షణ కొల్లాయిడ్	గోల్డ్ సంఖ్య
జిలాటిన్	0.005 – 0.01
కేసినేట్	0.01 – 0.02
హిమోగ్లోబిన్	0.03 – 0.07
గుడ్డు అల్బుమిన్	0.15 – 0.25
బంగాళదుంప స్టార్చ్	20 – 25

ఎమల్షన్లు

- విక్షిప్త ప్రావస్థ, విక్షేపణ యానకం రెండూ ద్రవస్థితిలో ఉండే కొల్లాయిడ్ ద్రావణాన్ని ఎమల్షన్ (Emulsion) అంటారు. దీన్ని రెండు రకాలుగా వర్గీకరించారు. **అవి:**
  ఎ) నీటిలో తైలం (Oil in water)
  బి) తైలంలో నీరు (Water in oil)
- **నీటిలో తైలం రకం ఎమల్షన్:** ఈ రకం ఎమల్షన్‌లో విక్షిప్త ప్రావస్థ తైలం, విక్షేపణ యానకం నీరు.
  ఉదా: పాలు, వానిషింగ్ క్రీమ్ మొదలైనవి.
- పాలలో ద్రవస్థితిలోని కొవ్వు, నీటిలో విక్షేపణం చెంది ఉంటుంది.
- **తైలంలో నీటి రకం ఎమల్షన్:** ఈ రకం ఎమల్షన్‌లో విక్షిప్త ప్రావస్థ నీరు, విక్షేపణ యానకం తైలం.
  ఉదా: కాడ్ లివర్ ఆయిల్, కోల్డ్‌క్రీం మొదలైనవి.
- సాధారణంగా ఎమల్షన్‌లు అస్థిరమైనవి. వీటిని కొంతకాలం నిల్వ ఉంచినట్లయితే అందులో ఉండే అనుఘటకాలైన తైలం, నీరు రెండు పొరలుగా వేరవుతాయి. కాబట్టి ఎమల్షన్‌లను స్థిరంగా ఉంచేందుకు మరో పదార్థాన్ని కలుపుతారు. ఈ పదార్థాన్ని ఎమల్సీకరణ కారకం (Emulsifying agent) అంటారు.
- సబ్బు, గుడ్డు, అల్బుమిన్, కేసిన్, గ్రాఫైట్ చూర్ణం మొదలైనవి ఎమల్సీకరణ కారకాలకు ఉదాహరణలు.
- ఎమల్సీకరణ కారకం తైలం, నీటి తలాల మధ్య ఉన్న తలతన్యతను తగ్గించి స్థిరమైన ఎమల్షన్‌లు ఏర్పడటానికి ఉపయోగపడుతుంది.
- నీటిలో తైలం రకం ఎమల్షన్‌లకు ప్రోటీన్‌లు, జిగుర్లు, సబ్బులను ఎమల్సీకరణ కారకాలుగా ఉపయోగిస్తారు.
- తైలంలో నీటి రకం ఎమల్షన్‌లకు పొడవైన కార్బన్ గొలుసులు గల ఆల్కహాల్‌ను, కార్బన్ బ్లాక్‌ను ఎమల్సీకరణ కారకాలుగా ఉపయోగిస్తారు.

జెల్‌లు

- విక్షిప్త ప్రావస్థ ద్రవస్థితిలో, విక్షేపణ యానకం ఘనస్థితిలో ఉండే కొల్లాయిడ్ ద్రావణాన్ని 'జెల్' అంటారు.
  ఉదా: జెల్లీ, జున్ను, జామ్, బూట్ పాలిష్, జిలాటిన్, సిలికాజెల్ మొదలైనవి.
- జెల్‌ను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. **అవి:**
  ఎ) స్థితిస్థాపకత కలిగిన జెల్
  బి) స్థితిస్థాపకత లేని జెల్
- జెల్‌ను తయారు చేసే ప్రక్రియను జెలేషన్ అంటారు.

జెల్ లక్షణాలు:

- **ఉబ్బడం:** జెల్‌ను నీటిలో ఉంచితే అది నీటిని శోషించుకుని, వ్యాకోచం చెందుతుంది.
- **సినెరిసిస్:** జెల్‌ను ఎక్కువ రోజులు నిల్వ ఉంచితే, అది ద్రావణిని కోల్పోయి కుచించుకుపోతుంది. ఈ ప్రక్రియను సినెరిసిస్ అంటారు.
- **థిక్సోట్రోపి:** రెండు పదార్థాలను కలిపినప్పుడు సోల్‌గా (కొల్లాయిడ్ ద్రావణంగా) ఏర్పడి, అలాగే ఉంచితే జెల్‌గా మారే ప్రక్రియను థిక్సోట్రోపి అంటారు.

సోల్ ⇌ జెల్ (థిక్సోట్రోపి)

- **స్థితిస్థాపకత కలిగిన జెల్:** జిలాటిన్ ఈ రకానికి చెందింది. నీటిలో జిలాటిన్‌ని కలిపితే జెల్ ఏర్పడుతుంది. దీన్ని నిర్జలీకరణం చేస్తే ఘనపదార్థం ఏర్పడుతుంది. ఈ ఘన పదార్థానికి నీరు కలిపితే తిరిగి జెల్ ఏర్పడుతుంది. కాబట్టి వీటిని ఉత్క్రమణీయ జెల్‌లు (Reversible gels) అంటారు. ఇవి లయోఫోబిక్ స్వభావాన్ని కలిగి ఉంటాయి.
- **స్థితిస్థాపకత లేని జెల్:** సిలికా జెల్ (SiO_2), అల్యూమినా (Al_2O_3) ఈ రకానికి చెందినవి. అనార్ద్ర ఘనపదార్థానికి నీటిని కలిపి ఈ రకం జెల్‌ను తయారు చేయొచ్చు. దీన్ని నిర్జలీకరణం చేస్తే ఆమ్లత్వాన్ని కోల్పోయి గాజులాగా మారిపోతుంది. దీనికి నీరు కలపడం ద్వారా తిరిగి జెల్‌గా మారదు. కాబట్టి వీటిని అనుత్క్రమణీయ జెల్‌లు అంటారు. ఇవి లయోఫిలిక్ స్వభావాన్ని కలిగి ఉంటాయి.


కొల్లాయిడ్ అనువర్తనాలు

టీజీపీఎస్సీ, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
కెమిస్ట్రీ


- **సబ్బులు జరిపే శుద్ధి ప్రక్రియ:**
- భార కొవ్వు ఆమ్లాల సోడియం లేదా పొటాషియం లవణాన్ని సబ్బు అంటారు.

  సబ్బు: $RCOO^{\ominus}Na^{\oplus}$

  ఉదా: $C_{17}H_{35}COO^{\ominus}Na^{\oplus}$ (సోడియం స్టియరేట్)
- స్టియరేట్ అయాన్‌లో ($C_{17}H_{35}COO^{-}$) ఒక అంత్యం పొడవైన ఆల్కైల్ సమూహం (హైడ్రోఫోబిక్ తోక భాగం), రెండో అంత్యం కార్బాక్సిలిక్ సమూహం (హైడ్రోఫిలిక్ తలభాగం) ఉంటాయి.



- అత్యధిక గాఢతల వద్ద సబ్బు ద్రావణంలోని స్టియరేట్ అయాన్‌లు ఒకదానితో మరొకటి కలిసి సముచ్ఛయం చెంది గోళాకార స్టియరేట్ మిసెల్‌ను ఏర్పరుస్తాయి. వీటిలో హైడ్రోఫోబిక్ గొలుసులు గోళం కేంద్రకం వైపు చొచ్చుకుని ఉంటాయి.
- హైడ్రోఫిలిక్ సమూహాలు గోళం ఉపరితలంపై బయటవైపు ఉంటాయి.
- తోకభాగం తనలో మురికిని (గ్రీజు) కరిగించుకుని, మిసెల్‌ను ఏర్పరుస్తుంది. తలభాగం నీటిలో కరిగి దుస్తులపై మురికిని తొలగిస్తుంది. ఈ విధంగా సబ్బు 'నీరు - మురికి' ఎమల్షన్‌కు ఎమల్సీకరణ కారకంగా పనిచేసి దుస్తులపై మురికిని తొలగిస్తుంది.



- **ఔషధాలు:** చాలా ఔషధాలు కొల్లాయిడ్ స్వభావంతో ఉండటం వల్ల వాటిలోని చిన్న కణాలను మన దేహం త్వరగా శోషించుకుంటుంది. ఆమ్ల విరోధిగా ఉపయోగించే 'మిల్క్ ఆఫ్ మెగ్నీషియా' కూడా ఒక ఎమల్షనే. కంటి లోషన్‌గా ఉపయోగించే 'ఆర్జిరోల్' అనేది ఒక సిల్వర్ సోల్.
- **నీటిని శుద్ధి చేయడం:** నీటిలో కొల్లాయిడ్ రూపంలో ఉన్న మాలిన్యాన్ని తొలగించడానికి పటిక (Alum) కలుపుతారు. ఆలమ్‌లోని అల్యూమినియం అయాన్‌ను (Al^{+3}) స్కందన ప్రక్రియకు ఉపయోగించుకుని, మాలిన్యాన్ని అవక్షేపంగా మార్చి, తొలగించి నీటిని శుద్ధి చేస్తారు.
- **చర్మశుద్ధి ప్రక్రియ:** ధనావేశ ప్రోటీన్ కణాలు ఉన్న చర్మాన్ని రుణావేశిత కొల్లాయిడ్ కణాలు ఉన్న టానిన్‌లో ముంచితే, స్కందన ప్రక్రియ జరిగి తోలు గట్టిపడుతుంది. ఈ ప్రక్రియను 'టానింగ్' అంటారు.
- **పరిశ్రమల పొగ గొట్టాల నుంచి బహిర్గతమయ్యే పొగ అవక్షేపణం:** కర్బన కణాలు, ధూళి కణాలు మొదలైన ఘనస్థితిలోని కణాలు గాలిలో ఏర్పరిచే కొల్లాయిడ్ ద్రావణాన్ని 'పొగ' అంటారు. పెద్ద పరిశ్రమల్లో పొగ గొట్టాల నుంచి వెలువడే పొగను ముందుగానే 'కాట్రెల్ పొగ అవక్షేపకరిణి' ద్వారా పంపిస్తారు. దీనిలో పొగ కణాలకు విరుద్ధ ఆవేశం గల ప్లేట్లు అమర్చి ఉంటాయి. ఇక్కడ పొగ కణాలు ఆవేశాన్ని కోల్పోయి, అవక్షేపణం చెంది నేలపై స్థిరపడతాయి.
- **పారిశ్రామిక పదార్థాలు:** మనం రోజూ ఉపయోగించే పెయింట్లు, సిరాలు, కందెనలు, లోషన్‌లు, క్రీమ్‌లు మొదలైనవి కొల్లాయిడ్ స్వభావం గల పదార్థాలే.
- **డెల్టాలు ఏర్పడటం:** నదీ జలాలను బంకమట్టి కొల్లాయిడ్ ద్రావణాలుగా పరిగణిస్తారు. నదీజలం, సముద్ర నీటితో కలిసినప్పుడు సముద్రపు నీటిలోని విద్యుద్విశ్లేష్యకాలు బంకమట్టి కొల్లాయిడ్ ద్రావణాన్ని స్కందన ప్రక్రియకు గురిచేసి నదీజలంలోని బంకమట్టి డెల్టాలుగా ఏర్పడుతుంది.
- **మన చుట్టూ ఉండే కొల్లాయిడ్‌లు:** పొగమంచు, పాలు, వెన్న, రక్తం, మన్ను, జున్ను మొదలైనవి కొల్లాయిడ్‌లుగానే ఉంటాయి.

మాదిరి ప్రశ్నలు



రచయిత
డా. పి. భానుప్రకాష్
అసిస్టెంట్ ప్రొఫెసర్

1. పాలు ఏ రకం కొల్లాయిడ్ ద్రావణం?
   ఎ) తైలంలో నీరు రకం ఎమల్షన్
   బి) ఘనసోల్
   సి) నీటిలో తైలం రకం ఎమల్షన్
   డి) ఏరోసోల్
2. పాలలోని ఎమల్సీకరణ కారకం ఏది?
   ఎ) కేసిన్ బి) కెఫిన్
   సి) సబ్బు డి) అల్బుమిన్
3. జంతు చర్మాన్ని టానిన్ అనే కొల్లాయిడ్ ద్రావణంలో నానబెట్టడం ద్వారా గట్టిపడేలా చేసే ప్రక్రియను ఏమంటారు?
   ఎ) గాల్వనైజేషన్ బి) టానింగ్
   సి) ఎమల్సీకరణం డి) ద్రవాభిసరణం

జవాబులు: 1–సి, 2–ఎ, 3–బి.

441 Word of the Day

Obsequious

Telugu meaning: విధేయత, లొంగుబాటు

English meaning: The word 'obsequious' is an adjective that describes someone who is overly eager to please or obey, often in a fawning or servile manner.

Synonyms: Fawning, Submissive

Antonyms: Assertive, Independent

Usage: **1.** His obsequious behaviour around the boss made him disliked by many of his colleagues.
2. The servant's obsequious flattery was clearly intended to gain favour with the king.

Latest Updates

Technical Entry Scheme Course

Indian Army invites applications from Unmarried Male candidates for the Technical Entry Scheme Course (TES) (10 + 2) - 53. Course commencing in July 2025. The total vacancies are 90. The last date for online application is 6 November 2024.

Teaching Posts

Indian Institute of Information Technology Sri City (IIITS), Chittoor invites applications for the Computer and Communication Networks, Data Analysis, AIML, Deep Learning, Python for Data Science, and Cyber Security teaching posts. The last date for online application is 15 November 2024.

Non-Executive Posts

National Fertilizers Limited (NFL), Noida invites online applications for the recruitment of 336 non – executive (Worker) level positions for various units/ offices of the NFL. The application fee is Rs.200. Eligible candidates can apply online before 8 November 2024.


Did You Apply..?

Today (October 16) is the last date for the following Posts

- CBSE - Central Teacher Eligibility Test (CTET) December-2024.
  Eligibility:
  Senior Secondary, D.El.Ed., B.El.Ed., D.Ed. (Special Education), Degree, B.Ed., B.A.Ed/ B.Sc.Ed.
- 14,298 Technician posts in the Railway Recruitment Board (RRB).
- Device Associate posts in Amazon.
  Qualification:
  Any Graduate.

For more information and other notifications - scan QR code

ఈ-బుక్ (ఇండియన్ జాగ్రఫీ)



అత్యంత ముఖ్యమైన సహజ వనరుల్లో భూమి ఒకటి. భూమి ఉపరితలంపై కప్పి ఉన్న సన్నటి మట్టి పొరను 'నేల' లేదా 'మృత్తిక' అంటారు. ఇవి సేంద్రియ పదార్థాలు, ఖనిజాలు, రూపాంతర శిలల వల్ల ఏర్పడతాయి.


☛ మృత్తికలు ఏర్పడటానికి ప్రధాన కారణాలు, మృత్తికా క్రమక్షయం, మృత్తికలు - రకాలు, విభజన, భారతదేశంలోని మృత్తికా పరిశోధనా సంస్థలు, మృత్తికా సంరక్షణ పద్ధతులు మొదలైన విషయాలు ఈ-బుక్‌లో ఉన్నాయి.

చదవడం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

కరెంట్ అఫైర్స్



దేశంలోని 100 మంది అగ్రగామి కుబేరుల జాబితాను ఫోర్బ్స్ 2024, అక్టోబరు 10న విడుదల చేసింది. ముకేశ్ అంబానీ 119.5 బిలియన్ డాలర్ల సంపదతో మొదటి స్థానంలో ఉన్నారు. ఈయన సంపద విలువ గత 12 నెలల్లో 27.5 బి.డాలర్లు పెరిగింది. గౌతమ్ అదానీ 116 బి.డా.తో రెండో స్థానంలో నిలిచారు. ఆయన సంపద 12 నెలల్లో 48 బి.డా. పెరిగింది. ఈ జాబితాలో సావిత్రి జిందాల్ (43.7 బి.డా.), శివ్ నాడార్ (40.2 బి.డా.), దిలీప్ సంఘ్వీ (32.4 బి.డా.) వరుసగా మూడు, నాలుగు, అయిదు స్థానాల్లో నిలిచారు.



ఆసియాలోనే అతిపెద్దదైన గామా-రే ఇమేజింగ్ టెలిస్కోపు లద్దాఖ్‌లో ఏర్పాటైంది. ప్రపంచంలో అత్యంత ఎత్తయిన ప్రాంతంలో అమర్చిన టెలిస్కోపు ఇదే. 4,300 మీటర్ల ఎత్తులో ఉన్న హాన్లే ప్రాంతంలో మేజర్ అట్మాస్ఫియరిక్ చెరెన్‌కోవ్ ఎక్స్‌పరిమెంట్ (ఎంఏసీఈ) అబ్జర్వేటరీ టెలిస్కోపును ప్రారంభించారు. ముంబయిలోని బాబా అటామిక్ రిసెర్చ్ సెంటర్, ఈసీఐఎల్, ఇతర పారిశ్రామిక సంస్థల సాయంతో ఈ టెలిస్కోపును దేశీయంగా రూపొందించారు.

ఐరాస మానవతా వ్యవహారాల విభాగాధిపతిగా బ్రిటన్‌కు చెందిన టామ్ ఫ్లెచర్‌ను సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ నియమించారు. ఇంతకుముందు ఈ పదవిని మరో బ్రిటిష్ జాతీయుడు మార్టిన్ గ్రిఫిత్స్ నిర్వహించారు.

దేశంలో ఇంటర్నెట్ వినియోగిస్తున్న 15-24 ఏళ్ల మధ్య వారిలో పల్లెల్లో 82 శాతానికి పైగా ఉన్నారని సమగ్ర వార్షిక మాడ్యులార్ సర్వే (సీఏఎంఎస్) వెల్లడించింది. నగరాల్లో ఈ వయసు వారు మరింత అధికంగా 92% ఉన్నారని తెలిపింది. 15-24 ఏళ్ల మధ్య వారిలో మొబైల్ ఫోన్ వాడుతున్న వారు గ్రామీణ ప్రాంతాల్లో 95.7%, పట్టణ ప్రాంతాల్లో 97%.

కరెంట్ అఫైర్స్ ఈబుక్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

How is W related to T's brother?

Bank Exams
Reasoning

Blood Relations

Directions (1 - 3): *Study the following information carefully and answer the questions given below:*

☛ S is the sister of B. K is the brother of B. K is the son of L. L is married to Y. Y is the daughter of J. Y has only one daughter. J is married to C. K is the brother of D. D is married to T.

1. If P is the brother of C, then how is J related to P?
1) Brother 2) Cousin
3) Sister 4) Uncle
5) Cannot be determined

2. How is T related to S?
1) Brother-in-law 2) Cousin
3) Sister-in-law 4) Sister
5) Brother

3. If Z is the daughter of T, then how is B related to Z?
1) Uncle 2) Father
3) Aunt 4) Can't be determined
5) Mother

Directions (Qs. 4 - 6): *Study the following information carefully and answer the given questions.*

There are nine members in a family i.e. P, Q, R, S, T, U, V, M, and W. Among them only two married couples and only four males. R is married to P. Q is the only child of S. U is married and she has a mother-in-law. M has a child. S is paternal grandmother of T and T is uncle of W. P is father of T's mother and V. M is not a female member of a family.

4. How is W related to T's brother?
1) Son 2) Son-in-law
3) Mother 4) Daughter
5) None of these

5. How is S related to V's sister?
1) Father-in-law 2) Son-in-law
3) Mother-in-law 4) Daughter
5) None of these

6. Who is grandfather of child of M?
1) Q 2) S 3) U's husband
4) Both 1 & 3 5) None of these

Directions (Qs. 7 - 9): *Study the following information carefully and answer the given questions:*

A, B, C, D, E and F are six family members. They have different quantities of books i.e. 7, 9, 10, 12, 18, and 36. C is son-in-law of A and his grand-daughter is E. Oldest member of the family has maximum books. D is female member of the family. C has less books than only two persons. Wife of C has 2 children. F has only one grand-son. F has more books than grand-daughter of A and less books than D. B has more books than only one member.

7. How many books D's sons have?
1) 7 2) 9 3) 12
4) 18 5) None of these

8. How many books D has?
1) 7 2) 18 3) 9
4) None of these 5) 36

9. How many persons have more books than B's grandmother?
1) Three 2) Two 3) Four
4) None of these 5) One

Directions (Qs. 10 to 12): Study the information carefully and answers the question given below.

Q is maternal grandfather of G, who is child of L and C. J is brother-in-law of B. A is daughter of Q and niece of J. B is mother-in-law of C. Q has only two daughters and no son. J and Q are siblings.

10. How is G related with respect to B?
1) Grand daughter 2) Grand son
3) Daughter-in-law
4) Can't be determined
5) None of these

11. What is the relationship between J and L?
1) J is father of L 2) L is brother of J
3) L is daughter of the brother of J
4) Can't be determined
5) None of these

12. How is A related with respect to G?
1) Uncle 2) Father
3) Aunt
4) Can't be determined
5) None of these

Scan the QR code for Key

These model questions were prepared by subject experts of ***RACE Institute,*** *Hyderabad*

మానవశాస్త్రంతో ఏ అవకాశాలు?

బి.ఎ. మానవ శాస్త్రం (ఆంత్రపాలజీ.. డ్యూయల్ డిగ్రీ) మూడో సంవత్సరం.. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో చదువుతున్నాను. ఈ కోర్సుతో ప్రభుత్వ ఉద్యోగావకాశాలు ఎలా ఉంటాయి?

- ఎస్.చిన్నారావు, విశాఖపట్నం





■ మెరుగైన ఉద్యోగావకాశాల కోసం ఇదే సబ్జెక్టులో పీజీ కూడా చేయండి. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ఆంత్రపాలజీ శాఖకు మనదేశంలోనే మంచి పేరు ప్రతిష్ఠలున్నాయి. ఆంత్రపలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ ఆచార్య బీవీ శర్మ ఇదే యూనివర్సిటీ పూర్వ విద్యార్థి, 30 ఏళ్లు ఇదే డిపార్ట్‌మెంట్‌లో బోధన, పరిశోధన సాగించిన వ్యక్తి. ఈ సబ్జెక్టు చదివినవారు సంస్కృతులు, సమాజాలు, గిరిజన సమూహాలను అర్థం చేసుకోవడంపై అవగాహన పెంచుకుంటే ప్రభుత్వ, ప్రైవేటు, పరిశోధన, సంస్కృతి, పరిపాలన రంగాల్లో మెరుగైన ఉద్యోగావకాశాలు లభిస్తాయి. సివిల్ సర్వీసెస్ పరీక్షలో మానవ శాస్త్రాన్ని ఐచ్ఛికంగా ఎంచుకొని చాలామంది విజయం సాధిస్తున్నారు.

ఆంత్రపలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాలో ఆంత్రపాలజిస్టులు, అసిస్టెంట్ ఆంత్రపాలజిస్టులు, రిసెర్చ్ అసోసియేట్లు, జూనియర్/ సీనియర్ రిసెర్చ్ ఫెలోస్‌గా పని చేయవచ్చు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రిసెర్చ్‌లో పరిశోధన సంబంధిత కొలువులుంటాయి. పీజీ చేసి నెట్/ సెట్/ పీహెచ్‌డీతో విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో అధ్యాపక ఉద్యోగాలకు పోటీ పడవచ్చు. ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాలోనూ కొన్ని ఉద్యోగాలుంటాయి. గ్రాడ్యుయేట్లు రాష్ట్రస్థాయి గిరిజన పరిశోధన సంస్థల్లో క్షేత్ర పరిశోధకులు, అధికారులుగా పనిచేయొచ్చు. షెడ్యూల్డ్ తెగల జాతీయ కమిషన్‌లో సంక్షేమ అధికారులు, పాలసీ అనలిస్టులు, ఫీల్డ్ ఆఫీసర్లు వంటి ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సాంఘిక సంక్షేమ విభాగాల్లో ఉద్యోగావకాశాలు పొందవచ్చు. సాంస్కృతిక వ్యవహారాల శాఖలో అధికారులు, రిసెర్చ్ అసోసియేట్స్ లాంటి కొలువులు చేయవచ్చు.


మెడికల్ ఆంత్రపాలజీ స్పెషలైజేషన్ చదివినవారు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్‌లో పరిశోధనకు సంబంధించిన అధికారులుగా చేరవచ్చు. ఎయిమ్స్‌లో ఫిజికల్, మెడికల్ ఆంత్రపాలజీలో ప్రావీణ్యం ఉన్నవారికి అధ్యాపకులుగా ఉద్యోగాలున్నాయి. సాంస్కృతిక వారసత్వ కేంద్రాలు, నేషనల్.. స్టేట్ మ్యూజియాల్లో క్యూరేటర్లు, హెరిటేజ్ ఆఫీసర్లు, సాంస్కృతిక మానవ శాస్త్రవేత్తల వంటి ఉద్యోగాలుంటాయి. అటవీ శాఖలో గిరిజన సంక్షేమ, పర్యావరణ పరిరక్షణ అధికారులుగా అవకాశాలుంటాయి. ఇంటెలిజెన్స్ బ్యూరో, రిసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్ లాంటి కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఆంత్రపాలజీ గ్రాడ్యుయేట్లు ఫోరెన్సిక్ ఆంత్రపాలజీ పరిజ్ఞానంతో ఉద్యోగ ప్రయత్నాలు చేయవచ్చు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఇస్రో ఇంకా యునిసెఫ్, యునెస్కో డబ్ల్యూహెచ్ఓ వంటి అంతర్జాతీయ సంస్థల్లో బాలల సంక్షేమం, ఆరోగ్యం, సాంస్కృతిక సంరక్షణ వంటి రంగాల్లో పనిచేయవచ్చు.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

సాంకేతికత అద్దుకున్న ఏ రంగమైనా ఆకాశమే హద్దుగా రివ్వున ఎగిరిపోవటం చూస్తున్నాం. ఆహారశుద్ధి (ఫుడ్ ప్రాసెసింగ్) అందులో ఒకటి. తినే ఆహారం వైపు ప్రజల ఆలోచన మళ్లి అవగాహన పెరగటంతో ఈ రంగానికి టెక్నాలజీని జోడించారు. ఆపై ఫుడ్ టెక్నాలజీగా అవతరించి 25 లక్షల కోట్ల రూపాయల మార్కెట్‌గా ఎదిగింది. యువతకు ఉపాధి అవకాశాల పెన్నిధిగా నిలిచింది!

ఆహార శుద్ధిలో ఆకాశమే హద్దు!

ఉపాధి పథం
నైపుణ్య సాధనం



ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లపై ప్రజల్లో ఏర్పడిన చైతన్యం ఫలితంగా రుచి..శుచి ఉన్న పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించేందుకు ఆహార శుద్ధి రంగ సంస్థలు ముందుకువచ్చాయి. ఇందుకు సాంకేతికతను ఊతంగా తీసుకున్నాయి. ఫుడ్ టెక్నాలజీతో అద్భుతాలు జరిగి ఈ రంగం ఏటా 9.5 శాతం వృద్ధి రేటుతో దూసుకుపోతోంది.

✦ ఆహార ఎంపిక, శుద్ధి, ప్యాకేజింగ్, పంపిణీ, ఆహార వినిమయంలో టెక్నాలజీ వినియోగం పెరిగింది. ఉదాహరణకు మనకు బియ్యపు రవ్వ, బియ్యపు పిండి, గోధుమ రవ్వ, గోధుమ పిండి వంటివి విరివిగా, చౌకగా లభ్యమవుతున్నాయి. వీటిలో అనివార్యంగా తేమ చేరి పురుగులు పట్టడం ఓ సమస్య. దీన్ని అధిగమిస్తూ తేమను తీసివేసి చేతితో తాకకుండా, ప్యాకింగ్ చేస్తూ మార్కెట్‌లోకి వచ్చిన బ్రాండెడ్ పిండ్లు, రవ్వలకు డిమాండ్ ఎక్కువ. ప్రజలు ఎక్కువగా వినియోగించే సేమ్యాను టెక్నాలజీ సాయంతో ఆరోగ్యకరంగా అందించే బ్రాండ్లకూ ఆదరణ ఉంది.

✦ ఉప్పు వినియోగానికీ, రక్త పోటు (బి.పి.)కూ నేరుగా సంబంధం ఉందన్న అవగాహన సాధారణ ప్రజల్లో వ్యాప్తి చెందడంతో సురక్షితమైన ఉప్పు కోసం అన్వేషణ పెరిగింది. అందుకే టెక్నాలజీ జోడించిన అయొడైజ్డ్ సాల్ట్, రాక్ సాల్ట్ వంటి పోషక విలువల ఉప్పునకు డిమాండ్ ఏర్పడింది. రూ. 40 వేల కోట్ల మార్కెట్‌గా ప్రాసెస్డ్ సాల్ట్ మార్కెట్ ఎదిగింది. టాటా, నిర్మా, అంకుర్, ఆశీర్వాద్ (ఐ.టి.సి.), పతంజలి వంటి బ్రాండ్లు ఈ విపణిలో వాటా కోసం పోటీ పడుతున్నాయి.

తెరుచుకున్న ద్వారాలు

ఆహారశుద్ధి రంగంలో టెక్నాలజీ వినియోగంతో యువతకు ఉపాధి అవకాశాల ద్వారాలు బార్లా తెరుచుకున్నాయి. ఆహార నాణ్యత పెరగడం, మొక్కలూ పంటల ద్వారా వచ్చే జబ్బుల నుంచి రక్షణ, సరసమైన ధరలకు అందుబాటు, విభిన్న రకాల లభ్యత సాధ్యమవ్వడంతో ఆహారశుద్ధి రంగంలో సాంకేతిక పరిజ్ఞాన వినియోగం శరవేగంగా జరుగుతోంది. ఫలితంగా ఫుడ్ టెక్నాలజిస్టుల అవసరం అంతే వేగంగా ఏర్పడింది.

ఫుడ్ టెక్నాలజిస్ట్

ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీల్లో ఫుడ్ టెక్నాలజిస్టులకు కీలక బాధ్యతలుంటాయి. వ్యవసాయ క్షేత్రాలు, ఆహార శుద్ధి ఫ్యాక్టరీల పరిశీలనకు విస్తృతంగా ప్రయాణిస్తారు. ఆహార నిల్వ, శుద్ధి, ప్యాకింగ్, స్టోరేజీ సౌకర్యాల పర్యవేక్షణ బాధ్యత వహిస్తారు. అంతిమంగా శుద్ధి చేసిన ఆహార ఉత్పత్తులు వినియోగదారుడికి చేరే పంపిణీ వ్యవస్థను రూపొందిస్తారు. ఫుడ్ టెక్నాలజీలో ఫ్రెషర్స్‌కు ఏడాదికి రూ.4.5 లక్షల నుంచి సీనియర్లకు వార్షిక వేతనం రూ.20 లక్షల వరకు ఉంటుంది.

దేశ ఆహారశుద్ధి పరిశ్రమ వృద్ధిబాటలో ఉన్నందున ఫుడ్ టెక్నాలజిస్టులకు ఏటా డిమాండ్ పెరుగుతోంది. ఫుడ్ టెక్నాలజీలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసినవారికి ఫుడ్ ప్రాసెసింగ్ సంస్థల్లో వివిధ హోదాల్లో ఫుడ్ టెక్నాలజిస్ట్ ఉద్యోగాలు లభిస్తున్నాయి. ఫ్రెషర్స్‌కు ఎంట్రీ స్థాయి ఉద్యోగాలు లభించినా మూడు నుంచి ఐదేళ్ల అనుభవంతో కెరియర్ పరంగా ఉజ్వలంగా వెలుగొందుతున్నారు.

✦ వార్షిక వేతనాలు ఇలా.. ల్యాబ్ టెక్నీషియన్ (రూ.4.5 - 6 లక్షలు), ఆర్గానిక్ కెమిస్ట్ (రూ.3.5 - 5 లక్షలు), బయోకెమిస్ట్ (రూ.5 - 8 లక్షలు), క్వాలిటీ కంట్రోలర్ (రూ.8 - 10 లక్షలు), మేనేజర్ (రూ.8 - 11 లక్షలు), ఫుడ్ ఇంజినీర్ (రూ.8-11 లక్షలు), ఫుడ్ ప్రొడక్ట్ డెవలపర్ (రూ.10 - 12 లక్షలు).

✦ ఇంకా ఫుడ్ ప్రాసెసింగ్ కొన్ని ఉప విభాగాల్లో ఫుడ్ టెక్నాలజిస్టులను వేర్వేరు హోదాల్లో తీసుకుంటున్నారు. ఫుడ్ ప్యాకేజింగ్ స్పెషలిస్ట్‌గా ఎంట్రీ లెవెల్ (రూ.3 - 5 లక్షలు), సీనియర్లకు (రూ.8 - 12 లక్షలు), ఫుడ్ న్యూట్రిషనిస్ట్ ఎంట్రీ లెవల్ (రూ.3 - 5 లక్షలు), సీనియర్లకు రూ.8 - 12 లక్షలు ఆఫర్ చేస్తున్నారు.

వివిధ శాస్త్రాల సమ్మేళనం

ఫుడ్ టెక్నాలజీ వివిధ శాస్త్రాల సమ్మేళనంతో స్వతంత్ర శాస్త్రంగా ఎదుగుతోంది. బయో కెమిస్ట్రీ, కెమికల్ ఇంజినీరింగ్, ఫిజికల్ సైన్స్, స్టెరిలైజేషన్, పాశ్చరైజేషన్ వంటి మౌలిక అంశాల విలీనంతో కొత్త శాస్త్రంగా ఆవిర్భవించింది. ఆహార రంగానికి వెన్నుదన్నుగా నిలిచింది. ఇంకా అనలిటికల్ కెమిస్ట్రీ, బయో కెమిస్ట్రీ, ఇంజినీరింగ్, న్యూట్రిషన్, క్వాలిటీ కంట్రోల్, ఫుడ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ వంటి రంగాలనూ కలబోసి కొత్త రంగంగా ఎదుగుతోంది. ఇంకా ఫుడ్ టెక్నాలజీ రంగానికి బిగ్ డేటా, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ), ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)లను రంగరించడంతో ఉరకలెత్తుతోంది.

ఇవీ మెలకువలు

ఫుడ్ టెక్నాలజీలో గ్రాడ్యుయేషన్, పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులు చేసి... కొన్ని మౌలిక మార్గాలు అనుసరిస్తే మంచి కంపెనీలో ఉద్యోగం సాధించవచ్చు.

ఇంటర్న్‌షిప్: ముందుగా నేరుగా ఉద్యోగం సాధించాలని తహతహలాడకుండా ఏదైనా మంచి ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీ/ ఆహార పరిశోధన సంస్థ/ ప్రభుత్వ ఏజెన్సీలో ఇంటర్న్‌షిప్‌కు ప్రయత్నించాలి. ఆర్నెల్ల నుంచి ఏడాది ఇంటర్న్‌షిప్ ఉద్యోగ సాధనకు సోపానం అవుతుంది.

అకడమిక్ ట్రాక్: గ్రాడ్యుయేషన్‌లో ఏదోలా కోర్సు ముగించేయాలన్న తాపత్రయం వదిలి, ఆసక్తితో ప్రతి సబ్జెక్టు సారాంశాన్నీ గ్రహించాలి. మంచి జీపీఏతో ఉత్తీర్ణులు కావాలి. క్యాంపస్‌లో ఉన్న మూడు, నాలుగేళ్లలో ఫుడ్ ప్రాసెసింగ్‌కి సంబంధించిన ఎక్స్‌ట్రా కరిక్యులర్ కార్యకలాపాల్లో పాల్గొనాలి.

ప్రత్యేక విభాగాలపై ఆసక్తి: వివిధ విభాగాలైన ఫుడ్ సైన్స్, ఫుడ్ సేఫ్టీ, ఫుడ్ ప్రిజర్వేషన్, ఫుడ్ స్టోరేజీ, ఫుడ్ డెలివరీ వంటి వాటిపై అవగాహన పెంచుకోవాలి.

సాంకేతిక నైపుణ్యాలు: సాంకేతికత ముఖ్యం కాబట్టి ఫుడ్ టెక్నాలజీ సాఫ్ట్‌వేర్లు, లేబొరేటరీ టెక్నిక్స్, క్వాలిటీ కంట్రోల్ మెథడ్స్‌పై దృష్టి పెట్టాలి.

సర్టిఫికేషన్స్: ఫుడ్ టెక్నాలజీలో గ్రాడ్యుయేషన్, పీజీ చేసినా కొన్ని ప్రత్యేక అంశాలపై సర్టిఫికేషన్లు చేస్తే రెజ్యూమె పటిష్ఠమవుతుంది. సర్టిఫైడ్ ఫుడ్ సైంటిస్ట్, ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ వంటి సర్టిఫికెట్ కోర్సులు కెరియర్‌కు మేలు చేస్తాయి.



మెరుగైన భావ వ్యక్తీకరణ, బృంద నిర్మాణ నైపుణ్యం, నాయకత్వ సామర్థ్యం, సమస్యా పరిష్కార కౌశలం పెంపొందించుకుంటే ఈ రంగంలో ప్రొఫెషనల్‌గా ఎదిగే అవకాశాలు పుష్కలం.

- యస్.వి. సురేష్
సంపాదకుడు, ఉద్యోగ సోపానం

తాజా ఇంటర్న్‌షిప్‌లు

వర్క్‌ఫ్రమ్‌హోమ్
ఎర్న్‌వెల్ సంస్థలో

1. స్ట్రాటజిక్ మార్కెటింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-పవర్‌పాయింట్
స్టైపెండ్: రూ.5,000
☛ internshala.com/i/3ff1d3

2. ట్రేడింగ్ ఇన్‌సైట్స్
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-పవర్‌పాయింట్
స్టైపెండ్: రూ.5,000
☛ internshala.com/i/62fb27

సిన్‌క్రిట్ ఏఐ టెక్ ప్రై.లి.లో

1. కంటెంట్ రైటర్ (బ్లాగింగ్ అండ్ ఎస్ఈఓ ఫర్ ఏఐ ఫొటోషూట్)
నైపుణ్యాలు: బ్లాగింగ్, కంటెంట్ మార్కెటింగ్, కంటెంట్ రైటింగ్
స్టైపెండ్: రూ.3,000-6,000
☛ internshala.com/i/0be2c4

2. ఫిగ్మా డెవలపర్
నైపుణ్యం: ఫిగ్మా
స్టైపెండ్: రూ.4,000-10,000
☛ internshala.com/i/44890e

గ్లోబల్ లెర్నింగ్ స్పెషలిస్ట్
సంస్థ: ఎర్లీ స్టెప్స్ అకాడమీ
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం
స్టైపెండ్: రూ.15,000-35,000
☛ internshala.com/i/6f7789

వీడియో ఎడిటింగ్/మేకింగ్
సంస్థ: బవేజా మీడియా
నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్
స్టైపెండ్: రూ.6,000-7,000
☛ internshala.com/i/eb4b1f

ఎస్ఈఓ
సంస్థ: సెర్చ్ కంబ్యాట్
నైపుణ్యం: సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్ (ఎస్ఈఓ) స్టైపెండ్: రూ.8,000
☛ internshala.com/i/d8fcad

ట్రైలుక్స్ టెక్నాలజీస్ ప్రై.లి.లో

1. మెటా యాడ్ ఎక్స్‌పర్ట్
నైపుణ్యాలు: కాపీ రైటింగ్, డిజిటల్ అడ్వర్టైజింగ్, ఫేస్‌బుక్ యాడ్స్, యూట్యూబ్ యాడ్స్ స్టైపెండ్: రూ.1,000-3,000
☛ internshala.com/i/72dd8c

2. షాపిఫై డెవలపర్
నైపుణ్యాలు: ఏపీఐస్, హెచ్‌టీఎంఎల్ అండ్ సీఎస్ఎస్, జావాస్క్రిప్ట్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్ (ఎస్ఈఓ)
స్టైపెండ్: రూ.1,000-4,000
☛ internshala.com/i/4e2117

3. లింక్డ్‌ఇన్ కంటెంట్ రైటర్
నైపుణ్యాలు: కంటెంట్ మార్కెటింగ్, కంటెంట్ రైటింగ్, క్రియేటివ్ రైటింగ్, డిజిటల్, లింక్డ్‌ఇన్, సెర్చ్ ఇంజిన్ మార్కెటింగ్, మార్కెట్ అనాలిసిస్
స్టైపెండ్: రూ.1,000-3,000
☛ internshala.com/i/1752c5

లాంగ్వేజ్ ఎక్స్‌పర్ట్ – ఇంగ్లిష్
సంస్థ: గైడోఫీ
నైపుణ్యాలు: అమెరికన్ ఇంగ్లిష్, బ్రిటిష్ ఇంగ్లిష్, ఇంగ్లిష్ మాట్లాడటం
స్టైపెండ్: రూ.2,000
☛ internshala.com/i/05df02

టెలి సేల్స్ ఎగ్జిక్యూటివ్
సంస్థ: ఓపెన్ వీవర్
నైపుణ్యాలు: ఇంగ్లిష్ హిందీ మాట్లాడటం, ఎంఎస్-ఎక్సెల్, సేల్స్, సేల్స్ పిచ్
స్టైపెండ్: రూ.10,000
☛ internshala.com/i/6d784e

బ్యాక్‌ఎండ్
సంస్థ: క్వాలీవల్
నైపుణ్యాలు: జావాస్క్రిప్ట్, మాంగోడీబీ, నోడ్.జేఎస్, రెస్ట్ ఏపీఐ స్టైపెండ్: రూ.6,000
☛ internshala.com/i/26b8e6

కమ్యూనిటీ అవుట్‌బౌండ్
సంస్థ: ఫిన్‌సెంట్
నైపుణ్యం: సేల్స్ స్టైపెండ్: రూ.10,000
☛ internshala.com/i/71d3b8

డేటా ఎంట్రీ అండ్ అనాలిసిస్
సంస్థ: స్మోలన్ ఇండియా ప్రై.లి.
నైపుణ్యాలు: ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-పవర్ పాయింట్ స్టైపెండ్: రూ.5,000
☛ internshala.com/i/a6b7f7

మార్కెటింగ్
సంస్థ: చెక్‌మైగాడీ ప్రై.లి.
నైపుణ్యం: ఇంగ్లిష్ మాట్లాడటం
స్టైపెండ్: రూ.7,000
☛ internshala.com/i/74bc40

వీటన్నిటికీ దరఖాస్తు గడువు: నవంబరు 6

సేల్స్ (కోల్డ్ కాలింగ్)
సంస్థ: ఇండికా ఏఐ ప్రై.లి.
నైపుణ్యాలు: సీఆర్ఎం, ఇంగ్లిష్ మాట్లాడటం, ప్రొడక్షన్ ఇంజినీరింగ్, సేల్స్, సేల్స్ పిచ్
స్టైపెండ్: రూ.6,000
దరఖాస్తు గడువు: నవంబరు 4
☛ internshala.com/i/283a3c

ఉద్యోగాలు

దేవ్‌ఘర్ ఎయిమ్స్‌లో సీనియర్ రెసిడెంట్లు

ఝార్ఖండ్ దేవ్‌ఘర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్).. ఒప్పంద ప్రాతిపదికన 101 సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
విభాగాలు: అనస్తీయా అండ్ క్రిటికల్ కేర్, అనాటమీ, బర్న్ అండ్ ప్లాస్టిక్ సర్జరీ, బయో కెమిస్ట్రీ, కార్డియాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ, పాథాలజీ, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ అండ్ బ్లడ్ బ్యాంక్, సర్జికల్ అంకాలజీ, న్యూక్లియర్ మెడిసిన్, ఎండ్రోక్రినాలజీ, రేడియో థెరపీ తదితరాలు. **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎండీ/ ఎంఎస్/ డీఎన్‌బీతో పాటు పని అనుభవం.
మూల వేతనం: నెలకు ప్రొఫెసర్ పోస్టుకు రూ.67,700.
వయసు: 45 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ ఎస్టీ ఐదేళ్లు, ఓబీసీ మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పదేళ్లు సడలింపు ఉంటుంది.
దరఖాస్తు ఫీజు: రూ.3000; ఓబీసీలకు రూ.1000; ఎస్సీ/ఎస్టీ /దివ్యాంగ/ మహిళా అభ్యర్థులకు ఫీజు మినహాయింపు ఉంటుంది.
దరఖాస్తు: ఆఫ్‌లైన్, ఈమెయిల్ ద్వారా.
ఈమెయిల్: recruitment2022@aiimsdeoghar.edu.in
ఆఫ్‌లైన్ దరఖాస్తులను 'ఎయిమ్స్ దేవ్‌ఘర్, అకాడమిక్ బ్లాక్, దేవీపుర్, దేవ్‌ఘర్' చిరునామాకు పంపాలి. **దరఖాస్తుకు చివరి తేదీ:** 25-10-2024. **వెబ్‌సైట్:** www.aiimsdeoghar.edu.in/

నోటీస్ బోర్డు

బెల్‌లో ప్రాజెక్ట్ ఆఫీసర్ పోస్టులు

బెంగళూరులోని ప్రభుత్వ రంగ సంస్థ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్).. తాత్కాలిక ప్రాతిపదికన 4 ప్రాజెక్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది.
విభాగాలు: కంటెంట్ క్రియేషన్, సోషల్ మీడియా, డిజిటల్ మీడియా మేనేజ్‌మెంట్, గ్రాఫిక్స్ డిజైనింగ్, ఈవెంట్ మేనేజ్‌మెంట్. **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీఏతో పాటు పని అనుభవం.
వయసు: 32 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు సడలింపు ఉంటుంది. **వేతనం:** మొదటి ఏడాది నెలకు రూ.40,000; రెండో ఏడాది రూ.45,000; మూడో ఏడాది రూ. 50,000; నాలుగో ఏడాది రూ.55,000.
దరఖాస్తు ఫీజు: రూ.400. ఎస్సీ/ఎస్టీ/ పీడబ్ల్యూబీడీలకు ఫీజు మినహాయింపు ఉంటుంది.
ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూల ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 30-10-2024.
వెబ్‌సైట్: https://bel-india.in/

ఫిషరీస్ డిపార్ట్‌మెంట్‌లో ప్రోగ్రామ్ మేనేజర్లు

ఆంధ్రప్రదేశ్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిషరీస్ (ఏపీ ఫిషరీస్).. పీఎంఎంఎస్‌వై పథకం కింద ఒప్పంద ప్రాతిపదికన జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ (డీపీఎం) 3 పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది.
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ (ఫిషరీస్ సైన్స్/ జువాలజీ/ మెరైన్ సైన్స్/ మెరైన్ బయాలజీ/ ఫిషరీస్ ఎకనామిక్స్)తో పాటు పని అనుభవం.
వయసు: 35 ఏళ్లు మించకూడదు.
వేతనం: నెలకు రూ.45,000.
పని ప్రదేశాలు: డీఎఫ్ఓ కృష్ణా, బాపట్ల, కర్నూలు. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 24-10-2024. **వెబ్‌సైట్:** https://fisheries.ap.gov.in/home

యూఐఐసీలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు

చెన్నైలోని యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (యూఐఐసీ).. దేశ వ్యాప్తంగా యూఐఐసీ కార్యాలయాల్లో 200 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది.
◆ స్పెషలిస్టులు: 100 ◆ జనరలిస్టులు: 100
విభాగాలు: రిస్క్ మేనేజ్‌మెంట్, లీగల్ డేటా అనలిటిక్స్, ఫైనాన్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్, ఆటోమొబైల్, కెమికల్/ మెకాట్రానిక్స్ తదితరాలు.
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో సీఏ/ సీడబ్ల్యూఏ, డిగ్రీ (లా/ బీకామ్), బీఈ/ బీటెక్, ఎంఈ/ ఎంటెక్, ఎంకామ్‌తో పాటు పని అనుభవం.
వయసు: 30 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ ఎస్టీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు సడలింపు ఉంటుంది.
వేతన శ్రేణి: నెలకు రూ.50,925 - రూ.96,765.
దరఖాస్తు ఫీజు: రూ.1000+జీఎస్‌టీ; ఎస్సీ/ఎస్టీ/ పీడబ్ల్యూబీడీలకు రూ.250+జీఎస్‌టీ.
ఎంపిక: ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూల ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 05-11-2024
వెబ్‌సైట్: https://uiic.co.in/en/home

చదువు

ఉన్నతవిద్య, కెరియర్ ఎంపికలకు సంబంధించి విద్యార్థులకూ, ఉద్యోగార్థులకూ అనుమానాలు, ఊగిసలాట సహజం. సంబంధిత సందేహాలను సకాలంలో నివృత్తి చేసుకోవాలనుకుంటున్నారా?

మీ ప్రశ్నలను మాకు పంపండి. అనుభవజ్ఞులైన నిపుణులు సమాధానాలు ఇస్తారు.

మా చిరునామా:
చదువు
ఈనాడు కార్యాలయం,
అనాజ్‌పూర్,
అబ్దుల్లాపూర్‌మెట్ మండలం,
రామోజీ ఫిల్మ్‌సిటీ -501 512
edc@eenadu.in

కంటోన్మెంట్లు, మిలిటరీ స్టేషన్లలోని 139 ఆర్మీ పబ్లిక్ స్కూళ్లలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఆర్మీ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రకటన విడుదల చేసింది. ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి.

ఆర్మీ పబ్లిక్ స్కూళ్లలో ఉపాధ్యాయ పోస్టులు



తెలుగు రాష్ట్రాల్లో.. సికిందరాబాద్ (ఆర్‌కేపీ) సికిందరాబాద్ (బొల్లారం), గోల్కొండల్లో ఆర్మీ పబ్లిక్ స్కూళ్లు ఉన్నాయి.

ఉపాధ్యాయుల నియామకం జరిగే సబ్జెక్టులు: బయాలజీ, కంప్యూటర్ సైన్స్, ఇంగ్లిష్, జాగ్రఫీ, హిందీ, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, సైకాలజీ, సంస్కృతం, ఫిజికల్ ఎడ్యుకేషన్.

1. పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ): పోస్ట్ గ్రాడ్యుయేషన్, బీఈడీ 50 శాతం మార్కులతో పాసవ్వాలి.

2. ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ (టీజీటీ): గ్రాడ్యుయేషన్, బీఈడీ 50 శాతం మార్కులతో పూర్తిచేయాలి.

3. ప్రైమరీ టీచర్ (పీఆర్‌టీ): గ్రాడ్యుయేషన్, రెండేళ్ల డీఈఐఈడీ/ బీఈఐఈడీ 50 శాతం మార్కులతో పాసవ్వాలి. లేదా బీఈడీ, ఆరు నెలల పీడీపీఈటీ/ బ్రిడ్జ్ కోర్సు 50 శాతం మార్కులతో పూర్తిచేయాలి.

● ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్టుకు హాజరుకావడానికి సీటెట్/టెట్ తప్పనిసరికాదు. అయితే నియామక సమయానికి సీటెట్/టెట్ అర్హత ఉండాలి.

● ఆన్‌లైన్ స్క్రీన్‌టెస్టు జరిగిన 21 రోజుల తర్వాత స్కోర్‌కార్డు అందుబాటులో ఉంటుంది. వెబ్‌సైట్ నుంచి దీన్ని డౌన్‌లోడ్ చేసుకోవాలి.

వయసు: 01.04.2024 నాటికి అనుభవంలేనివారు 40 ఏళ్ల లోపు, అనుభవజ్ఞులైతే 57 ఏళ్ల లోపు ఉండాలి.

● అర్హతలు ఉన్నవారు ఒకటి కంటే ఎక్కువ పోస్టులకూ పోటీ పడొచ్చు. ప్రతి పోస్టుకూ విడిగా దరఖాస్తు చేయాలి.

ఎంపిక ఎలా?

ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్టు, ఇంటర్వ్యూ, టీచింగ్ స్కిల్స్, కంప్యూటర్ పరిజ్ఞానం, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపిక చేస్తారు.

● ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ మల్టిపుల్ ఛాయిస్ విధానంలో ఉంటుంది. దీంట్లో సబ్జెక్టు ఆధారిత ప్రశ్నలు అడుగుతారు.

● ప్రశ్నపత్రం 200 మార్కులకు ఉంటుంది. ప్రతి ప్రశ్నకూ ఒక మార్కు. ప్రతి తప్పు సమాధానానికీ పావు మార్కు తగ్గిస్తారు.

● పీజీటీ పోస్టులకు ప్రశ్నపత్రంలో మూడు సెక్షన్లు ఉంటాయి. సెక్షన్-ఏలో బేసిక్ జీకే, కరెంట్ అఫైర్స్, సెక్షన్-బీలో పెడగాజి, కరిక్యులం-ఎడ్యుకేషన్ పాలసీ మేటర్స్, సెక్షన్-సీలో అకడమిక్ ప్రొఫిషియెన్సీ ప్రశ్నలు ఇస్తారు.

● టీజీటీ పోస్టులకు సెక్షన్-ఏలో బేసిక్ జీకే-కరెంట్ అఫైర్స్, సెక్షన్-బీలో పెడగాజి, కరిక్యులం-ఎడ్యుకేషన్ పాలసీ మ్యాటర్స్; సెక్షన్-సీలో అకడమిక్ ప్రొఫిషియన్సీ ప్రశ్నలు అడుగుతారు.

● పీజీటీ పోస్టులకు సెక్షన్-ఏలో బేసిక్ జీకే-కరెంట్ అఫైర్స్; సెక్షన్-బీలో పెడగాజి, కరిక్యులం-ఎడ్యుయేషన్ పాలసీ మేటర్స్; సెక్షన్-సీలో అకడమిక్ ప్రొఫిషియన్సీ ప్రశ్నలు అడుగుతారు.

ముఖ్యమైన తేదీలు

దరఖాస్తు సమయంలో అభ్యర్థులు మూడు పరీక్ష కేంద్రాలను ఎంచుకోవచ్చు.
దరఖాస్తు ఫీజు: రూ.385.
దరఖాస్తుకు చివరి తేదీ: 25.10.2024
పరీక్ష తేదీలు: నవంబరు 23, 24
ఫలితాల వెల్లడి: 10.12.2024
వెబ్‌సైట్: http://www.awesindia.com/